





- లక్కోజు శ్రీనివాస్

# కొత్త దేవుడండీ..!

# కొత్తా దేవుడండీ..!

ఒక జాతిని చీల్చాలంటే మతాన్ని మించిన ఆయుధం లేదు
ఒక జాతిని నిలబెట్టాలంటే మానవత్వాన్ని మించిన మతం లేదు



మతం పునాదుల మీద మనం దేన్నీ సాధించలేం
ఒక జాతిని నిర్మించలేం, ఒక నీతిని నిర్మించలేం

---

**లక్కోజు శ్రీనివాస్**

**కొత్తా దేవుడండీ..!**

**లక్కోజు శ్రీనివాస్,**
**45-2-60 / 7 / ఏ,**
**రామచంద్ర నగర్,**
**విశాఖపట్నం,**
**ఆంధ్రప్రదేశ్ - 530016**
**ఫోన్ : 9985026555**

Email : lakkojusrinivas@gmail.com
Facebook : lakkoju srinivas



Book layout designer:
U. Kiran Kumar
9000264066

Book cover page Designer:
L. Satish Kumar (Andhra Prabha)
9394562985

Printer:

**Rs. 40/-**

# కృతజ్ఞతలు




వేచి ఉండాల్సి వస్తే...
ఆ సమయంలో విజ్ఞానాన్నిచ్చే
పుస్తకాలతో కాలక్షేపం చేయ్...

**జి. వివేక్,**
విశాఖ ఇండస్ట్రీస్ అధినేత.

కొత్త ఆలోచనలు ఎప్పుడూ
కొత్త మార్గాలను చూపుతాయి.

**అంకం రవి,**
సీఈవో, వీ6 న్యూస్.



ఈ పుస్తకం

మా

అమ్మకు అంకితం

# అంకితం



## శ్రీమతి లక్కోజు రాజేశ్వరి

ఎలకంత పుట్టాడు...ఏడు రోజులు బతికితే ఎక్కువని చెప్పేశారు డాక్టర్లు
ఎలకో, ఏనుగో నా పేగు ఇది అంటూ పాలు పట్టింది అమ్మ...
వారం గడిచింది, నెల గడిచింది, ఏడాది అయింది... ఊపిరితో అమ్మ ఒడిలోనే ఉన్నాను.
ఆ విషయం తెలిసి అసలు ఎలా బతికానా అనిపించింది....
తాగింది అమ్మపాలు కదా...అమృతమై ప్రాణం నిలిపుంటాయని తెలియక

చిన్నప్పుడు శ్మశానాన్ని చూసి భయపడితే...
తాను భయపడుతూ నాకు ధైర్యం చెప్పిన మా అమ్మని చూసి
అమ్మకి భయమే...మరి నాకెందుకు ధైర్యం చెప్పిందా అనుకున్నాను.
భయాల మధ్య బతుకే విజయమని చెప్పేందుకు అమ్మ చేసిన ప్రయత్నమని తెలియక...

స్కూలుకు వెళ్లనని గోల గోల చేస్తుంటే...
కోప్పడి కొట్టిన అమ్మని చూసి
మా అమ్మ రాక్షసిరా బాబూ అనుకున్నాను.
ఆ దెబ్బలు నా బంగారు భవిష్యత్ కోసమని తెలియక...

కొంచెం పెద్దయ్యాక ఖర్చులకని ఐదో, పదో అడిగితే...
ఇంటి అవసరాలకు నాన్న ఇచ్చిన డబ్బులో కొంత తీసి నాకిచ్చేసి....
ఆ డబ్బులకు నాన్నకి లెక్క చెప్పలేక...ఏవో తప్పులెక్కలు చెప్పిస్తుంటే
అయ్యో పాపం అమ్మ...! అనుకున్నాను...
నా సంతోషం కంటే అమ్మకి ఏదీ ఎక్కువ కాదని తెలియక...

పదో తరగతి పాసైన తరువాత...నాన్నతో పనికి పోతే, రోజుకు నాకు పదొచ్చేది...
దాంతో చదువుకంటే పనే నయమనుకున్నా...పని ఎప్పుడైనా చేయొచ్చు...
ముందు చదువుకో అని అక్షరం వైపు నన్ను మళ్లిస్తే...
పచ్చనోట్లు విలువ అమ్మకు తెలియలేదే అనుకున్నా...
అప్పుడు అమ్మ చెప్పించిన అక్షరాలే ఇప్పుడు అన్నం పెడతాయని తెలియక...

ఒకరోజు ఫుడ్ పాయిజన్ వల్ల ఏడు గంటలుగా స్పృహ లేకుండా పోతే...
ఇంట్లో అంతా పడుకున్నానని అనుకున్నారు.
కానీ అమ్మే ఎలా గుర్తు పట్టిందో ఏమో కానీ...
వీడు పడుకోలేదు...పడిపోయాడంటూ...
డాక్టర్ దగ్గరకు తీసుకుపోతే మా అమ్మ చదువుకునుంటే...
డాక్టర్ అయిపోయేది అనుకున్నా...
బిడ్డల బాగోగుల విషయంలో అమ్మకు మించిన డాక్టర్ ఎవరూ ఉండరని తెలియక...

మీ వాడు నల్లగా ఉంటాడు...సంబంధాలు చూడడం కష్టమని పేరయ్య అంటే...
చిరంజీవి నలుపు కాదా...పలానా సినిమాలో శోభన్‌బాబు నలుపు కాదా అని పేరయ్యతో
గొడవ పడితే...అమ్మకెందుకంత కోపం అనుకున్నా...
కానీ ప్రపంచమంతా ఏ వైపున్నా...అమ్మ మాత్రం నా వైపే ఉంటుందని తెలియక...

కాస్త నీరసంగా ఉండి పడుకుంటే చాలు...నాకేదో అయిపోయిందని అనుకుని...
వెనక వీధిలో సాయిబు దగ్గరకు పరుగున పోయి తాయెత్తులు తెస్తుంటే...
అమ్మకెందుకంత తాపత్రయం అనుకున్నా...
నా ప్రాణాలే అమ్మకు ఊపిరని తెలియక...

ఇప్పటికీ నేను తిన్నానా లేదా అని ఆలోచిస్తూనే...
నా కోసం ఇంటి ముందు గేటు దగ్గర...ఎదురు చూస్తుండే అమ్మని తలచుకుంటే...
మరి అమ్మకి ఆకలెయ్యదా అనుకుంటాను...
నా ఆకలి తీరితే అమ్మ కడుపు నిండిపోతుందనే విషయం తెలియక...

ఇంతకీ అమ్మంటే ఏంటి అని ఎంత ఆలోచించినా జవాబు దొరకడం లేదు.
అమ్మంటే ఏంటో తెలియడం లేదు...
అవును...తెలిస్తే అమ్మెందుకు అవుతుంది...
అందుకే అమ్మంటే అమ్మే...
అమ్మకి మరో పేరు లేదు, ఇంకో పోలికా రాదు...
అమ్మని పుట్టించిన బ్రహ్మకైనా ఆల్టర్నేటివ్ ఉంటుందేమో కాని...
అమ్మకి ఆల్టర్నేటివ్ ఉండదు...
ఉంటే తను మళ్లీ మరో అమ్మ మాత్రమే...

# ముందుమాట



**జాఫర్ బాబు,**

**ఇన్‌పుట్ ఎడిటర్, టీవీ9**

మిత్రుడు లక్కోజు శ్రీనివాస్‌కి శుభాకాంక్షలు...

మీ "కొత్త దేవుడండీ..!" పుస్తకం బాగుంది.

పుస్తకాన్ని మూడు సార్లు చదివాను.

సామాన్య పాఠకుడిగా ఒకసారి...

విమర్శకుడిగా రెండోసారి...

అభిప్రాయాన్ని వ్యక్తం చేయాల్సిన మిత్రుడిగా మూడోసారి.

ఏ కోణంలో చదివినా పుస్తకం ఆలోచింపజేసేదిగా ఉంది.

పుస్తకం టేకాఫ్ హాలీవుడ్ సినిమా రేంజ్‌లో అదిరింది.

గతంలో యండమూరి వీరేంద్రనాథ్ రాసిన చీకట్లో సూర్యుడు, యుగాంతం, ఆనందోబ్రహ్మలాంటి సైన్స్ ఫిక్షన్ నవలలని తలచుకుంటూ ఆసక్తిగా పుస్తకం పేజీలు తిరగేస్తూ పోతుంటే ఫ్లాష్ బ్యాక్ ప్రేమకథ పలకరించింది.

ప్రస్తుత కాలపు హైటెక్ ప్రేమికుల్లా కాకుండా...ఆ కాలపు ప్రేమికులు ఏలా ఉండేవారో కళ్ళకు కట్టినట్లు కనిపించింది.వర్తమానంలో ఉండి గతకాలాన్ని అవిష్కరించాలంటే చాలా కసరత్తే చేసి ఉంటారు.

కథ చెప్పే శైలి...చెప్పాల్సిన దాన్ని సుత్తి లేకుండా చెప్పిన విధానం నన్ను పుస్తకానికి కట్టి పడేసింది. మరో నాలుగైదు పుస్తకాల తర్వాత గత కాలపు పాపులర్ రచయితల సరసన నిలుస్తారనిపించింది.

రచయితకు మొదటిగా ఉండాల్సింది సామాజిక స్పృహ. ఈ పుస్తకం ద్వారా సామాజిక స్పృహకి తోడు ఊహ శక్తి, సృజనాత్మకత మీలో మోతాదుకి మించి కనిపించాయి.

అందులో ఎలాంటి సందేహం లేదు.

ఇటీవల కాలంలో విపరీతంగా పెరిగిన మత హింస, ఉగ్రవాదం నేపధ్యంలో కలత చెందిన మీ కలం ఈ పుస్తక రచనకు కదం తొక్కి ఉంటుంది.

మీ ప్రతి వాక్యంలోని ఆవేదన, సమాజం మారాలన్న ఆక్రోషం నన్ను ముగ్ధుడ్ని చేశాయి. మీలాంటి దూర దృష్టి గల రచయితలు ఈ కాలంలో ఉండటం పాఠకుల అదృష్టం.

సమకాలీన ఘటనల మీద స్పందించాల్సిన బాధ్యత తప్పకుండా రచయితల మీదే ఉంటుంది. చాలా సంతోషం.

పుట్టిన ప్రతి మనిషికీ దేవుడి గురించిన సందేహాలు ఉద్భవించడం సహజం. అది ఆరోగ్యం కూడా. మతం అనేది జనాన్ని ఏలా విభజించి పాలిస్తుందో విప్పి చెప్పడం మీ అభిమతంగా అనిపించింది.

దేవుడు లేదా మీరన్న కాస్మిక్ ఎనర్జీ అనేవాడుంటే అతనే ఈ చరాచర సృష్టికీ కారణమైెత..ే మత రాక్షసిని రూపుమాపాల్సిన మహత్తర బాధ్యత కూడా ఖచ్చితంగా ఆయన మీదే ఉంది. ఈ విషయంలో ఎవరైనా మీతో ఏకీభవించి తీరాల్సిందే.

మనం కళ్ళు మూసుకుని మనసులో ప్రార్థిస్తే అన్ని కోర్కెలు తీర్చే దేవుడు...పవిత్ర అనే అమ్మాయి తనని ఏమి ప్రశ్నిస్తుందో, కోరుకుంటుందో తెలుసుకోగలడు. కానీ ఆ అసామాన్య యువతి ద్వారానే ఆమె డిమాండ్‌ని విని పరిష్కరించడం...దేవుడి చమత్కారానికి నిదర్శనం.

యమగోల, యమదొంగ లాంటి చాలా సినిమాల్లో ఆ మరో లోకం ఏపిసోడ్...చూసిందే. వాళ్ళు భూమ్మీదకు తిరిగి వచ్చేదాకా...

ఆ లోకంలో 'నేను' అన్న అహం గురించి ప్రస్తావన బాగుంది. ఇంకాస్త వివరంగా ఉంటే ఇంకా బాగుండెదేమో అనిపించింది.

ఇక్బాల్, నూర్‌ల మరణం కంటతడి పెట్టించింది.

'భూఖండ చలన సిద్ధాంతం' బాగుంది.

ఈ పుస్తకం చదివాక యువత స్పేస్ ఫిజిక్స్  చదవడానికి క్యూలు కడతారెమో కూడా...

తెలుగు నవలాలోకంలోకి ఇప్పుడిప్పుడే బుడి బుడి అడుగులు వేస్తూ వచ్చిన మీరు సమీపకాలంలో రేసు గుర్రంలా పరుగెత్తాలని....

అకాంక్షిస్తూ...

అనుభవం మిమ్మల్ని ముమ్ముందు మరింత రాటుదేలుస్తుంది.

అభినందనలతో...

జాఫర్ బాబు

# ముందుమాట



**చిగురుపాటి సతీష్ బాబు,**

**రీజినల్ కో ఆర్డినేటర్, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి**

కొత్తా దేవుడండీ..! ఎప్పుడో పెద్ద తెరపై చూసిన సినిమాల్లో విన్న డైలాగో, పాటో గుర్తుకొచ్చింది. ఈ పుస్తకానికి ముందుమాట నన్నే ఎందుకు రాయమన్నాడు? అదే అడిగేసా.

"అక్షరాన్ని ప్రేమిస్తారు, పుస్తకాలు చదువుతారు అందుకే మీరు రాస్తే బాగుంటుందని అనుకున్నా"నంటూ శ్రీనివాస్ బదులిచ్చారు.

వెంటనే మరో ప్రశ్న మీరు చెప్పాలనుకున్నదేంటి?

ఈ ప్రశ్న వేయడం వెనక నా తూకంరాళ్లు నాకున్నాయి. తాను తన వాదనలు చెప్పిన తరువాత చదవడం మొదలుపెట్టాను.

అమ్మకు పుస్తకాన్ని అంకితమిస్తూ తాను రాసుకున్నది వచనం అనాలా? వచన కవిత్వం అనాలా? చదవడానికి కమ్మగా ఉంది. గుండెల్లోకి ఆర్ద్రంగా చొరబడింది. కళ్లల్లో తడే నిలిచింది. ఈ భావనతో పుస్తకంలోకి అడుగుపెట్టడం ఇబ్బందినిపించింది.

శ్రీనివాస్, నేను ABNలో సహచరులం. నేను ఆంధ్రజ్యోతి నుంచి రావడంతో ప్రతీ విలువలకు తప్పనిసరిగా నాదైన రాత ఉండాలనుకునేవాడినని నాకు అప్పటికీ కొత్త అయిన విజువల్ మీడియాకు అవసరమైన పద్ధతిలో శ్రీనివాస్ చిటికెలో స్క్రిప్ట్ రాసేవాడు. చక్కటి అల్లికతో అది సాగేది.

ఓ రోజు మా ఎండీ, రాధాకృష్ణ గారు ఫోన్ చేశారు. శ్రీనివాస్ ఇంటర్వ్యూకు వచ్చినప్పుడు ఓ పుస్తకం రాసుకువచ్చేవాడు. వాటిని కథనాలుగా మరల్చవచ్చేమో చూడు అన్నారు.

అప్పుడడిగాను శ్రీనివాస్ నీ పుస్తకం ఏది అని?

గురువురుగారు ఇదిగోనంటూ తీసుకొచ్చాడు. చక్కగా సాగిన ఎలక్ట్రానిక్ మీడియాకు కావాల్సిన కాన్సెప్ట్ అవి. ఆ తరువాత శ్రీనివాస్ మరో కార్యాలయానికి వెళ్లాడు.

ఎప్పుడు కనిపించినా అదే ఆత్మీయ పిలుపు.

తాను పుట్టి పెరిగిన ఉత్తరాంధ్ర ప్రాంతంపై మమకారం, తల్లిపై వల్లమాలిన ప్రేమ,

చిన్నప్పుడు తాను చూసిన మంచి అంతా కరిగిపోతుందే అన్న బాధ తనలో నిరంతరం కనిపిస్తూ ఉండేది.

కొత్త దేవుడండీ కల్పనా కథనం చదివిన తరువాత పై లక్షణాలు అన్నీ ఉన్న వ్యక్తి ఆలోచించగలిగిన రీతిలోనే ఆలోచిస్తున్నాడా అనిపించింది. మతం అడ్డుగోడల్లా ప్రపంచాన్ని చీల్చి చెండాడుతుందన్న బాధ, అది మనపై చేస్తున్న హింసాయుత పెత్తనంపై కాంక్షాపూర్వక కసి శ్రీనివాస్ రచనలో కనిపించింది. మన దేశంలో మతంతో పాటు కులం, వర్గం కూడా పెత్తనం చెలాయిస్తున్నాయని, కుల వివక్ష మనిషిని తడి గుడ్డతో చంపేస్తుందని శ్రీనివాస్ గుర్తించాడని ఆశిస్తాను. మరోచోట, మరో రూపంలో దానిపై కత్తి ఝుళిపిస్తాడేమో?!

దేవుడు ఉన్నాడని అంగీకరిస్తూనే,ఆ దేవుడి ప్రశ్నకేమీ మినహాయింపు కాదని నిరూపిస్తాడు. మతాలకు అతీతంగా కలిసుండే మనుషులు ఉన్నారని చెబుతూనే వాటిని అడ్డం పెట్టుకుని రాక్షసంగా మారిన వారు చేస్తున్న దారుణాలను సమయానుకూలంగా చక్కగా ఇముడ్చుకుంటూ సాగిపోయాడు. కథ బలంగా ఉండి కథనం లేకపోయినా...కథనం సమర్ధవంతంగా సాగి కథలో పట్టులేకపోయినా ఇబ్బందే. ఈ రెండూ ఒక స్థాయిలో శ్రీనివాస్‌కు పట్టుబడ్డాయి.

చివరగా...భాష, సాధారణ మధ్య తరగతి మనుషులు, సాదాసీదాగా మాట్లాడుకున్నట్టే సాగిపోయింది. నాకు బాగా నచ్చిన అంశంలో ఇదొకటి.

## గురువు కాని గురువు...

**చిగురుపాటి సతీష్‌బాబు**

# అభినందనలు



## పద్మశ్రీ ఆచార్య డా. కుటికుప్పల సూర్యారావు

**ప్రముఖ వైద్యులు, రచయిత**

ఈ వేళ దేశం అసహనం అనే కొత్త ఉన్మాదంలో ఉన్న తరుణంలో లక్కోజు శ్రీనివాస్ గారి పుస్తకం "కొత్తా దేవుడండీ..!" పుస్తకం సమాజాన్ని నూతనాలోచనల్లో ఓలలాడిస్తుందని నే చెప్పగలను.

"science without religion is lame.
Religion without science is blind"

"మతం లేని సైన్స్ కుంటింది. సైన్స్ లేని మతం గుడ్డిది" అన్నారు ప్రపంచ అతి గొప్ప మేధావుల్లో ఒకరైన ఐన్‌స్టీన్. సైన్స్, మతం చెట్టాపట్టాలేసుకున్నంత కాలం సమాజ ప్రగతికి తిరుగుండదు. ఈ రెండింటిలో ఏదో ఒకటి అధిపత్యానికి ప్రయత్నిస్తే మాత్రం అధోగతికి శ్రీకారం చుట్టినట్టే. మొదటి, రెండో ప్రపంచ యుద్ధ సమయాల్లో లక్షలాది మంది మరణించడంతో అనేక మంది అభ్యుదయవాదుల్లో అసలు దేవుడున్నాడా? వుంటే ఎందుకు ప్రజల్ని కాపాడటం లేదు? ఎందుకు ఈ మరణహోమానికి అడ్డుకట్ట వేయడంలేదనే ప్రశ్నలు ఉత్పన్నమై జపాన్, చైనా, నెదర్లాండ్స్ వంటి అనేక దేశాల్లో నాస్తికవాదులతో పాటు ఏ మతాన్ని ఆచరించని "మతరహితవాదులు" పెరగడం ఆరంభమైంది. భారతదేశం ఇందుకు మినహాయింపు కాదు. ఏది ఏమైనా హింస లేని శాంతికాముక సమాజం నిర్మాణం కావడం లేదు. ఇది ప్రపంచ మనుగడకే ఎంతో అందోళన కలిగించే అంశం.

ఈ నేపథ్యంలో "కొత్తా దేవుడండీ..!" పేరుతో శ్రీనివాస్ సాగించిన రచన నేటి సమాజానికి చాలా అవసరం. పుస్తకంలోని రాము, లూసీ, ఇక్బాల్, పవిత్రల్లాంటి పాత్రలు ద్వారా అంతర్లీనంగా మతసామరస్యాన్ని నెలకొల్పే దిశలో ఈ కథనం సాగించడంలో శ్రీనివాస్ కృతకృత్యులయ్యారనే చెప్పాలి.

70వ దశకంలో ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రం వారి లలితసంగీతంలో శ్రీ తిరుపతి రామానుసూరి గారి సంగీత సారధ్యంలో, కుమారి మండపాక శారదగారి గాత్రంలో వెలువడిన నా లలితగీతం "ఈశ్వరా...పరమేశ్వర" అప్పట్లో ఒక సంచలనం.

పల్లవి: ఈశ్వరా ! పరమేశ్వరా !!
ఎందుకు నీకీ వేషాలు
మనుజులలో కల్పించితి
విమతములు ద్వేషాలూ

చరణం: నారాయణుడుగ నాడు వెలసితివి
అల్లా పేరుతో అవతరించితివి
ఇలను ఏసుగా ప్రభవిల్లితివి
ఇన్ని నామములతో ఏలా పుడితివి {{ఈశ్వరా }}

చరణం: నీ రూపానికొక మతమని నమ్ముచు
మానవ కోటి ముక్కలాయెరా
హిందు క్రైస్తవ ముస్లిములనుచు
కొట్టుక చస్తున్నారు కదరా {{ఈశ్వరా }}

చరణం: ఒకే రూపం ఒకే నామంతో
భువిలో నీవే వెలసి వుంటే
లోకమంతా ఏక మతంతో
భాసిల్లేది భాయి భాయంటూ {{ఈశ్వరా } }

శ్రీనివాస్ గారి పుస్తక సారాంశం, సుమారు నలభై ఏండ్ల క్రితం నా ఆలోచనల లలితగీతం కూడా మత శాంతి, సహనాల కోసమే వుండటం కాకతాళీయమే కావచ్చు, కానీ ఓ శుభపరిణామమని చెప్పొచ్చు.

"God has no religion" అన్నారు మహాత్మ గాంధీ. కానీ, మతాన్ని దేవుడికి అపాదించడం అనాదిగా స్వార్థశక్తుల కుట్ర. భగవద్గీత, బైబిల్, ఖురాన్ ఏ మత గ్రంథమైన మానవ కళ్యాణాన్ని, లోకాభ్యుదయాన్ని కాంక్షించేవే ! అయితే సగటు మనిషికి ఈ మతం, దేవుడు అర్థం కాక కొట్టుమిట్టాడుతున్నాడు. తనకు నచ్చి కాని, లేదా మత మార్పిడి లాభం వచ్చి కాని, ఏదో ఒక మార్గాన్ని ఎంచుకుంటున్నాడు.

"ఉన్నతులకు ఒక లక్ష్యముంటుంది. సామాన్యులకు కోరికలు మాత్రమే ఉంటాయి" అని అన్నారు అమెరికా మొట్టమొదటి అధ్యక్షుడు వాషింగ్టన్. శ్రీనివాస్‌కి ఉన్నత లక్ష్యం ఉంది కాబట్టే ఈ తరహా రచనావ్యాసాంగాన్ని ఎంచుకున్నారు.

ముమ్ముందు మరిన్ని పుస్తకాలు, సమాజ హితాన్ని కోరు గ్రంథాలు శ్రీనివాస్ గారి కలం నుంచి జాలువారాలని ఆకాంక్షిస్తూ...

**అభినందనలతో...**

**పద్మశ్రీ ఆచార్య డా. కుటికుప్పల సూర్యారావు.**

# నా మాట



మహాకవి శ్రీశ్రీ అంతటి వ్యక్తి “దేవుడున్నాడని నమ్మకుండా... లేడేమోననే సందేహంతో బతకమంటాను” అన్నాడంటే ప్రపంచంలో మిస్టరీలన్నింటినీ మన విజ్ఞానం సరిగ్గా వివరించలేకపోయిందనే విషయం అర్థమవుతుంది.

మతాల గురించి శాస్త్రీయంగా ఆలోచించడం మంచిది కాదని అంటారు చాలా మంది. సైన్స్ ముందు మతాలు నిలబడనవసరం లేదన్నది వారి వాదన. నిజమే మతం సైన్స్‌కు జవాబుదారీతనం కావాల్సిన అవసరం లేదు. కానీ మత విషయాలు, ఆచరణ మార్గాలు శాస్త్రీయంగా ఉంటేనే ఆ నమ్మకాలను రుజువు చేయడం సులభమవుతుంది. నిలబడని నమ్మకాలన్నీ మళ్లీ మత మహిమలే అవుతుంటాయి.

ఒక చోటు నుంచి మరో చోటుకు చేర్చే మార్గంలా, విజ్ఞానాన్ని పెంపొందించే విద్యలా మతం ఎప్పుడూ మన పురోగతికే ఉపయోగపడాలి కానీ ఎందుకో మతం, కులం కొందరి ఎదుగుదలకు నిచ్చెనల్లా మరికొందరి అణచివేతకు ఆయుధంలా మారిపోయాయి.

ఏ మతాన్ని పాటించని వాళ్ళ సంఖ్య ఎక్కువగా ఉన్న దేశాల్లో నేరాల శాతం తక్కువగా ఉండటం, అందువల్ల అక్కడి దేశాల్లో జైళ్ళు కూడా మూసి వేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అలాగే ఈ దేశాల్లోని వారికి దయ, నైతికత అధికంగా ఉంటుందని సర్వేల్లో తేలింది.

76 శాతం మత రహిత ప్రజలున్న జపాన్, డెన్మార్క్ వంటి దేశాల కంటే... కేవలం 0.6 శాతం మత రహిత ప్రజలున్న భారతదేశంలో నేరాల సంఖ్య అధికం. దేవుడి ఉనికి అన్న భావన ప్రజల్ని నైతికంగా ఉంచుతుందన్న వాదనకు ఇది భిన్నంగా ఉంది కదా.

అందుకే ఈ మతం అనేది లేకపోతే బాగుంటుంది కదా అన్న ఆలోచన కొన్నేళ్ల క్రిందట వచ్చింది. దానిని మా మాష్టారు, జర్నలిజం ప్రొఫెసర్ బాబీవర్ధన్ గారు ప్రోత్సహించి “తప్పెవరిది?” అనే పేరుతో ఆలిండియా రేడియోలో కథానికగా చెప్పే అవకాశం కల్పించారు. ఇప్పుడు అదే విషయానికి మరింత సమాచారం, కాస్త కల్పనికతను జోడించి “కొత్త దేవుడండీ..!” పేరుతో పుస్తక రూపంలో అందిస్తున్నాను.

పుస్తకాన్ని చదివి...ముందుమాట రాసిన టీవీ9 ఇన్‌పుట్ ఎడిటర్ జాఫర్ బాబు గారికి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రీజినల్ కోఆర్డినేటర్ చిగురుపాటి సతీష్ బాబు గారికి, అభినందనలు తెలిపిన పద్మశ్రీ కుటికుప్పల సూర్యారావు గారికి ధన్యవాదాలు.

లక్కోజు శ్రీనివాస్...

# ప్రారంభం

భవిష్యత్‌లో ఒక రోజున....

ఆశ్చర్యం...

భూగోళమంత ఆశ్చర్యం...

కాదు...భూగోళమే ఆశ్చర్యం...

అంతరిక్షంలో... ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లో...

**అక్కడ** శాస్త్రవేత్తలు తాము చూస్తున్నది నిజమా...! లేక భ్రమా...! అని జీవితంలో ఎప్పుడూ లేనంత ఆశ్చర్యానికి, ఉద్వేగానికి గురవుతున్నారు. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ (ఐఎస్ఎస్)లో స్క్రీన్స్ మీద కనపడుతున్న చిత్రాలను చూస్తున్న వాళ్లకి గుండె వేగం పెరిగిపోతోంది. భూమిపై జీవం అవతరించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎవరు గురికానంత ఆశ్చర్యానికి లోనవుతున్నారు. అసలు ఏం జరుగుతుందో, తాము చూస్తున్నదేంటో కూడా ఆలోచనలకు అందడం లేదు.

బ్రెజిల్ తీర ప్రాంతం కదులుతూ కనిపిస్తోంది. అది దక్షిణ అట్లాంటిక్ సముద్రం మీద తేలుతూ మెల్లమెల్లగా ఆఫ్రికా ఖండం వైపు వెళ్లిపోతోంది. బ్రెజిల్ నెమ్మదిగా కదులుతూ ఆఫ్రికా ఖండంలోని దక్షిణాఫ్రికా, నంబియా, అంగోలా దేశాలను ఢీకొట్టబోతోంది. మరోవైపు గ్రీన్‌లాండ్ భూభాగం కూడా ఐర్లాండ్ దేశాన్ని ఢీకొట్టింది. ఆ రెండు భూభాగాలు కలిసిపోయి...సముద్రాన్ని వెనక్కి నెట్టేస్తూ నార్వే దేశం వైపు పయనిస్తున్నాయి. తాము చూస్తున్నది నిజమేనా లేక భ్రమా అనే అయోమయ స్థితిలో అక్కడి వారంతా ఉన్నారు. ఇంతలోనే న్యూజిలాండ్ దేశ భూభాగం కూడా ఆస్ట్రేలియా వైపు కదులుతూ కనిపిస్తోంది.

ఐఎస్ఎస్‌లో ఆస్ట్రోనాట్స్ అంతా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అసలు ఇది నిజమా, కలా అనే అనుమానం అందరిలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. అది నిజమే అన్న విషయాన్ని రుజువు చేస్తూ భూమి మీద దేశాలన్నీ కదులుతూ ఒకదానితో ఒకటి కలిసిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది.

ఇండియా, ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా...
శ్రీహరి కోట అంతరిక్ష కేంద్రం...

ఐఎస్ఎస్‌లో ఆస్ట్రోనాట్స్ ఏదైతే గమనించారో అదే విషయాన్ని శ్రీహరి కోట అంతరిక్ష కేంద్రం గుర్తించింది. ఇక్కడి శాస్త్రవేత్తలకూ ఏం జరుగుతుందో తెలియడం లేదు. ఇండియా చిట్టచివరి భూభాగమైన కన్యాకుమారి పాయింట్‌కి దిగువన ఉండే శ్రీలంక కదులుతూ ఉంది. అలాగే మొత్తం భారత భూభాగమంతా బంగాళాఖాతంలో ఈదుకుంటూ వెళ్తూ...మయన్మార్, మలేషియా, థాయ్‌లాండ్ దేశాల వైపు ప్రయాణం చేస్తోంది. ఇలా మొత్తం ప్రపంచంలోని తీర ప్రాంత దేశాలన్ని పక్కనున్న ఖండాలు, దేశాల్లో కలిసిపోవడమో, కలిపేసుకోవడం జరుగుతోంది. అసలేం జరుగుతోందో అర్థం కావడం లేదు. ప్రపంచంలోని అన్ని భూకదలిక పరిశోధన కేంద్రాల్లోని స్క్రీన్ల మీద ఇవే దృశ్యాలు.

అంతా గందరగోళం, అయోమయం. ప్రపంచ భూభాగమంతా ఒక్కటైపోయింది. దేశాల సరిహద్దులన్నీ చెరిగిపోయాయి. భూభాగం అంతా ఎలాంటి ఖాళీలు, విభజనలు లేకుండా కలిసిపోయింది. దీంతో సముద్రాలన్నీ వెనక్కి వెళ్లి సరిహద్దుల్ని కోల్పోయి, భూభాగం చుట్టూ చేరి ఏ సముద్రం ఏదో తెలియనంతగా కలిసిపోయాయి.

అదే సమయంలో...
చైనాలోని జర్మని రాయబార కార్యాలయంలో...

అక్కడున్న ఉద్యోగుల్లో కొందరు చైనా, మరికొందరు జర్మన్ దేశస్థులు ఉన్నారు. ఎవరి పనిలో వారు బిజీగా ఉన్నారు. చైనా దేశస్థుడైన చాంగ్లీ, జర్మన్ దేశస్థుడైన క్లెమెన్స్ పక్కపక్క క్యాబిన్లలో ఉంటారు. వీరిద్దరికీ ఎందుకో మొదట్నుంచీ పడదు. దాంతో చాంగ్లీ చైనీస్‌లో, క్లెమెన్స్ జర్మన్ భాషలో ఒకర్నొకరు తిట్టుకుంటారు. అయితే ఇద్దరికీ ఒకరి భాష మరొకరికి రాకపోవడంతో ఒకరి తిట్లు, ఇంకొకరికి అర్థం కావు.

రోజులా క్యాంటీన్లో ఇద్దరూ తారసపడ్డారు. భాష అర్థం కాదులే అనే ధైర్యంతో ఎప్పటిలా చైనీస్ లాంగ్వేజ్‌లో క్లెమెన్స్‌కు వినపడేలా తిట్టాడు చాంగ్లీ. అది విన్న క్లెమెన్స్ కోపంతో ఊగిపోయాడు. చాంగ్లీకి తిరిగి చైనీస్ భాషలోనే, చైనా సంప్రదాయ తిట్లతోనే ఘాటుగా సమాధానం చెప్పాడు. అంతే, ఒక్కసారిగా ఆశ్చర్యపోవడం చాంగ్లీ వంతైయింది. జర్మన్‌కు చెందిన క్లెమెన్స్‌కు నిన్నటి వరకూ రాని చైనీస్ భాష ఇప్పుడు ఇంత చక్కగా ఎలా వచ్చిందో అర్థం కాలేదు చాంగ్లీకి. తాను తిట్టాడనే విషయం క్లెమెన్స్‌కు తెలిసిపోవడంతో క్లెమెన్స్‌ను క్షమాపణ అడిగాడు చాంగ్లీ చైనీస్ భాషలో.

“ఓకే, మరోసారి ఇలా చేయకు” అంటూ చైనీస్‌లోనే చెప్పాడు.

“రాత్రికి రాత్రే వీడెప్పుడు చైనీస్ ఇంత స్పష్టంగా నేర్చుకున్నాడ్రా బాబూ...”

అనుకుంటూ చాంగ్లీ తల నేలకేసి కొట్టుకోవాలనేంతగా ఆలోచిస్తున్నాడు.

"అయితే నన్ను రోజు వీడు ఇలాగే తిట్టుకుంటున్నాడన్న మాట. వీడి పని పట్టాలి" అనుకుని...చాంగ్లీ వైపు కోపంగా చూస్తూ జర్మన్ భాషలో బండ బూతులు తిట్టాడు క్లెమెన్స్, చాంగ్లీకి జర్మన్ భాష రాదనే ధైర్యంతో.

కాని రాకెట్ కంటే స్పీడ్‌గా జర్మన్ భాషలో అదే స్థాయి బూతులతో గట్టి సమాధానమే వచ్చింది క్లెమెన్స్‌కి చాంగ్లీ నుంచి. ఈసారి ఆశ్చర్యపోవడం క్లెమెన్స్ వంతైయ్యింది.

'వీడికెప్పుడు జర్మన్ భాష ఇంత బాగా వచ్చిందిరా బాబూ?" అనుకుంటూ షాక్‌లో ఉండిపోయాడు క్లెమెన్స్.

చైనా వాడు జర్మన్ మాట్లాడగలుతున్నాడు, జర్మన్ వాడు చైనీస్ బ్రహ్మాండంగా పలికేస్తున్నాడు. అసలు తానెప్పుడూ జర్మన్ నేర్చుకున్నానని చాంగ్లీ, తానెప్పుడు చైనీస్ నేర్చుకున్నానని క్లెమెన్స్‌కి అర్థం కాక బుర్రలు గోక్కుంటున్నారు. వీళ్ల గందరగోళం ఎలా ఉన్నప్పటికీ వీరిద్దరి మధ్య ఉండే భాష సమస్య తీరిపోయింది. ఇదే విధంగా ప్రపంచంలోని ప్రతిఒక్కరూ తమతో మాట్లాడే వ్యక్తి ఏ భాష మాట్లాడినా అదే భాషలో తిరిగి సమాధానం చెప్పగలుగుతున్నారు. నిన్నటి వరకు మాతృభాషే సరిగా రాని చాలా మంది ఇప్పుడు ప్రపంచంలోని అన్ని భాషలు శబ్ద దోషాలు లేకుండా మాట్లాడగలుగుతున్నారు.

ఇండియన్‌తో చైనీస్, ఆస్ట్రేలియన్‌తో స్పానిష్, ఫ్రాన్స్ దేశంలో హిందీ, అమెరికాలో బెంగాలీ ఇలా ఎవరు ఏ భాషలో మాట్లాడినా తిరిగి వారికి అదే భాషలో సమాధానం చెప్పేస్తున్నారంతా. ఏదో మాయ జరిగింది. అయితే అదేంటో అర్థం కావడం లేదు. అసలేం జరుగుతుందో ఎవరికీ అంతుపట్టని పరిస్థితి. అసలేం జరిగింది?

న్యూజిలాండ్

క్రిస్టోఫర్ రైస్, ఫోర్త్ హౌస్...

ఆఫీసుకు బయలు దేరే హడావిడిలో ఉంది స్టెల్లా.

అద్దం ముందు కూర్చుని మేకప్ వేసుకుంటోంది. తన ప్రియుడు స్టువర్ట్‌ని తన అందంతో ఇంప్రెస్ చేయాలనే ఉద్దేశంతో మరింత బాగా ముస్తాబవుతోంది.

చూడగానే ముద్దు పెట్టుకోవాలనిపించే బుగ్గలపై సుతిమెత్తగా బ్రషింగ్ చేస్తోంది. అందానికే అందానివే అన్నట్లుగా న్యూజిలాండ్ బాపు బొమ్మలా స్టెల్లా తయారైంది. స్టెల్లా అందానికి పడనోడు ఉన్నాడంటే వాడు మగాడే కాదేమోననిపిస్తుంది. అంతటి అందం ఆమెది.

ఫైనల్ టచప్ ఇస్తూ అద్దంలో చూసుకుంటూ తానకి తానే ముద్దు పెట్టుకుంది. అద్దం

ముందు నుంచి కదలబోతూ...ఏదో అనుమానం వచ్చి ఒక్కసారిగా అద్దానికి దగ్గరగా తన ముఖాన్ని తీసుకెళ్లింది. దాదాపుగా అద్దంలో ముఖాన్ని పెట్టినట్లు చూసుకుంటుంది. ఫేస్‌లో టెన్షన్ కనపడుతోంది. మెల్లగా ఆ టెన్షన్ పీక్ లెవల్‌కి వెళ్లిపోయింది.

ఏం జరుగుతోంది? మగాళ్లని పిచ్చెక్కించే తన అందానికి ఏమవుతోంది? న్యూజిలాండ్ యాపిల్ లాంటి తన స్కిన్ టోన్‌కు ఏమైంది? మెల్లగా మెల్లగా మారిపోతూ రంగు తగ్గుతూ నల్లగా మారిపోయింది తన శరీరమంతా. పెద్ద కేక పెట్టి అద్దాన్ని అక్కడున్న మేకప్ కిట్ బాక్స్‌తో బద్దలుకొట్టింది. అక్కడ నుంచి పరుగు పెట్టి బెడ్ రూంలో ఉన్న మరో అద్దం దగ్గరకు వచ్చింది. అక్కడ తన ముఖాన్ని చూసుకుంది. ఇందాకే బెటర్‌గా ఉంది. ఇప్పుడు మరింత కలర్ తగ్గిపోయింది. ఆ బాధలో కూడా స్టెల్లా గమనించింది ఏంటంటే తన అందం అలాగే ఉంది. కాకపోతే రంగు మాత్రం మారిపోయింది. దానివల్ల తన అందం తగ్గినట్లు అనిపిస్తోంది.

ఏమైంది? హఠాత్తుగా ఎందుకిలా జరిగింది? అసలు ఏం జరుగుతోందో అని అనుకుంటూ ముందు గదిలోకి వచ్చి చూస్తే...అక్కడ సోఫాలో స్టెల్లా సిస్టర్ నిద్రలో వుంది. ఆ అలికిడికి లేచిన స్టెల్లా సిస్టర్, స్టెల్లాని చూసి గావు కేక పెట్టింది. స్టెల్లా కూడా తన సిస్టర్‌ని చూసి అదే రేంజ్‌లో అరిచింది. స్టెల్లా సిస్టర్ రంగు కూడా మారిపోయింది.

వీరిద్దరూ ఒకరిని ఒకరు చూసుకుని షాక్ తిన్నారు. ఎందుకైనా మంచిదని ఇద్దరు ముఖాలకు అడ్డంగా కర్చీఫ్‌లను కట్టుకుని బయటకు వచ్చారు. బయట రోడ్లపై వెళు ్తన్న వారిని గమనించారు. వారి రంగులు కూడా మారిపోయాయి. తమ దేశంలో ఎప్పుడూ లేనంతగా మంది రంగు తక్కువున్న మనుషులు  కనిపిస్తున్నారు. అలాగని అంతా నల్లగా లేరు, తెల్లగానూ లేరు. చామనఛాయ కూడా కాదు. అదో రంగు అంతే. అయితే అందరూ ఒకేరకమైన రంగులో ఉన్నారు. ఇది కేవలం న్యూజిలాండ్‌లోని మాత్రమే కాదు, ఇంగ్లండ్, అమెరికా, ఆఫ్రికా ఖండం, ఇండియా ఇలా ప్రపంచంలోని మనుషులందరూ ఒకే రంగులోకి వచ్చేశారు. అంతా రంగులో సమానత్వం సాధించారు. ఈక్వల్ ఇన్ కలర్.

భూభాగమంతా కలిసిపోయింది. సముద్రాలన్నీ ఏకమైపోయాయి. భాషలన్నీ ఒక్కటయ్యాయి. వర్ణ బేధం లేదు.

అసలు.....

ఈ భూగోళానికి ఏం జరిగింది...?

ఏం జరుగుతోంది..?

ఏం జరగబోతోంది...?

# 1

వర్తమానం...

రాజమండ్రి...

కొడితోట చర్చ్ సందులో ఉన్న ఓ ఇంటిలో...

సూర్యుడు మెల్లగా పడమరలో కలిసిపోతున్న సమయంలో...

"రామూ...నమాజ్‌కి టైమయ్యింది...! పవిత్ర వస్తోంది...స్టేషన్‌కి వెళ్లాలి కదా..!"

"హా...లూసీ అయిపోతుంది...వచ్చేస్తున్నా...పవిత్ర ఫోన్ చేసిందా...?"

"హా...చేసింది...నిడదవోలు రైల్వే స్టేషన్ బ్యాక్ డ్రాప్‌లో తీసుకున్న తన ఫొటోని వాట్సప్‌లో పంపింది కూడా."

రాము నమాజ్ పూర్తి చేసి రెడీ అయ్యాడు.

పవిత్ర ఢిల్లీలో స్పేస్ ఫిజిక్స్ చదువుతోంది. ఇవాళ తన సొంతూరు రాజమండ్రికి వస్తోంది. లూసీ, రాముల ఏకైక సంతానమే పవిత్ర. తనని రిసీవ్ చేసుకోవడానికి ఇద్దరూ స్టేషన్‌కి కారులో బయలుదేరారు. రాము, లూసీ వెళ్లేటప్పటికే పవిత్ర స్టేషన్ బయట ఉన్న పెట్రోల్ బంక్ దగ్గరున్న ఆటో స్టాండ్ వద్ద వెయిట్ చేస్తోంది.

పేరెంట్స్‌ని చూడగానే పవిత్ర కళ్లలో ఆనందం కనిపించింది.

రాము కారుని రివర్స్ చేసి...లూసీ, పవిత్రల దగ్గరకు తీసుకొచ్చాడు.

"మమ్మీ డ్రైవర్ మంచోడేనా...జాగ్రత్తగా తీసుకెళ్తాడుగా?" సరదాగా అడిగింది పవిత్ర.

"ఆ మంచోడే. నాకు గత 25 ఏళ్లుగా తెలుసు. ఏ ఇబ్బందీ రాదు. బండినే కాదు సంసారాన్ని కూడా బాగానే డ్రైవ్ చేస్తాడు. అంతెందుకు నా దగ్గర డ్రైవర్ జాబ్ చేస్తూ కూతుర్ని రాజధాని ఢిల్లీలో స్పేస్ ఫిజిక్స్ చదివిస్తున్నాడు" నవ్వుతూ చెప్పంది లూసీ.

"అవునా...గుడ్. అయితే మంచోడే కాకుండా, బాధ్యతున్నోడు కూడా" అంటూ తండ్రి రాము వైపు చూసింది పవిత్ర.

"అవునవును" అంటూ ఇక చాల్లే అన్నట్లుగా పవిత్ర తలపై చిన్నగా కొట్టింది లూసీ. వీరు ముగ్గురూ కలిస్తే ఇలాగే స్నేహితుల్లాగే ఉంటారు. పవిత్ర కూడా తల్లిదండ్రుల వద్ద ఏ విషయం దాచిపెట్టదు. కాలేజ్‌లో తనకి వచ్చిన లవ్ ప్రపోజల్స్‌తో సహా.

చిన్నతనం నుంచి పవిత్రకు ఆకాశం, నక్షత్రాలు అంటే ఎందుకో తెలియని ఆసక్తి. అక్కడ ఏదో ఉంటుందని నమ్ముతుంది. అప్పటి నుంచి అక్కడ ఏముందా అని రకరకాలుగా

ఊహించుకుంటుంది. తన పేరెంట్స్‌ని ఈ ప్రశ్న వేస్తే, వాళ్లు అక్కడేమీ ఉండదని అంతా శూన్యమేనని చెప్పారు. తనకి తెలిసిన చాలా మందిని ఇదే ప్రశ్న అడిగింది. ఎక్కువ మంది అక్కడ దేవుడు ఉంటాడని సమాధానం చెప్పారు.

దేవుడు అక్కడుంటే మనకి కనపడాలి కదా…! అక్కడే ఉన్న సూర్యుడు, చంద్రుడు కనిపిస్తున్నారు. నక్షత్రాలూ కనిపిస్తున్నాయి. మరి అక్కడే ఉన్న దేవుడు ఎందుకు కనిపించడు అనే ప్రశ్న తనని తాను వేసుకుంది. చాలా మందికి ఇదే ప్రశ్న వేసింది. అయితే ఎవరి దగ్గర నుంచి సరైన సమాధానం మాత్రం రాలేదు. అంతా అక్కడేదో మాయ ఉంటుంది, దేవుడుంటాడు, మనమెవ్వరం చూడలేనంత శక్తి ఉంటుంది ఇలాంటి సమాధానాలే చెప్పారు. కాని ఆ సమాధానాలతో పవిత్రకు ఎందుకో సంతృప్తి కలగలేదు. ఇదే విషయాన్ని తన పేరెంట్స్ వద్ద ప్రస్తావిస్తే పవిత్ర ఆసక్తి గమనించిన రాము కొంచెం వివరంగా సమాధానం చెప్పాడు.

“ఆకాశం అంటే  ఏమీ ఉండని ఒక పెద్ద ఖాళీ స్థలం. దాన్నే శూన్యం అంటారు. అక్కడ మనకి కనిపిస్తున్న శూన్యం పేరు ఆకాశం . అలాగే ఆ శూన్యం వైపు చూస్తే మనకు కనిపించే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు అన్నీ కూడా అక్కడ వేలాడుతున్న వస్తువులు లాంటివి.

అసలు ఆకాశం అనేది ఒక వస్తువు కాదు కాబట్టి ఈ నక్షత్రాలు, సూర్యచంద్రులు ఆకాశం పక్కనుంటాయా, పైనుంటాయా, కిందుంటాయా అనే ప్రశ్నే లేదు. ఇవన్నీ భూమికి బాగా దూరంగా ఉంటాయి. అవన్ని ఒక వరుస క్రమంలో ఒకదాన్ని ఒకటి ఆకర్షించుకుంటూ తిరుగుతుంటాయి. ఏ ఒక్కటీ లైన్ దాటకుండా గుండ్రంగా వాటి కోసం గీసినట్లు ఉండే గీతలపై తిరుగుతూంటాయి. వాటినే గ్రహాలంటాం.

అలా తిరిగే ఒక గ్రహమే భూమి కూడా. మనం ఉన్న భూమి, భూమి చుట్టూ ఉన్న మరిన్ని గ్రహాలు అన్నీ తిరుగుతూ ఉంటాయి. వాటిని చూడాలంటే పెద్ద పెద్ద టెలిస్కోప్‌లు ఉపయోగించి చూడాలి. లేదంటే అంతరిక్షంలోకి వెళ్లి చూడాలి” అని చెప్పాడు.

“అంతరిక్షం అంటే ఏంటి?” ఆసక్తిగా అడిగింది పవిత్ర.

“భూమి నుంచి చూస్తే ఎక్కడో దూరంగా మనకి కనిపించే సూర్యచంద్రులు, నక్షత్రాలతో పాటు మనకి కనిపించని గ్రహాలు, ఇతర గ్రహాలు, తోక చుక్కలు, ఉల్కలు మొత్తం ఇలాంటివన్నింటినీ కలిపి అంతరిక్షం అంటాం” అంటూ తనకి తెలిసిన సైన్స్ గురించి కూతురికి వివరించాడు రాము.

తాను చదువుకుందేమో సివిల్ ఇంజనీరింగ్. తన కూతురు అడుగుతున్నది స్పేస్ సైన్. ఇప్పటి వరకు చెప్పిందే ఎక్కడో చదువుకున్నది, టీవీల్లో సైన్స్ ప్రోగామ్స్ ద్వారా తెలుసుకున్నది. ఇంతకు మించి రాముకి ఏమీ తెలియదు.

“మరి దేవుడు ఎక్కడుంటాడు. అంతరిక్షంలో ఉంటాడా?” అని మరో ప్రశ్న వేసింది.

“దేవుడు అంతరిక్షంలో ఉండడమ్మా…దేవుడు అంతటా ఉంటాడు. మనకి మంచి చేసిన వాళ్లు, కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే వాళ్లు, అవసరమైనప్పుడు వచ్చి సహాయం చేసే

వాళ్లంతా దేవుళ్లే అని చెప్పాడు. అంతే కాని అక్కడ ఉండడు” అని చెప్పాడు.

“మరి అలాగైతే నాకు ఎప్పుడూ దేవుడ్ని చూపించలేదు” అని ఇంకో ప్రశ్న వేసింది.

“అందరి దగ్గరకి రాడు. ఎవరికి అవసరం వస్తే వాళ్ల దగ్గరకే వెళ్తాడు. మనకి దేవుడు అవసరం రాలేదు కదా అందుకే మన దగ్గరకి రాలేదు” అన్నాడు.

“అలాగైతే నాకు రోజూ స్కూల్లో హోంవర్క్ ఎక్కువగా ఉంటుంది కదా. నేను చేయడానికి చాలా కష్టంగా ఉంది. మరి నాకు సహాయం చేయడానికి వస్తాడా? నేను నీలా, అమ్మలా, మన గుళ్లో పంతులుగారిలా పూజలు చేస్తాను” అంది.

“అలా దేవుడు రాడమ్మా. ఎవరికి, ఎప్పుడు, ఎలా సహాయం చేయాలో దేవుడు దగ్గర ఒక లిస్టు ఉంటుంది. ఆ లిస్టు ప్రకారమే వస్తాడు” అని చెప్పాడు.

“మరి లిస్టులో నా పేరు ఉంటుందా? ఉండదా?” అని అడిగింది.

“అది చాలా సీక్రెట్‌గా ఉంటుంది. దేవుడికి మాత్రమే తెలుస్తుంది” అని చెప్పాడు.

“మరి అంతరిక్షం ఎంత దూరంలో ఉంటుంది?” ఇలా విరామం లేకుండా ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఉంది పవిత్ర.

“అంతరిక్షం అంటే మనకు చాలా దూరంగా ఎక్కడో ఉంటుంది” అని చెప్పాడు.

“అదే ఎక్కడ? ఎంత దూరంలో ఉంటుంది?” అని మరో సందేహాన్ని బయట పెట్టింది.

పవిత్ర ప్రశ్నలకు సమాధానం చెప్పలేక...సతమతమవుతూ...“ఏమోనమ్మా నాకు ఇంతవరకే తెలుసు. మిగతావి మీ సైన్స్ టీచర్‌ని అడుగు” అని రాము తప్పించుకున్నాడు.

అయితే కూతురి ఆసక్తి గమనించి పవిత్రకు స్పేస్ ఫిజిక్స్‌కు సంబంధించిన పుస్తకాలు తెచ్చేవాడు. అవి చదువుతూ పవిత్రకి స్పేస్ ఫిజిక్స్ అంటే మరింత ఆసక్తి పెరిగింది.

అలా పవిత్రకు అంతరిక్షం, ఆకాశం, నక్షత్రాలు ఇలాంటి విషయాలపై తెగని ఆసక్తి. ఆ ఆసక్తి వల్లే ఎక్కువగా సైన్స్ పుస్తకాలు, ముఖ్యంగా అంతరిక్షానికి సంబంధించిన పుస్తకాలు చదివేది. అక్కడేముంటుందా అని తెలుసుకోవాలనే కుతూహలం పవిత్రకి రోజురోజుకి పెరుగుతూ వచ్చింది. అదే ఆసక్తి ఇంటర్ అయిపోగానే ఎంసెట్ వైపు వెళ్లకుండా డిగ్రీలో ఫిజిక్స్ మెయిన్ సబ్జెక్ట్‌గా తీసుకుని ఆ తర్వాత పీజీలో స్పేస్ ఫిజిక్స్ స్పెషలైజేషన్ చేసే వరకు తీసుకొచ్చింది.

పదిహేను నిమిషాల్లో ముగ్గురు రైల్వే స్టేషన్ నుంచి ఇంటికి చేరుకున్నారు.

“నెక్ట్స్ ఏం చేద్దామనుకుంటున్నావ్ రా తల్లి?” అని అడిగాడు రాము.

“ఏముంది నాన్న ఇస్రో, ఈఎస్ఏ, నాసాల్లో అవకాశం కోసం ట్రై చేస్తాను. ఇప్పటికే ఆ ప్రయత్నాల్లో ఉన్నాను కూడా అని చెప్పింది. అయితే పవిత్ర మాటల్లో ఏమాత్రం ఇదివరకటి ఉత్సాహం కనిపించలేదనేది గమనించారు పేరెంట్స్.

భోజనంతో పాటు పవిత్రకి ఇష్టమైన గులాబ్‌జామ్ కూడా రెడీ చేసింది లూసీ. భోజనం

కొంచెమే తిన్న పవిత్ర ఎప్పుడూ ఎంతో ఇష్టంగా తినే గులాబ్‌జామ్ అంటే కూడా ఈసారి ఎందుకో పెద్దగా ఆసక్తి చూపలేదు. ఆ విషయం లూసీ, రాము ఇద్దరూ గమనించారు.

భోజనాలు పూర్తయిన తరువాత ముగ్గురూ హాల్లో కూర్చున్నారు.

"ఏదైనా ప్రాబ్లమా..?" అని పవిత్రను అడిగారు.

"ప్రాబ్లమా...లేదే" చెప్పింది పవిత్ర.

మన ఆలోచనలో తేడా ఉంటే మన ఇష్టాలను సైతం మర్చిపోతుంటాం అందుకే అడిగాను" చెప్పింది లూసీ పవిత్ర గులాబ్‌జామ్ తినకపోవడాన్ని గుర్తు చేసుకుంటూ...

"అదేం లేదమ్మా" అంది పవిత్ర.

"నవీన్ పేరెంట్స్ ఏమైనా అన్నారా" అడిగింది లూసీ

ఆ మాట అనగానే అమ్మను వాటేసుకుని కన్నీళ్లు పెట్టుకుంది పవిత్ర. అది చూసిన రాము పవిత్రను దగ్గరకు తీసుకున్నాడు. ఏ జరిగిందమ్మా అని అడిగాను లూసీ, రాము.

"నవీన్ పేరెంట్స్‌కు మన ఇల్లు అన్ని మతాల కలగూరగంపలా అనిపించిందంట. అందుకే ఈ పెళ్లి వద్దని నవీన్‌పై ప్రజర్ చేస్తున్నారట" ఏడుస్తూ తనకు, నవీన్‌కు మధ్య జరిగిన సంభాషణంతా చెప్పింది.

నవీన్‌ను ఎక్కడ వదులుకోవాల్సి వస్తుందన్న ఆందోళన పవిత్రలో ఉందనే విషయం పేరెంట్స్‌కి అర్థమైంది.

తమ పెళ్లికి అడ్డు వచ్చిన మతం, తమ బిడ్డ పెళ్లికి కూడా అడ్డు వస్తుందని అనుకోలేదు ఆనాడు. ఆ రోజు రాము, లూసీల పెళ్లి మాటల సందర్భంలో "వీళ్లకే మతం పట్టింపు లేదు, ఇక వీళ్ల పిల్లల పెళ్ళిల సమయానికి మతం ఊసే ఉండదు హ్యాపీగా పెళ్లి చేసేయండి" అని కొందరు పెద్దలనడం గుర్తుకొచ్చింది. కానీ అది తప్పు అని రుజువైంది. మనిషి ఎంత అభివృద్ధి చెందినా మతం మాత్రం మనిషిని పాతాళంలోనే ఉంచుతుంది. కాలం ఎంత మారినా...మత పిచ్చి మరింత పెరిగిందే తప్ప, ఏమాత్రం తగ్గలేదు. దానికి మళ్లీ తమ కూతురి ప్రేమే ఉదాహరణగా నిలిచిందని అనుకున్నారు ఇద్దరూ.

"మీ మమ్మీని పెళ్లి చేసుకుంటానని అన్నప్పుడు కూడా ఇదే సమస్య. వాళ్లని ఒప్పించాను కదా. ఇప్పుడు మీ మమ్మీ కూడా తోడుంది. మేమిద్దరం వాళ్లిద్దరినీ ఒప్పిస్తాం. అప్పటికీ ఒప్పుకోకపోతే కౌన్సెలింగ్ పేరుతో మీ మమ్మీ చేత రెండు పెద్ద ఇంజక్షన్లు పొడిపించేస్తా. అప్పుడు ఇద్దరూ దార్లోకొస్తారు" అన్నాడు రాము.

ఆ మాటలకు పవిత్ర ముఖంలో నవ్వు కనిపించింది.

"ఇదే రా జీవితమంటే..! ఏవో ఆనందాలు, అడ్డంకులు, ఆశలు, గోతులు అన్నీ ఉంటాయి. నువ్వేమీ వర్రీ కాకు, మాకు వదిలేయ్...నువ్వు నీ ఉద్యోగం, భవిష్యత్, నీ సంతోషం వాటి సంగతి చూసుకో చాలు. ఇప్పుడు నువ్వు హాయిగా పడుకో" అని పవిత్రకి ధైర్యం చెప్పాడు.

సమయం గడుస్తోంది కానీ పవిత్రకు నిద్ర పట్టడం లేదు. అసలు మత పట్టింపులు ఇంకా ఉన్నాయా...? బంధాలను విడగొట్టేంత స్థాయిలో మతం పని చేస్తుందా..? అన్న సందేహం పవిత్రని స్థిమితంగా ఉండనివ్వడం లేదు. తన తల్లిదండ్రుల ప్రేమకు, పెళ్లికి అడ్డొచ్చిన మతమే ఇప్పుడు తన ప్రేమకు అడ్డుగా మారుతుందా..? లేదంటే "అప్పుడంటే పెద్ద విషయం కాదు. కానీ ఇప్పటి కాలంలో మతం పెద్ద పట్టింపు కాదులే" అనే తన తండ్రి మాటే రుజువవుతుందా అనే ఆలోచనలో పడింది పవిత్ర.

ఒక మతం మనిషి, మరో మతం మనిషితో స్నేహం చేయడమే తప్పుగా చూసే ఈ నేల మీద, మతం కోసం మనుషులనే చంపుకునే ఈ భూమి మీద...మతం కోసం ప్రేమను చంపేయడం పెద్ద వింతేమీ కాదు కదా...! మరి నవీన్ తన తల్లిదండ్రులను ఎలా ఒప్పిస్తాడు? అసలు నవీన్ మాట వినే పరిస్థితిలో వాళ్ల అమ్మానాన్న ఉన్నారా? అన్నీ ప్రశ్నలే. సమాధానాలు మాత్రం దొరకడం లేదు. ఇలా ప్రశ్నతో మరో ప్రశ్న యుద్ధం చేస్తుంది. తన తల్లిదండ్రుల ప్రేమ కథ మొదలు తన ప్రేమ వరకు జరిగిన విషయాలన్నీ ఒక దాని తరువాత మరొకటిగా సినిమా రీళ్ల మాదిరిగా పవిత్ర కళ్ల ముందు తిరుగుతున్నాయి.

గతం...

1991 సంవత్సరం...

రాజమండ్రి దేవిచౌక్ ఏరియా...

సంవత్సరంలో 12 నెలలూ కళకలలాడే చోటు. చిన్న, పెద్ద వ్యాపారాలు అన్నీ జరుగుతుంటాయి. మనిషి జీవితానికి కావలసిన ఏ వస్తువైనా అక్కడ దొరుకుతుంది. అరమరికలు లేకుండా ఎవరితోనైనా కలిసిపోయే మనుషులతో సహా.

అమ్మవారి గుడిని అనుకుని ఉండే వరుస దుకాణాల్లో ఒక కిరణా షాపు ఉంది. ఆ షాపు యజమాని రషీద్. ఉదయాన్నే షాపు తీయడానికి ముందు, దుకాణం మూసేసిన తర్వాత అమ్మవారికి భక్తితో నమస్కరిస్తాడు. రోజూ అయిదుసార్లు నమాజ్ ఎంత శ్రద్ధగా చేస్తాడో, అమ్మవారిని అంతే భక్తితో స్మరించుకుంటాడు. 50 ఏళ్ల రషీద్ అన్ని మతాలు మనిషి మంచి కోసమే అని నమ్మతాడు. అందుకే అల్లాని, అమ్మవారిని సమానంగా కొలుస్తాడు.

ఎప్పటిలా ఉదయాన్నే 9 గంటలకు రషీద్ షాపు దగ్గరకు వచ్చాడు. ఎదురుగా ఉన్న దేవి మాతకు నమస్కరించి షాపు తెరిచాడు. షాపు తెరవగానే అక్కడున్న మక్కా మసీదు ఫొటోకి నమస్కరించాడు. దుకాణానికి కస్టమర్లు ఒక్కొక్కరుగా వస్తున్నారు. రషీద్ క్యాష్ కౌంటర్‌లో కూర్చుని సరుకుల బిల్లు వేస్తూ, డబ్బు తీసుకుంటూ పనిలో బిజీ అయిపోయాడు. ఇంతలో ఏదో గుర్తొచ్చింది రషీద్‌కి.

"ఒరేయ్...రాము వచ్చాడా?" అని అడిగాడు.

“అయ్…రాము బాబు వచ్చారండి. ఇవాళ రాము గారి బాసు గారి సినిమా రిలీజ్ కదండి అక్కడికి వెళ్లిపోయి ఉంటారండి” అన్నాడు ఆ షాపులోని వర్కరొకడు.

రాము రషీద్ కొడుకు. రాము బాలకృష్ణ ఫ్యాన్. తన ఫేవరెట్ హీరో సినిమా విడుదలైన మొదటి రోజు మొదటి షో చూసేయాల్సిందే. అందుకే బాలయ్య సినిమా రిలీజైన రోజు రాము కోసం ఎవరు అడగరు, వెతకరు.

రాజమండ్రి అశోక్ మహల్. బాలకృష్ణ నటించిన “ఆదిత్య 369” సినిమా రిలీజ్ కావడంతో ఉదయం తొమ్మిది గంటలకే థియేటర్ దగ్గరకి వెళ్లిపోయాడు రాము. తన ఫ్రెండ్ కోసం ఎదురు చూస్తూ ఆ పక్కనే ఉన్న పార్లర్‌లో టీ తాగుతున్నాడు. అందర్నీ పరిశీలినగా చూస్తున్నాడు రాము.

ఆ పార్లర్ పక్కనే ఓ అమ్మాయి కూడా ఎవరి కోసమో ఎదురు చూస్తూ కనిపించింది. రాము ముఖం ఆటోమేటిక్‌గా ఆ అమ్మాయి వైపు తిరిగింది. ఇంతలో అటుగా వెళ్తున్న అమ్మాయిని చూసి ఫ్రెండ్ కోసం ఎదురు చూస్తున్న పార్లర్ దగ్గర అమ్మాయి గట్టిగా పిలిచింది.

“హేయ్ లూసీ, హేయ్…ఇటు ఇటు లూసీ, ఇటు” అంటూ అరిచినట్లుగా పిలుస్తోంది.

ఆ పిలుపుకి లూసీ పార్లర్ వైపు చూసింది. వెనక్కి తిరిగి చూసిన ఆ చూపుకి పార్లర్‌లో ఉన్న మగాళ్లంతా ఆ చూపు తమ కోసమే అన్నట్లుగా ఫీలైపోయారు. అందరి కళ్లలో వింతైన కాంతి కనిపించింది. అది లూసీ అందం చేస్తున్న మ్యాజిక్. లూసీని చూసిన ప్రతి ఒక్కరూ ఆమె అందానికి ఫిదా అయిపోయారు. రాము అయితే డబుల్ ఫిదా అయిపోయాడు. దేవలోకం నుంచి దిగి వచ్చినట్లు అప్సరసలా ఉన్న లూసీని చూసి రాము మనసు కితకితలు పెట్టినట్లు సంతోషంతో గెంతులేస్తోంది. ఇదే సంతోషం అక్కడున్న చాలా మందికి కూడా కలిగింది.

లూసీ, తన ఫ్రెండ్ శ్రీదేవి ఇద్దరు తొందర తొందరగా థియేటర్ వైపు వెళ్లారు. తన ఫ్రెండ్ వచ్చాడో రాలేదో కూడా చూసుకోకుండా లూసీనే ఫాలో అవుతూ థియేటర్ వైపు వెళ్లిపోయాడు రాము. ఇంతలో రాము ఫ్రెండ్ వెనక నుంచి కొట్టి మరి పిలిచాడు.

“ఎక్కడికి వెళ్లిపోతున్నావురా…నేను రాకుండా”

“పద పద నీ కోసమే చూస్తున్నా రా ఇక్బాల్” అంటూ రాము ఇక్బాల్‌ని చేయి పట్టుకుని థియేటర్‌లోకి తీసుకెళ్లాడు.

కాని లూసీ ఎటు వెళ్లిందో తెలియలేదు. రాముని ఇక్బాల్ పిలిచిన సమయంలో మిస్ అయిపోయింది. ఇద్దరూ థియేటర్‌లోకి ఎంటరయ్యారు. అయితే లైట్స్ ఆర్పేయడంతో ఆ చీకట్లో లూసీ ఎక్కడుందో ట్రెస్ చేయడం రాముకి కష్టమైంది. కొద్దిసేపటికే సినిమా స్టార్ట్ అయ్యింది.

సినిమా ఇంటర్వెల్ టైమ్‌లో, మూవీ పూర్తయిన తర్వాత కూడా లూసీ కోసం వెదికాడు.

కాని కనిపించలేదు. తన అభిమాన హీరో సినిమా సూపర్ హిట్టైనా, తన మనసు దోచుకున్న అమ్మాయిని పట్టుకోవడంలో ఫ్లాప్ అయ్యాడు రాము. ఏదో తెలియని తియ్యని బాధతో ఇంటికి వెళ్లిపోయాడు. ఇక్బాల్‌కి లూసీ కోసం చెప్పాడు.

ఇక్బాల్, రాము చిన్ననాటి స్నేహితులు. ఇద్దరికీ మసీదులో స్నేహం ఏర్పడింది. ఇద్దరూ రోజూ నమాజ్ ఒకే చోట చేసేవారు. అలా ఒకరితో ఒకరికి ఏర్పడ్డ స్నేహం, ఇప్పుడు ప్రాణంగా మారింది. ఇద్దరూ ఎంటెక్ చేశారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా బిటెక్ తర్వాత ఇక్బాల్ చదువు ఆపేద్దామని అనుకున్నాడు. ఇదే విషయం రాము తన తండ్రి రషీద్‌కి చెప్పాడు. రాముని, ఇక్బాల్‌ని ఒకేలా చూసుకునే రషీద్ ఇక్బాల్ చదువు బాధ్యతని కూడా తానే తీసుకున్నాడు. రాము, ఇక్బాల్ ఇద్దరూ ఎంటెక్ కంప్లీట్ చేశారు.

చదువైనా, సినిమాకైనా, షికారుకైనా అన్ని ఇక్బాల్‌తోనే రాముకి.

# 2

**నాలుగు** రోజుల తర్వాత...

పుష్కర ఘాట్‌కి కిలో మీటర్ దూరంలో ఉన్న ఆంధ్ర పేపర్ మిల్లు సందులో ఓ ఇంట్లో సందడిగా ఉంది. ఆ ఇంటి పెద్దావిడ వహీదా అందరికి పనులు పూరమాయిస్తూ హడావిడిలో ఉంది. ఆ ఇంటి బయట గోడకి వేలాడదీసిన బోర్డుపై "హ్యాపీ బర్త్ డే రాము" అని రాసి ఉంది.

రాము పుట్టిన రోజు ఇవాళ. రషీద్‌ది ఆర్థికంగా బాగా నిలదొక్కుకున్న కుటుంబం కావడంతో రాము బర్త్ డేని పెద్ద పండుగలా జరుపుతారు. సాయంత్రం ఐదైయింది. రాము ఇంటికి వచ్చాడు. రాముని చూసిన వహీదా కళ్లలో ఆనందం కనిపించింది.

"ఇప్పటి దాకా ఎక్కడికి వెళ్లావురా...ఇవాళ నీ పుట్టిన రోజు అనే విషయం గుర్తుందా?" అని అడిగింది.

"ఎందుకు గుర్తు లేదు నాకు. ప్రతి ఏడాది నువ్వు చేసే హడావిడి, సందడి ఎవరైనా మర్చిపోతారా. నా పుట్టిన రోజు గుర్తులేకపోయినా నీ కళ్లలో కనిపించే ఆనందం చూడగానే నాకు ఇట్టే తెలిసిపోతుంది" అంటూ అమ్మ కాళ్లకి దణ్ణం పెట్టాడు రాము.

"లేరా బాబు లే. నిండు నూరేళ్లు చల్లగా ఉండు బేటా" అని దీవించింది.

ఫంక్షన్ ప్రారంభమైంది. రాముకు ఒక్కొక్కరే వచ్చి శుభాకాంక్షలు చెప్తున్నారు. రాము చాలాసేపట్నుంచి శుభాభినందనలతో పాటు వచ్చిన వారు ఇస్తున్న గిఫ్ట్‌లు కూడా తీసుకుంటూ అలిసిపోయాడు. ముఖం కూడా నీరసంగా కనిపిస్తోంది. రాముకి టాయిలెట్

అర్జెంట్. కాని ఒకరి తర్వాత ఒకరు వస్తుండటంతో వెళ్లడం కుదరడం లేదు. ఎవరో ఒకామె వస్తోంది...ఈవిడే లాస్ట్ ఈవిడ తర్వాత ఎవరు వచ్చినా ఇక వెళ్లిపోవడమే అని స్ట్రాంగ్‌గా ఫిక్సయ్యాడు.

ఒకావిడా రాము దగ్గరకి వచ్చి "హ్యాపీ బర్త్ డే బాబు" అని చెప్పి ఏదో వెతకసాగింది. అది గమనించిన రాము "ఏంటండీ వెతుకుతున్నారు?" అని అడిగాడు.

"గిఫ్ట్ తెచ్చాను బాబు అది ఏమైందా" అని...

"పర్లేదండి...మీరు వెళ్లిరండి" అని రాము అన్నాడు.

"భలేవాడివే బాబు ఉండు మా అమ్మాయి దగ్గర ఉండిపోయినట్టుంది" అంటూ..."లూసీ ఇలారా...లూసీ త్వరగా రా" అని పిలుస్తోంది అండ్రియా.

లూసీ అనిపేరు వినగానే రాము కళ్లు ఆమె పిలిచిన దిక్కువైపే చటుక్కున తిరిగాయి.

"ఆ ఆ...మమ్మీ ఇదిగో వస్తున్నా" అంటూ రాముకి దేవతలాంటి లూసీ హంస లాంటి నడకతో అక్కడికి వచ్చింది.

"మా ఫ్రెండ్ కనిపిస్తే మాట్లాడుతున్నా" అంటూ వాళ్ల అమ్మకి గిఫ్ట్ అందించింది.

"బాబు నీ పుట్టిన రోజుకి ఇది మా కానుక" అని రాము చేతిలో గిఫ్ట్ పెట్టింది. అది తీసుకోడానికి చేయి చాచిన రాము కళ్లు మాత్రం లూసీనే చూస్తున్నాయి.

"మా వారు అనుకోకుండా క్యాంపు వెళ్లారు అందుకే నేను, అమ్మాయి వచ్చాం బాబు, మా వారు మీ నాన్న గారు మంచి స్నేహితులు. నువ్వు ఎప్పుడు మా ఇంటికి రాలేదు కాని, మీ నాన్న గారు వస్తుంటారు" అంటూ ఆమె ఏదో చెప్పుకుంటూ పోతోంది.

కాని రాము చూపు మాత్రం లూసీ వైపే ఉంది. దేవ కన్యని చూస్తున్నట్లుగా కనురెప్ప వేయకుండా చూస్తున్నాడు. లూసీ కనిపించడం ఏదో తెలియని వరంలాగా ఫీలైపోతున్నాడు.

అంతలో "హ్యాపీ బర్త్ డే రాము గారు" లూసీ కూడా రాముకి విషేస్ చెప్పింది. హ్యాపీ బర్త్ డే చెప్పిన లూసీ వాయిస్ ఎస్.జానకి లాలిపాటలా వినిపించింది రాముకి.

"లూసీ, ఐయామ్ లూసీ" అని చెప్పి లూసీ రాముకి నమస్కరించింది.

"నైస్ టూ మీట్ యూ" అని రాము కూడా ప్రతి నమస్కారం చేశాడు.

ఐదడుగులా పదంగుళాల పొడవు, చక్కని ముఖ ఛాయ, చూడగానే ఆకట్టుకునే చిరునవ్వు, నుదురుని దాదాపుగా కప్పేసేలా ఉండే పక్క పాపిడి జుట్టుతో రాము ఎవర్నైనా ఇట్టే ఆకర్షిస్తాడు. లూసీ కూడా రాముని చూసి అందగాడే అనుకుంది. అయితే ముస్లింల కుటుంబంలో రాము ఎలా వచ్చాడా అనే అనుమానం వచ్చింది లూసీకి.

"హలో రాము గారు మిమ్మల్ని ఒక మాట అడగొచ్చా?" అంది లూసీ.

"ఓ తప్పకుండా అడగండి"

"మరి...మీరు..."అంటుండగా..."రాము ఒక్కసారి ఇలారా, ఎవరొచ్చారో చూడు" అంటూ వహీదా రాముని పిలిచింది.

"ఆ...వస్తున్నా అమ్మీ" అంటూ "ప్లీజ్...ఇప్పుడే వస్తానండి" అంటూ లూసీకి చెప్పి వెళ్లాడు. రాము వాళ్ల దూరపు బంధువు అమెరికా నుంచి వచ్చాడు. అమెరికా నుంచి రావడమంటే నేరుగా స్వర్గం నుంచి వచ్చిన దేవదూత కిందే లెక్క. అందుకే అంతా అమెరికా అబ్బాయి చుట్టూ మూగారు. అమెరికా ముచ్చట్లు ముగించుకుని లూసీ కోసం కంగారుగా వచ్చాడు రాము. కాని లూసీ కనిపించలేదు, వెళ్లిపోయి ఉంటుంది అనుకున్నాడు.

"అనవసరంగా అమెరికా వాడి కోసం వెళ్లాను" అంటూ తనని తానే తిట్టుకున్నాడు రాము.

"అసలు ఎవరు ఈ లూసీ? థియేటర్ కనిపించి మనసు దోచుకున్న అమ్మాయి ఇక్కడ అకస్మాత్తుగా ప్రత్యక్షమైంది" తనలో తానే మాట్లాడుకుంటున్నాడు.

కాసేపటి కిందట లూసీ వాళ్ల మదర్ ఏవో వివరాలు చెప్తుంటే లూసీ మాయలో పడి ఆ మాటలే వినిపించుకోలేదు. దీంతో లూసీ ఎవరు అనేది వెయ్యి అమెరికన్ డాలర్ల ప్రశ్నలా రాజమండ్రి అబ్బాయికి ఇప్పుడు పెద్ద సవాలైంది.

రాము బుర్రలో ఓ ఆలోచన వచ్చింది. తనకి గిఫ్ట్ ఇచ్చింది కదా దానిపై ఏమైనా రాసుంటుంది కదా అని అనుకున్నాడు. తన తెలివి తేటలకు తన భుజం తానే తట్టుకున్నాడు. లూసీ వాళ్ల మదర్ ఇచ్చిన రెడ్ కలర్ గిఫ్ట్ ప్యాక్ కోసం వెదికాడు. మొత్తానికి అక్కడున్న వాటిలో దాన్ని ఎలాగోలా పట్టుకోగలిగాడు. అటుఇటు తిప్పి చూశాడు. పైన వివరాలు ఏమీ లేవు. హ్యాపీ బర్త్ డే అని తప్ప. పోని లోపలేమైనా వివరాలుంటాయేమోనని ఆ గిఫ్ట్ ప్యాక్‌ని విప్పి చూశాడు. కాని దానిపై కూడా వివరాలు ఏమీ లేవు. ఆ ప్యాకెట్ ఓపెన్ చేసి చూశాడు. రెండు పుస్తకాలున్నాయి. వాటిపై ఏవైనా వివరాలు రాశారా అని చూశాడు. కానీ ఏమి లేవు. దీంతో ఆ పుస్తకాలు ఏంటో కూడా చూడలేదు.

కాసేపు ఫంక్షన్‌లో గడిపిన లూసీ, ఆండ్రియాలు ఇంటికి బయలుదేరారు. అక్కడ నుంచి బయటకు వచ్చి రిక్షా కోసం ఎదురు చూస్తున్నారు లూసీ, ఆండ్రియా.

"మమ్మీ వాళ్లు చూస్తే ముస్లింలులా ఉన్నారు. మరి ఇతని పేరు రాము. అదెలా? పెంచుకుంటున్నారా? లేదా సొంత కొడుకేనా..! పెంచుకున్న కొడుకులా అనిపించడం లేదు. మరి ఇదెలా సాధ్యమయింది?" అని అడిగింది.

"ఏమో లూసీ, అసలు నాకు ఆ అబ్బాయి పేరు రాము అని కూడా తెలియదు" అని అమాయకంగా చెప్పింది ఆండ్రియా.

"మరి అన్ని తెలిసిన దానిలా అతనితో ఏదేదో మాట్లాడేస్తున్నావ్"

"ఏదో ఒకటి మాట్లాడాలి కదా అందుకే మాట్లాడా. వీళ్ల నాన్న మీ నాన్నగారి కోసం మనింటికి వస్తుంటాడు. నాకు అంతే తెలుసు. ఆ అబ్బాయిని సరిగ్గా చూడటం కూడా ఇదే

మొదటిసారి. దేవిచౌక్ దగ్గర ఉన్న అమ్మవారి గుడి పక్కన వాళ్ల షాపు ఉంది. మీ నాన్నతో వెళ్లినప్పుడు ఒకసారి ఆ బాబుని చూసినట్లు గుర్తు” చెప్పింది అండ్రియా.

“అవునా...సర్లే” అంటూ లూసీ ఆలోచనలో పడింది.

అక్కడ ఫంక్షన్‌లో లూసీ ఎవరో తెలియక, ఎలా తెలుసుకోవాలా అని రకరకాలుగా ఆలోచిస్తున్నాడు రాము.

ఇక్కడ రషీద్ కొడుకు రాము ఎలా అయ్యాడో తెలియక రాము కోసం ఆలోచిస్తోంది లూసీ.

కారణాలు వేరైనా ఇద్దరూ ఒకరి కోసం మరొకరు ఆలోచించుకుంటున్నారు. ప్రేమలో పడేందుకు తొలి మెట్లు ఒకరి కోసం ఒకరి ఆలోచనలే.

# 3

**రెండు** రోజుల తర్వాత...

ఆ రోజు శుక్రవారం. మధ్యాహ్న సమయంలో ఆచరించే జుహర్ నమాజ్ పూర్తయిన తర్వాత “కాస్త ఏలూరు వరకు వెళ్లే పనుంది. పుష్కరాలు వస్తున్నాయి కదా ముందుగానే సరుకులు ఆర్డర్ చేయాలి. సాయంత్రానికి వచ్చేస్తా. నేను వచ్చే వరకు దుకాణంలో ఉండండి” అని రషీద్...రాము, ఇక్బాల్‌కు చెప్పి వెళ్లాడు.

క్యాష్ కౌంటర్‌లో కూర్చున్న రాము ఏవో లెక్కలేసుకుంటున్నాడు. అంతలో “అరకేజీ పామాయిల్ ఎంతండీ?” అని ఓ స్వీట్ వాయిస్ వినిపించింది. ఆ వాయిస్‌కి రాము ఎక్కడో కనెక్ట్ అయ్యాడు. వెంటనే తల పైకెత్తి చూశాడు. ఆమె ఎవరో కాదు లూసీ.

లూసీ కావాలనే అక్కడికి వచ్చింది. రాము బర్త్ డే ఫంక్షన్ రోజున దేవిచౌక్ దగ్గర వాళ్ల షాపు అని లూసీ మదర్ చెప్పిన అడ్రస్‌ని పట్టుకుని వెతుక్కుంటూ వచ్చింది. లక్కీగా రాము షాపులో ఉన్నాడు. ముస్లిం ఇంట్లో ఉన్న ఇతని పేరు రాము ఎలాగయ్యిందో తెలుసుకోవాలని ఉంది లూసీకి. సైకాలజి స్టూడెంట్ కదా...! తెలుసుకునే వరకు నిద్రపోదు.

లూసీని చూసిన షాక్‌లో రాముకి ఏం మాట్లాడాలో తెలియడం లేదు. ఆమె అడ్రస్ ఎలా పట్టుకోవాలా అని బర్త్ డే రోజు నుంచి ఇప్పటి వరకు ఎన్ని ప్రయత్నాలు చేశాడు. అలాంటి ఆమె ఇప్పుడు తన ఎదురుగా ఉంది. దాంతో రాముకి ఇది నిజమేనా అనిపిస్తోంది. బయట వాళ్లకి తెలియడం లేదు కాని రాము శరీరం కంగారుతో వణుకుతున్నట్లుగా ఉంది. అసలు ఆమె ఏం అడుగుతుందో కూడా వినపడటం లేదు.

“ఏమండీ...! అరకేజీ పామాయిల్ ఎంత?” అని మళ్లీ అడిగింది.

“పామాయిల్ ధర దేముందిలెండి. మీ మదర్ నాకు బాగా తెలుసు. ఆ రోజు చూశారు కదా ఫంక్షన్‌లో. చాలా సేపు మాఖీట్లాడుకున్నాం. మీ మదర్ అన్ని విషయాలు నాతో డిస్కస్ చేస్తారు” అన్నాడు రాము.

ఆ మాటకి “ ఆ కుర్రాడు ఎవడో నాకు తెలియదమ్మా” అన్న అండ్రియా మాటలు గుర్తొచ్చి పక్కున నవ్వింది లూసీ.

లూసీ ఎందుకు నవ్వుతుందో అర్థం కాకపోయినా నవ్వు మాత్రం చాలా బాగుంది. రాము లూసీ నవ్వుని ప్రశాంత గోదారి సవ్వడిలా ఎంజాయ్ చేస్తున్నాడు.

“ఏంటి ఇలా వచ్చారు?” అని అడిగాడు రాము ఉత్సాహంగా.

“అదేనండి ఇలా వెళ్తూ మిమ్మల్ని చూశాను. ఆ రోజు ఇచ్చిన పుస్తకాలు చూశారా, ఎలా ఉన్నాయి అని అడుగుదామని వచ్చాను” అని చిన్న అబద్ధం చెప్పింది. అమ్మాయి చెప్పిన అబద్ధం కూడా అందంగానే ఉంటుంది. అదే లూసీలాంటి అందమైన అమ్మాయి చెప్తే మరింత అందంగా ఉంటుంది.

లూసీ ఇచ్చిన పుస్తకాలలో అడ్రస్ కోసం వెదికాడు కాని, అసలు ఆ పుస్తకాలు ఏంటో చూడలేదు. దాంతో ఏం చెప్పాలా అని ఆలోచిస్తూ...“చూశానండి బాగున్నాయి” అని ఏదో తనకి తోచింది చెప్పేశాడు.

“అందులో మీకు ఏ బుక్ బాగా నచ్చింది?” అనడిగింది లూసీ.

“రెండు పుస్తకాలూ బాగున్నాయి. ముఖ్యంగా ఫస్ట్ బుక్ చాలా బాగుంది. ఆల్రడీ సగం చదివేశాను కూడా. ఇంట్రస్టింగ్‌గా ఉంది. సస్పెన్స్ థ్రిల్లర్‌లా ఉంది. చాలా ఆసక్తికరంగా రాశాడు రచయత. అసలు పూర్తిగా చదివితే కాని ఆపలేం, అంత బాగుంది. ఇవాళ రాత్రికి ఎలాగైనా ఆ బుక్‌ని కంప్లీట్ చేసేస్తాను” అని మరో అబద్ధం చెప్పేశాడు.

ఆ మాటలకు...“అవునా మరి పూర్తి చేసేయండి. మళ్ళీ అలాంటి పుస్తకాలు దొరకవు” చిన్నగా నవ్వుతూ చెప్పింది. లూసీ నవ్వుని రాము నోటీస్ చేశాడు.

“అసలు మీరిచ్చిన ఆ రెండో పుస్తకం టైటిలే అదిరిపోయిందండి. చాలా క్యురియస్‌గా ఉంది. ఇది చదివిన తర్వాత వెంటనే అది కూడా చదివేస్తానండి” అన్నాడు.

రాము చెప్తుంటే లూసీ మళ్లీ చిన్నగా నవ్వింది. మళ్లీ రాము ఆ నవ్వుని నోటీస్ చేశాడు.

“మీకు పుస్తకాలంటే బాగా ఇష్టమా..? నాక్కూడా పుస్తకాలన్నా, పుస్తకాలు చదివేవారన్నా చాలా ఇష్టమండి. ఎంత జ్ఞానం ఇస్తాయండీ పుస్తకాలు. అందుకే చిరిగిన చొక్కా అయినా తొడుక్కో...కొత్త పుస్తకం కొనుక్కో అన్నారు కదా మన కందుకూరి వీరేశలింగం పంతులు గారు” అన్నాడు రాము.

“అవునవును. మీకు కూడా పుస్తకాలంటే బాగా ఇంట్రస్ట్ మాట. మీరు లైబ్రరీకి వస్తుంటారా మరి?” అనడిగింది లూసీ.

“ఆ వస్తుంటానండి. మరి మీరు..?” అన్నాడు.

"నేను రోజు వస్తానండీ...మీరు నాకు కనిపించలేదే ఎప్పుడూ..."

మెంబర్‌షిప్ ఉన్నా లైబ్రరీకి వెళ్లకపోవడం వల్ల ఇంతకాలం ఏం మిస్సైయ్యానో అనుకుంటూ..."వస్తానండి...కాకపోతే అక్కడ ఎక్కువసేపు ఉండను" అన్నాడు.

"అయితే సాయంత్రం ఐదు గంటలకు లైబ్రరీకి వస్తానండి...అక్కడ కలుద్దాం. సరే... ఉంటానండి మరి" అని చెప్పి లూసీ అక్కడ నుంచి బయలుదేరింది. లూసీ వెళ్లిపోతుంటే తన శరీరంలోని ఏదో భాగం తనని వదిలి వెళ్లిపోతున్నట్లు ఫీలయ్యాడు రాము.

* * * * *

**దుకాణాన్ని** ఇక్బాల్‌కు అప్పజెప్పి...సాయంత్రం 4.30 గంటలకే లైబ్రరీకి వచ్చేశాడు రాము. అమ్మాయిని కలవడానికి ఏ మగాడైన చెప్పిన సమయానికి కంటే అరగంట ముందే వస్తాడని లవ్ ఫిలాసఫీ ఒకటుంది. అందుకే లూసీ ఐదు గంటలకని చెప్పినా రాముఅరగంట ముందే వచ్చేశాడు.

రాము రారాణి లూసీ లైబ్రరీకి వచ్చింది లూసీ. తల తిప్పితే క్షణకాలం పాటు లూసీని చూడటం మిస్ అయిపోతాననే భావన రాముని కనురెప్ప వేయడం లేదు.

"రాము గారు అప్పుడే వచ్చేశారా?"లూసీ అడిగింది.

అందమైన షాక్ నుంచి బయటకొచ్చిన రాము "ఇప్పుడే వచ్చాను. వచ్చి ఐదు నిమిషాలయ్యింది అంతే" అని అబద్ధం చెప్పాడు.

"మిమ్మల్ని ఆ రోజు ఫంక్షన్‌లోనే అడుగుదామనుకున్నాను. మీ పేరు రాము. మీ తండ్రి పేరు రషీద్. మదర్ వహీదా. ముస్లింల కొడుక్కి రాము అని పేరు ఎలా అని...నేను అప్పటి నుంచి తల బద్దలు కొట్టుకుంటున్నా"

"ఓ అదా..." అని రాము ఏదో చెప్పబోతుంటే అక్కడ లైబ్రేరియన్ "ష్..ష్..ష్..' అంటూ సైలెంట్‌గా ఉండమని సైగ చేసింది.

మాట్లాడుకుంటూ లైబ్రరీలోకి వచ్చేశామనే విషయం గ్రహించారిద్దరూ. లైబ్రేరియన్ దగ్గరకు వెళ్లిన లూసీ తాను తీసుకొచ్చిన పుస్తకాలను ఇచ్చేసి కొత్త పుస్తకాలు తీసుకోవడానికి స్టాండ్స్ దగ్గరకు వెళ్లింది. రాము లూసీని చూస్తూ ఊహల్లో తేలిపోతున్నాడు.

"బాబు నువ్వు బుక్స్ తీసుకుంటావా?" అనే లైబ్రేరియన్ ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చాడు.

"ఆ...ఆ...తీసుకుంటానండి..." అంటూ లూసీ ఉన్న స్టాండ్ దగ్గరకు వెళ్లాడు.

అప్పటికే పుస్తకాలుసెలెక్ట్ చేసుకున్న లూసీ, ఆ పుస్తకాలు పట్టుకుని లైబ్రేరియన్ దగ్గరకు వచ్చింది.

రాముకి అంతా అయోమయంగా ఉంది. తాను కూడా ఏవో రెండు పుస్తకాలు తీసుకుని

కంగారుగా వచ్చేశాడు. ఆ కంగారులో తాను ఏ పుస్తకాలు తీశాడో కూడా చూడలేదు. నేరుగా ఆ పుస్తకాలు తీసుకుని లైబ్రేరియన్ దగ్గరకు వచ్చేశాడు. లైబ్రేరియన్, రాము దగ్గర పుస్తకాలు  తీసుకుని…“ఏం నాయనా ఎన్నో నెల?” అనడిగింది.

ఆ ప్రశ్న రాముకి అర్థం కాలేదు.

“అదే బాబు మీ ఆవిడకి ఎన్నో నెల అంటున్నా”

“మా ఆవిడకా…ఎవరావిడా?” అన్నాడు అయోమయంగా.

“మరి ఎవరి కోసం ఈ పుస్తకం?” అందామె.

అప్పుడు చూశాడు తాను ఏ పుస్తకం పట్టుకొచ్చాడో…

“కాన్పు సమయంలో జాగ్రత్తలు” అని ఉంది.

ఆ సీన్ చూస్తున్న లూసీ నవ్వు ఆపులేకపోయింది. నోటి దాకా వచ్చిన నవ్వుకి చేతిని అడ్డం పెట్టి చకచకా లైబ్రరీ హాల్ నుంచి బయటకు వచ్చేసి అక్కడ భళ్లున కక్కేసింది.

రాముకి ఏం చెప్పాలో తోచలేదు.

“ఇది కాదు లెండి ఆ రెండో పుస్తకం ఇవ్వండి” అన్నాడు.

“సరే” అంటూ టేబుల్ మీద ఉన్న ఆ రెండో పుస్తకం తీసింది.

అది చూసి లైబ్రేరియన్ నవ్వాపుకోవడానికి ప్రయత్నించింది. అది గమనించిన రాము ఆ పుస్తకం ఏంటా అని చూశాడు. రాముకి తలకొట్టేసినంత పనైంది.

“భర్తని లొంగదీసుకోవడం ఎలా?” అనే పుస్తకం అది. అక్కడ ఒక్క నిమిషం కూడా ఉండలేక, ఆ లైబ్రేరియన్ నవ్వుని అసలు చూడలేక…మళ్లీ వచ్చి తీసుకుంటానండి” అని అక్కడి నుంచి కంగారుగా బయటకు నడిచాడు. వెళ్తూ వెళ్తూ… తాను పుస్తకాలు తీసుకున్న స్టాండ్ వైపు ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాడు. అక్కడ పెద్ద అక్షరాలతో రాసిన ఒక బోర్డు వేలాడదీసి ఉంది. “మహిళా పుస్తక లోకం” అని రాసి ఉంది ఆ బోర్డుపై. అది చూసిన రాము ఇక ఒక్క క్షణం కూడా అక్కడ ఉండలేకపోయాడు. అవమానంతో  బయటకు పరుగు తీశాడు.

రాముని చూస్తే చాలు లూసీకి నవ్వొచ్చేస్తోంది. లూసీ నవ్వంటే పడి చచ్చే రాముకి, తన ఫూలిష్‌నెస్‌కి నవ్వుతున్న లూసీ నవ్వు మాత్రం ఇప్పుడు నచ్చడం లేదు. దీంతో త్వరగా ఇక్కడ నుంచి వెళ్లిపోతే బాగుంటుందని అనుకుంటున్నాడు. ఇంతలోనే లూసీ “చీకటి పడేటట్లుంది. మళ్లీ కలుద్దాం” అని నవ్వుని అతి కష్టం మీద ఆపుకుంటూ అక్కడ నుంచి వెళ్లిపోయింది.

లూసీ వెళ్లిపోవడం బాధగా ఉన్నా…ఇప్పుడు వెళ్లిపోవడమే మంచిదని అనుకున్నాడు రాము.  ఇంటికి వెళ్లిన రాముకి లూసీతో పాటు లైబ్రరీలో తన సిల్లీ బిహేవియర్ గుర్తొస్తోంది. అప్పుడు సడెన్‌గా గుర్తొచ్చింది. ఉదయం లూసీ అడిగినప్పుడు బర్త్ డే గిఫ్ట్‌గా ఇచ్చిన పుస్తకాలు బాగున్నాయని, అందులో ఒకటి చదివేశానని చెప్పాడు. అసలు ఏ

పుస్తకాలు ఇచ్చిందా అని ఆ పుస్తకాల కోసం వెదకడం మొదలెట్టాడు.

లూసీ ఇచ్చిన గిఫ్ట్ ప్యాక్‌లోనే ఆ పుస్తకాలు ఉన్నాయి. వాటిని తీసి చూశాడు. రెండు పుస్తకాలున్నాయి. వాటిలో ఒక దాని మీద 'లేటెస్ట్ ఇంగ్లీష్ జోక్స్' అని ఉంది. ఆ పుస్తకం కవర్ పేజ్ మీద జోకర్ బొమ్మ ముద్రించి ఉంది. అది చూసిన రాముకి ఆ జోకర్ తానేనని అనిపించింది. ఉదయం లూసీతో సస్పెన్స్ సూపర్, క్యూరియస్‌గా ఉంది అని తాను కూసిన కోతలు ఈ పుస్తకం కోసమే. అప్పుడు గుర్తొచ్చింది రాముకి, ఉదయం తాను పుస్తకాల కోసం చెప్పినప్పుడు లూసీ ఎందుకు నవ్విందో. ఆ సీను గుర్తుకు రాగానే ఆ పుస్తకాలతోనే తలని కొట్టుకున్నాడు.

ఇంతకి రెండో పుస్తకం ఏంటా అని చూశాడు. అది "ఇండియా టూరిజం" అనే పుస్తకం. ఈ పుస్తకం టైటిలే చాలా ఇంట్రెస్టింగా ఉంది అన్నాడు. అప్పుడు కూడా లూసీ నవ్వింది. మళ్లీ పుస్తకాలతో తల బాదుకున్నాడు.

తాను ఆరాధిస్తున్న లూసీ దగ్గర ఉదయం నుంచి ఫూల్ అవుతున్నాడనే విషయం తెలిసింది రాముకి. తన తెలివితక్కువ పనుల గురించి పదే పదే తనని తానలు తిట్టుకుంటూనే ఉన్నాడు. ఆ రోజు రాముకి నిద్ర పట్టలేదు లూసీ ఆలోచనలతో.

లూసీ లైబ్రరీలో రాము బుక్‌లతో బుక్కైపోయిన విషయాన్ని పదే పదేతలచుకుని నవ్వుకుంటోంది.

మళ్లీ విషయం ఏదైనా ఇద్దరూ ఒకరి కోసం మరొకరు ఒకే సమయంలో తలచుకుంటున్నారు.

# 4

**వారం** రోజుల తర్వాత...

రాజమండ్రి గౌతమి ఘాట్‌కి రషీద్, వహీదా, రాము, ఇక్బాల్ వచ్చారు.

రషీద్‌ని చూసిన ఓ బ్రాహ్మణుడు రషీద్ వద్దకు వచ్చారు.

"అయ్యా...సమయం దాటుతోంది కార్యక్రమం మొదలుపెడదాం" అంటూ అక్కడ పిండ ప్రదానానికి ఏర్పాటు చేస్తున్నాడు. అందరి ముఖాల్లో విషాదం కనిపిస్తోంది. బ్రాహ్మణుడు మంత్రాలు చదువుతున్నాడు. ఎదురుగా రాము కూర్చున్నాడు.

"అయ్యా తండ్రి గారి నామం..!" బ్రాహ్మణుడు అడిగాడు.

"ప్రసాదశాస్త్రి"

"తల్లిగారి నామం..!"

"భ్రమరాంబిక"

"అయ్యా...సోదరి నామం...!"

"షబానా"

అరగంటసేపు ఈ కార్యక్రమం సాగింది. ప్రసాదశాస్త్రి, భ్రమరాంబిక, షబనాలకు రాము పిండ ప్రదానం చేశాడు. కాస్త దూరంగా ఉండి రషీద్, వహీదా, ఇక్బాల్ ఈ తంతు చూస్తున్నాడు. వాళ్ల కళ్లలో తడి బయటకు తన్నుకొస్తున్నట్లు ఉంది.

తాను పిండ ప్రదానం చేసిన ఈ ముగ్గురూ ఎలా ఉంటారో రాముకి గుర్తు లేదు. రాము మూడేళ్లప్పుడే వారిని కోల్పోయాడు. అక్కడ తంతు పూర్తి కావడంతో వారంతా కలిసి ఆజాద్ చౌక్ దగ్గరున్న మసీదుకు చేరుకున్నారు. అక్కడ ప్రసాదశాస్త్రి, భ్రమరాంబిక, షబానా పేర్లతో పేదలకు భోజనాలు, బట్టలు పెడతారు. దీన్ని ప్రతి సంవత్సరం తప్పక పాటిస్తారు.

ఆ రోజు లూసీ దేవి చౌక్ ప్రాంతం వైపు వెళ్తూ...రాముని కలుద్దామని షాపు దగ్గరకు వెళ్లింది. రాము ఆజాద్ చౌక్ మసీదు దగ్గరున్నాడని షాపులో ఉన్న వర్కర్స్ లూసీకి చెప్పారు. వెంటనే అక్కడ నుంచి మసీదు దగ్గరకు బయలుదేరింది. మసీదు బయట రోడ్డు మీద టెంట్లు వేసి ఉన్నాయి. అన్నదానం జరుగుతుండడం గమనించింది లూసీ. రాముతో పాటు రషీద్, వహీదాలను చూసిన లూసీకి విషయం అర్థమైంది. లూసీ అక్కడే ఉన్న ఇక్బాల్ దగ్గరకు వెళ్లింది. ఏం జరిగిందని అడిగింది. రాము తల్లిదండ్రులు, రషీద్ కూతురు చనిపోయిన రోజు అని, అందుకే ఉదయం హిందు సంప్రదాయం ప్రకారం పిండ ప్రదానాలు చేశామని, ఇప్పుడు మసీదులో కొందరు పేదలకు అన్నదానం చేస్తున్నామని చెప్పాడు.

రాముని కలిసేందుకు ఇది సరైన సమయం కాదని వెళ్లిపోదామని బయలుదేరింది. కాని ఎందుకో ఇప్పుడు కలిస్తేనే కాస్త ఓదార్పుగా ఉంటుందేమోనని మళ్లీ ఆగింది. మనిషికి మనిషి కష్టంలోనే కదా తోడు ఉండాలి అనుకుంది. ఎందుకంటే ఏ మనిషికైనా సంతోషంలో తోడు అవసరం లేదు, బాధలో ఉన్నప్పుడే తోడు బలనిస్తుంది. సంతోషాన్ని ఒక్కడైనా అనుభవించగలడు. కాని బాధ అందరితో పంచుకుంటేనే తగ్గుతుంది.

"మళ్లీ మా వాడికి ఏమైనా బుక్స్ తెచ్చారా, ఇలా వచ్చారు..!" అడిగాడు ఇక్బాల్;.

'అలాంటిదేమీ లేదు...ఏదో పని మీద వెళ్తూ ఇలా వచ్చాను" లూసీ చెప్పింది.

లూసీ రావడంతో రాము కొంచెం రిలాక్స్ అయ్యాడు. ముగ్గురికి మధ్య కాసేపు నిశబ్దం. ఏం మాట్లాడుకోలేదు. కొద్ది సేపటి తర్వాత నిశ్శబ్దాన్ని ఛేదించడం కోసం "రాము అసలేం జరిగింది?" అనడిగింది లూసీ.

"నేను చెప్తాను లూసీ" అంటూ ఇక్బాల్ చెప్పడం ప్రారంభించాడు.

* * * * *

రషీద్, ప్రసాదశాస్త్రి వేర్వేరు ప్రాంతాల నుంచి బతుకుతెరువు కోసం రాజమండ్రి ఒకసారి వచ్చారు. రషీద్ వ్యాపారం కోసం, ప్రసాదశాస్త్రి పౌరోహిత్యం కోసం. ఇద్దరికీ పక్క పక్క ఇళ్ళే దొరికాయి. ఇద్దరు వేర్వేరు మతస్తులైనా అభ్యుదయ భావాలున్నవారు కావడంతో ఎటువంటి అభ్యంతరాలు లేకుండా పక్కపక్కనే దిగిపోయారు.

ప్రసాదశాస్త్రి ఇంటికి, రషీద్ ఇంటికి వాకిలి ఒక్కటే. ఆ వాకిట్లోనే ప్రసాదశాస్త్రి వేదపారయణం చేస్తూ, తన మూడేళ్ళ కొడుకు రాముకు వేదం నేర్పిస్తుండేవాడు. అలాగే రషీద్ కూడా ఖురాన్ చదివి తన బిడ్డ షబానాకి వినిపించేవాడు. రెండు భిన్న మతాలు ఒకే వాకిట్లో పురుడు పోసుకొన్నట్లు...ఒక వైపు వేదం, మరో వైపు ఖురాన్ పఠనం జరిగేవి. ఒకరి మతాన్ని ఒకరు గౌరవించుకునే వ్యక్తులు కావడంతో ఇబ్బంది తలెత్తలేదు. ప్రసాదశాస్త్రి రషీద్ ఇద్దరు ఎంతో ఆసక్తిగా ఒకరి మత విధానం కోసం మరొకరు తెలుసుకునేవారు. వీరి రెండు కుటుంబాలు ఒకరి పండగని ఒకరు కలిసే జరుపుకునేవారు. వీరి స్నేహం అక్కడ కొంతమంది కంటికి ఇంపుగాను, మరికొందరికి కంటగింపుగాను తోచేది. మతాల్ని మంటగలుపుతూ ఈ స్నేహాలేంటి? ఆ పద్ధతులేంటి? అని పలు రకాలుగా అనేక మంది సూటిపోటి మాటలనేవారు. ప్రసాదశాస్త్రి, రషీద్‌లను ఆ మాటలు ఇబ్బంది పెట్టినా..."మనిషికి మతం. అంతే కాని మతానికి మనిషి కాదు కదా" అని అనుకునేవారు.

ప్రసాదశాస్త్రి, రషీద్ పిల్లలైన రాము, షబానా కూడా కలిసి ఆటలాడుకుంటూ ఉండేవారు. షబానా ఎక్కువగా భ్రమరాంబిక దగ్గర, రాము వహీదా దగ్గర ఉండేవారు. రాము అంటే వహీదాకి ఎంతో ఇష్టం. బూరెల్లాంటి బుగ్గలతో, బుగ్గ మీద కాటుక బొట్టుతో ఉండే రాముని చూసి వహీదా ముచ్చటపడిపోయేది. రాము ఒకరోజు కనిపించకపోతే వహీదా తన సొంత బిడ్డ కనిపించనట్లే బాధపడేది. అలాగే భ్రమరాంబికాకి షబానా అంటే ఎంతో ప్రేమ. బయటికి వెళ్లిదంటే చాలు షబానాకి ఆడుకోడానికో, తినడానికో ఏదో ఒక వస్తువు తెస్తుండేది. వహీదాకి మగ పిల్లలు లేకపోవడం, భ్రమరాంబికాకి ఆడ పిల్లలు లేకపోవడం కూడా ఆ బిడ్డలపై ప్రేమకి కారణమయ్యాయి. అలాగే భ్రమరాంబిక, వహీదాలు బంధువుల్లా కలిసిపోయారు. ఒకరిని ఒకరు ఎంతో అభిమానించుకుంటూ, ఒకరిపై ఒకరు ఆప్యాయతను ప్రదర్శించేవారు. ఆ రెండు ఇళ్లూ అందరికీ ఆదర్శంగా ఉండేవి. ప్రపంచమంతా అలాగే ఉంటే ఎంత బాగుంటుందో అనేటట్లు ఉండేవి.

ప్రతిరోజు వేకువజామున ప్రసాదశాస్త్రి వేద పారాయణం, సూర్యోదయ సమయంలో రషీద్ ఫజ్ర్ నమాజ్ పూర్తయిన తర్వాత ఇద్దరూ అరుగుపై కూర్చుని పిచ్చపాటి విషయాలు మాట్లాడుకుంటేవారు. అలాగే ఒకరి ఆచార వ్యవహారాలు, పండగలు ఇతర మత విషయాలపై చర్చించుకుంటూ ఉండేవారు. అక్కడ రెండు భిన్న మతాలకు చెందిన రెండు కుటుంబాలున్నాయంటే ఎవరు నమ్మేవారు కాదు. అంతలా కలిసిపోయాయి ఆ రెండు కుటుంబాలు.

కార్తీక మాసం వచ్చింది. ఈ మాసమంటే అంతా వన భోజనాలకు వెళ్లడం సంప్రదాయం. ప్రసాద్ శాస్త్రి కుటుంబం కూడా వన భోజనాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. పాపి కొండలకు వనభోజనాలకు అనగానే హాయిగా ప్రకృతితో కాసేపు స్నేహం చేసి రావచ్చని అనుకున్నారు. బతుకు తెరువు కోసం వచ్చిన ప్రసాదశాస్త్రికి ఆ

వీధిలో రషీద్ తప్పితే పెద్దగా పరిచయస్థులు ఎవరూ లేదు. అలాగే రషీద్‌కి కూడా ఆ ఊర్లో మన అనుకునే వాళ్లు ఎవరూ లేకపోవడంతో ప్రసాదశాస్త్రి కుటుంబమే వీరికి అన్నీ. దాంతో కార్తీక వన భోజనాలకు ప్రసాదశాస్త్రితో పాటు రషీద్ కుటుంబం కూడా బయలుదేరింది.

పాపికొండలు అందం...ప్రకృతి అంతా ఇక్కడే తిష్ట వేసుకుని కూర్చుందా అన్నట్లుగా ఉంటుంది. రాజమండ్రి నుంచి బయలుదేరి నాలుగు గంటల పాటు గోదావరిలో ప్రకృతి అందాల మధ్య ప్రయాణం చేస్తూ పాపికొండలు చేరుకున్నారు. పాపికొండల ప్రాంతాన్ని చేరుకునే సమయంలో రెండు కొండల నడుమ ప్రవహించే గోదావరి అందం చూడాలంటే పూర్వ జన్మ పుణ్యం ఉండాలేమో అనిపిస్తుంది. అంత సుందర దృశ్యమిది.

పాపికొండలను చూసిన తర్వాత సీతమ్మ పాదాల వద్దకు చేరుకున్నారు. అక్కడ భోజనాలు అయిన తర్వాత మళ్లీ ప్రకృతి దృశ్యాలను చూసేందుకు బోటు దిగి ప్రయాణీకులంతా తలో వైపు వెళ్లారు. సాయంత్ర సమయం అవుతోంది. సంధ్యా సమయం కావడంతో తిరుగు ప్రయాణానికి తొందర పెట్టాడు బోటు డ్రైవర్. పైగా సూర్యుడు అస్తమిస్తున్న సమయంలో పాపికొండల అందాలను మరోసారి చూడటం మధురానుభూతిని ఇస్తుంది. ఇదే విషయాన్ని డ్రైవర్ చెప్పాడు. దీంతో సామాన్లన్నీ సర్దుకుని బోటెక్కేశారు.

వెనక్కి తగ్గుతున్న సూర్యుని కాంతి పాపికొండలపై పడుతోంది. బంగారు వర్ణంలో గోదావరిపై పడుతున్న సూర్య కిరణాలు నీటిని బంగారుమయం చేస్తున్నాయి. దీంతో గోదారమ్మ బంగారు రంగులోకి మారిపోయి బంగారమ్మలాగా ప్రవహిస్తోంది. రెండు కొండల నడుమ ప్రవహిస్తున్న గోదావరి అందాన్ని సంధ్యాసమయంలో చూస్తుంటే ఆ ప్రదేశాన్ని వదిలి రావాలనిపించడం లేదు ఎవరికీ. పాపికొండల అందాలను, గోదావరి అందాలను పడవపై నుంచి చూడటమంటే అందమైన దృశ్య కావ్యాన్ని ప్రత్యక్షంగా చూడటమే అనుకుంటారు. రషీద్, శాస్త్రిలకు పాపికొండల ప్రయాణం తొలిసారి కావడంతో ఈ వన భోజనాల ట్రిప్ ఎంతో సంతోషాన్ని, ఆనందాన్ని ఇచ్చింది.

దారి పొడవునా గోదావరి అందాలను చూస్తూ, వారి పిల్లలకు చూపిస్తూ భ్రమరాంబిక, వహీదాలు గోదావరి ముచ్చట్లే మాట్లాడుకుంటున్నారు. షబానా, రాములకు బోటు ప్రయాణం చాలా సరదాగా ఉంది. బోటులోంచి గోదావరిని చూస్తూ, అల్లరి చేస్తూ పడవలో అటూ ఇటూ గెంతుతున్నారు.

పిల్లలిద్దర్నీ భ్రమరాంబిక, వహీదాలు ఎంత వారించినా వినడం లేదు. గోదావరి ప్రవాహం, చీకటి పడుతున్న సమయం, బోటు శబ్దం, గట్టు మీద కనిపిస్తున్న ప్రకృతి అన్ని ఎంత అందంగా ఉన్నాయో, అలాగే ఏదో తెలియని భయాన్ని కూడా కలిగిస్తున్నాయి. ఇంకో అరగంట ప్రయాణం చేస్తే బోటు పురుషోత్తపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గోదావరి నీళ్లని నెత్తిన చల్లుకోవడం ఒక సంప్రదాయంగా వస్తుంది. కొందరు సీసాల్లో పట్టి ఇంటికి తీసుకెళ్లి ఇంటిలో జల్లుతారు. దీనివల్ల గోదావరి తల్లి దీవెనలు అందుతాయని నమ్మకం. బోటు చుట్టూ ఉన్న రక్షణ కవచం లాంటి గ్రిల్స్ దగ్గరకు వెళ్లి, గోదావరి ప్రవాహం వైపు వంగి నీళ్లు తీసుకుని నెత్తిన జల్లుకుంటున్నారు కొందరు. తనకి అలాగే చల్లమని షబానా మారాం చేస్తోంది. వహీదా గోదావరి నీళ్లు తీసి షబానా నెత్తిన

చల్లింది. అయితే తనకి అలా కాదని తనని వంచితే తానే తీసి వేసుకుంటానని ఏడుపు అందుకుంది.

ఇక చేసేదేమీ లేక రషీద్ వచ్చి షబానాని పట్టుకుని బోటుపై నుంచి గోదావరి నీటిని అందించే ప్రయత్నం చేశాడు. నీళ్లు అందుకున్న షబానా తనపై చల్లుకుని తన తండ్రి రషీద్‌పై కూడా చల్లింది. "మళ్లీ మళ్లీ" అంటూ గొడవ చేస్తూనే ఉంది. రెండు మూడుసార్లు రషీద్ అలాగే చేశాడు. షబానా ప్రవాహానికి అడ్డంగా తన చేతిని పెట్టి ఆటలాడుతోంది. అది చాలా సరదాగా అనిపించడంతో ఇంకా కిందకి, మరింత కిందకి వంగుతోంది. కిందకి వంగుతూ వంగుతూ రషీద్ చేతి నుంచి షబానా జారిపోతుంది. అది గమనించిన రషీద్, షబానాని తన వైపు లాగే ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్నంలో షబానాని పట్టుకున్న రషీద్ చేయి పట్టు తప్పిడంతో షబానా మరింత ముందుకు వంగింది. అంతే రషీద్ చేతి నుంచి షబానా జారి గోదావరిలో పడిపోయింది. ఆ సంఘటనతో షాకైనా రషీద్‌తో పాటు అక్కడున్న వారంతా పెద్దగా కేకలు వేశారు. షబానా గోదావరిలో పడిపోవడం చూసిన ప్రసాదశాస్త్రి మరుక్షణమే ఏం ఆలోచించకుండా ప్రవాహంలోకి దూకేశాడు. పడవను అక్కడికక్కడే ఆపేశాడు. రషీద్‌కి ఈత రాకపోవడంతో కూతురు గోదారిలో పడిపోయినా ఏం చేయలేక రక్షించండంటూ కేకలు వేస్తున్నాడు. ప్రసాదశాస్త్రి మాత్రం స్నేహితుడి కూతురి కోసం క్షణమాలోచించకుండా గోదారిలో దూకేశాడు.

ప్రసాద శాస్త్రి దాదాపు గంట సేపుగా వెదుకుతూనే ఉన్నాడు. మధ్యమధ్యలో పైకి రావడం..."కనిపించిందా?" అని కనుక్కోవడం, మళ్లీ లోపలకి వెళ్లడం, ఇలా చేస్తూనే ఉన్నాడు. అలాగే వెదుకుతూ, వెదుకుతూ ఉన్న ప్రసాదశాస్త్రి కూడా లోపలకి వెళ్లి తిరిగి రాలేదు. సమయం గడుస్తున్నా ప్రసాదశాస్త్రి అచూకి కూడా తెలియలేదు. ప్రసాదశాస్త్రి తిరిగి రాకపోవడంతో భ్రమరాంబికా మనసు ఏదో కీడు శంకించింది. ప్రసాదశాస్త్రి కోసం భ్రమరాంబిక ఏమండీ..! ఏమండీ..! అని అరుస్తూనే ఉంది. మరో వైపు రషీద్, వహీదాలు "మేరా బేటీ కో బచావో, శాస్త్రికో బచావో" అంటూ ఏడుస్తూ అరుస్తూనే ఉన్నారు. మూడేళ్ల రాముకి పరిస్థితి అర్థం కాలేదు. రషీద్ రాము చేతిని గట్టిగా పట్టుకుని తన దగ్గరే ఉంచుకున్నాడు. వీరిని చూసిన బోటులోని వారందరూ కన్నీరు పెట్టుకున్నారు. ప్రసాదశాస్త్రి, షబానాల ఆచూకీ తెలియలేదు. మరోవైపు చీకటి పడుతుండడంతో బోటుని పురుషోత్తపురానికి తీసుకుని పోయి అక్కడ నుంచి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చీకటి పడడంతో తెల్లవారిన తరువాతే గాలించాలని నిర్ణయించుకున్నారు.

రషీద్, వహీదా, భ్రమరాంబిక గట్టుపై అటు ఇటు తిరుగుతూ, ఏడుస్తూ తమ వారు వస్తారేమోనని ఎదురు చూస్తున్నారు. రాముకి ఎప్పుడు పడుకుండిపోయాడో కాని...ఆ గట్టు మీదే పడుకుండిపోయాడు. రషీద్ అయితే...

"షబానా బేటి"

"శాస్త్రి భయ్యా"

అంటూ గోదావరి అవతలి గట్టుకు సైతం వినపడేంతలాగా అరుస్తూనే ఉన్నాడు. వీరికి

తోడుగా ఇద్దరు కానిస్టేబుల్స్ ఉండి వారు షబానా, శాస్త్రిల కోసం తీరం వెంబడి టార్చిలైట్లతో వెదుకుతున్నారు ఆ చీకట్లోనే. రాత్రంతా గోదావరి గట్టు అంతా షబానా, శాస్త్రి అనే పిలుపులతోనే దద్దరిల్లింది. అరుస్తూ, అరుస్తూ భ్రమరాంబిక గోదావరి గట్టు మీదే స్పృహ తప్పి పోయింది. ఆమెను వెంటనే కానిస్టేబుల్స్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. రషీద్, వహీదాల దగ్గరకు మరో ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చారు. తొలి సూర్య కిరణాలు గోదావరి నదిని తాకుతున్న వేళ...రాము నిద్రలేచి అమ్మ, అమ్మ అని ఏడుస్తున్నాడు. వహీదా వెంటనే రాముని దగ్గరకు తీసుకుని అమ్మ వచ్చేస్తుంది బేటా అంటూ సముదాయిస్తోంది. రషీద్‌కి కన్నీళ్లు ఆగడం లేదు. ఒకవైపు కూతురు, మరోవైపు స్నేహితుడు. వీరిద్దరి కోసం రాత్రంతా రషీద్, వహీదాలు చూసిన ఎదురు చూపులకు సమాధానం దొరికింది. దూరంగా గట్టుపై ఏదో చిన్న బస్తాలాగా కనిపిస్తోంది. పరుగు పరుగున అక్కడికి వెళ్లాడు రషీద్. అంతే గుండెలు పగిలిపోయేటట్లు అరిచాడు. ఆ అరుపు విని కానిస్టేబుల్స్, వహీదా అక్కడికి పరుగులు పెట్టారు. పరుగు పరుగున వెళ్తున్న వహీదా మళ్లీ వెనక్కి వచ్చి...రాముని చంకనేసుకుని మళ్లీ పరుగు పెట్టింది.

అక్కడికి వెళ్లి చూస్తే శాస్త్రి చేతిలో షబానా చేయి ఉంది. ఒకరి చేతిని ఒకరు పట్టుకుని ఉన్నారు. అయితే ఇద్దరికీ ప్రాణం లేదు. గోదావరి తల్లి ఏం చేసిందో కాని, ఇద్దరిని ఎక్కడ కలిపిందో తెలియదు. కాని ప్రాణాలు తాను తీసేసుకుని, శరీరాన్ని ఒడ్డున పడేసింది. ఆ వార్త తెలిసిన పురుషోత్తపురం గ్రామ జనాలు పెద్ద సంఖ్యలో అక్కడికి వచ్చారు. పోలీసులు మరో నలుగురు అక్కడకు వచ్చారు. జనాలని మృతదేహాల దగ్గరకు రానివ్వకుండా చూస్తున్నారు.

అక్కడ ఆసుపత్రిలో స్పృహ కోల్పోయిన భ్రమరాంబిక. ఇక్కడ షబానా, ప్రసాదశాస్త్రిల శవాల ప్రాణముండి శవంలా మారిపోయిన రషీద్, వహీదాలు..షబానా, ప్రసాదశాస్త్రిల శవాల పక్కన కూర్చుని గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్నారు. వహీదా పక్కనే ఉన్న రాము గోదావరి గట్టు మీద ఉన్న ఇసుకతో గుడి కట్టి.. ముద్దు మాటలతో నాన్న 'పూజ చేయ్, పూజ చేయ్' అంటూ ప్రసాదశాస్త్రిని తన చిన్న చేతులతో కొట్టి లేపుతున్నాడు. ప్రసాదశాస్త్రి లేవకపోవడంతో ఆ పక్కనే ఉన్న షబానాని "నువ్వు కూడా ఇలాగే కట్టు గుడి" అని లేపుతున్నాడు. వారిద్దరూ ప్రాణాలతో లేరని తెలియని రాముని చూసి రషీద్, వహీదాలకు మరింత దు:ఖం పెరిగింది.

పోలీసులు పంచనామా ముగించారు. శవాలను రషీద్‌కి అప్పగించారు. ఆ శవాలకు అంత్యక్రియలను పూర్తి చేశారు. శాస్త్రితో పాటే షబానాని కూడా ఖననం చేశారు. అక్కడి నుంచి భ్రమరాంబికా కోసం ఆసుపత్రి వెళ్లారు. ఈ విషయం ఎలా చెప్పాలో రషీద్, వహీదాలకు అర్థం కావడం లేదు. మొత్తానికి ధైర్యం చేసి ఆసుపత్రిలో భ్రమరాంబిక ఉన్న గదికి వెళ్లారు. అక్కడికి వెళ్లేసరికి పిచ్చి చూపులు చూస్తూ ఎవరిని గుర్తు పట్టలేకపోతోంది భ్రమరాంబిక. రాత్రంతా అరిచిన అరుపులకి నరాల్లో రక్తం గడ్డ కట్టేయడంతో భ్రమరాంబికా మతి స్థిమితం కోల్పోయింది. దీంతో ఎవరినీ గుర్తు పట్టడం లేదు. ఆమె పరిస్థితిని చూసిన రషీద్ ఏడుపు ఆపుకోలేకపోయాడు. అయితే తమ కంటే ఆమె నయమనుకున్నాడు. ఏం జరిగిందో, జరుగుతోందో తెలియకుండా తన లోకంలో తాను

ఉంది. రెండు చావుల్ని, భ్రమరాంబిక పరిస్థితిని చూసిన రషీద్, వహీదాలు తట్టుకోలేకపోతున్నారు. కన్నీళ్లు గోదావరి ప్రవాహం కంటే వేగంగా జారుతూనే ఉన్నాయి.

నాలుగురోజుల పాటు భ్రమరాంబికాకి వైద్యం సాగింది. కాని నాలుగో రోజున భ్రమరాంబిక కూడా కన్నుమూసింది. షబానాని కాపాడబోయి శాస్త్రి, అతని మరణాన్ని తట్టుకోలేక భ్రమరాంబిక కూడా ప్రాణాలు వదిలేయడంతో రాము అనాథ అయిపోయాడు. ప్రమాదం జరిగినప్పటి నుంచి అమ్మా, అమ్మా అని ఏడుస్తూనే ఉన్నాడు. వహీదా రాముని సముదాయిస్తూనే ఉంది. తల్లిదండ్రులని కోల్పోయిన రాము ఒంటరైపోయాడు.

ఈ రెండు కుటుంబాలు ఇంత కష్టంలో ఉంటే చాలా మంది మాత్రం ఈ కష్టం కట్టుబాట్లు పాటించకపోవడం వల్లేనని తమలోని ఆక్రోశాన్ని బయటకు కక్కేశారు. "మతం, ఆచారం, వ్యవహారం లేకుండా ఒకరు మరొకరితో కలిసి తిరిగితే గొప్పలైపోతారా...? పైకిపోతారు..!" అంటూ వెటకారం ఆడినోళ్లు ఉన్నారు.

ఇప్పుడు రాముకి వహీదా, రషీద్‌లే తల్లిదండ్రులు. రాముని పెంచుకునేందుకు నిర్ణయించుకున్నారు వాళ్లు. తమకి బిడ్డలు లేని లోటు, రాముకి తల్లిదండ్రులు లేని లోటు తీరాలంటే ఇదే సరైన నిర్ణయం అనుకున్నారు. శాస్త్రి కుటుంబంతో ఉన్న స్నేహం, తన బిడ్డ కోసం శాస్త్రి చేసిన ప్రాణ త్యాగానికి గుర్తుగా రాముకి పేరు కూడా మార్చలేదు. రాము పేరుతోనే ఉండే విధంగా రెండు మతాల పెద్దలతో మాట్లాడి దత్తత కార్యక్రమాన్ని సంప్రదాయం ప్రకారమే పూర్తి చేశారు. అప్పటి నుంచి రాము రషీద్‌తో మసీదుకు వెళ్లడం, నమాజ్ చేయడం అలవాటు చేసుకున్నాడు.

అలా హిందూవైన రాము, ముస్లిమైన రషీద్‌కి కొడుకయ్యాడు. ముస్లిమైన రషీద్, హిందువైన రాముకి తండ్రయ్యాడంటూ ఇక్బాల్ చెప్పడం ముగించాడు. ఇదంతా విన్న లూసీకి రాము రషీద్‌కి ఎలా కొడుకయ్యాడో తెలియడంతో పాటు రాము, రషీదులిద్దరి కలయిక వెనుక ఎంత విషాదం ఉందో కూడా తెలిసింది.

# 5

**"శవం...శవం..."**

ఇటు వైపు వద్దు, అటువైపు పోదాం పద" అంటూ ఇక్బాల్ రాము చేయి పట్టుకుని లాగేస్తున్నాడు. వీరిద్దరూ లైబ్రరీకి బయలుదేరారు.

దేవిచౌక్ దాటి రెండో రోడ్డుకు వెళ్లేసరికి అక్కడొక శవయాత్ర సాగుతోంది.

"ఒరేయ్ ఇక్బాల్ శవం అంటే భయమెందుకురా...శవమంటే శరీరమేరా..! దానికి భయపడిపోవడమెందుకు?" అన్నాడు రాము.

“శవం వైపు ఎవరైనా వెళ్తారా?” అని కోపంగా అడిగాడు ఇక్బాల్.

“వెళ్తారా, వెళ్లరా అనేది కాదు. అందరూ వెళ్లాలి. ఎందుకంటే రేపు నువ్వు, నేను, మనందరం కూడా అలాంటి నిద్రలోకి వెళ్లిపోతాం. అప్పుడు నీ పేరు ఇక్బాల్ కాదు, నా పేరు రాము కాదు. మనతో పాటు ఇక్కడున్న వాళ్లందరి పేరు కూడా శవమే అవుతుంది.అందుకే శవం వెళ్లే దారి అంటే ఏదో ఒక రోజు మనం వెళ్లే దారే, దాన్ని తప్పించుకోలేం. ఎందుకంటే ఈ లోకంలో ఏ ఒక్కరు శాశ్వతం కాదు. రేపు మన పయనం అదే దారిలో. పద పద మన రేపటి ప్రయాణాన్ని ముందుగానే చూసుకునే అవకాశాన్ని పోగొట్టుకోకు” అంటూ ఇక్బాల్ చేయి పట్టుకుని శవం వెళ్లే దారి వైపు లాక్కెళ్లాడు.

ఇప్పుడు ఇక్బాల్ శవయాత్ర వైపు చూశాడు. అది పవిత్రంగా, ఉన్నతమైన దారిని చూపే యాత్రలా కనిపించింది. ఇక్బాల్ మనసు ప్రశాంతంగా ఉంది. ఇంతకుముందు శవం ముఖం చూడటానికి భయపడే ఇక్బాల్ ఇప్పుడు ఆ శవంతో పాటు కొంత దూరం నడిచాడు. ఇద్దరూ లైబ్రరీకి చేరుకున్నారు. ఎప్పటిలాగే రాము అరగంట ముందుగానే లైబ్రరీ దగ్గరకు వచ్చేశాడు. ఇంకా లూసీ రావడానికి ఇంకా టైమ్ పడుతుంది. అందుకే ఇద్దరూ టీ తాగుదామని లైబ్రరీ బయట ఉన్న టీ స్టాల్ వద్దకు వెళ్లారు.

“ఇంతకి లూసీని ప్రేమిస్తున్నావని చెప్పావా? లేకపోతే ఇలాగే లైబ్రరీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తావా?” అనడిగాడు ఇక్బాల్.

“చెప్తా...చెప్తా...అది చెప్పడానికే ఇవాళ ఫిక్స్ అయ్యా”

“నువ్వు సూపర్‌రా రాము..శవయాత్రలో పాల్గొని, అక్కడ నుంచి డైరెక్ట్‌గా ఐ లవ్ యూ చెప్పడానికి వచ్చిన ప్రేమికుడివి ఈ ప్రపంచంలో బహుశా నువ్వొక్కడివేరా” నవ్వుతూ అన్నాడు. ఇక్బాల్.

“జోకులాపరా...అసలే లూసీని చూస్తే ఎంతో సంతోషంగా ఉంటుందో, అంతకంటే ఎక్కువ టెన్షన్‌గా ఉంటుందిరా...ఈ రోజు లూసీతో నా ప్రేమ సంగతి చెప్పేస్తారా లేటయ్యే కొద్దీ బాధ ఎక్కువవుతోంది. ప్రేమ పెరిగిన తర్వాత విరిగితే తట్టుకోలేను” అంటూ లైబ్రరీలోకి వెళ్లాడు రాము.

అక్కడున్న లైబ్రేరియన్ రాముని చూసి ముసిముసిగా నవ్వుకుంది.

లైబ్రరీలో పుస్తకం చదువుకుంటూ లూసీ కోసం ఎదురు చూస్తున్నాడు. ఆ పుస్తకంలో ఒక చోట “ఒక పని చేయడానికి ఒక్క క్షణం ఆలోచిస్తే...ఒక్కోసారి జీవితాంతం ప్రతిక్షణం విచారించాల్సి వస్తుంది.” అని. అది తన పరిస్థితికి కరెక్ట్‌గా సరిపోతుందని అనుకున్నాడు. పుస్తకం చదువుకుంటున్న రాముకి ఒక్కసారి ఎందుకో చూడాలనిపించి లైబ్రరీ ఎంట్రన్స్ వైపు చూశాడు. లూసీ లైబ్రరీలోకి వచ్చింది. లైబ్రరియన్‌కి పుస్తకాలు ఇచ్చేసి తనకి కావలసిన పుస్తకాలు తీసుకుని బయటకు వెళ్లిపోయింది.

అది చూసిన రాము కూడా బయటకు వచ్చేశాడు. ఈసారి ఏ పుస్తకాలు తీసుకోలేదు. రాము వెళ్లడం చూసిన లైబ్రేరియన్ మళ్లీ ముసిముసిగా నవ్వుకుంది. ఈసారి ఏ పుస్తకాలు

తీసుకెళ్లడం లేదని కోపంగా ఖాళీ చేతులు చూపించి మరి బయటకు వచ్చేశాడు.

లైబ్రరీ బయట లూసీ నిలబడి ఉంది. ఎవరి కోసమో వెయిట్ చేస్తున్నట్లుంది. అది అతని కోసమే అని రాముకి తెలియదు. “నేను మీతో ఒక విషయం చెప్పాలని అనుకుంటున్నాను” అన్నాడు రాము.

“ఏంటండి అది?” అని లూసీ అడిగింది.

“అది అది ఇక్కడ కాదు, అలా మాట్లాడుకుంటూ పార్క్‌దాకా వెళ్దాం. అక్కడ ప్రశాంతంగా కూర్చోని మాట్లాడుకుందాం” అని అన్నాడు. ఇలా మాట్లాడుకుంటూ పార్క్‌కి వెళ్లి ఓ బెంచ్‌పై కూర్చున్నారు.

“హా...ఇప్పుడు చెప్పండి ఏం చెప్తారో?” అని రాము వైపు చూస్తూ అడిగింది లూసీ.

లూసీకి రాము ఏం చెప్తాడో దాదాపుగా తెలుసు. నిజానికి ఎప్పుడూ చెప్తాడా అని ఎదురు చూస్తోంది. లూసీకి కూడా కాస్త కంగారుగానే ఉంది.

“మరండి...అది” అంటూ చెప్పడానికి ధైర్యం చాలక, పక్కనే ఉన్న మొక్క ఆకులు పీకుతున్నాడు. ఆకులు పీకుతున్నప్పుడు కూడా రాము చేతులు వణుకుతున్నాయి. లూసీ ఇదంతా గమనిస్తూనే ఉంది.

ఎలా చెప్పాలో తెలియని స్థితిలో ఉన్న రాముకి ఒక ఐడియా వచ్చింది.

“ఒక్క నిమిషమండి...” అంటూ జేబులోని పేపరు, పెన్ను తీసుకున్నాడు. షాపులోని కిరాణా లెక్కలు మరిచిపోయి ఇప్పుడు రాసుకుంటున్నాడెమో అనుకుంది లూసీ. ఐదు నిమిషాల తర్వాత రాము వణుకుతున్న చేతులతో లూసీకి తాను రాసిన చిన్న పేపరు ఇచ్చాడు.

“ఇది చూసి మీ అభిప్రాయం చెప్పండి” అనడిగాడు వణుకుతున్న స్వరంతో.

లూసీ అనుకున్నట్లుగానే 20 కేజీల కందిపప్పు, 6 పామాయిల్ డబ్బాలు, రెండు అర కిలో జీడిపప్పు ప్యాకెట్లు, రెండు కాల్గేట్ టూత్ పేస్ట్ బాక్సులు... ఇలా రకరకాలైన కిరాణా ఐటమ్స్ లిస్టు ఉంది అందులో. ఇందులో నేను చెప్పడానికి ఏముంటుంది అనుకుంది.

“ఈ లెక్కలన్నీ నాకెందుకండీ...వీటి గురించి నా అభిప్రాయం ఏముంటుంది. అన్నీ కిరాణా వస్తువులే కదా” చెప్పింది రాముని పిచ్చివాడిని చూసినట్లుగా చూస్తూ.

ఆ పేపరందుకున్న రాము చూశాడు. మళ్లీ తనని తాను మనసులోనే తిట్టుకుని, ఆ పేపరుని తిప్పి లూసీ ఇచ్చాడు అభిప్రాయం చెప్పమని.

“నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరంటే నాటు చాలా ఇష్టం. మీతో జీవితాన్ని పంచుకోవాలని అనుకుంటున్నాను. మీకు నచ్చితే కిందనున్న బాక్స్‌లో (✓) అని టిక్ పెట్టండి. లేదంటే పక్కనున్న ఇంకో బాక్స్‌లో (X) అని మార్క్ పెట్టండి. విషయం ఏదైనా పర్లేదు మీ సమాధానం తెలియజేయండి. కాని దయచేసి నా చెంప మాత్రం పగలగొట్టోదు. అలాగే ఎవరిని అల్లరి చేయ్యొద్దు” అని రాసి ఉంది.

ఎలా రియాక్ట్ అవుతుందోననే భయంతో రాము లూసీ వైపు చూడలేకపోతున్నాడు. ఐదు నిమిషాల తర్వాత లూసీ ఆ పేపరుని రాముకి ఇచ్చేసింది.

రాము ఆ పేపరుని ఓపెన్ చేయడానికి చాలా టెన్షన్ పడిపోతున్నాడు. వణుకుతున్నా చేతులతో పేపరుని ఓపెన్ చేశాడు. అందులో ఏ సమాధానం లేదు. తాను గీసిన రెండు బాక్సులు ఖాళీగానే ఉన్నాయి. అప్పుడు మెల్లగా తలెత్తి చూశాడు. లూసీ ముఖంలో ఏ విధమైన ఫీలింగ్ కనిపించడం లేదు. కనీసం కోపం కూడా లేదు. ఏం అని అడుగుదామంటే మాట బయటకు రావడం లేదు.

"ఇక బయలుదేరుదామా?" కాస్త ఇబ్బందిపడుతూ లూసీ అడిగింది.

"సరే పదండి" బాధని అణుచుకుంటూ అన్నాడు.

ఇద్దరూ నడుస్తున్నారు. రాము ఆలోచనలు పరిపరి విధాలుగా పోతున్నాయి. ఇష్టం లేదా? మరి ఇష్టం లేకపోతే నాతో ఎందుకు వస్తుంది. పోని ఇష్టమా..! ఇష్టమైతే సమాధానం ఎందుకు చెప్పలేదు. రాము చేతిలోని ఆ పేపరు నలుగుతూనే ఉంది.

"ఏదో ఒక సమాధానం చెప్పి వెళ్లండి...మీకు నచ్చకపోతే ఇక జన్మలో మిమ్మల్ని కలవను. నచ్చితే ఎన్ని జన్మలకైనా మిమ్మల్ని వదలను" అన్నాడు.

ఆ మాటకి సీరియస్‌గా రాము చేతిలో ఉన్న పేపరుని తీసుకుంది లూసీ.

నలిగిపోయిన ఆ పేపర్‌ని ఓపెన్ చేసింది. రాము వైపు సూటిగా చూసింది.

తన చిటికెన వేలితో కంటి కింద రెప్పపై ఉన్న కాటుక తీసింది. ఆ కాటుకతో పేపర్లో ఇష్టం అని ఉన్న చోట (✓)మార్క్ పెట్టింది.

అది చూసిన రాము ఆనందానికి అవధుల్లేవ్. ఎగిరి గెంతేయాలని అనుకున్నాడు. కాని జంక్షన్‌లో ఉండటంతో చుట్టూ జనాలే. లూసీ వైపు యుద్ధం గెలిచిన మహారాజులా చూశాడు.

"మరి ఆ విషయమేదో అక్కడే చెప్పొచ్చుగా. ఎంత టెన్షన్ పడ్డానో తెలుసా"

"మీ తెలివి తేటలు బాగున్నాయి. మేటరు రాశారు. పేపరిచ్చారు. టిక్ పెట్టమన్నారు. కాని పెన్ను ఇవ్వడం మర్చిపోయారు" లూసీ కోపంగా చెప్పింది.

అప్పుడు కాని తెలియలేదు మళ్లీ తన తెలివి తక్కువతనానికి తనని తానే తిట్టుకున్నాడు.

"మరి ఈ కాటుక ట్రిక్ అక్కడే చెయ్యొచ్చు కదా" అన్నాడు.

"ఆ ఐడియా నాకు ఇప్పటికీ తట్టింది" అని చెప్పింది.

* * * * *

**లూసీ,** రాము ఇద్దరూ గాఢమైన ప్రేమలో మునిగిపోతున్నారు. "మీరు" నుంచి

మొదలైన వారి ప్రేమ “నువ్వు” దాకా వచ్చేసింది. ఆ రోజు ఇద్దరూ పుష్కర ఘాట్ దగ్గర కలుసుకున్నారు. చాలాసేపు స్వీట్ నథింగ్స్ మాట్లాడుకున్న తర్వాత...

“ఇంతకీ నీ ఇంగ్లిష్ పీజీ ఎంతవరకు వచ్చింది?” రాము అడిగాడు.

“సెకెండియర్ స్టార్ట్ అయ్యింది. మరో ఎనిమిది నెలల్లో ఫైనల్ ఎగ్జామ్స్”

“అప్పుడు లూసీ డబుల్ పీజీ హోల్డర్ అవుతుందన్నమాట”

“అవునవును...ఆ డబుల్ పీజీ హోల్డర్‌కి ఓనర్ నువ్వే”

‘మరేంటనుకున్నావ్...ఏదైనా మనం సాధించాలి. లేదంటే సాధించిన వాళ్లని సాధించాలి. నువ్వు సాధించావు. నిన్ను నేను సాధించాను” అంటూ కాలరెగరేశాడు రాము.

“అబ్బో మంచి ఫిలాసఫీనే, తెలివితేటలు ఎక్కువే. మరి నీ తెలివి తేటలకు ఒక పరీక్ష పెడతాను. కరెక్ట్‌గా ఆన్సర్ చెప్పాలి”

“ఏంటో అడుగు?” కాలరెగరేసి మరి అడిగాడు.

“తెలుగులో ప్రతిఒక్కరూ తప్పుగా ఉచ్చరించే పదం ఏది? చిన్న వాళ్లు అయినా, ముసలోళ్లైనా, పామరుడైనా, పండితుడైనా, ఎవరైనా సరే తప్పుగా ఉచ్చరించే పదం ఏది?”

తెలుగులో అంత కష్టమైన పదం ఏముందా అని ఆలోచించసాగాడు. చిన్నప్పుడు తెలుగు మాస్టారు చెప్పిన కఠినమైన పదాలను గుర్తుతెచ్చుకునే ప్రయత్నం చేశాడు. అయినా తట్టలేదు.

“ఓడిపోయినట్టేనా హీరో గారు..?”

“టైమ్ ఇస్తారా? ఇప్పుడే చెప్పాలా మేడం?” అనడిగాడు రాము.

“టైమ్ తీసుకోండి...కాని సరైన సమాధానం చెప్పండి”

“సరే అయితే రేపు వందశాతం కచ్చితమైన సమాధానంతో వస్తా. అలాగే నీక్కూడా ఒక ప్రశ్న. నువ్వు కరెక్ట్‌గా చెప్తే నీకు ఇంగ్లిష్ పీజీలో గోల్డ్ మెడల్ వచ్చినట్లే” అన్నాడు.

“అడుగు” అని కాన్ఫిడెంట్‌గా చెప్పింది లూసీ.

“ఇంగ్లీష్‌లో మైలు దూరం ఉండే పదమేది?” అనడిగాడు.

“మైలు దూరమా..! అంత పెద్దదా ఆ పదం..!” అని అనుమానంగా అడిగింది.

“అది నాకు తెలియదు. కాని ఒక పదం మాత్రం మైలు దూరం ఉంటుంది”

“అవునా, మరి నాకూ టైమిస్తారా?”

“టైమ్ తీసుకోండి...కాని సరైన సమాధానంతో రండి” లూసీ డైలాగునే రిపీట్ చేశాడు.

“ఓకే రేపు ఇద్దరం సరైన సమాధానాలతో కలుద్దాం” అనుకుని బయలుదేరారు.

రాత్రంతా ఆలోచించాడు. సమాధానం దొరకలేదు. ఇంట్లో ఉన్న తెలుగు నిఘంటువుని కూడా తిరగేశాడు. అందులోనూ తప్పుగా ఉచ్చరించే పదం కోసం ఏ సమాచారం లేదు.

లూసీ కూడా మైలు దూరముండే ఇంగ్లీష్ పదమేంటా అని ఇంగ్లీష్ డిక్షనరీ తిరగేసింది. అన్నీ చిన్న చిన్న పదాలే కాని మైలు పొడవున్న పదం ఏంటో అర్థం కాలేదు. మళ్లీ ఆ రాత్రి ఇద్దరికీ నిద్ర పట్టలేదు, సమాధానమూ తట్టలేదు.

తెల్లవారగానే రాము ఇక్బాల్ ఇంటికి వెళ్లాడు.

"ఒరేయ్ నిన్ను ఒక ప్రశ్న వేస్తాను. కరెక్ట్‌గా ఆన్సర్ చెప్పాలి" అన్నాడు.

"లూసీ అడిగిందా...సరే అడుగు" అన్నాడు ఇక్బాల్.

"తెలుగులో ఎవరైనా సరే తప్పుగా పలికే పదం ఒకటుంది. అది ఏది?" అనడిగాడు.

"ఇంకేది తప్పే...తప్పు అనే పదాన్ని ఎవడైనా తప్పు అనే పలకాలి కదా..." అన్నాడు.

ఆ సమాధానంతో రాము ఇక్బాల్ వైపు షాక్ కొట్టినట్లు చూశాడు. రాత్రంతా తాను బుర్ర బద్దలు కొట్టుకుంటుంటే ఇంత సింపుల్‌గా చెప్పేశాడేటబ్బా వీడు అనుకున్నాడు.

"నీకు ఎలా తెలుసురా..?" అని అనుమానంగా అడిగాడు.

"మరి...ఒక్కడు కూడా కరెక్ట్‌గా పలకని పదం అంటూ ఏదైనా ఉంటుందా..? తప్పు అనే పదం ఎవడు పలికినా "తప్పు" అనే పలకాలి కదా..."

ఎంత సింపుల్‌గా చెప్పేశాడు వీడు. తెలుగు పండితులకే అందదేమో అనుకున్న విషయం వీడికి ఎంత సింపుల్‌గా తెలిసిపోయింది అనుకున్నాడు.

"ఒరేయ్ ఇక్బాల్ నీకు పార్టీ గ్యారంటీ...వస్తా" అంటూ హుషారుగా నడకందుకున్నాడు. లూసీ కూడా తన ఫ్రెండ్ శ్రీదేవి దగ్గరకు వెళ్లి ప్రశ్న అడిగింది. సేమ్ రాము అడిగినప్పుడు ఇక్బాల్ ఎలాంటి ఎక్స్‌ప్రెషన్ ఇచ్చాడో...అలాంటి ఎక్స్‌ప్రెషన్‌నే శ్రీదేవి ఇచ్చింది.

"ఇంగ్లీష్‌లో మైలు దూరం ఉండే పదం ఏది?" అడిగింది లూసీ.

"మైలు దూరం ఉండే పదమా..? ఎవరడిగారే నిన్ను ఈ ప్రశ్న? ఇంగ్లీష్‌ప్రొఫెసరా?"

"కాదు...నువ్వు ఆన్సర్ చెప్పు ముందు" కాస్త సీరియస్‌గా అడిగింది.

"కొంపతీసి నీ లవర్ రాము అడిగాడా ఏంటి?"

"అవునే...రాము అడిగాడు" అంటూ సిగ్గుపడిపోతోంది.

"అబ్బా రాము పేరు చెప్పగానే ఎంత సిగ్గు, ఏం స్మైలు...అబ్బో అబ్బో" అని శ్రీదేవి ఆటపట్టిస్తోంది లూసీని.

శ్రీదేవి ఎంత సిగ్గు, ఏం స్మైలు అని అనగానే లూసీకి స్పార్క్‌లా ఐడియా వచ్చింది.

"థ్యాంక్యూ శ్రీదేవి, ఐ గాట్ ద ఆన్సర్' అంటూ అరిచినంత పని చేసింది.

“బై బై మళ్లీ కలుస్తా” అంటూ లూసీ నడుస్తుందో, గెంతుతోందో తెలియనట్లుగా ఉన్న ఒక రకమైన అందమున్న నడకతో వెళ్లిపోయింది.

సాయంత్రం లైబ్రరీ దగ్గర కలుసుకున్నారు లూసీ, రాము.

ఇద్దరూ ముఖాల్లో విజయానందం కనిపిస్తోంది. ఇద్దరి దగ్గరా సమాధానాలు ఉన్నాయి.

“ఏంటి సంతోషంగా ఉన్నట్లున్నావ్...సమాధానం దొరికిందా ఏంటి?” లూసీ అడిగింది.

“మరి...రాముకి ఓటమే తెలియదు” గర్వంగా అన్నాడు రాము.

“అయితే మరి ఆన్సర్ చెప్పు”

“చెప్తా...ముందు నువ్వు ఆన్సర్ చెప్పు” అన్నాడు.

“నాకు ఆన్సర్ తెలియలేదు. నీ ఆన్సర్, నా ఆన్సర్ నువ్వే చెప్పేయ్”

లూసీ ఆన్సర్ తెలియలేదు అనగానే రాము ముఖంలో  కాంతి కనిపించింది.

“తెలుగులో ప్రతిఒక్కరూ తప్పుగా పలికే పదం...తప్పు. ఎందుకంటే తప్పు అనే పదాన్ని తప్పు అనే పలకాలి కాబట్టి” అన్నాడు విజయగర్వంతో.

“నువ్వు గ్రేట్ రాము...భలేగా కనిపెట్టావు” అంటూ రాముకి కంగ్రాట్స్ చెప్పింది.

‘మరేమనుకున్నావ్...ఓటమే తెలియదు రాముకి” అంటూ కాలరెగరేశాడు. అది తాను కనిపెట్టలేదని, ఇక్బాల్ కనిపెట్టాడని మాత్రం రాము చెప్పలేదు.

“ఇక నీ ఆన్సర్...” అంటూ రాము చెప్పబోతుండగా..

“SMILES” ఈ పదం మొదటి, చివరి అక్షరాల మధ్యలో మైల్ అనే పదం ఉంది. అంటే ఈ పదం పొడవు మైలు దూరం ఉన్నట్లే కదా” మహారాణిలా పోజు పెట్టి మరి చెప్పింది లూసీ.

‘అబ్బో...జీనియస్’ అంటూ లూసీకి కంగ్రాట్స్ చెప్పాడు రాము. మొత్తానికి వాళ్లు పెట్టుకున్న పందెంలో ఇద్దరూ గెలిచారు. ఇలా వాళ్ల ప్రేమ చిలిపి ప్రశ్నలు, సరదా సమాధానాలతో సాగిపోతూ పెళ్లి మాటల వరకు వచ్చింది.

# 6

**“తప్పు** ఎలా అవుతుందండీ..! ప్రేమించి మోసం చేస్తే తప్పు కాని...ప్రేమించి పెళ్ళి చేసుకుంటే తప్పు ఎలా అవుతుందండీ?” సీరియస్ గా అడిగాడు రాము.

“అది కాదు బాబు మీది ముస్లిం కుటుంబం, పోనీ నీదైనా మా మతమా అంటే కాదు.

నీ పుట్టుక హిందూ పుట్టుక. మేం క్రిస్టియన్స్. ఎలా చూసినా ఎక్కడా కుదరడం లేదు బాబు" చెప్పింది లూసీ మదర్ అంద్రియా ఎలాగైనా ఈ టాపిక్ ముందుకెళ్లకూడదని.

"అదేంటండీ ముస్లింమైన మా నాన్నకి, నన్ను పెంచుకోడానికి అడ్డం రాని మతం, ఇప్పుడు మీ అమ్మాయిని పెళ్లి చేసుకోడానికి అడ్డంకిగా మారిందా?" రాము ఆవేశంగా అడిగాడు.

రాము ఆవేశంగా మాట్లాడటం గ్రహించిన రషీద్ రాముని వారించాడు.

"అది కాదండి...పిల్లలిద్దరూ చదువుకున్నారు. ఇద్దరూ ప్రపంచం గురించి బాగా తెలిసిన వాళ్లు. వాళ్లిద్దర్నీ ఒకటి చేస్తే సంతోషంగా ఉంటారని ఉద్దేశం" రషీద్ సర్దిచెప్తూ అన్నాడు.

అంద్రియా ఏదో మాట్లాడబోతుండగా...లూసీ తండ్రి అనిల్ అడ్డు చెప్పారు.

"అంద్రియా నువ్వు ఆగు. రాము, లూసీలకే మతం పట్టింపులు లేవు, ఇక వాళ్లకి పుట్టే పిల్లలకు పెళ్లిళ్లు చేసే సమయానికి ఈ మతాల గొడవే ఉండకపోవచ్చు" అంటూ తాను వీరి పెళ్లికి ఒప్పుకుంటున్నాని చెప్పాడు.

"రేపు మన పెద్దలు, మన మతస్థులు అంతా అడిగితే ఏం చెప్తాం? ఏ మతస్థుడని చెప్పాలి? నీ అల్లుడికి కనీసం ప్రార్థనైనా వచ్చా అని అడిగి మరి ఎగతాళి చేస్తారు. అయినా ఇతను నీకు అల్లుడైతే రేపు హిందువులాగా శ్లోకం చదువుతాడా, ముస్లింలాగా నమాజ్ చేస్తాడా, క్రిస్టియన్‌లా ప్రార్థన చేస్తాడా చెప్పు?" అని కోపంగా ప్రశ్నించింది.

అక్కడ నిశ్శబ్దం తాండవిస్తోంది. మతాల విషయం కదా శబ్దం కూడా నిశ్శబ్దం జోలికి పోలేదు. ఏ మత శబ్దం చేస్తే ఏమవుతుందోనని భయం వేసినట్లుంది.

చాలా సేపటి నుంచి ఆలోచనలో ఉన్న రాము ఒక్కసారిగా పైకి లేచాడు.

"మీకు అసలు మతం అంటే ఏంటో తెలుసా? మతం...మతం అని అంటున్న మీకు మతం ఎలా పుట్టిందో ఎందుకు మనం ఫాలో అవుతున్నామో మీ ఎవరికైనా తెలుసా?" అని అడిగాడు.

అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారే కానీ...ఎవరు సమాధానం చెప్పలేదు.

"మతం కూడా సైన్స్‌లా మానవ జీవితాన్ని సుఖమయం చేయాలనే పుట్టింది. అయితే మతాలు "ఇహ" జీవితాన్ని సుఖమయం చేయడం కంటే "పర" జీవితానికి సంబంధించిన విషయాలన్నే ఎక్కువ ప్రభోదించాయి. రెండింటి గమ్యం విశ్వాసాన్ని అర్థం చేసుకోవడమే అయినప్పటికీ సైన్స్ ఇహాన్ని "ఇహంలో" వివరిస్తే, మతం ఇహాన్ని "పరంలో" అర్థం చేసుకోమంటుంది. అక్కడ వచ్చిన తేడా...నేడు మతాలకు పెద్ద ఆయుధంగా మారింది.

మతం, సైన్స్ రెండింటి గమ్యం మానవునికి ఉన్న అభద్రతను తొలగించడమే. జ్ఞానం అభదత్రను తొలగిస్తుంది. ఏ జ్ఞానం అభద్రతను తొలగిస్తుంది? పర లౌకిక జ్ఞానం

అంటుంది మతం. ఇహా లౌకిక జ్ఞానం అంటుంది సైన్స్.

అభద్రత ఉన్నంత కాలం మతానికి, సైన్స్‌కూ ఎప్పుడూ పని ఉంటుంది. అందుకే మతానికి, సైన్స్‌కి చావు లేదు. అభద్రత పోవాలంటే "ఆధారం" ఉండాలి. ఈ "ఆధారం" దేవుడిలో, ధనంలో, పనుల్లో, ఈ విశ్వంలో, ప్రేమలో ఎక్కడైనా చూడొచ్చు. ఈ "ఆధార" సాధనలో అతడికి అనేక అనుభవాలు ఎదురవుతాయి. అవే మాతానుభవాలు. ఈ అనుభవాల వ్యక్తీకరణం అనేక రూపాల్లో ఉంటుంది. ఈ రూపాలు దేశకాలమాన పరిస్థితులను బట్టి మారతాయి. ఇవి మనుషులకు అనుకూలమైన రూపాలు పొందిన తర్వాత స్థిరపడిపోతాయి. ఆ క్రమంలో మత సిద్ధాంతాలు మానవునిలో ఎంత బలంగా నాటుకున్నాయంటే మత సిద్ధాంతాలను ఎదిరిస్తే సమాజంలో రక్తపాతం జరపాల్సిందే అన్నంతగా. అందుకే వాటి జోలికెవరూ వెళ్ళరు.

అలాగే మత రహిత సమాజం కూడా మతానికి అతీతం కాదు. మత రహిత సమాజమంటే మతం లేదని కాదు. ఎవరి మతాలను వారు గౌరవించుకోవచ్చనేది మూల సూత్రం. ఒక మతం గొప్పది, మరొక మతం తక్కువ అనే పోలికే ఉండదు. కాని మనకి అలా అర్థం కాదు. మా మతం గొప్పదంటే, మా మతం గొప్పంటూ కొట్టుకు చస్తున్నాం" అని చెప్పి రాము అందరి వైపు చూశాడు.

ఏవరిలోనూ ఏవిధమైన చలనం లేదు. అందరూ రాముని చూస్తున్నారు.

"ప్రపంచంలో ఎన్ని రకాల ప్రాణులున్నప్పటికీ మనుషులకు తప్ప వేటికీ మత విశ్వాసాలుండవు. ఇది కేవలం మానవ పరిణామానికి సంబంధించిన విషయం. ఈ విషయాన్ని మనం అర్థం చేసుకోం. కనపడని దేవుడ్ని, పట్టిపీడిస్తున్న మతాన్నే నమ్ముతాం తప్ప…మనుషులుగా మతం వలన మరో మనిషికి కలిగే లాభమేంటని ఒక్కసారి కూడా ఆలోచించం. అసలు మతం ఎందుకని అడిగితే ఎవరు సమాధానం చెప్పరు. చెప్పలేరు కూడా. కానీ మతం విషయానికి వచ్చేసరికి మాత్రం అన్ని పట్టుదలలే ఉంటాయి. చివరకూ ఇద్దర్ని కలిపే ప్రేమని, పెళ్లిని కూడా ఈ మతాలు అడ్డుకుంటాయి. మనుషులని విడదీసే మతాలు ఏవరి కోసం?" అని రాము ఆవేశంగా ప్రశ్నించాడు.

"నిజానికి దేవుడి మీద నమ్మకం, మతం పట్ల విశ్వాసం కూడా సైన్సే. కాకపోతే అది సైన్స్ అని గుర్తించనివ్వకుండా మనల్ని అవివేకుల్ని చేస్తున్నారు. మతాధిపతులు, రాజకీయ నాయకులు…ప్రజలను బానిసలుగానే ఉంచాలనుకునే కొందరు స్వార్థంతో మతాల్ని మరింత రెచ్చగొడుతూ, మతంలో ఉన్న విజ్ఞానాన్ని అందకుండా చేస్తూ, మూడత్వాన్ని మాత్రం అందిస్తున్నారు" అని రాము చెప్పాడు.

రాము అలా చెప్పుకుంటూ పోతుంటే అక్కడున్నవారంతా శ్రద్ధగా వింటున్నారు. కానీ అంద్రియా మాత్రం అసహనంగా ఉంది. "అయితే దేవుడు, మతంపై ఉన్న నమ్మకాలన్నీ మూఢ నమ్మకాలంటావా? మేమంతా వెర్రిబాగులోళ్లమని నీ ఉద్దేశమా?" అని అంద్రియా కాస్త కోపంగానే ప్రశ్నించింది.

"అవును నిజమే. మీరే కాదు, మతం మత్తులో కురుకుపోయిన వాళ్లంతా గొర్రెలే. అందుకే మనల్ని మత చాంధసులు, మతవాదులు అంత సులువుగా తైతక్కలాడిస్తున్నారు.

అందులో భాగంగానే కనిపించని విషయాలను, అనవసరమైన వాటిని మతం పేర్లు చెప్పి ప్రజలను భక్తి మత్తులో ఉంచుతున్నారు ఈ మతవాదులు. అవి ప్రధానంగా చావు భయం, పాపభీతి. చావు భయాన్ని మరింత ప్రేరేపించి పునర్జన్మలో మంచి జీవితం కావాలంటే ఇప్పుడు పూజలు, పునస్కారాలంటూ భయపెడతారు. మనుషులు వచ్చే జన్మలో ఏ కుక్కగానో, పందిగానో పుట్టొచ్చు. అప్పుడు కుక్క పుణ్యాలు చేస్తే ఆ తర్వాత జన్మలో మనుషుల్లో ఉత్తమమైన జన్మ లభిస్తుంది అంటూ ఏవో చెప్తుంటారు. అయితే పుణ్యం పొందాలంటే చేయాల్సిన ప్రార్థనలు ఆ కుక్కకి ఎవరు చెప్తారో? ఎలా చెప్తారో? ఎప్పుడు చెప్తారో? ఎప్పుడు ఆ కుక్క మనిషిగా మారుతుందో ఎవరికి తెలియదు.

ప్రపంచంలో ఎన్నో విషయాలు పరిణామ క్రమంలో కనుమరుగయ్యాయి. కానీ మత పిచ్చి మాత్రం పెరుగుతూ వస్తోంది. ప్రాచీనుల నమ్మకాలు అమాయకంగా, గుడ్డిగా అనిపించినా...ఆ నమ్మకాల ఆధారంగా సమాజం అంతా ఒకటిగా ఉంటుందని భావించారు. కానీ నేడు ఆధునీకులం అని చెప్పుకుంటూ ఆ సమాజాన్ని మతం, కులం, వర్గం అంటూ విడదీసి మరీ మన అవివేకాన్ని చాటుకుంటున్నాం." అంటూ వెటకారంగా నవ్వాడు రాము.

"బాబు నువ్వు చెప్తున్న చరిత్రేది మాకు అవసరం లేదు. మా మతం ప్రార్థనలు, మా మతాచారాలు తెలిసిన వాళ్లతోనే మాకు సంబంధం కుదురుతుంది అంతే" అంది అండ్రియా.

"పోనీ దేవుడు, మతాలనే నమ్ముదాం కాసేపు. అలా నమ్మితే ప్రార్థన అనేది ఒక మత సంబంధమైన ఆచరణ మాత్రమే. క్రిస్టియన్లు చేసే ప్రార్థన, హిందువులు చేసే పూజలు, ముస్లింలు చేసే నమాజ్‌కి అర్థం అందరూ బాగుండాలనే కదా. ఏ మత పూజలైనా అంతా బాగుండాలనే కదా" అన్నాడు రాము అందరి వైపు చూస్తూ.

"మీ మతంలో ఎక్కడా మీ మతస్థులు మీ వారినే పెళ్లి చేసుకోవాలని చెప్పలేదే..! అలాగే ఇస్లాంలో కాని, హిందు ధర్మంలో కాని అలాంటి నియమమేది లేదే..! మరి మత గ్రంథాలను అనుసరించి జీవించే మనం ఈ కొత్త ధర్మాలను ఎక్కడ నుంచి తెచ్చాం? అందులో లేని ధర్మాలను తీసుకొచ్చామా...? అంటే దేవుడికి ఇది వ్యతిరేకమే కదా...! అలాంటప్పుడు ఆ దేవుడిని మోసం చేసినట్లు కదా?" అంటూ వరుస ప్రశ్నలు సంధించాడు రాము.

రాము ప్రశ్నలకు సమాధానం రావడం లేదు. ఎందుకంటే రాము ప్రశ్నలో నిజం ఉంది. రాము అడిగే పద్ధతిలో నిజాయితీ ఉంది. దాంతో ఎవరు ఈ పెళ్లికి అడ్డు చెప్పే ధైర్యం చేయలేదు. అండ్రియాతో సహా ఆమె వైపు బంధువులెవరికి ఈ పెళ్లి జరగడం ఇష్టం లేదు. అయితే మెజారిటీ పెళ్లికి ఒప్పుకోవడంతో చేసేదేమీ లేక అయిష్టంగానే అండ్రియా ఒప్పుకుంది.

పెళ్లికి రెండు కుటుంబాలకు చెందిన మూడు మతాల వారు అంగీకరించారు. హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి భాజాలు మోగించి, క్రిస్టియన్ ట్రెడిషన్ ప్రకారం రింగులు మార్చుకుని, ఇస్లాం పద్ధతిలో నికాహ్ నామా చేసేందుకు కూడా అంతా ఒప్పుకున్నారు.

అయితే రాము మాత్రం ఏడాది తర్వాతే పెళ్లి అన్నాడు. తాను ఒక బిజినెస్ ప్లాన్ చేశానని, దానికి ఆరు నెలల సమయం పడుతుందని, తర్వాతే పెళ్లి చేసుకుంటానని చెప్పాడు.

అండ్రియా దీనికి వెంటనే ఓకే చెప్పింది. ఈ ఏడాది కాలంలో కూతురి మనసు మార్చేయడానికి సమయం దొరుకుతుందని సంతోషపడింది.

రాము నిర్ణయాన్ని లూసీ కూడా అంగీకరించింది.

వారం రోజుల తర్వాత రాము హైదరాబాద్ బయలుదేరాడు. రియల్ ఎస్టేట్ హైదరాబాద్‌లో బాగా సాగుతోంది. దాంతో అక్కడ భవన నిర్మాణ రంగం ఊపందుకుంది. రాము హైదరాబాద్‌లో తన స్నేహితుల సహాయంతో ఓ సైట్ తీసుకుని అపార్ట్‌మెంట్ నిర్మాణం స్టార్ట్ చేశాడు. రాము తన కంపెనీకి రషీద్ ప్రసాద్ కనస్ట్రక్షన్స్ అని పేరు పెట్టాడు.

కొత్తగా నిర్మాణ రంగంలోకి దిగడంతో కొన్ని ఇబ్బందులు వస్తున్నా కూడా వాటిని అధిగమిస్తూ ఆరు నెలల సమయానికి తన అపార్ట్‌మెంట్ నిర్మాణం పూర్తచేసి, అడ్వాన్సులు ఇచ్చిన వారికి ఫ్లాట్స్ అప్పగించేశారు. నిజాయితీతో ఎలాంటి మోసానికి తావు లేకుండా, లాభం పెద్దగా ఆశించకుండా చేసిన రాము తొలి వెంచర్‌లో విజయం, అనుభవం రెండూ వచ్చాయి. రషీద్ ప్రసాద్ కనస్ట్రక్షన్స్ మార్కెట్‌లో నిలదొక్కుకోగలిగింది.

అలాగే రాము ఖైరతాబాద్‌లోని ఓ ఇల్లు కొనుక్కున్నాడు. పెళ్లయ్యాక లూసీకి ఎలాంటి ఇబ్బంది రాకుండా ఉండే విధంగా అన్ని సామానులు, హంగులతో ఇంటిని సిద్ధం చేశాడు.

ఈ ఏడాది కాలంలో పెళ్లి క్యాన్సిల్ చేయించేందుకు అవకాశం దొరికినప్పుడల్లా లూసీకు అండ్రియా బ్రెయిన్ వాష్ చేసేది. అయితే లూసీ తన తల్లి అండ్రియా చెప్పినవన్నీ విని, పెళ్లి మాత్రం రాముతోనే అనేది. దీంతో అండ్రియాకు కూడా విసుగొచ్చి తన ప్రయత్నాలను విరమించుకుంది.

లూసీ ఇంగ్లీష్ పీజీ, డిప్లమో ఇన్ రెలీజియస్ స్టడీస్ కూడా పూర్తి చేసింది. అనుకున్నట్లుగానే ఏడాది గడిచింది. అన్ని పరిస్థితులు అనుకూలంగా మారాయి. రాము, లూసీల పెళ్లి జరగబోతోంది అనే విషయం తెలిసిన తర్వాత రాజమండ్రిలో టాక్ ఆఫ్ ది టౌన్ అయ్యింది. మూడు మతాల పెళ్లా అని అంతా మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. ఆదర్శ భావాలున్న వారు శభాష్ అన్నారు. మన దేశానికి మంచి రోజులొచ్చాయి. ఈ పెళ్లి ఆదర్శంగా దేశంలోని అన్ని మతాలు కలిసి మెలసిఉండాలని అన్నారు.

ఇక ఇలా అంతర మతాల పెళ్లి ఇష్టం లేని వారు మాత్రం “ఇదేమి విడ్డూరం, రాముని రషీద్ పెంచడమే తప్పు అంటే, ఇప్పుడు ఇది కూడానా. బాగుంది, ఇంకేముంది, మతమేముంది, విశ్వాసాలేమున్నాయి. అన్ని మంట కలిసిపోతున్నాయి” అనుకుంటూ రోజూ మీటింగులు సాగేవి కొందరి మధ్య. మీటింగులు, చర్చలు ఎలా ఉన్నా లూసీ, రాముల పెళ్లి ఘనంగా జరిగింది. ఎవరికి ఏ ఇబ్బంది కలిగించకుండా హిందూ, ముస్లిం, క్రైస్తవ ఆచారాల ప్రకారం పెళ్లి జరిగింది. పెళ్లికి వచ్చిన వారికి ఇదే పెద్ద టాపిక్. హిందువుల అబ్బాయి ముస్లింల ఇంట్లో పెరగడం, ఆ అబ్బాయి క్రిస్టియన్ అమ్మాయిని

ప్రేమించడం, పెళ్లి చేసుకోవడం చిన్న విషయం కాదు కదా అందుకే అక్కడ అదే పెద్ద టాపిక్.

వచ్చిన వారందరూ రాము, లూసీల జంటను చూసిన తర్వాత మతం గొడవ పక్కన పెట్టి బెస్ట్ పెయిర్ అంటూ కితాబిచ్చారు.

మతాంతర పెళ్ళి వార్త రాజమండ్రి నుంచి రాష్ట్రమంతా పాకింది.

# 7

**బెడ్‌రూంలో...**లూసీ బుగ్గలు పట్టుకుని...

“లూసీ హనీమూన్‌కి ఎక్కడికి వెళదాం?” అని అడిగాడు రాము.

“ఇప్పటిదాకా నేను హైదరాబాద్ వెళ్లలేదు. మనకి ఇల్లు కూడా అక్కడ ఉంది కాబట్టి అక్కడికే వెళదాం. మన ఇంట్లో ఉంటూ ఎప్పుడు కావాలంటే అప్పుడు నచ్చిన చోటుకి వెళ్లి హాయిగా ఎంజాయ్ చేయొచ్చు కదా..! కావాలంటే హైదరాబాద్ బోరు కొడితే అప్పుడు ఎక్కడికైనా వెళదాం”’ రాము బుగ్గ మీద ముద్దు పెడుతూ చెప్పింది.

“పైగా ఎంత త్వరగా హైదరాబాద్ వెళ్తే అంత మంచిది నాకు. అక్కడ సైకాలజీకి కాస్త డిమాండ్ ఉంది. ఇప్పుడు ఏదైనా ఉద్యోగం చూసుకుంటే కెరియర్ ప్లానింగ్‌కి హెల్ప్ అవుతుంది. భవిష్యత్తు కూడా బాగుంటుంది”

“కరెక్టే. నీ ప్లానింగ్ బాగుంది. ఇక చెప్పేదేముంది. నీ ఇష్టమే నా ఇష్టం. మన హైదరాబాద్ ఇల్లే మన హనీమూన్ స్పాట్” అన్నాడు లూసీ మెడపై చేతులాడిస్తూ.

“మరి ఆ ఇంటిని హనీమూన్ స్పాట్‌లా ఉంచావా? లేక బ్యాచిలర్ రూములా ఉంచావా..?” అంటూ అడిగింది లూసీ బుగ్గలలో సిగ్గు దాచుకుంటూ.

“బ్యాచిలర్ రూం కంటే బెస్ట్ హనీమూన్ స్పాట్ మరొకటి ఉండదు తెలుసా..?”

“ఏం ఎందుకు అలా?” అంటూ అమాయకంగా అడిగింది లూసీ.

“ఎందుకంటే హనీమూన్‌కి కావాల్సిన అన్ని ఏర్పాట్లు బ్యాచిలర్ రూంలో ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయి” అన్నాడు.

“హా...అంటే నువ్వు ఆ ఇంట్లో...” అని తన మెడ మీద ఆడుతున్న రాము చేతులను తీసేసింది.

“లేదు లేదు...సరదాగా అన్నా” అంటూ ఈ సారి చేతులు నడుం మీద వేశాడు.

"ఇంతకి అయ్యగారు గతంలో ఎవరికైనా వలేశారా...?" ఆడవాళ్లకుండే సహజమైన అనుమానాన్ని బయటపెట్టింది.

"అవును ఇంతకాలం పరిచయంలో అడగని ప్రశ్న ఇప్పుడెందుకు అడిగావు"

"పెళ్లికాక ముందు ఇదే ప్రశ్న వేస్తే అనుమానంతో అడిగినట్లు అవుతుంది. సమాధానం చెప్పడం నీకు ఆప్షనల్. ఇప్పుడైతే అధికారంతో, హక్కుతో అడిగినట్లు అవుతుంది. ఇప్పుడు సమాధానం చచ్చినట్లు చెప్పాలి" చెప్పింది లూసీ ఇది నా హక్కు అన్నట్లుగా.

"అమ్మ బాబోయ్ ఇన్ని తెలివి తేటలా...ఇన్ని తెలివితేటలున్న అమ్మాయితో నేను ఎలా వేగాలి దేవుడా...!" అంటూ పైకి చూశాడు.

"చెప్తావా లేదా..!" అని నెత్తి మీద కొట్టింది.

"వయసులో ఉన్నప్పుడు ఎవరినో చూసి ఆకర్షితులవడం సహజం. ప్రేమించడం ప్రతి మనిషి జీవితంలో జరిగే సంఘటనే. అది కొందరు ఒప్పుకోవచ్చు. మరికొందరు ఒప్పుకోకపోవచ్చు. నా జీవితంలో ఇలాంటి అమ్మాయే రావాలనే చాలా మందిని చూసినప్పుడు అనిపించేది. నిన్ను చూసినప్పుడు నీతో మాట్లాడగలిగితే చాలు అనుకున్నాడు. నువ్వు నా  సొంతమయ్యావంటే ఇంకా నాకు నమ్మకం కలగడం లేదు తెలుసా. నేను ఇప్పుడు చాలా హ్యాపీగా ఉన్నాను" అన్నాడు లూసీ ముఖాన్ని దగ్గరకు తీసుకుంటూ...

"ఎందుకో?" అంటూ రాము నుదురుపై ముద్దు పెట్టి అడిగింది.

"కోరుకున్నది దగ్గరైతే ఎదురయ్యే ఆనందం కంటే, అవ్వదేమో అనుకున్నది దగ్గరైతే ఎదురయ్యే ఆనందమే ఎక్కువ. ఇప్పుడు ఆ ఆనందమే నాకు కలుగుతుంది" అన్నాడు.

రాము అలా చెప్తూ ఉంటే లూసీ లోలోపల పొంగిపోతోంది. దీంతో లూసీ బుగ్గలు మరింత ఎర్రబడ్డాయి. లూసీని మరింత దగ్గరకు తీసుకున్నాడు రాము. వారిద్దరా..! ఒక్కరా..! అన్నంత దగ్గరయ్యారు.

వారం రోజుల తర్వాత ఇద్దరూ హైదరాబాద్ బయలుదేరారు. రషీద్, వహీదా, అండ్రియా, అనిల్ అంతా వీడ్కోలు చెప్పారు.

హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో వీళ్ళిద్దర్నీ రిసీవ్ చేసుకుని ఇంటి దగ్గర దింపాడు ఇక్బాల్. ఇంటికి రాగానే ఇంటిలో ఉన్న అన్ని గదుల్ని పరిశీలిస్తోంది లూసీ.

"రాణిగారి కోసం ఇంత మంచి మందిరాన్ని సిద్ధం చేసిన రాజుగార్ని చూస్తే ఏమనిపిస్తోంది? అని రొమాంటిక్‌గా అడిగాడు రాము.

"నువ్వు పప్పుసుద్దవని అనిపిస్తోంది" అని కవ్విస్తూ సమాధానం చెప్పింది.

"అదేంటి..! ఒక్కసారే అలా అనేశావు?"

"మరి...ఇంట్లో హాయిగా పరిమళం వస్తోంది.  కనీసం నువ్వు...నువ్వు..."

"ఆ నేను..."

"అదే మరి పప్పు సుద్ద అంటే.."

"అవునా..!" అంటూ లూసీ పెదవులపై ముద్దు పెట్టాడు.

"నువ్వు మరీ పప్పు సుద్దవేమి కాదులే..."

ఈసారి లూసీ పెదాలకు ఇంగ్లీష్ ముద్దు నుంచి ఫ్రెంచ్ కిస్‌కి ఏలా షిఫ్ట్ అవ్వాలో చూపించాడు.

"పర్లేదే పప్పుసుద్దకు ప్రమోషన్ వచ్చిందే" కొంటెగా చూస్తూ చెప్పింది లూసీ.

"ఇంతకీ బ్యాచిలర్ గదిలా ఉందా..? హనీమూన్ స్పాట్‌లా ఉందా?" అన్నాడు రాము.

"ప్రస్తుతం అయితే బ్యాచిలర్ గదిలా ఉంది" చెప్పింది లూసీ రాముని ఓరగా చూస్తూ.

"లూసీ నడుం మీద చెయ్యేసి దగ్గరకు తీసుకుని ఇప్పుడెలా ఉంది?" అనడిగాడు.

"నౌ ఐ ఎగ్రీ, ఇట్స్ హనీమూన్ స్పాట్" అంటూ రాము చేతిలో తన చేయి కలిపింది. అదే సమయంలో పక్కింటి రేడియో నుంచి "ప్రేమ యాత్రలకు బృందావనం, నందన వనమోలానో...కులుకులొలుకు చెలి చెంతనుండగా...వేరే స్వర్గం ఎలానో... హహహ...హహ..." అంటూ పాట వినిపిస్తోంది.

* * * * *

ఉస్మానియా యూనివర్సిటీలో సైకాలజీ విభాగంలో పార్ట్‌టైమ్ పీహెచ్‌డిలో జాయిన్ అయ్యింది లూసీ. క్లాసులకు మిస్ కాకుండా వెళ్తోంది. సైకాలజీ క్లాసులో ఒక రోజు ప్రముఖ సైకాలజిస్ట్ పట్టాభిరామ్‌తో స్పెషల్ క్లాస్ ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ పట్టాభిరామ్ క్లాసు మొదలు పెట్టారు.

"మనిషి మానసిక స్థితిపై ఆసనాలు బాగా ప్రభావం చూపుతాయి. అందుకే పెరుగుతున్న ఒత్తిడిని అధిగమించడానికి ఆసనాలు తప్పనిసరి. ఇవి మనిషిపై ఎంత ప్రభావాన్ని చూపుతాయో చెప్పడానికి ముస్లింల జీవన విధానం ఒక ఉదాహరణ" అని చెప్పారు.

ముస్లింల జీవన విధానం వల్ల మానసిక స్థితి బ్యాలెన్స్‌గా ఉంటుందా, ఇదేదో బాగుందే అంటూ విద్యార్థులంతా ఎంతో ఆసక్తిగా వింటున్నారు.

"పిచ్చి ఆసుపత్రుల్లో దాదాపుగా ముస్లింలు పేషెంట్లుగా ఉండరు. ఉంటే గింటే డాక్టర్లుగా ఉంటారు. దానికి కారణం వాళ్లు రోజుకు ఐదు సార్లు నమాజ్ చేయడమే. అల్లాకి మోకరిల్లి చేసే నమాజ్ ఎంతో మంచి మానసిక, శారీరక వ్యాయామం. నమాజ్ చేసినప్పుడు ముస్లింలు ముందు నిటారుగా నిలబడతారు. ఆ తర్వాత కాళ్లని నిటారుగా ఉంచి నడుం భాగాన్ని ముందుకు వంచుతారు. దాని తర్వాత మోకాళ్లపై కూర్చుని తలను నేలకు ఆనిస్తారు. అప్పుడు పైకి లేచి మోకాళ్లపై కూర్చుంటారు. ఇది ఎంతో మంచి

వ్యాయామంతో సమానం. ఇది దాదాపు ఒక వంద ఆసనాలు వేసిన ఫలితాన్ని ఇస్తుంది. ఒక వైపు ఆరాధన, మరోవైపు ఆరోగ్యం ఈ రెండూ నమాజ్ వల్ల సాధ్యమవుతాయి. అందుకే ముస్లింలు మెంటల్‌గా, ఫిజికల్ స్ట్రాంగ్‌గా ఉంటారని చెప్పాడు.

ఇంటికి వచ్చిన తర్వాత రాముకి పట్టాభిరామ్ క్లాస్ గురించి చెప్పింది.

“నమాజ్...ప్రార్థన మాత్రమే కాదు, వ్యాయామం కూడా” అన్నాడు రాము.

“వచ్చే వారం రెలీజియస్ స్టడీస్ సెమినార్ ఒకటుంది. దానిలో నాకేదైనా అవకాశం వస్తే మాట్లాడతాను. అందులో ఏదైనా ఇంట్రెస్టింగ్‌గా ఉండడే అంశాలు చెప్తే స్టూడెంట్స్ కనెక్ట్ అవుతారు. నేను ముస్లింల ప్రార్థనల గొప్పతనం గురించి చెప్దామని అనుకుంటున్నాను. నాకు ముస్లింల ఆచారాలు, ప్రార్థనలు నమాజ్ కోసం కొంచెం చెప్పవా అని అనడిగింది లూసీ.

“సరే” అని చెప్పడం మొదలుపెట్టాడు రాము.

“నమాజ్ అంటే అల్లా ముందు మోకరిల్లి నిర్వహించే ప్రార్థన. నమాజ్ ప్రతి ముస్లిం కచ్చితంగా రోజూ ఐదుసార్లు పాటించాలి. నమాజ్ అనేది పర్షియన్ పదం. అరబ్బీలో నమాజ్‌ని సలాహ్ అంటారు. ఉర్దూలో నమాజ్ లేదా సలాత్ అంటారు. నమాజ్ చేయాలనుకునేవారు నమాజ్‌కు ముందు ముఖం, చేతులు కాళ్లు శుభ్రపరచుకోవాలి. దీన్నే **“వజూ”** అంటారు. ఆ తర్వాత నమాజ్ ప్రార్థన కోసం భక్తితో వరుసగా నిలబడాలి. దీనినే **“ఇఖామా”** అంటారు.

ఇక నమాజ్ చేయాల్సిన సమయాల విషయానికి వస్తే...సూర్యోదయం నుంచి అర్ధరాత్రి వరకు రోజులో ఐదుసార్లు నమాజ్ ఆచరించాలి. ఆయా సమయాల్లో చేసే నమాజ్‌కి ఒక్కో పేరు ఉంది.

సూర్యోదయానికి ముందు ఆచరించే నమాజ్‌ని **‘ఫజ్ర్ నమాజ్’** అని, సూర్యుడు నడినెత్తిన వచ్చి పడమట పయనించే సమయంలో చేసే నమాజ్‌ని **“జుహర్ నమాజ్”** అంటారు. దానికి సూర్యాస్తమయ సమయానికి మధ్య చేస్తే **“అసర్ నమాజ్”** అని అంటారు. సూర్యాస్తమయ సమయంలో చేసే నమాజ్‌ని **“మగ్రిబ్ నమాజ్”** అని, ఇక సూర్యాస్తమయ సమయం నుంచి, అర్ధరాత్రి వరకు ఆచరించే నమాజుని **“ఇషా నమాజ్”** అని అంటారు.

ఇవి కాకుండా మరికొన్ని రకాలైన నమాజులున్నాయి. అల్లా గొప్పతనాన్ని చెప్తూ చేసే నమాజ్‌ని **‘తస్ బీహ్ నమాజ్’** అని అంటారు. రోజు వారి అవసరాలను తీర్చమని వేడుకునే నమాజ్‌ని **“హజాత్”** అని, అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రశాంత సమయంలో చేసుకునే నమాజ్‌ని **“తహజ్జుద్”** అంటారు.

లూసీ రాము చెప్తున్న విషయాలను పాయింట్ల వారీగా నోట్ చేసుకుంటోంది.

“అలాగే ఇప్పుడంతా బిజీ జీవితాలు అయిపోయాయి. ప్రయాణం, ఉద్యోగం, ఇతర కారణాల వల్ల ఒక పూట నమాజ్ తప్పిపోతే, ఆ తర్వాత దాన్ని ఆచరించి చేసేదే **“కజా**

**నమాజ్"** అని చెప్పిన రాము ఇషా నమాజ్ చేసేందుకు కాళ్లూ, చేతులు, ముఖం కడుక్కుని సిద్ధమయ్యాడు.

నమాజ్ పూర్తి చేసుకుని రాము వచ్చాడు. రాముకి టవల్ అందించిన లూసీ "ముస్లిం పలకరింపు కొత్తగా ఉంటుంది. ఏదైనా ప్రత్యేకత ఉందా?" అనడిగింది.

"లూసీ అన్ని మతాల్లో రకరకాలైన ఆచారాలుంటాయి. **"అస్సలాము అలైకుమ్"** అంటూ ముస్లింలు తోటి ముస్లింలను పలుకరించుకుంటారు. ఈ పలకరింపులోనే ఎదుటి వారి మంచిని కోరుకోవడం ఉంది. అస్సలాము అలైకుమ్ ప్రతిగా **"వాలేకుమ్ అస్సలాం"** అని బదులిస్తారు. ఇలా ఒక వ్యక్తి మరో వ్యక్తి మంచి కోరుకోవడం అనేది కూడా సమాజం అంతా బాగుండాలనే సైకాలజీయే కదా. అమ్మా మేరి మాత....లూసీ...ఇప్పుడైనా నాకు అన్నం పెట్టు. ఆకలేస్తుంది. లేకపోతే చచ్చేలాగున్నాను" అన్నాడు నీరసంగా.

"నీకు ఆ ఛాన్స్ ఇవ్వను. చస్తే గిస్తే నువ్వు నా వంట తినలేక చావాలి కాని నిన్ను ఆకలితో చావనిస్తానా" అంటూ జోక్ చేసింది లూసీ.

ఇద్దరూ నవ్వుకుంటూ డైనింగ్ రూం వైపు నడిచారు.

* * * * *

**రాము,** లూసీల ప్రేమకి కారణమైన రాము పుట్టిన రోజు వచ్చింది. రాజమండ్రి నుంచి రషీద్, వహీదాలు అలాగే లూసీ పేరెంట్స్ అనిల్, అండ్రియా, ఇక్బాల్ అబ్బా, అమ్మీలతో పాటు లూసీ ఫ్రెండ్ శ్రీదేవి కూడా వచ్చింది. పుట్టిన రోజు పార్టీ జరుగుతోంది.

అండ్రియా, వహీదా లూసీని "లూసీ ఏం ఇంకా పిల్లల్ని కనరా మీరు?" అని అడిగారు.

"ఆయన బిజినెస్, నా చదువు వల్ల ఒక సంవత్సరం గ్యాప్ అనుకున్నాం. వచ్చే ఏడాదికి నాన్న ఫ్యాంట్, మీ ఇద్దరి చీరలు, రషీద్ మామయ్య గెడ్డం అన్ని తడిపేసే మనవడు ఉంటాడు" అని సిగ్గు పడుతూ చెప్పింది.

"ఓ...అలాగ...అయితే ఓకే..." అంటూ అండ్రియా, వహీదా, కాబోయే తాతలైన రషీద్, అనిల్‌లకు ఈ విషయం చెప్పారు. వాళ్లు కూడా ఆనందపడ్డారు. పార్టీలో అంతా సరదాగా కబుర్లు చెప్పుకుంటూ రాజమండ్రి విషయాలు మాట్లాడుకుంటున్నారు.

"ఏం లూసీ ఇంకా అప్పట్లాగే సరదా ప్రశ్నలు, ఆన్సర్లు సాగుతున్నాయా మీ మధ్య...?" అనడిగింది శ్రీదేవి.

"ఎందుకుండవు? అవి ఎప్పుడైనా ఉంటాయి. నువ్వు బాగా గుర్తు చేశావ్. మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతాను. ఎవరు కరెక్ట్‌గా ఆన్సర్ చేస్తే వారికి మంచి బహుమతి ఇస్తాను" అని అనౌన్స్ చేసింది లూసీ.

"ఏం గిఫ్ట్?" అనడిగారు అందరూ.

"సమాధానం ఎవరు చెప్తే, వారు చెప్పిన పేరు లూసీకి పుట్టబోయే బిడ్డకు పెట్టాలి" అన్నాడు రషీద్.

"ఇదేదో బాగుందే...ఒకే" అన్నారు లూసీ, రాము.

"జీవితాంతం మనతో పాటు ఉంటుంది. కష్టాల్లోను, సుఖాల్లోను. ఎండైనా, వానైనా కూడా మనతోనే ఉంటుంది. అది ఏది?" అని లూసీ ప్రశ్న అడిగింది.

"భార్య" అన్నాడు రషీద్.

"కాదు. భార్య మన జీవితంలో మధ్యలో వస్తుంది. పైగా జీవితాంతం ఉండదు.

ఎందుకంటే భార్య, భర్తల్లో ఎవరైనా ముందుగా కాలం చేయొచ్చు" అన్నాడు రాము.

"పాప, పుణ్యాలు" అండ్రియా చెప్పింది.

"అసలు ఈ కలికాలంలో పాపమేదో, పుణ్యమేదో తెలిస్తే అవి మనతో ఉన్నాయో లేవో చెప్పడానికి" అని సమాధానం చెప్పింది లూసీ.

"ఆ...ఫ్రెండ్స్" అన్నాడు రాము.

"ఫ్రెండ్ విడిపోరా...అయినా జీవితాంతం ఉండరు కదా" తిరిగి ప్రశ్నించింది లూసీ.

"ఏరా ఇక్బాల్ నువ్వు ఇలాంటి ప్రశ్నలకు షార్ప్‌గా సమాధానం చెప్తావు కదా...ఏం నీకు క్కూడా సమాధానం దొరకడం లేదా...?" అనడిగాడు రాము.

"ఆలోచిస్తే సమాధానం దొరకదుగా...ఆటోమేటిగా వచ్చేయాలి" అన్నాడు ఇక్బాల్.

"సరే ఆలోచించు...నువ్వే గెలవాలని కోరుకుంటున్నా" అన్నాడు రాము.

పార్టీ జరుగుతుంది. లూసీ ప్రశ్నకి మాత్రం ఇంకా ఆన్సర్ ఎవ్వరూ చెప్పలేదు. అందరూ తామే సమాధానం చెప్పి లూసీ, రాముల సంతానానికి పేరు పెట్టాలని అనుకుంటున్నారు.

"యా అల్లా ఆన్సర్ దొరికేసింది. లూసీ ప్రశ్నకి సమాధానం దొరికింది. జీవితాంతం మనతో ఉండేది ఏంటో తెలుసా?" అన్నాడు ఇక్బాల్

"చెప్పు చెప్పు" అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

"జీవితాంతం మనతూ ఉండేది మరేంటో కాదు మన పేరే. జీవితంలో మనతో కష్టాలు, సుఖాలు, డబ్బులు, స్నేహితులు, ఆఖరికి తల్లిదండ్రులు కూడా ఎంతోకొంత కాలమే ఉంటారు. కాని పేరు మాత్రం జీవితాంతం మనతోనే ఉంటుంది" అన్నాడు.

"అవును...మా ఇక్బాల్ భయ్యా కరెక్ట్" ఆనందంతో చెప్పింది లూసీ.

"నా బిడ్డకు జీవితాంతం తనతో ఉండే పేరుని నా ప్రాణమైన ఇక్బాలే పెట్టబోయేది. ఇంతకి ఏం పేరు పెడతావు రా నువ్వు?" అన్నాడు రాము.

"నీకు ఆడపిల్లే పుడుతుంది. ఆ పుట్టబోయే బిడ్డ పేరు పవిత్ర" అన్నాడు ఇక్బాల్.

అక్కడున్న వారందరికీ ఆ పేరు ఎంతో నచ్చింది.

“మనందరి మధ్యా ఏ మతం లేదు, ఏ కులం లేదు. మనం ఒకరికొకరం తెలిసినప్పటి నుంచి మతాలతో సంబంధం లేకుండానే హాయిగా ఉంటున్నాం. రషీద్ అబ్బా పెంపకానికి, మన స్నేహానికి, మీ పెళ్లికి అన్నింటికి గుర్తుగా నీ బిడ్డకు పవిత్ర అని పేరు పెట్టు. ఏ మతం లేదు, ఏ కులం కాదు. మనందరి బంధమంత పవిత్రమైందిరా ఆ పాప. అందుకే ఆ పాపకు పవిత్ర అని పేరు పెడదాం” అన్నాడు.

“పెడదాం ఏంట్రా. పెట్టేశావ్...నా బిడ్డ పేరు పవిత్రే” అన్నాడు రాము ఇక్బాల్‌ని చూస్తూ.

“భయ్యా నా బిడ్డకి పేరు పెట్టడమే కాదు, దాని బాధ్యతలన్నీ నీవే” అంది లూసీ.

“తప్పకుండా అన్నీ నేనే చేస్తా అన్నాడు. అఖీఖా, ఖురాన్ ఖ్వానీ నేనే చేయిస్తా బెహన్” అన్నాడు ఇక్బాల్ సంతోషంగా.

**“అఖీఖా”** అంటే పుట్టు వెంట్రుకలు తీయించడం, అలాగే ఖురాన్ ఖ్వానీ అంటే పిల్లలకు విద్యా అభ్యాసన చేయించడం. “బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం” అంటే “చదువు అల్లాహ్ పేరుతో” అనే వాక్యంతో విద్యాభ్యాసం ప్రారంభిస్తారు.

# 8

**రషీద్ ప్రసాద్** కనస్ట్రక్షన్ కార్యాలయం...

“ఏరా ఇక్బాల్ వెళ్తావా...?”

“నేను వెళ్తేనే బెటర్ కదా రాము..!”

“మరొకరిని ఎవర్నో ఒకర్ని పంపించి...వాళ్లు మళ్లీ సరిగ్గా డీల్ చేయలేకపోతే మళ్లీ నేనే వెళ్లాలి. అదేదో ఇప్పుడే వెళ్లొచ్చేస్తే మంచిది కదరా. అందులోనూ పెద్ద ప్రాజెక్ట్. మనం ఎలాగైనా దీన్ని సాధిస్తే మరో పదేళ్ల వరకు మార్కెట్‌లో తిరుగుండదు మనకి” అన్నాడు ఇక్బాల్.

“సరే నీ ఇష్టం. కాని తొందరగా వచ్చేయ్” అంటూ అయిష్టంగానే ఒప్పుకున్నాడు రాము.

“నేనేమైనా హాలీడే టూర్‌కి వెళ్తున్నానా...అక్కడే ఉండిపోడానికి, వచ్చేస్తాలే”

“అవున్రా...టూర్ అంటే గుర్తొచ్చింది. నువ్వు పెళ్లయిన తర్వాత హాలీడే టూర్‌కి వెళ్లినట్లు లేదు కదా..! పైగా బొంబాయి లాంటి మంచి ప్లేస్‌కి వెళ్తున్నావ్. నూర్‌ని కూడా తీసుకుని వెళ్ళు. ఇండియా గేట్, హాజీ దర్గా, ఎలిఫెంటా కేవ్స్ చూసి రండి. స్వామి

కార్యం, స్వకార్యం రెండూ అయిపోతాయి” అన్నాడు రాము.

“అయితే నువ్వు కూడా లూసీని తీసుకుని వచ్చేయ్ మనందరం కలిసి వెళ్లినట్లు ఉంటుంది” అన్నాడు ఇక్బాల్.

“ఇప్పుడు లూసీ ప్రెగ్నెంట్ కదరా..! నేనెలా వస్తాను. పైగా నువ్వు పేరు పెట్టిన బిడ్డ త్వరలో ఈ నేల మీదకు రాబోతుంది. జాగ్రత్తగా చూసుకోవద్దా నేను..!” అన్నాడు.

“అవునవును నా పవిత్రను జాగ్రత్తగా భూమి మీదకు చేర్చాల్సిన బాధ్యత నీదే. నువ్వు ఇక్కడే పవిత్రకు బాడీగార్డ్‌లా ఉండాలి”

“ఉంటా కాని…నువ్వు మాత్రం నీ ఫ్యామిలీతోనే వెళ్లాలి. వెళ్తున్నావ్. నేను టిక్కెట్లు బుక్ చేయించేస్తున్నాను” అంటూ రాము ఇంటర్ కమ్‌లో తన మేనేజర్‌కి టిక్కెట్లు బుక్ చేయమని చెప్పాడు.

“స్నేహం ఎంత గొప్పదో, తన స్నేహితుడు అంతకంటే గొప్పవాడు. ఏదైనా కొత్తలో బాగుంటుంది. పాతదైన కొద్దీ విరక్తి కలుగుతుంది. స్నేహం మాత్రం పాతదైన కొద్దీ ఎంతో బాగుంటుంది” రాము, ఇక్బాల్ విషయంలో ఇది నిజమనే విషయం అర్థమవుతుంది.

బొంబాయి సాయంత్రం ట్రైన్‌కి వెళ్లాలి. అందుకే లగేజ్ అంతా సర్దుకుని ఇక్బాల్, నూర్ రాము ఇంటికి వెళ్లారు. అక్కడే నలుగురు భోజనాలు చేసి కాసేపు కబుర్లు చెప్పుకుని స్టేషన్‌కి బయలుదేరారు. ఇన్ టైమ్ కే చేరుకున్నారు స్టేషన్‌కి. ట్రైన్ బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. ట్రైన్ ఎక్కేసిన తర్వాత నూర్, లూసీలు ఓ పక్కగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

“ఇక్బాల్ ఎంతో మంచివాడని అలాంటి భర్త దొరకడం తన అదృష్టమని, రాము అంటే ఇక్బాల్‌కి ఎంతో ఇష్టమని, ఇంట్లో కూడా రాము, మీ గురించే ఎప్పుడూ చెప్తుంటారని” నూర్ చెప్పింది. ఇద్దరూ కాసేపు ముచ్చట్లు, నవ్వులతో గడిపారు.

ఇంతలో ట్రైన్ కదులుతోంది. రాము, లూసీలు ట్రైన్ దిగిపోయి టాటా చెప్పారు వారిద్దరికి. ఒకరికి ఒకరు కనిపించేంత వరకు రెండు జంటలు ఒకరికి ఒకరు చేతులూపుతూనే ఉన్నారు. రాము, లూసీలు ఇంటికి బయలుదేరారు. రాము కాస్త డల్ అయ్యాడు. ఎందుకో మనసులో ఏదో బాధగా అనిపిస్తోంది.

“రాము ఏం అలా ఉన్నావ్. ఇక్బాల్ వచ్చేస్తాడుగా..! ఎక్కడికి వెళ్లాడు బొంబాయే కదా.. పైగా నూర్ కూడా ఉంది” అని రాముని సముదాయించింది లూసీ.

“అది కాదు లూసీ ఇక్బాల్ వెళ్లడం గురించి కాదు కాని ఏదో మనసు పీకుతున్నట్లు ఉంది” అన్నాడు రాము ఏదో తెలియని బాధతో. ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు. రాముకి మాత్రం ఆ రాత్రి ఎందుకో సరిగా నిద్ర పట్టలేదు.

* * * * *

లూసీ తన పీహెచ్‌డీ క్లాస్‌కి వెళ్లింది. ఆ రోజు కమ్యూనికేషన్ క్లాస్ చెప్పడం కోసం పాపులర్ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ వచ్చారు. యండమూరి రావడంతో స్టూడెంట్స్‌లో ఉత్సాహం పెరిగింది. అంతా ఏం చెప్తారా అని ఆసక్తిగా చూస్తున్నారు.

యండమూరి చెప్పడం ప్రారంభించారు.

"సైకాలజీ, కమ్యూనికేషన్ ఒకదానితో ఒకటి విడదీయలేనివి. ఈ రెండు భార్యభర్తల్లాంటివి. ఏ ఒకటి సరిగా లేకపోయిన రెండో దానికి ఇబ్బందులే. తమ ఆలోచనలను సరిగా చెప్పలేకపోవడం, లేదా అర్థం చేసుకోలేకపోవడం వలన అనేక సమస్యలు వస్తాయి" అంటూ  క్లాస్ మొదలుపెట్టారు.

"సరిగా కమ్యూనికేట్ చేయలేకపోవడం వలన, లేదా కమ్యూనికేషన్‌ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం వలన అనర్థాలు జరుగుతాయి.అపార్థాలు పెరుగుతాయి. దానికి ఉదాహరణ కోసం కొత్త దంపతుల మధ్య జరిగిన సంఘటన చెప్తాను వినండి" అంటూ విద్యార్థులందరి వైపు చూసి చెప్పడం ప్రారంభించారు.

ఆఫీసు నుంచి ఎంతో హుషారుగా వచ్చిన భర్త, భార్య ఎక్కడుందా అని ఇల్లంతా వెదుకుతున్నాడు. సోఫాలో కూర్చుని పుస్తకం చదువుతున్న భార్య దగ్గరకు వెళ్ళి తాను తెచ్చిన మల్లిపువ్వులను ఇస్తూ...."ఇందులోని చివరి పువ్వు వాడిపోయేంత వరకూ నిన్ను ప్రేమిస్తూనే ఉంటాను" అన్నాడు రొమాంటిక్‌గా.

"ఒక గంటలో వాడిపోయే పువ్వులిచ్చి, వాడిపోయేంత వరకు ప్రేమిస్తానంటావా" అని ఆ పువ్వుల్ని ఓ మూలకి విసిరికొట్టి అక్కడ నుంచి వెళ్లిపోయింది.

ఆ మరుసటి రోజు ఇల్లు శుభ్రం చేసిన పనిమనిషి "అమ్మగారు ఇల్లు తుడుస్తూంటే ఈ పువ్వులు దొరికాయమ్మా. ఇందులో ఒక వెండి మల్లిపువ్వు ఉందమ్మా" అని చెప్పింది.

తన భర్తని ఎంత అపార్థం చేసుకుందో అప్పుడర్థమైంది ఆమెకి.

అలాగే పువ్వుల్లో ఓ వెండి పువ్వు పెట్టి ఇచ్చి, రొమాంటిక్ డైలాగ్ చెప్తే ఏవరైనా ఇలాగే అపార్థం చేసుకుంటారనే విషయం ఆ భర్తకి అర్థం కాలేదు.

భార్య ఆ పువ్వులు చూసిన తర్వాత భర్త డైలాగ్ చెప్పుంటే కరెక్ట్‌గా కమ్యూనికేట్ అయ్యేది. అలాగే భార్య కూడా తన భర్త ఇలా ఎందుకు చెప్పాడు, అసలు ఆ పువ్వుల్లో ఏముందా అని ఒక నిముషం ఆలోచించినా బాగుండేది"  అని చెప్పడం ముగించారు యండమూరి.

"మనిషి జీవిత చక్రం ఇలాగే సాగుతుంది. అయితే మనిషి ప్రతి విషయాన్ని రెండు కోణాల్లో ఆలోచించడం నేర్చుకోవాలి. కాస్త లైఫ్‌కి ఆర్ట్ యాడ్ చేయాలి. అప్పుడే జీవితం సాఫీగా, హాయిగా అనిపిస్తుంది. లేదంటే ప్రతి విషయానికి ఒత్తిడికి గురవుతాం. అయితే అదే మీ సైకాలజిస్టులకు డబ్బులు ఇస్తుందనుకోండి" అంటూ నవ్వేశారు యండమూరి. దీంతో క్లాస్ అంతా ప్రొఫెసర్ నవ్వుతో జత కట్టారు.

ఈ కథను ఇంటికి రాగానే రాముకి చెప్పింది లూసీ.

ఇది విన్న రాము నవ్వి..."మీ క్లాసులు భలేగా సరదాగా సాగుతున్నాయే. బాగుంది...ఎంజాయ్. చెప్పడం మర్చిపోయాను. ఇక్బాల్ బొంబాయి చేరుకున్నాడట. అంతా బాగానే ఉందట. రేపు ఉదయాన్నే ఆఫీసు పని చూసుకుని ఎల్లుండి బయలుదేరేస్తాడట" డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుంటూ చెప్పాడు రాము.

"పనైపోతే అప్పుడే బయలుదేరడం ఎందుకండీ? మరో రెండు రోజులు బొంబాయి అంతా తిరిగిరమ్మని చెప్పండి" అంది లూసీ భోజనం వడ్డిస్తూ.

"అదే చెప్పాను. పని అయిపోయినా రెండు, మూడు రోజులు అక్కడే ఉండి రమ్మన్నాను. లేకపోతే కాళ్లు విరగ్గొడతానని"

"బాగా చెప్పారు. నూర్‌కి ఎంత సరదాగా ఉంటుంది భర్తతో అలా తిరుగుతుంటే"

"మరి అమ్మగారికి అలాంటి కోరికలేమి లేవా" కొంటెంగా అడిగాడు.

"అబ్బో అయ్యగారికి కొత్త ఆశ పుట్టినట్లుంది...వెళ్దాం వెళ్దాం. ఈ బొజ్జలో ఉన్నది భూమి మీద పడనివ్వండి. అప్పుడు ముగ్గురం కలిసి వెళ్దాం"

"మరి ఆ పడటం ఎప్పుడో?"

"రేపు డాక్టర్ దగ్గరకు వెళ్తాం కదా అప్పుడు వాళ్లు చెప్తారు అయ్యగారికి"

* * * * *

మరుసటి రోజు బొంబాయిలో...ఇక్బాల్ తనతో పాటు భార్య నూర్‌ని కూడా తాను వెళ్లాల్సిన ఆఫీసుకి తీసుకుని వెళ్లాడు. అక్కడ మధ్యాహ్నానికి పని పూర్తి చేసుకుని హొటల్ రూంకి చేరుకున్నాడు. అక్కడ నుంచి ఇక్బాల్ రాముకి ఫోన్ చేశాడు. పని పూర్తయ్యిందని...ఆ ప్రాజెక్టు దాదాపు మనకే వస్తుందని చెప్పి, రేపు బయలుదేరి వచ్చేస్తానని అన్నాడు.

"పెళ్లయిన తర్వాత మొదటిసారి వెళ్లారు. రెండు రోజులుండి రండి. అంతకంటే ముందే వచ్చావా నిన్ను చంపి రాజమండ్రి సెంట్రల్ జైలుకి పోతా. అసలే సొంతూరెళ్లి చాలా రోజులైంది. నేను వెళ్దామంటే కుదరడం లేదు. నిన్ను చంపేస్తే పోలీసులే పట్టుకెళ్తారు" అన్నాడు రాము.

ఆ మాటికి ఇక్బాల్ నవ్వుతూ..

'సరేలే ఇక్కడే ఉంటా. అసలు ఇక్కడ ఏం తిరగాలో, ఏం చూడాలో కూడా తెలియదు కదరా నాకు" అన్నాడు ఇక్బాల్ బుర్ర గోక్కుంటూ.

"ఆ హొటల్ వాళ్లని అడుగు చెప్తారు. వాళ్లనే కారు ఎరేంజ్ చేసి చూడాల్సిన ప్రదేశాలు చూపించమను. చూపిస్తారు, సరేనా" సలహా ఇచ్చాడు రాము.

"సరేలే...ఇంతకీ లూసీ ఎలా ఉంది?" అనడిగాడు.

“ఆ బాగుంది...ఇవాళ సాయంత్రం హాస్పటల్‌కి వెళ్లాలి”

“ఆ ఓకే జాగ్రత్త...ఆడపిల్లే కావాలి అని డాక్టర్‌కి చెప్పు” అంటూ “లూసీకి ఫోన్ ఇవ్వూ...నూర్ మాట్లాడుతుందట” అని చెప్పి నూర్‌కి ఫోన్ ఇచ్చాడు.

నూర్ తమ ప్రయాణం, బొంబాయిలో ఇప్పటి వరకు తిరిగిన, చూసిన ప్రదేశాల గురించి చెప్పింది. “నీకు గాజులు తెస్తా... ఇక్కడ చాలా బాగున్నాయి. నిన్న కొనడం కుదరలేదు. రేపు బయటకు వెళ్తే నీకు, పవిత్రకి కూడా కొంటా” అని లూసీకి చెప్పింది నూర్.

అలా ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు.

మరుసటి రోజు...చుట్టు పక్కలున్న టూరిస్ట్ స్పాట్స్ చుట్టి రావడానికి హెూటల్ వాళ్లతో చెప్పి కారు ఎరేంజ్ చేసుకున్నాడు.

**ఆ రోజు 1992, డిసెంబర్ 6వ తేదీ, శుక్రవారం...**

నూర్, ఇక్బాల్ ఉదయాన్నే రెడీ అయిపోయారు. నూర్ బుర్కా ధరించింది. ఇక్బాల్ తలపై టోపీ పెట్టుకుని ట్రెడిషనల్ డ్రెస్ వేసుకున్నాడు. నూర్, ఇక్బాల్ ఇద్దరూ సంప్రదాయ ముస్లిం వేషధారణలో ఉన్నారు. హెూటల్ లోనే టిఫిన్ తినేసి...తాములో మాట్లాడుకున్న కారు విషయాన్ని రిసెప్షన్‌లో చెప్పారు. పది నిమిషాల్లో కారు వచ్చింది. గేట్ వే ఆఫ్ ఇండియాకి వెళ్లారు. ప్రసిద్ధిగాంచిన గేట్ వే ఆఫ్ ఇండియా చూడ్డానికి ఆనందం అనిపించింది ఇక్బాల్ దంపతులకి. గేట్ వే ఆఫ్ ఇండియా బొంబాయిలో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. దీన్ని హిందూ, ముస్లిం శిల్పులు కలిపి నిర్మించారు. ఇక్బాల్, నూర్ అక్కడ ఫొటోలు తీయించుకున్నారు. గేట్ వే ఆఫ్ ఇండియా వద్ద నిల్చుని ఒక ఫోటో తీయించుకోకపోతే బొంబాయి ట్రిప్ వృథాగా భావిస్తారు పర్యాటకులు.

“రాము, లూసీలను కూడా ఇక్కడికి వెళ్లమని చెప్పాలి” అన్నాడు ఇక్బాల్.

“చెప్పడం ఎందుకు, మళ్లీ మనందరం కలిసే వద్దాం” ఉత్సాహంగా చెప్పింది నూర్.

గేట్ వే చూసిన తర్వాత అక్కడి నుంచి 19 కిలో మీటర్లు దూరంలో ఉన్న ఎలిఫెంటా కేవ్స్‌కు వెళ్లారు. ఈ గుహలకు వెళ్లిన ఇక్బాల్, లూసీలు రాతిలో చెక్కిన మందిర సముదాయాలను చూస్తూ అక్కడే చాలా సమయం ఉండిపోయారు. ఇక్కడ శిల్ప సౌందర్యం ఎన్ని సార్లు చూసినా తనివి తీరదు. నూర్ అయితే అక్కడ నుంచి రావడానికి ఇష్టపడలేదు. మనం మళ్లీ తప్పకుండా ఇక్కడకు వద్దాం అని ఇక్బాల్‌తో మాట కూడా తీసుకుంది.

అక్కడ నుంచి మళ్లీ ఇండియా గేట్ దగ్గరకు వచ్చి అక్కడ ఉన్న బడే మియాస్ రెస్టారెంట్‌లో భోజనం చేసి బయలుదేరారు. కారు మండ్వీ జంక్షన్ మీదుగా వెళ్తోంది. అక్కడే మండ్వీలోని ఫేమస్ అయిన మండ్వీ మసీదు చూసిన ఇక్బాల్ కారుని పక్కగా ఆపమన్నాడు. బాగా ట్రాఫిక్ ఉండటంతో మసీదు పక్కనే ఉన్న కార్పొరేషన్ బ్యాంకు దగ్గర కారు ఆపుతానని చెప్పాడు డ్రైవర్. ఆ బ్యాంకు దగ్గర కారుని స్లో చేసి ఓ పక్కగా పార్కు

చేశాడు డ్రైవర్.

నూర్, ఇక్బాల్ ఇద్దరూ మసీదుని చూసొద్దామని అనుకున్నారు.

"భాయ్ సాబ్ నువ్వు కూడా వస్తావా?" అనడిగారు డ్రైవర్ని.

"నేను రాను, కారులోనే ఉంటా భాయ్...మీరు త్వరగా వచ్చేయండి" అన్నాడు డ్రైవర్.

"సరే" అంటూ ఇద్దరూ కారు దిగారు. బాగా రద్దీగా ఉంది ఆ ప్రదేశం. మనుషులు, వాహనాల రాకపోకలతో కిటకిటలాడుతోంది.

"బాగా రద్దీ ప్రాంతంలా ఉందే ఇది?" అనడిగింది నూర్ అక్కడ పరిస్థితిని చూస్తూ...

"అవును. ఇది దక్షిణాసియాకే అతి పెద్ద వ్యాపార కేంద్రం. ఇది తెలుసా?"

"నాకు తెలియదు, కానీ మా ఆయనకు తెలుసు" అంటూ వెటకారమాడింది నూర్. అలా వెళ్తుండగా చిన్న సందు కనిపించింది. జనాల హడావిడి ఎక్కువగా ఉంది. ఆ సందులో గాజుల మార్కెట్ కనిపించింది. గాజుల మార్కెట్ చూడగానే నూర్ అక్కడకు వెళ్దామంది ఇక్బాల్‌తో.

"ఇప్పుడెందుకు హైదరాబాద్‌లో గాజులు దొరకవా?" అన్నాడు కాస్త కోపంగా.

"అది కాదండీ లూసీకి, పవిత్రకి కొంటానని చెప్పాను" అంది నూర్ తలపైకెత్తకుండా.

"అమాయకంగా అడిగిన నూర్ చూస్తూ పద" అంటూ ఆ సందు లోపలికి వెళ్లారిద్దరూ.

నూర్ చాలా సేపట్నుంచి వెతుకుతుంది. అక్కడ చాలా వెరైటీలు, డిజైన్లు ఉన్నాయి కాని ఎందుకో నూర్‌కి నచ్చడం లేదు. అలా రెండు మూడు దుకాణాలు చూసిన తర్వాత ఒక దుకాణంలో ఎరుపు, నారింజ, మట్టి రంగు కలిపినట్టుగా ఉన్న గాజులు నూర్ చాలా బాగా నచ్చాయి. అవి తీసుకుని చేతితో పట్టుకుని ఇక్బాల్‌కి చూపించింది. ఇక్బాల్ సరే అన్నాడు.

ఇంతలో అక్కడేదో పెద్ద పెద్ద అరుపులు వినిపించాయి. వెనక్కి తిరిగి చూస్తే ఓ పెద్ద గుంపు పరుగులు పెడుతూ వస్తోంది. వారిని వెంటాడుతూ మరో గ్రూపు వస్తోంది. ముందు పరిగెత్తుతున్న వారు భయంతో ఉంటే, వారిని వెంటాడుతున్న వారిని చూస్తేనే భయం కలిగేలా ఉన్నారు. కత్తులతో, కర్రలతో ఆవేశంగా ఉన్నారు. భయంతో ఉన్న గుంపు అంతా నుదుటన విభూతి, మెడలో రుద్రాక్షమాలలు లాంటివి ధరించి ఉన్నారు.

ఇక్బాల్, నూర్ ఉన్న చోటకి వచ్చే సరికి అక్కడ సందు బాగా చిన్నదిగా ఉండటం, సందుకు ఒక వైపు దారి మూసేసి ఉండటంతో అక్కడ నుంచి ఎటు వెళ్లే మార్గం లేక అక్కడే ఆగిపోయారు ముందు పరిగెడుతున్న గుంపు. రొంపుతూ, భయపడుతూ ఎటు వెళ్లాలో తెలియక అటు ఇటూ చూస్తూ, ఇక్బాల్ వెనక్కి కొందరు, నూర్ వెనక్కి కొందరు వచ్చారు. తమని కాపాడంటూ వారిని రక్షగా చేసుకుని, తమపై దాడికి వస్తున్న వారివైపు దీనంగా చూస్తూ తమనేమి చెయ్యవద్దంటూ ప్రాధేయపడుతున్నారు.

ఏం జరుగుతుందో ఇక్బాల్‌కి కూడా అర్థం కాలేదు. నూర్ అయితే దాదాపు ప్రాణాలు

పోయాయనే అనుకుని వణికిపోతోంది.

అయితే నుదుట విభూది దిద్దుకున్న గుంపు వైపు కర్రలు, కత్తులతో వచ్చిన మరో గ్రూపు ఇక్బాల్, నూర్‌లను చూసి...అక్కడ నుంచి తప్పుకోమని పెద్దగా అరుస్తూ మరింత ముందుకి వచ్చారు. ఇక్బాల్, నూర్‌లను పక్కకి తప్పుకోమని బలవంతంగా తోసేశారు. విభూతి పెట్టుకున్న వారి దగ్గరకు వచ్చి...

"ఏరా మా దేవుడు ఉండే చోటునే కూల్చేస్తారా..? మిమ్మల్ని వదలంరా..." అంటూ పెద్దగా అరుస్తూ వారి మీదకు కత్తులు, కర్రలతో దాడి చేయడం మొదలుపెట్టారు. ఉన్మాదంతో రెచ్చిపోయారు. ఇష్టానుసారం కత్తులతో, కర్రలతో దాడి చేస్తూనే ఉన్నారు. మాకేమి తెలియదు, వదిలేయండి అని ఎంత బతిమాలినా వదల్లేదు. దాడిలో దుకాణాల్లోని గాజులన్ని కింద పడి చెల్లాచెదురైపోయాయి. వాటిపై తోసేసి ఎలాంటి ఎటువంటి విచక్షణ లేకుండా వీరిని చంపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎవరు ఎవర్ని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. చేసే పరిస్థితి కూడా లేదక్కడ. వాళ్ల కోపం, ఆవేశం చూస్తే కనీసం మాట్లాడటానికి కూడా భయమేస్తుంది. ఆ దాడిలో మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

నూర్, ఇక్బాల్‌ని మాత్రం ఏమి అనలేదు. వారిద్దరూ ఆ షాక్ నుంచి తేరుకుని మెల్లగా మరోవైపు వెళ్లిపోయారు. అక్కడ ఓ గట్టు మీద కూలబడిపోయారు.

"అంతమందిని చంపేసిన వాళ్లు...మనిద్దరినీ ఏమి అనలేదు ఎందుకండీ?" వణుకుతున్న స్వరంతో అడిగింది నూర్.

"మనిద్దరి వేషధారణ చూస్తే వాళ్లకి మనమెవరో తెలిసింది. అందుకే మనల్ని ఏం చేయలేదు" అని సమాధానం చెప్పాడు.

"అవునా...మరి పాపం వాళ్లని అనవసరంగా చంపేశారు కదండి. వాళ్లని మాత్రం ఎందుకు అలా చేశారండీ?" అంటూ ఒక్కొక్క మాట వత్తి పలికి అడుగుతోంది. నూర్ చేతిలోని పుట్టబోయే పసిపాప కోసం కొన్న గాజులు రక్తంతో తడుస్తున్నాయి. నూర్ ఆ గాజులని మాత్రం విడిచి పెట్టలేదు.

"నూర్ పద పద ఇక్కడుంటే ప్రమాదం...వెంటనే మనం బయలుదేరుదాం" అని అన్నాడు. ఇద్దరూ మళ్లీ వెనక్కి వచ్చే ప్రయత్నం చేస్తూ భయంభయంగా అడుగులేసుకుంటూ వస్తున్నారు. అక్కడ గాజు ముక్కలని పక్కకు తోస్తున్న ఓ 50 ఏళ్ల పెద్దాయన్ని ఇక్బాల్ అడిగాడు.

"అసలేం జరిగింది. ఎందుకు ఇలా చేస్తున్నారు?"

"ఎక్కడో మసీదుని కూల్చేశారట..! దాంతో మీరే కూల్చేశారని హిందువులను ముస్లింలు, అక్కడే మా రాముడి గుడి ఉండేది, దాని మీదే మీరు మసీదు కట్టారంటూ ముస్లింలపై హిందువులు ఒకరిపై ఒకరు ఇలా...నా షాపుని నాశనం చేసినట్లు దేశాన్ని నాశనం చేస్తున్నారు" అంటూ ముక్కలైన తన దుకాణాన్ని చూస్తూ చెప్పాడు ఆ వృద్ధుడు.

ఇక్బాల్‌కి అర్థమైంది.

నూర్ కి మాత్రం విషయం అర్థం కాలేదు.

వెంటనే నూర్ చేతిని పట్టుకుని మరింత వేగం పెంచి నడవడం ప్రారంభించాడు. ఇలా నాలుగడుగులు వేశారో లేదో...కాషాయి వస్త్రాలు ధరించిన మరో గుంపు వచ్చి..."ఇక్కడేనా జరిగింది...ఎవరు చేశారంటూ..!" పెద్ద పెద్దగా అరుస్తున్నారు. అక్కడున్న నూర్, ఇక్బాల్‌ని చూసి ఆ గుంపులో ఒకడు "చూడండీ...ఇక్కడే ఉన్నారు పట్టుకోండి, చంపండంటూ" ఒకడు పెద్దగా అరిచాడు.

ఆ అరుపు విన్న మిగతా వారు చేతికి దొరికిన వస్తువులతో ఇక్బాల్, నూర్ వైపు వేగం వస్తున్నారు. ఇక్బాల్ నూర్ పరిగెత్తే ప్రయత్నం చేశారు. కాని పరిగెత్తలేక రెండు అడుగులు వేసే సరికి కిందపడ్డారు.అంతే వారి మీదకు కర్రలతో, కత్తులతో దూకిన కొందరు విచక్షణారహితంగా ఏం చేస్తున్నారో కూడా తెలియని ఉన్మాద స్థితిలో దాడి చేశారు.

"మమ్మల్ని వదిలేయండి, వదిలేయండి ప్లీజ్" అంటూ ఎంత బతిమాలినా వాళ్లు వదలలేదు. చూస్తున్న వాళ్లు కాపాడే ప్రయత్నమూ చేయలేదు. కొడుతున్న వాళ్లు అలా కొడుతూనే ఉన్నారు. పీక మీద కాలేసి తొక్కారు. "మా దేవడంటే మీకు లెక్క లేదురా..." అంటూ రక్తాలు కారుతున్నా కొట్టడం ఆపలేదు. కొందరికి కోపం తిరక కత్తితో పొడిచారు. ఆ పోట్లుకి నూర్, ఇక్బాల్ అరవకుండా, అరుపులు బయటకు వినిపించకుండా ఇద్దరి నోర్లూ మూసేశారు. ఆ బాధని తట్టుకోలేక పోతున్నారిద్దరూ.

"ఓరేయ్...ఇక్కడ కొందరున్నారు ఇటు రండి" అంటూ ఇంకోవైపు నుంచి మరో కేక వినిపించింది. దాంతో కొడుతున్న వాళ్లు, ఇక్బాల్ జంటని వదిలేసి ఆ వైపు వెళ్లిపోయారు. వెళ్తూ వెళ్తూ ఇద్దర్ని కాళ్లతో తన్ని, కత్తులతో మరో రెండు పోట్లు పొడిచి మరి వెళ్లిపోయారు.

ఇక్బాల్, నూర్లకు అర్థమైంది. ఇక తాము బతకమని.

"ఇందాక వాళ్లు మనల్ని ఏం అనలేదు కదండి...ఇప్పుడు వీళ్లెందుకు మనల్నే చంపాలని చూశారు?" అని అడిగింది నూర్.

"మనిద్దరి వేషధారణ చూస్తే వీళ్లకి మనమెవరో తెలిసింది" అని ఇందాక చెప్పిన సమాధానమే మళ్లీ చెప్పాడు.

అల్లరి మూకలు వెళ్లిపోయిన తర్వాత పక్కనున్న కొందరు వచ్చి వీరిని పక్కకు తీసుకెళ్లి సపర్యలు చేస్తున్నారు. ఆ సమయంలో ఇక్బాల్ తన జేబులోని విజిటింగ్ కార్డు వాళ్లకి ఇచ్చాడు. అది రషీద్ ప్రసాద్ కనస్ట్రక్షన్ కంపెనీది. కాసేపు వీళ్లిద్దరికి సేవలు చేసినా, వారి ప్రయత్నాలు ఫలించలేదు. ఇద్దరూ ప్రాణాలు విడిచారు. నూర్ చేతిలోని గాజులు బిగిసిన పిడికిలిలో ముక్కలైపోయాయి.

* * * * *

హైదరాబాద్‌లో రాము, లూసీ ఇద్దరూ బాబ్రీ మసీదు అల్లర్లపై వస్తున్న వార్తలను చూస్తుండగా ఫోన్ మోగింది.

లూసీ ఫోన్ తీసింది. "హిందీలో మాట్లాడుతున్నారు, మీరే మాట్లాడండి" అంటూ రాముకి ఫోన్ ఇచ్చేసింది.

ఫోన్ అదుకున్న రాము..."హలో కౌన్ హే జీ?" అంటూ అడిగాడు.

అవతల వ్యక్తి "మే బొంబాయిసే బాత్ కర్ రహాహూ..."అంటూ చెప్పడం ప్రారంభించాడు. అంతా విన్న రాము ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అలా పడిపోయిన రాముని చూడగానే లూసీ కంగారు పడిపోయింది. లూసీకి ఏం చేయాలో తోచడం లేదు. బొంబాయి నుంచి ఫోన్ వచ్చిందనే విషయం అర్థమైంది. ఏం జరిగిందో తెలియడం లేదు. రాము ముఖంపై నీళ్లు చల్లింది. కొద్దిసేపటికి తేరుకున్న రాము ఈ లోకంతో సంబంధం లేని వాడిలా దిక్కులు చూస్తున్నాడు.

"ఏమైందండి?" అంటూ రాముని పట్టుకుని గట్టిగా ఊపుతూ అడుగుతోంది లూసీ.

రాము ఏం చెప్పలేక శవంలా లూసీ వైపు చూస్తూ ఉండిపోయాడు. చాలా సేపటి తర్వాత తేరుకున్న రాము. లూసీ, లూసీ అంటూ కన్నీళ్లు పెట్టుకుంటూ "ఇక్బాల్, నూర్..." అంటూ ఏడుస్తూనే ఉన్నాడు. లూసీ మనసు కీడు శంకించింది.

అంతలో టీవీలో అయోధ్య అల్లర్లు అటు ఢిల్లీ, ఇటు బొంబాయిలకూ పాకాయనే వార్త వస్తోంది. ఆ అల్లర్లలో పదుల సంఖ్యలో చనిపోయారని కూడా చెబుతున్నారు.

లూసీకి విషయం అర్థమైంది. కొద్దిసేపటికే ఈ విషయం రాము, లూసీ సర్కిల్స్‌లో అందరికి తెలిసింది. రాము మేనేజర్ ఇంటికి వచ్చాడు. రాము ఇంట్లోని ల్యాండ్‌లైన్‌కి వరుసగా ఫోన్లు వస్తూనే ఉన్నాయి. మేనేజర్ ఫోన్ చేసిన వాళ్లందరికి ఈ విషాద వార్తని చెప్తున్నాడు. ఇక్బాల్, నూర్ ఫ్యామిలీతో పాటు రషీద్, అండ్రియాకు ఈ దుర్వార్తని చెప్పాడు.

మరుసటి రోజు రాము, మేనేజర్ బొంబాయి వెళ్లి ఇక్బాల్, నూర్ మృతదేహాల్ని రాజమండ్రి తీసుకొచ్చారు. వాటిని గుర్తు పట్టడమే కష్టంగా ఉంది. రాముని ఓదార్చడం ఎవరికీ సాధ్యం కావడం లేదు.

ఇక్బాల్ శవయాత్ర జరుగుతోంది. శవాన్ని చూడడానికే భయపడిపోయే ఇక్బాల్ ఇప్పుడు శవంగా మారిపోయాడు. ఏ దారిలో అయితే ఒకప్పుడు శవయాత్రని చూసేందుకు భయపడ్డాడో ఆ దారిలోనే ప్రశాంతంగా పయనం చేస్తున్నాడు ఇక్బాల్. శవయాత్రంటే రేపు మనం వెళ్లే దారేరా అని ఇక్బాల్‌తో చెప్పిన రాముకి ఈసారెందుకో శవాన్ని చూడాలంటేనే భయంగా ఉంది. ఆ "రేపు" ఇక్బాల్‌కి ఇంత తొందరగా వస్తుందని అనుకోలేదు. ఇక్బాల్ తనని ఒంటరి వాడ్ని చేసి వెళ్లిపోవడంతో రాముకి సగం ప్రాణాలు పోయినట్లయింది.

మృత్యువు ఎప్పుడూ తన వారితోనే స్నేహం చేస్తుందా అని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు రాము.

# 9

**చావు,** పుట్టుకలు...ప్రశ్న, సమాధానాలు లాంటివి.

పుట్టుక ఒక ప్రశ్న లాంటిది. ఎవరూ సమాధానం చెప్పరు.

చావు ఒక సమాధానం లాంటిది. ఎవ్వరూ ప్రశ్నించలేరు.

ఈ విషాదం నుంచి బయటపడటానికి రాము, లూసీలకు మూడు నెలల సమయం పట్టింది. రాము అయితే ఈ ఇక్బాల్ మరణానికి తానే కారకుడనే భావనతో అసలు తేరుకోలేకపోతున్నాడు. ఇక్బాల్ వచ్చేస్తానంటే తానే బొంబాయి అంతా తిరిగి రా అంటూ బలవంతంగా ఉంచేశాడు. ఇక్బాల్ పట్ల నేనే యముడిగా మారాను అనుకుంటూ తనలో తాను కుమిలిపోని క్షణం లేదు. ఆ భావన రాముని స్థిమితంగా ఉండనివ్వడంలేదు.

మరో వైపు లూసీ డెలివరీకి టైమ్ దగ్గరపడుతోంది. అండ్రియా, వహీదాలు హైదరాబాద్ వచ్చారు. మంచి హాస్పటల్స్ ఉంటాయని వారే ఇక్కడకి వచ్చారు. లూసీతో పాటు రాముకి కూడా వాళ్లే తోడయ్యారు.

లూసీ డెలవరీ సజావుగా సాగింది. చక్కని చుక్కలాంటి ఆడపిల్ల పుట్టింది. ఆడపిల్ల పుట్టిందని డెలివరీ వార్డులోని నర్స్ చెప్పగానే రాముకి ఇక్బాలే గుర్తొచ్చాడు. కన్నీళ్లాగలేదు. రాముతో పాటు అక్కడున్న అందరికి ఇక్బాల్, నూర్జహాన్ గుర్తొచ్చి...కన్నీళ్లు పెట్టుకున్నారు.

మొత్తానికి నువ్వే గెలిచావురా ఇక్బాల్, ఆడపిల్లే పుట్టింది. నువ్వన్న పవిత్రే పుట్టింది అనుకున్నాడు. అప్పుడే ఆ పసిదాన్ని “పవిత్ర పవిత్ర” అని పిలుస్తుంటే ఆ వార్డులోని నర్సులు, వార్డు బాయ్స్ వింతగా చూస్తున్నారు.

“ఏమ్మా అప్పుడే పేరు పెట్టేశారా?” అని అడిగారు.

“అప్పుడే కాదు, ఎప్పుడో మా ఇక్బాల్ పెట్టేశాడు” అన్నారంతా.

“మరి ఆయనేరి?” అనడిగింది ఓ నర్స్.

“అక్కడున్నాడంటూ” రషీద్ పైకి చూపించాడు.

“ఇదిగో ఇక్కడున్నాడంటూ” లూసీ పవిత్రని చూపించింది.

ఒక వైపు పవిత్ర జననం ఆనందాన్ని, మరోవైపు ఇక్బాల్ మరణం దుఖాన్ని కలిగిస్తున్నాయి వారికి. దుఖాన్నైనా భరించగలం. సంతోషాన్నైనా అనుభవించగలం. దు:ఖం, సంతోషం ఒక్కసారే వస్తే భరించడం చాలా కష్టం. అదే పరిస్థితి వారిది.

రోజులు గడుస్తున్నాయి. కాలం అన్ని గాయాలకు సమాధానం చెబుతుంది. కాలానికి

కాస్త టైమ్ ఇస్తే ఆ టైమ్ అన్నింటికి మందుగా మారుతుంది. ఇక్బాల్, నూర్‌ల మరణం మిగిల్చిన కన్నీళ్లు మెల్లగా మెల్లగా జ్ఞాపకాలుగా మారుతున్నాయి.

పవిత్రలో ఇక్బాల్, నూర్లను చూసుకుంటున్నారు. రాము మళ్లీ మెల్లగా వ్యాపారంపై దృష్టి పెట్టాడు. ఇక్బాల్ లేని లోటు రాముకి వ్యాపారంలో కూడా కనిపిస్తోంది. లూసీ రెండు ప్రైవేటు కాలేజీల్లో అవర్లీ బేసెస్ మీద సైకాలజీ క్లాసులు చెబుతోంది. మిగతా సమయంలో పవిత్రని చూసుకోవడంతో బిజీగా మారిపోయింది. కాల ప్రవాహంలో పవిత్రకి పదేళ్ళు వచ్చాయి.

పవిత్రకి పెరిగి పెద్దదవుతున్న కొద్దీ అంతరిక్షం, విశ్వంపై మరింత ఆసక్తి పెంచుకుంది. దేవుడు అంటే ఎవరు? ఎక్కడుంటాడు? అసలు ఎందుకు కనిపించడు? మనం ఫోటోల్లో, దేవాలయాల్లో, క్యాలెండర్‌లో కనిపించేది దేవుడు కదా..! మరి దేవుడు ఎలా ఉంటాడు? ఎలాంటి డ్రెస్ వేసుకుంటాడు? అసలు దేవుడు కనిపిస్తాడా? ఇలాంటి అనేక ప్రశ్నలు పవిత్రని రోజూ వెంటాడుతూనే ఉన్నాయి.

పవిత్రకి రషీద్ తాతయ్య అంటే అమితమైన ఇష్టం. రషీద్ పవిత్ర అడిగే అన్ని ప్రశ్నలకు ఓపికగా సమాధానం చెప్తుంటాడు. రాజమండ్రి వెళ్లినా, రషీద్ ఇక్కడికి వచ్చిన పవిత్ర రషీద్‌తోనే టైమంతా స్పెండ్ చేస్తుంది. ఒకరోజు...

“తాతయ్యా...దేవుడంటే ఎవరు?” అని పవిత్ర రషీద్‌ని అడిగింది.

“దేవుడంటే మనందరికి పెద్ద తాతయ్య లాంటివాడు. అందర్ని ఆకాశం పై నుంచి చూస్తుంటాడు” అని చెప్పాడు.

“ఆకాశంలో దేవుడు లేడని డాడీ చెప్పాడు మరి” పవిత్ర అడిగింది అనుమానంగా.

“అబ్బో అలా చెప్పాడా..! ఆకాశంలో ఉండడు. అక్కడి నుంచి చూసి, దేవుడు ఇల్లు వేరే చోట ఉంటుంది అక్కడికి వెళ్లిపోతాడు”

“దేవుడు ఇల్లు ఎక్కడుంటుంది?”

“దేవుడు ఇల్లు ఎక్కడో ఎవరికీ తెలియదు. ఎవరికీ చెప్పడు”

“ఎందుకు తెలీదు? ఎందుకు చెప్పకూడదు మనకి?” అనడిగింది మళ్లీ.

“చెప్తే అందరూ దేవుడింటికి వెళ్లిపోయి అది ఇవ్వు, ఇది ఇవ్వు అని అడిగి దేవుడికి రెస్ట్ లేకుండా చేస్తారు కదా అందుకే దేవుడు మనకి చెప్పడు”

“దేవుడు ఎప్పుడూ రెస్ట్‌లోనే ఉంటాడు కదా...రెస్ట్ లేదు అని అంటున్నావ్ ఏంటి తాతయ్యా?” అని డౌట్‌గా అడిగింది పవిత్ర.

“దేవుడు రెస్ట్‌లో ఎప్పుడుంటాడమ్మా?” అనడిగాడు రషీద్ ఆశ్చర్యంగా చూస్తూ...

“ఏ గుడిలో చూసిన కదలకుండా ఉంటాడు కదా, మరి అది రెస్టింగ్ పొజిషన్ కదా.

కదలనిది ఏదైనా రెస్ట్‌లో ఉన్నట్లే అని మాకు ఫిజిక్స్ టీచర్ చెప్పింది. ఇంతకీ దేవుడున్నాడా, లేడా?" తన పాత అనుమానాన్నే మళ్లీ అడిగింది.

"దేవుడు ఉన్నాడా లేడా అనేది చాలా పెద్ద చిక్కు ప్రశ్న తల్లి. సైన్స్ ప్రకారం చూస్తే దేవుడి ఉనికి ఎక్కడా ఉండదు. అంటే దేవుడు అనే పదం కేవలం మతపరమైన విశ్వాసాలకు సంబంధించినది మాత్రమే. అందుకే సైన్స్ ప్రకారం దేవుడు లేడు. కాని నూటికి తొంబై శాతం మంది తాము చదివిన శాస్త్రం కంటే మతాన్ని, మతపరమైన విశ్వాసాలను ఎక్కువగా నమ్మడం వల్ల "దేవుడు" ఉనికి మానవ సమాజంలో సజీవంగా ఉంది. కాబట్టి దేవుడు ఉన్నాడా? లేడా? అనే ప్రశ్నకు సమాధానం ఏంటంటే మతపరంగా ఉన్నాడు. సైన్స్ ప్రకారం లేడు. కాని విశ్వాన్ని నడిపించే ఓ అదృశ్య శక్తి మాత్రం ఉండే ఉంటుంది" చెప్పాడు రషీద్.

సరిగ్గా అదే సమయంలో వచ్చిన రాము "ఆ శక్తి పేరు కాస్మిక్ ఎనర్జీ (COSMIC ENERGY)" అన్నాడు.

"కాస్మిక్ ఎనర్జీ అంటే ఏంటి డాడీ?" అంటూ రాము దగ్గరకి వచ్చింది పవిత్ర.

"హమ్మయ్య" ఈ ప్రశ్నల వర్షం తనకి తప్పిందని రషీద్ అనుకున్నాడు.

రీసెంట్‌గా ఓ సైన్స్ మ్యాగజైన్‌లో కాస్మిక్ ఎనర్జీ కోసం చదివిన విషయం గుర్తొచ్చి, పవిత్రని తనవ ఒడిలో కూర్చోబెట్టుకుని చెప్పడం ప్రారంభించాడు.

"కాస్మిక్ అంటే విశ్వం అని అర్థం. విశ్వాన్ని కాస్మోస్(COSMOS)అని కూడా అంటారు. విశ్వానికి సంబంధించిన విజ్ఞానాన్ని కాస్మోలజీ అంటారు. ఎనర్జీ అంటే శక్తి. మనం పుట్టినప్పుడు ప్రాణం ఎక్కడ నుంచి వస్తుందో ఎవ్వరికీ తెలియదు. చనిపోయినప్పుడు ప్రాణం పోతుంది. ఆ పోయిన ప్రాణం ఎక్కడికి పోతుందో కూడా తెలియదు. ఆ విషయాలను ఇప్పటి వరకు ఎవ్వరూ కనుక్కోలేకపోయారు. ప్రాణం రావడానికి, పోవడానికి ఏదో ఒక కారణం ఉండాలి. ఆ కారణమే దేవుడని చాలా మంది అంటారు. మరి అలాంటి దేవుడు కనిపించడం లేదు కదా. మరి కనిపించని దానికి దేవుడని ఎందుకు పేరు అని కొందరు వాదిస్తారు. ఈ నేపథ్యంలో దేవుడు ఉన్నాడని, లేడని కాకుండా, ఎవరికీ అందని, అర్థం కాని శక్తి ఒకటుందనే వాదన వచ్చింది. ఆ శక్తి పేరే కాస్మిక్ ఎనర్జీ అంటున్నారు" అని చెప్పాడు.

అంతా విన్న పవిత్రకి ఇంతకు ముందుకంటే తనకున్న అనుమానాలకు సంబంధించి కాస్త క్లారిటీ వచ్చింది.

తెలియని విషయానికి సమాధానం దొరకనంత వరకు అది బ్రహ్మ పదార్థమే. అదే బ్రహ్మ పదార్థం గురించే తెలుసుకోవాల్సి వస్తే అది ఎప్పటికీ ప్రశ్నగానే ఉండిపోతుంది. ఆ ప్రశ్నకి సమాధానం కనుక్కోవాలనే పవిత్ర ఆలోచనలు ఆమెతోపాటు పెరుగుతూనే ఉన్నాయి. అసలు దేవుడే కనిపిస్తే బాగుణ్ణు ఇవన్నీ అడిగేయొచ్చు అని పవిత్ర అనుకోని క్షణం లేదు.

# 10

**హాలీడేస్** తర్వాత పవిత్ర ప్రాక్టీకల్ ఎగ్జామ్‌కి అటెండ్ అయ్యింది. పవిత్ర క్లాస్‌మేట్, తెలుగోడైన నవీన్ కూడా అదే బ్యాచ్‌లో ప్రాక్టికల్‌కి వచ్చాడు. ఇద్దరూ ఒకరిని ఒకరు పలకరించుకున్నారు.

“మళ్లీ ఊరు ఎప్పుడు వెళ్తున్నావ్, అసలు వెళ్తున్నావా లేదా?” నవీన్ అడిగాడు.

“ఎందుకు వెళ్లను ప్రాక్టికల్స్ అవ్వగానే బయలుదేరుతాను. మరి నువ్వు?” అడిగింది లూసీ.

“నేను వెళ్లడం లేదు. ఇక్కడే ఉంటాను”

“అరె...వస్తే బాగుండేది కదా..! ఇద్దరం కలిసి వెళ్లిపోయేవాళ్లం” అడిగింది పవిత్ర.

ఆ మాట నవీన్‌కి ఎక్కడో తగిలింది. “నువ్వొస్తే బాగుండేది” అన్న మాట నవీన్‌ని మెలికలు తిప్పేసింది. కాని ఏం మాట్లాడకుండా చిన్న చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

పవిత్రని నవీన్ చాలా కాలంగా ప్రేమిస్తున్నాడు. కాని ఎప్పుడూ బయటపడలేదు. ఇంకా పవిత్ర ఊరు బయలుదేరడానికి నాలుగు రోజులుంది. ఈలోగా ఏదో ఒకటి చేసి ఐ లవ్ యూ చెప్పాలని ఫిక్స్ అయ్యాడు.

సెకండ్ ప్రాక్టికల్ కూడా పూర్తి చేసి బయటకొచ్చారు. పవిత్రకి నవీన్ ఎందుకో ఇబ్బందిగా కనిపిస్తున్నాడు. “నవీన్ ఆర్ యూ ఓకే?” అనడిగింది.

“ఆ...ఐ యామ్ ఓకే...ఓకే” అని చిన్న షివరింగ్‌తోనే చెప్పాడు.
“దట్స్ ఓకే...యూ ఆర్ సీమ్స్ టూబీ డిఫరెంట్ అందుకే అడిగా..!”

“నోనో...ఐయామ్ యాజ్ యాజువల్...పవిత్ర...ఐ వాంట్ టూ సే సమ్‌థింగ్” అని అతి కష్టం మీద అన్నాడు.

“ఐ లవ్ యూ కాదు కదా...!” అని డైరెక్ట్‌గా అనేసింది.

ఆ మాటకి నవీన్‌కి చెమటలు పట్టాయి. ఏం చెప్పాలో తెలియక నోనో అని అన్నాడు.

“నవీన్ వన్ మినిట్...ల్యాబ్‌లో ఫోన్ మరచిపోయా” అంటూ బ్యాగ్ కోసం వెళ్లింది.

“హమ్మయ్య తప్పించుకున్నా” అని అనుకుంటూ నవీన్ అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

అక్కడే ఉంటే మళ్లీ అడుగుతుంది. అందుకే ఏం చెప్పాలో తెలియక అక్కడ నుంచి పవిత్రకి చెప్పకుండా వచ్చేశాడు.

ఐ లవ్ యూ చెప్పడం అంటే కష్టమే. కాని చెప్పాలి. ఎలా అని తల బద్దలు కొట్టుకుంటున్నాడు నవీన్. తాను ఐ లవ్ యూ చెప్పాడనే విషయం తెలియకూడదు. కాని చెప్పాలి. నవీన్‌కి ఒక ఐడియా వచ్చింది.

ఫైనల్ ప్రాక్టికల్‌కి హాజరయ్యారు. ప్రాక్టికల్ తర్వాత ఇద్దరూ బయటకు వచ్చారు.

"ఇంతకి ఆ రోజు ఏదో చెప్తానని అన్నావ్...ఏంటది...?"

"చెప్దామని అనుకున్నాను. కాని ఇప్పుడు మనసు మార్చుకున్నాను. కాని నీకు తెలుస్తుంది" అంటూ తన జేబులోని ఫోన్ బయటకు తీశాడు.

"ఇదిగో ఇప్పుడు నీ ఫోన్‌కి మెసేజ్ పంపిస్తా. దాన్ని డీ కోడ్ చేస్తే నేను నీకు ఏం చెప్పాలని అనుకున్నానో తెలుస్తుంది" అన్నాడు.

మెసేజ్ అలర్ట్ సౌండ్ వచ్చింది పవిత్ర సెల్ నుంచి. వెంటనే దాన్ని ఓపెన్ చేసి చూసింది. తెలుగులోనే ఉంది, కానీ మెసేజ్ వింతగా ఉంది. అది అర్థం కాని తెలుగు. ఎప్పుడూ చూడని తెలుగు పదాలున్నాయందులో. ఆ పదాలు ఎప్పుడూ విన్నట్లు కూడా లేవు.

ఆ మెసేజ్ ఇలా ఉంది.

**"సనేసెవియాడమ్ ఇచ్ లై బిడిచ్ అల్ స్కార్ డిగ్ ఓ ఐని యుటే ఆమో జిటియేమ్ ఎస్ అగాపా టి యామో"**

"విచ్ లాంగ్వేజ్ ఈజ్ దిస్?" ఆశ్చర్యంగా అడిగింది పవిత్ర.

"అదే కదా నిన్ను డీకోడ్ చేయమంది" అన్నాడు.

"నువ్వు చెప్పాలని అనుకున్నది ఇదేనా? ఎనీ క్లూ?"

"నో క్లూస్...ఫైండ్ ఇట్"

"ఓకే ఐ నీడ్ సమ్ టైమ్...డెఫినెట్‌గా డీ కోడ్ చేస్తా" పవిత్ర కాన్ఫిడెంట్‌గా చెప్పింది.

"నాక్కూడా అదే కావాలి" అన్నాడు.

"ఓకే బై...వి మీట్ ఇన్ సెకండ్ ఇయర్ క్లాసెస్" అంటూ ఇద్దరూ బై చెప్పుకున్నారు.

నవీన్ వెళ్లిపోయాడు కాని...పవిత్ర ఆ మెసేజ్ వైపు చూస్తూనే ఉంది చాలా సేపటి వరకుఏదైనా క్లూ దొరుకుతుందేమోనని. సెల్ ఫోన్ నాలుగు వైపులా తిప్పి చూసింది. అక్షరాలు తిరగబడి కనిపించాయి కాని అసలు ఏమీ అర్థం కాలేదు. పవిత్రకి మాత్రం అర్థమైంది. తానను చెప్పదల్చుకున్న విషయాన్ని నేరుగా కాకుండా కోడ్ లాంగ్వేజ్‌లో పంపించాడంటే, అది డెఫినెట్‌గా లవ్‌కి సంబంధించిన విషయమే అని మాత్రం తెలుస్తోంది. తన మదర్ లూసీకి ఈ మెసేజ్ పంపి, విషయం అంతా చెప్పి డీ కోడ్ చేయమని అడిగింది. రాము, లూసీలు కూడా రకరకాలైన ప్రయత్నాలు చేశారు. కాని కనుక్కోలేకపోయారు.

“సమాధానం తెలియడం లేదు కాని…ఆ మెసేజ్‌కి అర్థం మాత్రం ప్రేమే అని తెలుస్తుంది. ఎందుకంటే ఒక కుర్రాడు, ఒక అమ్మాయికి ఈ టైప్ మెసేజ్ పంపి పరీక్ష పెట్టాడంటే దానర్థం ఏమై ఉంటుంది ప్రేమకి సంబంధించింది కాకుండా” అనుమానం వ్యక్తం చేసింది లూసీ.

“కరెక్టే. సమాధానం లవ్వే అయితే మరి ఆ లవ్‌కి మన సమాధానం ఏంటి?” అన్నాడు.

“ఏముంది పవిత్ర ఏదంటే అదే. మనమెందుకు మధ్యలో దూరడం. మనం మధ్యలో దూరామంటే ఏ రాకెట్‌కో కట్టేసి మనిద్దర్ని అంతరిక్షంలోకి పంపించేస్తుంది. అసలే కాబోయే స్పేస్ సైంటిస్ట్” నవ్వుతూ అంది లూసీ.

ప్రాక్టికల్స్ అయిపోవడంతో పవిత్ర రాజమండ్రి బయలుదేరింది. ఫ్లైట్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కి చేరుకుంది. అక్కడ నుంచి క్యాబ్ ఎక్కి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి చేరుకుంది. ట్రైన్ ఎక్కి, రిజర్వ్ చేసుకున్న విండో సీటులో కూర్చుని బయటకు చూస్తూ అందర్నీ గమినిస్తోంది. ట్రైన్ కదిలింది. ఇంతలో ఎవరో పరుగుపరుగున వచ్చిన ఓ కుర్రాడు కదులుతున్న ట్రైన్‌ని అతి కష్టం మీద క్యాచ్ చేసి ఎక్కాడు. అయాసపడుతూ వచ్చి తన రిజర్వ్‌డ్ సీట్లో కూర్చున్నాడు ఆ యువకుడు. కిటికీలో నుంచి చూస్తున్న పవిత్ర ఇటువైపు తిరిగింది. పవిత్ర చిన్నపాటి అయోమయానికి గురైంది. ఎదురుగా నవీన్, కాని ఎలా వచ్చాడో అర్థం కావడం లేదు.

“హాయ్ పవిత్ర” అంటూ పలకరించాడు నవీన్ అయాసపడుతూ…

“హాయ్…ఏంటి నువ్వేనా? ఏంటి ఇక్కడ, ఇంత సడెన్‌గా?” ఆశ్చర్యంతో అడిగింది పవిత్ర.

“అదే నా మెసేజ్‌ని డీ కోడ్ చేశావా లేదా అని కనుక్కుందామని వచ్చాను” అన్నాడు.

“అది చెప్తా కాని…సొల్లు కబుర్లు ఆపి, నిజం చెప్పు” అడిగింది పవిత్ర.

“ఏం లేదు నేను కూడా ఊరు వెళ్తున్నా” అన్నాడు.

“మరి వెళ్లను అన్నావ్ కదా…”

“అన్నాను కాని నువ్వొస్తే కలిసి వెళ్లేవాళ్లం అని అన్నావ్ కదా…అందుకే ఇలా…”

“అవునా…మరి ఢిల్లీ నుంచే కలిసి రావొచ్చు కదా”

“అక్కడే కలిసే ప్రయత్నం చేశాను. కాని మీ రూం మేట్ నువ్వెక్కే ఫ్లైట్ నేమ్ రాంగ్ చెప్పింది అందుకే మిస్సయ్యా. ట్రైన్ నేమ్, సీటు నెంబర్ రైట్ చెప్పింది అందుకే ఇక్కడే కలిసా” అన్నాడు.

“ఆహా…చాలా కష్టపడ్డావే. సరే…ఏంటి సడెన్‌గా ఊరు మీదకు గాలి మళ్లింది?”

“డిప్లొమాటిక్ ఆన్సరైతే అమ్మ, నాన్నని చూడాలనిపించింది. రియల్ ఆన్సర్ అయితే నీతో జర్నీ చేయాలని అనిపించింది” అన్నాడు.

“తెలుసు…తెలుసు…అర్థమవుతోంది. ఆ డీ కోడ్ మెసేజ్ కూడా ఏదో లవ్ ప్రపోజలే అయ్యింటుందని నా డౌట్”

“ఓ…ట్రై చేయ్…అల్ ది బెస్ట్” అన్నాడు.

నవీన్, పవిత్ర ఉన్న ఆ కూపేలో నవీన్ పక్కనే ఓ కషాయ దుస్తులు ధరించిన సాధువు ఉన్నారు. వీరిద్దరి మాటలు ఆయన గమనిస్తున్నాడు.

“స్వామి ఎక్కడి దాకా?” అనడిగింది పవిత్ర.

“వైజాగ్ వెళ్తున్నానమ్మా…అక్కడ ఓ యాగం ఉంది” సాధువు సమాధానం చెప్పారు.

“అవును స్వామి యాగాలు భగవంతుడి కోసం చేస్తారా? అసలు దేవుడు ఎక్కడుంటాడు? ఎలా ఉంటాడు? యాగాలు భగవంతుడిని చేరుతాయా?” అనడిగింది పవిత్ర.

నవీన్ పవిత్ర వైపు చూశాడు. పవిత్ర ప్రశ్నలడగడం మొదలు పెడితే ఇక ఆపదు. ఆ సంగతి నవీన్‌కి బాగా తెలుసు. అందుకే సాధువు వంక జాలిగా చూశాడు.

సాధువు పవిత్ర వైపు చిరునవ్వుతో చూసి “భగవంతుడు ఎక్కడైనా, ఎలాగైనా ఉంటాడు. యాగాలు దేవుడికి ఏ విధంగానైనా చేరుతాయి” అని సమాధానం చెప్పాడు.

“అదేంటి స్వామి నాకు ఒక రూపం ఉంది. మీకు ఒక రూపం ఉంది. నవీన్‌కి మరో రూపం ఉంది. మీకు అక్కడున్నారు, నేను ఇక్కడున్నాను, అదిగో ఆయనేమో అక్కడున్నారు. అలాగే దేవుడు ఎలా ఉంటాడు? ఎక్కడుంటాడో కూడా తెలియాలి కదా స్వామి” అనడిగింది.

“తెలియాలమ్మా..! కాని తెలుసుకునే వాడేడి. తెలిసినవాడేడి…ఆ ప్రయత్నమే ఇంకా జరుగుతుంది” సమాధానం చెప్పారు సాధువు.

“అవునా..! మరి రోజు పూజించే విగ్రహాలు ఏంటి?జరిపే పూజలు ఎవరికి స్వామి?

“అన్నీ దేవుడి కోసమే”

“మరి దేవుడు ఎవరో తెలియదంటున్నారు. దేవుడి కోసమే అంటున్నారు ఏంటి స్వామి ఈ అయోమయం?

“అయోమయం కాదు తల్లి. దేవుడనే వాడు ఒకడున్నాడు, ఆ దేవుడ్ని వెదికే కొన్ని పద్ధతులే ఇవన్నీ” అన్నారు స్వామి.

“ఏ దేవుడు ఉన్నాడంటున్నారు. మళ్ళీ దేవుడ్ని వెదుకుతున్నామంటున్నారు…అదేలా?

“అవునమ్మా, దేవుడు ఎక్కడుంటాడా అని వెతుకుతున్నాం. కాని దేవుడు ఉన్నాడా, లేదా అని వెదకడం లేదు” చెప్పాడు సాధువు.

“అబ్బా లాజికల్‌గానే చెప్పాడే స్వామి” అనుకుంది పవిత్ర.

“పోని దేవుడంటే ఎవరు స్వామి?” అనడిగింది.

“దేవుడంటే ఒక రూపం ఉన్నవాడు కాదు. దేవుడంటే విశ్వం సమాస్తం. ముస్లింలకు అల్లా, క్రైస్తవులకు ఏసు, హిందువులకి ఈశ్వరుడు ఇలా ఎంతమంది దేవుళు ్లన్నా...దేవుడెవరైనా వారంతా ఒక్క రూపమే. ఆ రూపం శాశ్వతమైంది. ఈ విశ్వం చివరకు ఆ రూపంలోనే లీనమవుతుంది. అదే రూపం నుంచి తిరిగి సృష్టించబడుతుంది” చెప్పాడు సాధువు.

“అయితే మరి ఈ విశ్వం ఎప్పుడంతమవుతుంది? ఎప్పుడు సృష్టించబడుతుంది?”

“ఆ భగవంతుడు ఎప్పుడనుకుంటే అప్పుడే తల్లి”

“అంటే భగవంతుడు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఈ సృష్టిని అంతం చేయగలడా, సృష్టించగలడా స్వామి..?” ఆశ్చర్యంగా అడిగింది.

“ఎందుకు చేయలేడు. అతని సృష్టి, అతని ఇష్టం. దేవుడికి ఏదైనా సాధ్యమే”

“స్వామి మరి చాలా మంది అసలు దేవుడే లేడు అంటుంటారు కదా. ఉంటే ఏడి అని కూడా ప్రశ్నిస్తుంటారు” మరి వారి సంగతేంటి?

“ఈ విశ్వంలో మనకి కనిపించనవి చాలా ఉన్నాయి. అందులో దేవుడు కూడా ఒకడు. కనిపించడం లేదు కాబట్టి దేవుడే లేడు అనే వాళ్లు కూడా ఉన్నారు. అది నాస్తికత్వం. అది ఒక మతమే. అయితే ఆ మతంలో అన్ని సైన్స్‌కి నిలవాల్సి వస్తుంది. నమ్మకాలతో కాకుండా నిరూపణలతోనే ఆ మతస్థులకు పని.” చెప్పాడు సాధువు.

ఇంతలో వరంగల్ స్టేషన్ వచ్చింది. నవీన్ కిందకి వెళ్లి రెండు వాటర్ బాటిల్స్, రెండు బిస్కెట్ ప్యాకెట్లు తెచ్చాడు.

“మరి స్వామి ఇన్ని మతాల్లో ఏ మతం గొప్పది? ఏ మతం మంచిది?” అడిగింది పవిత్ర.

“చూడమ్మా...మేమైనా, ఇస్లాం, క్రిస్టియన్, అసలు ఏ గురువులైన ఒక మతం ద్వారా ప్రజలకు మంచి జరగాలని కోరుకునే వాళ్లమే కానీ...మా మతమే గొప్పది అని చెప్పం. ఏ మతంలో మంచి ఉన్నా అది ఇతర మతాల వాళ్ళు అనుసరించాలి. ఆ మంచి ప్రజలందరికీ చేరాలి. అదే మా లక్ష్యం. మనం ఇప్పుడు రైల్లో ప్రయాణం చేస్తున్నామంటే ఇది మనకి అందుబాటులో ఉంది కాబట్టి దీన్లో ప్రయాణం చేస్తున్నాం. అంతే కాని బస్సులు, విమానాలు అంటే మనకి ఇష్టం లేదని  కాదు కదా..! మతం కూడా అంతే మనకి అందుబాటులో ఉన్న దాన్ని, మనకి అనుకూలంగా ఉన్న దాన్ని అనుసరిస్తాం. అది ఏ మతమైనా, ఏ మతస్థులైనా అంతే. హిందూ ముస్లింలే కాదు క్రిస్టియన్లతో సహా అన్ని మతస్థులు భాయిా భాయిాలే” అంటూ చెప్పడం ముగించాడు సాధువు.

స్వామిజీ, నవీన్, పవిత్రల డిస్కషన్ చాలా ఆసక్తికరంగా ఉండటంతో కూపీలోని వారంతా వీరికి దగ్గరగా జరిగి మరి వారి మాటలు వింటున్నారు. రైలు వేగంగా వెళ్తుండగా కిటికీలోంచి ఒకావిడ ఏదో ఆలయాన్ని చూసి నమస్కరించింది.

అది చూసిన మరొకాయన “ఏ గుడి అది?” అనడిగాడు.

"తెలియదండీ..! ఏదో గుడిలాగా ఉంటే నమస్కరించాను అంతే" చెప్పింది ఆమె.

"అవునా..! ఒక వేళ అది గుడికాకపోతే..?" అనడిగాడు ఏ దేవుడని ప్రశ్నించిన వ్యక్తి ఆసక్తిగా చూస్తూ...

"గుడి కాకపోతే చర్చ్. ఏమైంది? ఏదైనా దేవుడే కదా..!" ఆమె సమాధానమిచ్చింది.

ఆ మాటకు సాధువు ఆమెను ప్రశంసాపూర్వకంగా చూశాడు. పవిత్ర వైపు తిరిగి "చూశావా ఆవిడకు ఏ దేవుడైనా పర్వాలేదు. కాకపోతే ఏదో ఒక దేవుడైతే చాలు. ఆ దేవుడు తమకి కష్టకాలంలో అండగా ఉంటే చాలు అని కోరుకుంది అంతే. ఇది ఎంత మంచి నమ్మకం. ఇలాంటి నమ్మకాలు ఎంత బాగా వ్యాప్తి చెందితే మన సమాజానికి, మన జాతికి, మతాలకు అంత మంచిది" అన్నాడు సాధువు.

"మా తాతయ్య రషీద్ కూడా ఇలాగే ఆలోచిస్తారు స్వామి" అంటూ రాము, రషీద్‌ల మధ్య జరిగిన ఒక సంఘటనను చెప్పింది పవిత్ర.

ఒక రోజు రాము రషీద్ దగ్గరకు వచ్చి..."నాన్న మా ఫ్రెండ్స్ వాళ్ల ఫ్యామిలీలోని కొందరు పెద్ద వారు మక్కా వెళ్తున్నారు. మీరూ, అమ్మా కూడా వెళ్తారా?" అని అడిగాడు.

"బాగా ఖర్చవుతుంది కదరా..!" అన్నాడు రషీద్.

"ఖర్చుదేముంది నాన్న మీరు వెళ్లండి" అన్నాడు.

"నువ్వు ఖర్చు పెట్టలేవని కాదురా...మన దగ్గర డబ్బుంది వెళ్లగలం. మరి డబ్బులేని వాళ్ల పరిస్థితి ఏంటి? అందుకే దేవుడు ఎక్కడ పుట్టినా...ప్రతిచోటా తనని చూసుకునేందుకే వీధి వీధినా గుళ్లు, గోపురాలు, మందిరాలు, మసీదులు, చర్చిలు ఉంటాయి. దేవుడి కోసం ఎక్కడికో వెళ్లడం ఎందుకురా. ఎక్కడైనా ఉంటాడు కదా ఆ అల్లా.

హిందువులు కాశికి, ముస్లింలు మక్కాకి, క్రిస్టియన్లు వాటికన్ సిటీకి జీవితంలో ఒక్కసారైనా వెళ్లాలని అనుకుంటారు. మనం ఎక్కడో మక్కాకి దూరంగా ఉన్నాం కాబట్టి మక్కా మనకి జీవితాశయం. మరి మక్కాలోనే ఉండే వాళ్లకి మన ఊరులోని మసీదుకి రావడమా జీవితాశయమా?" అనడిగాడు రషీద్.

ఆ ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు రాముకి.

"దేవుడు ఎక్కడున్నా దేవుడే, మక్కాకి వెళ్తేనే దేవుడైతే..! మరి మన అజాద్‌చౌక్‌లో ఉన్న మసీదులో ఉన్నదెవరు? చార్మినార్ పక్కనున్న మక్కా మసీదులో ఉన్నదెవరు? తిరుపతిలోనే వెంకటేశ్వరుడుంటే, మన వీధుల్లో ఉండే ఆలయాల్లో ఉన్నదెవరు? వాటికన్ సిటీలో నైనా, మెదక్ చర్చిలోనైనా ఉండేది ఆ ఏసేరా. మనం రోజూ ప్రార్థనలు చేస్తున్నాం. అవి ఎక్కడికి చేరాలో అక్కడికే చేరుతాయి. ఎక్కడికో వెళ్లి చేస్తేనే ప్రార్థనలు కావు. నేనెందుకు ఇదాంత చెప్తున్నానంటే దేవుడున్న చోటుకి వెళ్లడానికి డబ్బులు ఖర్చు చేసి నేనొక్కడినే తృప్తి పొందడంకంటే...ఆ డబ్బుతోనే పేదలకు సాయం చేద్దాం. దేవుడు చెప్పింది అదే కదా. దేవుడిని చూసి రావడం సంతృప్తి, దేవుడు చెప్పింది చేయడం దైవత్వం. సంతృప్తి ఎక్కడైనా

పొందొచ్చు. దైవత్వం మాత్రం మానవత్వం చూపించినప్పుడే పొందుతాం.” అన్నాడు రషీద్.

రాముకి తన తండ్రి ఏం చెప్తున్నాడో అర్థమైంది.

“ఆ డబ్బుతో ఇక్బాల్, నూర్ పేర్లతో పేదలకు చదువు చెప్పించు. అలా చేస్తే దేవుడు సంతోషిస్తాడు. నీకు మేలు చేస్తాడు” అన్నాడు రషీద్. ఇస్లాంలో రషీద్ అంటే గురువు, మార్గదర్శి అని అర్థం. దానికి నిజమైన రూపం రషీద్.

ఇది విన్న సాధువు “కష్టాల్లో ఉన్న వ్యక్తికి సహాయం చేస్తే నువ్వు దేవుడివే కదా…నీలో ఉన్న దేవుడిని బయటకు తీయకుండా…కనిపించని దేవుడి కోసం ఎందుకు వెదుకులాట?” అని తాను తన గురువు వద్ద విన్న మాటలను గుర్తు చేసుకున్నారు.

“పవిత్ర…మీ తాతయ్య చెప్పింది అక్షరాల నిజం” అని మెచ్చుకోలుగా అన్నారు సాధువు.

“మరి స్వామి మీరు ఇలాంటి విషయాలను మీరు చాలా చోట్ల చాలా మందికి చెప్పే ఉంటారు. ఇంత మంచి విషయాలను ప్రజలు ఎందుకు పాటించడం లేదు. అలా పాటిస్తే ఈ గొడవలే ఉండవు కదా అనడిగారు నవీన్, పవిత్రలిద్దరూ.

“ఎందుకు పాటించరు. అసలు మేం ఇప్పుడిప్పుడే ఈ విషయాలను చెప్తున్నాం. కాని మన దేశంలో మత సహనం అనేది ఎప్పటి నుంచో ఉంది. దానికి అనేక ఉదాహరణలు కూడా ఉన్నాయి. అయితే ఆ మంచి ఇంకా అందరికీ చేరలేదు. చేరే రోజుల కోసమే అందరి ఎదురు చూపులు. ఆ రోజులు త్వరలోనే వస్తాయని ఆశిద్దాం. మీరు కూడా పేపర్లు, టీవీల్లో అనేక సార్లు చదవడమో, చూడడమో జరిగే ఉంటుంది. మన దేశంలో మత సహనాన్ని తెలుపుతూ అనేక సంఘటనలు జరిగాయి” చెప్పాడు సాధువు.

“అవునవును చాలా సార్లు టీవీలో చూశాను. నాకు గుర్తున్నంత వరకు కొన్ని మీకు చెప్పగలను కూడా” అన్నాడు నవీన్.

**– తమిళనాడులోని శ్రీరంగం దేవాలయం, భద్రాచలం రాముల వారి దేవాలయంలో సన్నాయి వాయించేది తెలుగు ముస్లింలే.**

**– భద్రాచలంలోని రాముల వారి కల్యాణానికి ఆది నుంచి ముత్యాలు నిజాం వంశీయులే అందిస్తారు.**

**– బీబీ నాంచారమ్మ (వెంకన్న రెండో భార్య) ముస్లిం స్త్రీ. తిరుమలలో ఆమె దేవాలయం ఉంది.**

**– ఉత్సవ దేవతలైన శ్రీదేవి, భూదేవిలకు సయ్యద్ మీర్జా సమర్పించిన రెండు మంగళ సూత్రాలనే నేటికీ వెంకటేశ్వర కల్యాణోత్సవంలో ఉపయోగిస్తున్నారు. ఆనాటి బ్రిటీష్ అధికారి సర్ థామస్ మన్రూళి సమర్పించిన మన్రూ గంగాళంలోనే నేటికీ నైవేద్యం తెస్తున్నారు.**

ఇవన్నీ మత సహనానికి నిదర్శనాలే కాదా?” అని నవీన్ చెప్పాడు.

అవును ఇంకా ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయి ఈ దేశంలో అంటూ..."**నిజామాబాద్ జిల్లాలోని భైంసాలో మతకల్లోలాలు జరిగినప్పుడు ఓ సాధారణ హిందూ వనిత తుల్జాబాయి దాడిలోనైన కొందరు ముస్లింలకు ఆశ్రయం ఇచ్చింది. ప్రజా గాయకుడు గద్దర్ భైంసాకు వచ్చి ఆమె కాళ్లకు నమస్కరించారు.**

**– విశ్వ హిందూ పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించిన భగవద్గీత శ్లోక పఠన పోటీలలో ఖమ్మం జిల్లాకి చెందిన 10, 6వ తరగతులు చదువుతున్న షేక్ సాజిద్, షారుక్ బాబాలు పాల్గొని ప్రథమ బహుమతులు గెలిచారు.**

**– కాశ్మీర్‌లో పండిట్ల గ్రామాల్లో ముస్లింలే హిందువులకు దేవాలయాలను నిర్మించారు. కాశ్మీర్‌లో పులల్వామా గ్రామంలో నేటికీ హిందువులు, ముస్లింలు ఇద్దరూ ఒకే ముస్లిం పవిత్ర స్థలంలో ఒక పక్క హోమం, మరో పక్క నమాజు చేస్తారు.**

**– హైదరాబాద్‌లో జరిగే వినాయక ఉత్సవాలు సర్వమత సమ్మేళనానికి నిదమర్శనంగా నిలుస్తాయని నిరూపిస్తున్నారు అక్కడి ప్రజలు.**

**– ప్రకాశం జిల్లా తాళ్ళూరు మండలంలోని తురకపాలెం గ్రామంలో 600 ముస్లిం కుటుంబాలు, ఒకే ఒక్క హిందూ కుటుంబం ఉన్నాయి. ఆ ఒక్క హిందూ కుటుంబం కోసం ముస్లింలు రామాలయం నిర్మించారు.**

ఇలా ఒక్కటేమిటి ఎన్నో మతసహనం, సామరస్యం పాటించే ఉదాహరణలు చాలా ఉన్నాయి. అయితే వీటిని ఏ మాత్రం పట్టించుకోకుండా మనలో చాలా మంది మత ఉద్వేగాలకు, మత అసహనానికి పాల్పడుతుంటారు" సాధువు చెప్తుంటే ఆ కూపేలో అందరూ ఈ డిష్కసన్ చాలా ఆసక్తిగా వింటున్నారు.

ఇంతలో విజయవాడ వచ్చింది. నవీన్ ఆ స్టేషన్‌లో ట్రైన్ దిగి, ఇంకా ట్రైన్ కదలకపోవడంతో పవిత్ర సీటు పక్కనున్న కిటికీ దగ్గరకు వచ్చి నిల్చున్నాడు.

"హా...పవిత్ర ఇంతకి నాకు సమాధానం ఎప్పుడూ చెప్తావ్?" అనడిగాడు.

"టైమ్ బాండ్ లేదు కదా..!" అనడిగింది పవిత్ర.

"నీకు టైమ్ బాండ్ లేదు కాని...నాకు టైమ్ లేదు. అందుకే నువ్వు నాకు త్వరగా దాన్ని డీ కోడ్ చేసి ఆన్సర్ చేయాలి" అన్నాడు.

"ఓకే ఓకే...నీకు మళ్లీ మనం కాలేజ్‌కి వెళ్లేలోపే డెఫినెట్‌గా ఆన్సర్ చేస్తా"

"ఓకే చూద్దాం. ఐ విష్ యూ ఆల్ ది బెస్ట్" అన్నాడు నవీన్.

ఇంతలో ట్రైన్ కదులుతోంది. "ఓకే ఉంటా మరి, స్వామిజీ బై" అంటూ ఇద్దరికి టాటా చెప్పాడు నవీన్.

నవీన్ ది విజయవాడ. నవీన్ వాళ్లది హిందు కుటుంబం. ఆ కుటుంబంలోని అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాల్లో ఇప్పటివరకు ఏ మతాంతర, కులాంతర వివాహం కూడా జరగలేదు. అది వాళ్ల కుటుంబానికి సంబంధించి అల్ టైమ్ రికార్డ్. అలాంటి కుటుంబం

నుంచి వచ్చిన నవీన్ పవిత్రను ప్రేమిస్తున్నాడు. పవిత్ర నవీన్ ప్రేమని ఒప్పుకున్నా, అసలు ఇంట్లో వాళ్లని ఎలా ఒప్పిస్తాడో మరి నవీన్‌కే తెలియాలి.

నవీన్‌కు ఇంట్లో పెళ్లి సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. తెలిసిన వాళ్లలోనే చాలా సంబంధాలు ఉన్నాయంటూ రోజుకో అమ్మాయి ఫోటోని నవీన్‌కి వాట్సప్ చేస్తున్నారు అతని పేరెంట్స్. నవీన్‌కి పవిత్ర అంటే చాలా ఇష్టం. పవిత్రని అడ్మిషన్ టైమ్‌లో చూసినప్పటి నుంచి ప్రేమిస్తూనే ఉన్నాడు. కాని ఆ ప్రేమని చెప్పలేకపోయాడు. కాని ఇప్పుడు పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉంది. అందుకే ముందు పవిత్రకి తన ప్రేమ విషయం చెప్పాలని గట్టిగా నిర్ణయించుకుని, కోడ్ భాషలో తన ప్రేమని చెప్పాడు. తాను ఇచ్చిన ఫజిల్‌ని పవిత్ర డీ కోడ్ చేస్తుందా? లేదా? అనేది ఒక టెన్షన్ అయితే, డీ కోడ్ అయితే తన ప్రేమని ఒప్పుకుంటుందా లేదా అనేది మరో పెద్ద టెన్షన్. అందుకే పవిత్ర ఏం సమాధానం చెప్తుందా అని టెన్షన్ పడుతున్నాడు. పవిత్ర ఓకే అంటే ఇంట్లో వాళ్లని ఒప్పించడం పెద్ద సవాలే తనకి.

మరో మూడు గంటల్లో రాజమండ్రి వచ్చింది.

పవిత్ర ట్రైన్ దిగిపోతూ..."స్వామిజి మీరు చెప్పిన విషయాలకు ధన్యవాదాలు" అంటూ ఆయనకి నమస్కరించింది.

" నీకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నా తల్లి" అంటూ సాధువు దీవించాడు.

# 11

**స్టేషన్** నుంచి ఇంటికి వచ్చిన తర్వాత కాసేపు పేరెంట్స్‌తో మాట్లాడి అలసటగా ఉండటంతో నిద్రపోతానంటూ తన రూం వెళ్ళిపోయింది పవిత్ర. తనకి నవీన్ పంపిన మెసేజ్‌ని ఏలా డీకోడ్ చేయాలా అనే ఆలోచనలతో నిద్ర పట్టడం లేదు.

టైమ్ చూసింది. అర్ధరాత్రి 1 గంట. నిద్ర రావడం లేదు. తనకి తెలుసు ఆ మెసేజ్‌కి అర్థం లవ్ చేస్తున్నాననో, పెళ్లి చేసుకుంటున్నాననో అయ్యుంటుంది. కాని అది ప్రూవ్ చేయడం ఎలాగో అర్థం కావడం లేదు. ఆలోచిస్తూనే ఉంది. నిద్ర రాకపోవడంతో టీవీ ఆన్ చేసింది.

టీవీలో స్టార్ హిందీ ఛానల్‌లో పవన్ కల్యాణ్ నటించిన "తీన్‌మార్" సినిమా హిందీ డబ్బింగ్‌లో వస్తుంది. పవన్ కల్యాణ్ ఫ్యాన్ కావడంతో రిమోట్‌ని పక్కన పడేసి టీవీ చూస్తుంది. టీవీ స్క్రీన్‌పై వస్తున్న ఇంగ్లీష్ సబ్ టైటిల్స్‌తో పని లేకుండా సినిమాని ఎంజాయ్ చేస్తుంది.

కథ ప్రకారం పవన్ ఇటలీలో ఉండటంతో అప్పుడప్పుడు ఇటాలియన్ లాంగ్వేజ్‌లో డైలాగులు చెప్తుంటాడు. పవన్, త్రిష రొమాంటిక్ సీన్లలో ఎక్కువగా ఇటాలియన్ లాంగ్వేజ్ మాట్లాడుతాడు పవన్ కల్యాణ్. అప్పుడు మాత్రం పవిత్ర సబ్ టైటిల్స్ చూస్తోంది.

ఒక సీన్లో పవన్ కల్యాణ్ ఇటాలియన్ లాంగ్వేజ్‌లో త్రిషతో ఏదో చెప్తున్నాడు. అప్పుడు పవన్ పలికిన డైలాగ్‌లో ఓ సౌండ్‌కి పవిత్ర కనెక్ట్ అయ్యింది. "టియామో" అంటూ పవన్ త్రిషతో రెండు, మూడుసార్లు అంటాడు. వెంటనే ఆ శబ్దానికి అర్థం ఏంటా అని సబ్ టైటిల్స్‌లో చూసింది. ఐ లవ్ యూ అని సబ్ టైటిల్స్‌లో వస్తోంది.

వెంటనే నవీన్ పంపిన మెసేజ్ ఓపెన్ చేసి చూసింది. ఆ మెసేజ్‌లోని చివరి పదం "టియామో" అనే ఉంది. అంటే చివరి పదానికి అర్థం ఐ లవ్ యూ అయితే మిగిలిన వాటికి అర్థం ఏంటా అని ఆలోచించింది. అవే పదాలను ఇటాలియన్ భాషలో ఏమంటారోనని నెట్‌లో సెర్చ్ చేసింది. ఏ అర్థం చూపడం లేదు. మరి టియామో ఇటాలియన్ పదం కాదా. అదొక్కటే ఎలా మ్యాచ్ అయ్యింది అనుకుంటూ తనలో తానే వంద రకాలుగా ఆలోచిస్తోంది.

మొత్తానికి చిన్న లింక్ దొరికింది. స్థిమితంగా ఆలోచిస్తే డీ కోడ్ చేయొచ్చు అనుకుంది. వెంటనే గూగుల్ సెర్చ్ ఇంజన్‌లో ఒక్కో పదానికి అర్థమేంటా అని టైప్ చేయడం ప్రారంభించింది.

నవీన్ పంపిన **"సనేసె వియాడమ్ ఇచ్ లై బిడిచ్ జేగ్ అల్ స్కార్ డిగ్ ఓ ఐని యుటే ఆమో జిటియేమ్ ఎస్ అగాపా టియామో"** అనే మెసేజ్‌ని చూస్తూ గూగుల్‌లో "వాటిజ్ ద మీనింగ్ ఆఫ్ సనేసె" అని టైప్ చేసింది.

"నాట్ ఫౌండ్" అని జవాబు వచ్చింది.

ఆ తర్వాత "వియాడమ్" అని టైప్ చేసింది.

దానికి కూడా "నాట్ ఫౌండ్" అనే చెప్పింది గూగుల్.

అలా టైప్ చేస్తూ "జిటియేమ్" అనే పదం టైప్ చేసింది.

దానికి మాత్రం సమాధానం వచ్చింది. "ఐ లవ్ యూ ఇన్ ఫ్రెంచ్" అని ఆన్సర్ వచ్చింది. అంతే పవిత్రకి విషయం అర్థమైపోయింది. ఇవి ఒక్కో పదానికో, రెండేసి పదాలకో, మే బీ మూడు మూడు పదాలకో అర్థం రకరకాల భాషల్లో ఐ లవ్ యూ అని.

ఈసారి రెండేసి పదాలను కొట్టడం ప్రారంభించింది. "సనేసె వియాడమ్" అని టైప్ చేసింది. దానికి ఆన్సర్ వచ్చింది. "టర్కిష్‌లో ఐ లవ్ యూ" అని. అలాగే "ఓ ఐని" అని టైప్ చేస్తే దానికి "చైనీష్ భాషలో ఐ లవ్ యూ" అని అర్థం తెలిపింది. మొత్తానికి పవిత్ర ప్లాన్ వర్కవుట్ అయ్యింది. అన్ని పదాలకు ఆన్సర్ లభించింది. పదాలు వేరే కాని ఆన్సర్ మాత్రం ఒక్కటే ఐ లవ్ యూ అని తేలిపోయింది. మొత్తం నవీన్ పంపిన మెసేజ్‌ని రీ టైప్ చేసింది. పవిత్ర రీ టైప్ చేసిన మెసేజ్ ఇలా ఉంది.

**సనేసె వియాడమ్ (టర్కిష్), ఇచ్ లై బిడిచ్ (జర్మన్, జేగ్ అల్ స్కార్ డిగ్ (స్వీడన్ అండ్ డేనిష్), ఓ ఐని (చైనీష్), యుటే ఆమో (పోర్చుగీస్), జిటియేమ్ (ఫ్రెంచ్), ఎస్ అగాపా (గ్రీక్), టియామో (ఇటాలియన్)**

నవీన్ తనకి ప్రపంచంలోని వివిధ భాషల్లో ఐ లవ్ యూ చెప్పాడు. నవీన్ చెప్పిన ఐ లవ్ యూ అనే విషయంపై కాస్త కోపంగా ఉన్నప్పటికీ...చెప్పిన విధానం మాత్రం నచ్చింది పవిత్రకి. మొత్తానికి నవీన్ ఇచ్చిన టాస్క్‌ని పవిత్ర సక్సెస్ ఫుల్‌గా డీ కోడ్ చేసింది. థాంక్యూ పవన్ కల్యాణ్ అండ్ తీన్‌మార్ అనుకుంటూ ప్రశాంతంగా పడుకుంది.

మార్నింగ్ ఎనిమిది గంటల వరకు పవిత్ర నిద్రలేవకపోవడంతో లూసీ పవిత్ర గదిలోకి వెళ్లింది. ఇంకా పడుకునే ఉంది పవిత్ర. "పవిత్ర ఎనిమిదయ్యింది నిద్రలే...లే" అంటూ లూసీ పవిత్రని నిద్రలేపింది.

లేచిన వెంటనే "అమ్మ.. ఐ గాట్ ఇట్" అంటూ లూసీని కౌగిలించుకుంది పవిత్ర.

"ఏంటి నువ్వు సాధించావు చెప్పు ముందు?" అడిగింది లూసీ.

"అమ్మా నవీన్ పంపిన మెసేజ్‌ని నేను డీ కోడ్ చేశాను. అది తొమ్మిది భాషల్లో ఉన్న కోడ్. దాన్ని నేను ఈజీగా డీ కోడ్ చేశాను. అయితే ఆ తొమ్మిది భాషల్లో ఉన్న ఆ పదాలకు అర్థం మాత్రం ఒకటేనమ్మా..!" చెప్పింది పవిత్ర సిగ్గుపడుతూ.

"ఏంటి... ఐ లవ్ యూ అనే కదా..!" అనడిగింది లూసీ.

లూసీ అలా అనేసరికి పవిత్ర ఆశ్చర్యపోయింది. "నీకెదలా తెలుసు మమ్మీ?" అనడిగింది.

"ఒక కుర్రాడు, ఒక అమ్మాయికి ఇంత టిపికల్ టెస్ట్ పెట్టాడంటే దాని అర్థం ఏంటే మరి, సరే దాని సంగతి తర్వాత చూద్దాం కాని...ముందు నువ్వు రెడీ అవ్వు రషీద్ తాతయ్య షాపు దగ్గరకు రమ్మన్నాడు" అంటూ పవిత్ర నుదుటిపై ముద్దు పెట్టింది లూసీ.

అంతా రషీద్ షాపు దగ్గరకు వెళ్లారు. పవిత్ర షాపులో ఉన్న క్యాషియర్ సీటులో కూర్చుంది. పవిత్ర కూర్చున్న పక్కనే ఉన్న ఇక్బాల్, నూర్‌ల ఫోటోని చూసి నమస్కరించింది. పవిత్రకి పవిత్ర అనే పేరు ఇక్బాల్ ఎలా పెట్టింది, బొంబాయిలో ఏం జరిగిందనే విషయాలు చెప్పడంతో ఇక్బాల్, నూర్ అంటే పవిత్రకి ఎంతో ప్రేమ ఏర్పడింది.

రాము, లూసీ, రషీద్ ముగ్గురూ ఏదో సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు. వాళ్లని చూసిన పవిత్రకి విషయం అర్థం కాలేదు.

మెల్లగా వారి దగ్గరకు వచ్చి "ఏంటి సీక్రెట్ మాట్లాడుకుంటున్నారు" అనడిగింది.

"సీక్రెట్ ఏం లేదు...నీ ప్రపంచ భాషల ప్రేమ కోసమే" చెప్పింది లూసీ.

"సరే అయితే, నేను ఢిల్లీ వెళ్లిన తర్వాత మీకు చెప్తాను. నాకు కొంచెం టైమ్ కావాలి. నవీన్‌ని కాస్త స్టడీ చెయ్యాలి" అంది.

*** * * * ***

ఉదయాన్నే నిద్రలేచిన నవీన్ అలవాటు ప్రకారం సెల్‌ఫోన్ చూసుకున్నాడు. కొన్ని ఫేస్‌బుక్ అప్‌డేట్స్, మెసేజ్‌లు కనిపించాయి. ఒక్కొక్కటీ చూస్తున్నాడు. అందులోని ఒక మెసేజ్‌లో "ఐ డిడ్ ఇట్. ఇట్ వాజ్ డీ కోడెడ్" అని ఉన్న మెసేజ్‌ని చూశాడు నవీన్. అది పవిత్ర నుంచి వచ్చింది.

నవీన్‌కి అర్థం కాలేదు. డీ కోడ్ చేస్తే మరి దానిలో ఉన్న మ్యాటర్‌కి రియాక్ట్ అవ్వకుండా కూల్‌గా "డీ కోడెడ్ ఇట్" అని పంపించింది ఏంటా అని ఆలోచనలో పడ్డాడు. పోనీ పవిత్రకే ఫోన్ చేసి అడుగుదామంటే అంత ధైర్యం సరిపోవడం లేదు. నిన్నటి వరకు పవిత్రని పెట్టిన టెన్షన్ ఇప్పుడు తనకి చుట్టుకుంది అనుకున్నాడు. అసలు నిజంగానే డీ కోడ్ చేసిందా లేక తనని కార్నర్ చేసేందుకు ఫాల్ గేమ్ ఆడుతోందా అనే అనుమానం కూడా వచ్చింది.

"కంగ్రాట్స్" అంటూ రిప్లై ఇచ్చాడు నవీన్. దానికి ఏం సమాధానం వస్తుందా అని వెయిట్ చేస్తూ కూర్చున్నాడు. ఓ గంట వెయిట్ చేసిన తర్వాత రిప్లై వచ్చింది. అది చూసిన నవీన్‌కి అర్థం కాలేదు.

"ఐ డోంట్ అండర్ స్టాండ్ ఇట్" అని పంపాడు.

"డీ కోడ్ ఇట్" అని రిప్లయి వచ్చింది.

పవిత్ర పంపిన మెసేజ్‌లో "**DIIHSLCEUDSNI**" అని ఉంది.

దాన్ని చూస్తూ డీ కోడ్ చేయాలా...అంటే నేను తీసిన కోడ్‌లో నేనే పడ్డానన్నమాట అనుకున్నాడు.

ఆ పదాన్ని డీ కోడ్ చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. తనలాగే ఏదైనా ఫారెన్ లాంగ్వేజ్‌లో పంపిందేమోనని అన్ని లాంగ్వేజ్‌లో ఆ పదానికి అర్థం కోసం మూడు గంటల పాటు గూగుల్‌లో ట్రై చేశాడు. నడుం నొప్పి వచ్చింది కాని ఫలితం మాత్రం రాలేదు. తాను ఐ లవ్ యూ చెప్పాడు. దానికి నచ్చితే ఐ టూ లవ్ చెప్పాలి. ఈ పదానికి అలాంటి అర్థం వచ్చే విధంగా ఎక్కడా కనిపించలేదు. మరి ఏమై ఉంటుంది..! పోనీ కోపంతో ఏదైనా తిట్టిందా అని అనుకున్నాడు.

అయితే ఆ పదానికి 'చెప్పు తెగుద్ది, ఇడియట్, నీ ముఖం అద్దంలో చూసుకున్నావా, నువ్వింత వెధవ్వని అనుకోలేదు" ఇలాంటి అర్థాలు ఏమైనా వస్తాయా అని ఆలోచిస్తూ ఉన్నాడు. ఎక్కడా ఎలాంటి క్లూ దొరకడం లేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా నవీన్ దాన్ని డీ కోడ్ చేయలేకపోతున్నాడు.

*** * * * ***

**హాలీడేస్** అయిపోయాయి. పవిత్రకు సెకండియర్ క్లాసలు మొదలయ్యాయి. నవీన్, పవిత్ర ఇద్దరూ కాలేజ్‌కి వచ్చారు. ఆ రోజు క్లాసు తీసుకుంటున్న ప్రొఫెసర్ "భూగోళంలో భూభాగం ఇప్పుడున్నట్లు రకరకాలైన షేపుల్లో కాకుండా అంతా ఒకేచోట మద్ద పోసినట్లు

ఉంటే ఎలా ఉంటుందో ఊహించి చెప్పండి” అనడిగారు. సడన్‌గా ఈ ప్రశ్న వేసేసరికి ఏం చెప్పాలో ఎవరికీ తెలియడం లేదు. అయితే నవీన్ మాత్రం సిల్లీ ఆన్సర్ చెప్పాడు.

“భూమి అంతా ఒకే చోట ముద్దపోసినట్లు ఉంటే దేశాల మధ్య సరిహద్దు గోడలుండవు సార్” అన్నాడు.

క్లాస్ అంతా ఒక్కసారిగా నవ్వారు.

“ఎస్...ఇట్ ఈజ్ అల్ సో రైట్” అంటూ మళ్లీ ప్రొఫెసర్ చెప్పడం ప్రారంభించారు.

“కొన్ని చోట్ల సంవత్సరాల కిందట ఒకే చోట పలకలా భూమి ఉండేది. అలాంటి భూమి మరి ఎందుకు ముక్కలైంది. రీసెంట్‌గా మనకు స్పేస్ రీసెర్చ్ సెంటర్స్ నుంచి అందుతున్న ఛాయా చిత్రాల ప్రకారం భూమిలోని ఖండాల మధ్య దూరం తగ్గుతూ వస్తోంది. అంటే కొన్ని రోజులకు భూమి మళ్లీ ఏకమైపోయి, ఒకే ఖండంగా మారిపోతుందనే పాయింట్ మళ్లీ తెర మీదకు వచ్చిందన్నారు” ప్రొఫెసర్.

“వీటికి సమాధానం కావాలంటే అల్ఫ్రెడ్ వెజినర్ అనే సైంటిస్ట్ ప్రపోజ్ చేసిన భూ ఖండ చలన సిద్ధాంతం లేదా కాంటినెంటల్ డ్రిఫ్ట్ థియరీ (CONTINENTAL DRIFT THEORY) తెలుసుకోవాలి” అన్నారు.

“ఇందాక మన నవీన్ చెప్పినట్లు ఒకప్పుడు అసలు భూమికి సరిహద్దులే ఉండేవి కావు. ఇప్పుడు మనమంతా మన ఊరు, మన రాష్ట్రం, మన దేశం అంటూ మనకు మనం హద్దులు గీసుకుంటున్నాం కాని...కొన్నాళ్లకు భూగోళంలోని ఖండాలన్నీ ఏకం కాబోతున్నాయి. దేశాల సరిహద్దులు బద్దలు కాబోతున్నాయి. సముద్రమంతా ఒక చోటుకు, భూమి అంతా మరో చోటుకు చేరి, ఓ మహాఖండం ఏర్పాటు కాబోతున్నది. అయితే ఆ కొన్నాళ్లు ఎన్నాళ్లకు వస్తుంది అనేది ఇప్పుడు ప్రశ్న. ఆ రోజు ఎంత తొందరగా వస్తే అంత మంచిది కూడా అనేది నా పర్సనల్ ఒపీనియన్” అన్నారు ప్రొఫెసర్.

ఏడు ఖండాలు, 200 పైగా దేశాలు, 700 కోట్ల జనాభా, వేలాది తెగలు, వందలాది భాషలు, అపారమైన జీవరాశితో వందల కోట్ల సంవత్సరాలుగా అనంత విశ్వంలో మన భూగోళం వెలుగొందుతోంది. అయితే 20 కోట్ల సంవత్సరాల కిందట భూగోళంలోని నేలంతా ఒకే చోట ఓ మహాఖండంలా ఉండేది. ఆ తర్వాత చాలా నెమ్మదిగా ఈ భూభాగం అనేక భాగాలుగా విడిపోయింది. గడిచిన 20 కోట్ల సంవత్సరాల్లో ప్రస్తుతం ఉన్న రూపానికి వచ్చింది. ఇప్పటికీ భూభాగంలోని ఫలకలు అలా విస్తరిస్తూపోతూనే ఉన్నాయి. అలా భూమి ఫలకల విస్తరణ పెరుగుతూ పోయి మళ్లీ ఒక మహా ఖండంగా ఏర్పడుతుంది. ఈ ప్రక్రియను వివరించేదే ‘భూఖండ చలన సిద్ధాంతం’. అని చెప్పారు ప్రొఫెసర్.

ఈ టాపిక్ స్టూడెంట్స్‌కి చాలా ఆసక్తిగా అనిపించింది. అందరూ ఎంతో కుతూహలంతో వింటున్నారు. ఈ టాపిక్ వింటుంటే పవిత్రకి హాలీడేస్‌లో రాజమండ్రి వెళ్తున్నప్పుడు ట్రైన్‌లో “ఈ సృష్టి దేవుడిలోనే అంతమవుతుంది. దేవుడితోనే కలుస్తుంది” అని సాధువు చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. అటు మత విశ్వాశాలపరంగా, ఇటు సైన్స్‌పరంగా చూసినా ఈ భూగోళం మాత్రం ఇప్పుడున్నట్లు శాశ్వతంగా ఉండదని అనుకుంది పవిత్ర.

“సార్ మరి ఈ థియరీ నిజమయ్యే అవకాశం ఉందా? ఉంటే అది జరగడానికి ఎన్నాళ్లు పడుతుందని అనుకోవచ్చు? అసలు ఒకే గోళంగా ఉన్న భూమి...ఇలా ఇన్ని ఖండాలుగా, ఇన్ని ప్రాంతాలుగా ఏలా విడిపోయిందో వివరంగా చెప్తారా..!” అడిగింది పవిత్ర.

“అసలు భూమి ఏర్పడినప్పటి స్థితికి నుంచి ఇప్పటి స్థితికి ఏలా మారిందో తెలుసుకునే పరిశోధనలు ఎంతో కాలంగా సాగుతున్నాయి. ఈ విషయంపై శాస్త్రవేత్తల అంచనాలు చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. అసలు భూమి చరిత్రని స్టడీ చేస్తే మనకి చాలా విషయాలు అర్థమవుతాయి.” అంటూ చెప్పడం ప్రారంభించారు ప్రొఫెసర్.

“దాదాపు 20 కోట్ల సంవత్సరాల కిందట భూగోళంలోని నేలంతా ఒకే చోట ఒక మహాఖండంలా ఉండేది. కొన్ని సంవత్సరాలుగా భూమి అనేక మార్పులకు గురవుతూ...ఏడు ఖండాలు, అనేక ద్వీపాలుగా కనిపిస్తున్న ప్రస్తుత భూగోళం ఏర్పడింది.

ఒక గోళంగా ఉన్న భూమి అనేక భాగాలుగా ఎందుకు విడిపోయిందనే విషయం తెలియాలంటే భూమి నిర్మాణం, దాని ధర్మాలను తెలుసుకోవాలి. సుమారు 600 కోట్ల సంవత్సరాల కిందట సౌర మండటం రూపుదిద్దుకుంది. హీలియం, హైడ్రోజన్‌ల మిశ్రమమైన సూర్యుని నుండి అనేక భాగాలు విడిపోయి గ్రహాలు, ఉపగ్రహాలు, గ్రహశకలాలు, తోక చుక్కలుగా విడిపోయింది. మధ్యలో ఉన్న భాగం మాత్రం సూర్యుడిలా మిగిలింది. అలాంటి భాగాల్లో ఒకటి భూమి. ఇది ఏర్పడి సుమారు 550 కోట్ల సంవత్సరాలు అవుతోంది. మొదట్లో ఇది కూడా వాయువుల మిశ్రమంగా ఉండేది. అంతే కాదు సూర్యుడిలాగే స్వయం వెలుగులతో ఉండేది. భూమిలోని హైడ్రోజన్ ఇంధనం అడుగంటిపోవడంతో భూమి తన స్వయం ప్రకాశ లక్షణాన్ని కోల్పోయింది. మిగతా గ్రహాలు అదే రీతిన తమ లక్షణాన్ని కోల్పోయాయి. సూర్యుడు మరీ పెద్ద గోళం కాబట్టి ఇంకా వెలుగులు చిమ్ముతున్నాడు.

సుమారు 500 కోట్ల సంవత్సరాల కిందట భూమికున్న విపరీతమైన ఉష్ణోగ్రతల కారణంగా ద్రవ రూపంలో కణకణ మండే నిప్పు గోళంలా ఉండేది. కాల క్రమంలో భూ ఉపరితలం ఘనీభవించింది. ఈ పొర కింద ఉన్న భాగం నెమ్మదిగా ఉష్ణాన్ని పొగోట్టుకోవడం వల్ల పెద్ద పెద్ద రాళ్ల ఫలకాలుగా ఏర్పడ్డాయి. అంతకన్నా కిందున్న పొరల్లో ఇంకా ద్రవ రూపం ఉండేది. అత్యంత లోపలున్న పొర ఇప్పటికీ ద్రవరూపంలోనే ఉంది.

గోళకారంగా ఉన్న భూమి ఐదు భాగాలుగా ఉంటుంది. అత్యంత అడుగున ఉన్న భాగాన్ని ఇన్నర్ కోర్, ఆ పైన ఉన్న దాన్ని అవుటర్ కోర్ అని పిలుస్తారు. ఇనుము, నికెల్ వంటి లోహాలు ఇక్కడ ద్రవరూపంలో ఉంటాయి. వీటిపైన ఉండేది “మాంటిల్”. ఇది ఘనరూపంలో ఉంటుంది. ఇక భూమికి అత్యంత పై భాగాన సుమారు 50 కిలోమీటర్ల మందంలో ఉండే పై పొరనే “క్రస్ట్” అంటారు. ఇది గట్టి పెంకు మాదిరిగా ఉంటుంది. సుమారు 150 కోట్ల సంవత్సరాల కిందట ఈ క్రస్ట్ భూమి ఉపరితలంలో ఒక వైపు ఉబ్బుగా ఉండగా, భూమ్మీదున్న నీరంతా ఒకే సముద్రంగా మరో వైపు ఉండేది. నీటి వత్తిడి వల్ల, భూమికున్న అయస్కాంతత్వం వల్ల, చంద్రుడి వల్ల, సూర్యుడి వల్ల సముద్రపు నీటి

మీద కలిగే అటుపోటుల వల్ల నేల భాగపు ఫలకలు అటుయిటూ కదలసాగాయి. ఈ భూఫలకల కదలికలే ఇప్పుడు అనేక ఉత్పాతాలకు భవిష్యత్‌లో జరగబోయే సమూల మార్పులకు కారణం.

నీటిపై చెక్క తేలినట్లే...మనం జీవిస్తున్న ఖండాలు కూడా భూమి అడుగు భాగాన ఉన్న శిలాద్రవాలపై తేలుతుందనే విషయం మీకు తెలుసా...?. ఖండాలకు సంబంధించిన భూఫలకాలను 'టెక్టానిక్ ప్లేట్స్' అంటారు. భూగోళం మొత్తం అనేక టెక్టానిక్ ప్లేట్ల సమాహారమే. ఈ భూఫలకాలు చాలా బరువుగా ఉన్నా అవి భూగర్భంలో ఉండే శిలాద్రవంపై తేలుతూ ఉంటాయి. భూగర్భంలో రాళ్లు సైతం కరిగిపోయే అత్యంత ఉష్ణోగ్రత వల్ల ఈ ఉపరితలాన్ని కప్పి ఉండే శిలాద్రవం పొంగుతూ ఉంటుంది. రాతి లక్షణాలుండే భారీ పదార్థాలతో ద్రవరూపంలో ఉండే నిర్మాణమే ఈ శిలాద్రవం (మాంటిల్). భూమి బరువులో 85% ఉండే మాంటిల్, భూ పై పొర నుంచి దాదాపు 2900 కి.మీ. దిగువన ఉంటుంది.

ఇటీవల జరిగిన పరిశోధనల్లో ఈ మాంటిల్ కింద ఒక పెద్ద సముద్రం ఉందనే విషయం వెలుగులోకి వచ్చింది. భూ అంతర్భాగంలో సుమారు 410 కి.మీ. నుంచి 660 కి.మీ. లోతులో మాంటిల్, అప్పర్ మాంటిల్ పొరల మధ్య భారీ సముద్రం ఉందని దీనిపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు తెలిపారు. ఆ మహాసముద్రంలోన నీరంతా కలిపితే ఏకంగా భూమిపై ఉన్న మహాసముద్రాల్లోని నీరంత ఉంటుదని భూమి మాంటిల్ పొర నుంచి లావాతో పాటు పైకి వచ్చిన 'రింగ్‌వూడైట్' ఖనిజంపై పరిశోధనలు చేసిన గ్రాహవమ్ పియర్‌సన్ తేల్చాడు. 'రింగ్‌వూడైట్' ఖనిజంలో 1.5 శాతం బరువు నీరు ఉంది. దీనిని బట్టి చూస్తే ఆ ఖనిజం ఉత్పత్తైన ప్రాంతంలో భారీగా నీరు ఉండవచ్చని చెప్పాడు. భూ అంతర్భాగంలో భారీ ఎత్తున నీరు ఉండొచ్చన్న సిద్ధాంతాలకు ఈ ఖనిజం బలం చేకూర్చింది. భూఫలకాలు నీటిపై పడవల్లా తేలుతూ ఉండటానికి ఇది ఒక కారణని ఒక అంచనా.

భూఫలకాల మూలంగా ఖండాల చలనం జరుగుతుందని ఇక నిర్థారణకు రావడంతో గతంలో చలనం ఏ విధంగా జరిగిందనే దానిపై దృష్టి పెట్టారు. దీనినే కాంటినెంటల్ డ్రిఫ్ట్(భూఖండ చలన సిద్ధాంతం)గా వ్యవహరిస్తున్నారు. కొన్ని వందల కోట్ల సంవత్సరాల ఇందట భూగోళం ఎలా ముక్కలుగా వడిపోయిందే వివరించేదే ఈ భూఖండ చలన సిద్ధాంతం. దీనికి ఒక రూపం తీసుకొచ్చింది మాత్రం జర్మనీకి చెందిన శాస్త్రవేత్త అల్ఫ్రెడ్ వెజ్‌నర్. 1912లో ఆయన దీనిని ప్రతిపాదించాడు. ఇందు కోసం ఆయన అనేక ఉదాహరణలు చూపించాడు. భూగోళం ఒకప్పుడు ఒకే ఖండంలా ఉందనడానికి ప్రధాన ఉదాహరణ ప్రస్తుత ప్రపంచపటంలోనే కనిపిస్తుంది. అట్లాంటిక్ సముద్రానికి రెండు వైపులా ఉన్న దక్షిణ అమెరికా, ఆఫ్రికా ఖండాలను పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది. ఒక బిస్కెట్‌లో విరిగిపోయిన రెండు ముక్కల్లాగా ఈ ఖండాలు కనిపిస్తాయి. ఆఫ్రికా పశ్చిమ భాగాన్ని, దక్షిణ అమెరికా తూర్పు భాగాన్ని కలిపేస్తే...రెండూ ఒక పజిల్‌లోని ముక్కల్లా అమరిపోతాయని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

పరిశోధనల్లో భూఫలకాల కదలికలు అనేక ఉత్పాతాలకు కారణమని గుర్తించారు.

ప్రస్తుతం భూగోళంపై 7 పెద్ద భూఫలకాలుండగా మరో 30 వరకూ చిన్న చిన్న ఫలకాలున్నాయి. పెద్ద వాటిని ఆఫ్రికా, అంటార్కిటికా, యూరేసియా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఇండో అస్ట్రేలియా, పసిఫిక్ ప్లేట్లుగా వీటిని వ్యవహరిస్తున్నారు. అన్నింటిలోకి పసిఫిక్ ప్లేట్ అతి పెద్దది. ఇండో అస్ట్రేలియన్ ప్లేట్‌ను ఆ తర్వాత ఇండియా అస్ట్రేలియా ప్లేట్లుగా విడివిడిగా వ్యవహరిస్తున్నారు. ఇవన్నీ విడిపోక ముందు ఈ ఫలకాలన్నీ ఒకే భాగంగా ఉండేది. 300 కోట్ల సంవత్సరాల నుంచి భూ ఫలకాల్లో కదలికలున్నట్లు గుర్తించినప్పటికీ అంతకు ముందు ఇదంతా ఒకే మహా ఖండంగా ఉండేది. 200 కోట్ల సంవత్సరాల నాడు కొలంబియా పేరుతో మహా ఖండం ఉండేది. 150 కోట్ల సంవత్సరాల నాటికి అది విచ్ఛిన్నమై వంద కోట్ల సంవత్సరాల కిందట రొడీనియా అనే మహాఖండం ఏర్పడింది. దాని తర్వాత 40 కోట్ల సంవత్సరాలకు అదీ విచ్ఛినమై పెనోటియా అనే మహాఖండం ఏర్పడింది. కొంత కాలానికి అదీ విడిపోయి 30 కోట్ల ఏళ్ళ నాడు పెంజ్జియా అనే మహాఖండంగా రూపాంతరం చెందింది. ఇదే ఆధునిక మహాఖండం.

20 కోట్ల సంవత్సరాల నుంచి ఇది కూడా విడిపోవడం మొదలైంది. దక్షిణార్థ గోళం వద్ద ఉన్న భాగం గోండ్వానా, ఉత్తరార్థ గోళం వైపు ఉన్నవి లారాసియాగా మొదట విడిపోయాయి. ఆ తర్వాత అవీ చిన్న చిన్న ముక్కలుగా విడిపోయాయి. ఈ ముక్కలు గత నలుదిక్కులా పయనిస్తూ ప్రస్తుతం మనం చూస్తఉన్న భూగోళాంన్ని ప్రపంచపటాన్ని సృష్టించాయి. అయితే నిరంతరం కదులుతూ కొన్ని కోట్ల సంవత్సరాల నుంచి మొదలైన ఈ పయనం ఎక్కడి వరకూ అన్నది ఇప్పుడు ప్రశ్న..!

భూగోళం మీదున్న ఈ ఫలకాలన్నీ నిరంతరం కదులుతూనే ఉన్నాయి. అయితే కొన్ని వేగంగా కదులుతుంటే కొన్ని మందకొడిగా కదులుతున్నాయి. ఈ ఫలకాలన్నీ ఒక చోట నుంచి మరో చోటకు కదులుతూ ఉండటంతో అవి ఖాళీ చేసిన భాగానికి సముద్రపు నీరు వచ్చి చేరుతోంది. ఆఫ్రిక్, అమెరికా ఖండాలు విడిపోవడం వల్ల అట్లాంటిక్ ఏర్పడింది. ఇలా ఫలకలు కదులుతూ ఉన్న కొద్దీ ఖాళీ అయిన ప్రాంతాలను సముద్రం కప్పేస్తుంటుంది. అయితే ఈ పయనం ఎక్కడ వరకూ అన్నదే ప్రస్తుతం ప్రపంచాన్ని ఆలోచనలో పడేసిన సమస్య. గతంలో మహాఖండాలు విచ్ఛిన్నమై మళ్ళీ కలుస్తాయని శాస్త్రీయ సిద్ధాంతాలు ప్రతిపాదిస్తున్నాయి. అది మరో 5 కోట్ల సంవత్సరాల నుంచి 25 కోట్ల ఏళ్లలో ఖండాల పునరేకీకరణ జరిపోతుందన్నది ఒక అంచనా.

ప్రపంచంలో మెజార్జీ శాస్త్రవేత్తలు అంగీకరించిన బిగ్ బ్యాంగ్ సిద్ధాంతాన్ని అనుసరించి ఈ విశ్వం ఎప్పుడో ఒకనాటికి అంతరించి కొత్తగా ఏర్పాటు కావాల్సిందే. ఒక మహా విస్ఫోటనం ద్వారా సృష్టి ఎలా సంభవించిందో, తిరోగమన ప్రక్రియలో మళ్లీ అలానే అంతమైపోతుంది. అనంత విశ్వంలో భాగమైన ఈ భూగోళానికి అది తప్పదు.

భూమిపైన జీవజాలం అంతమయ్యే నాటికి ఈ ఖండాల పునరేకీకరణ జరుగుతుందా లేదా అన్నది తేల్చలేం. 20 కోట్ల సంవత్సరాల నుంచి కదులుతున్న భూఫలకాలు మళ్ళీ 25 కోట్లి సంవత్సరాలకు ఒకటిగా కలుస్తాయన్నది ఒక అంచనా. భవిష్యత్తులో జరిగే భూ సర్దుబాట్లకు భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వతాల విస్ఫోటనాలు వంటి వాటిని ప్రజలు చవిచూడాల్సిందే. వీటన్నింటినీ తట్టుకుని ఆఖరు జీవి మహాప్రళయాన్ని

చూడగలుగుతుందా..? లేక నిర్జీవ భూగోళం విశ్వంలో కలిసిపోతుందా అనే దానికి కాలమే సమాధానం చెప్పాలి” అని ప్రొఫెసర్ తన సుదీర్ఘమైన వివరణని పూర్తి చేశారు.

క్లాస్ ముగియడంతో అంతా బయటకు వచ్చేశారు. పవిత్ర ఆలోచనలన్నీ ఇంకా భూఖండ చలన సిద్ధాంతం చుట్టూ తిరుగుతున్నాయి. స్టూడెంట్స్ అందరికీ ఈ టాపిక్ చాలా ఆసక్తి కలిగించింది. దీనిపై చాలా సేపు చర్చించుకున్నారు కూడా. కాపేటి తర్వాత పవిత్ర, నవీన్ కలుసుకున్నారు.

“ఏం నవీన్ ఇంతకీ డీ కోడ్ అయ్యిందా?” అనడిగింది పవిత్ర.

“లేదు...ట్రై చేస్తున్నా” అన్నాడు.

“చేయ్...చేయ్...గోదారోళ్లతో పెట్టుకుంటావా..!” అని వెటకారించింది.

“నేను ఆన్సర్ కనుక్కుంటా...బెజవాడ బలుపేంటో చూపిస్తా” అన్నాడు సరదాగా.

“ఓకే...ఆల్ ది బెస్ట్” అంటూ పవిత్ర నవ్వుకుంటూ అక్కడ నుంచి వెళ్లిపోయింది.

# 12

**మరో** రెండు రోజులు గడిచింది. నవీన్ ఎంత ఆలోచించినా సమాధానం దొరకడం లేదు. ఇక పవిత్ర ముందు తన ఓటమిని ఒప్పేసుకుని తన ప్రపోజల్ విషయం ఏం చేసిందో కనుక్కుందామని డిసైడ్ అయ్యాడు. క్యాంటీన్ దగ్గర పవిత్రని కలిశాడు నవీన్.

“గ్రౌండ్ దగ్గరకు వస్తావా, కొంచెం మాట్లాడాలి” అని పవిత్రని అడిగాడు.

“అరగంటలో వస్తా” అని చెప్పింది పవిత్ర.

“నేను కూడా అరగంటలో అక్కడికే వచ్చేస్తా...బై” అంటూ నవీన్ వెళ్లిపోయాడు. వెళు న్న నవీన్ వైపు చూస్తూ “ఇప్పుడు నవీన్ తనని ఏం అడుగుతాడా?...ఏం సమాధానం చెప్పాలా?” అని ఇబ్బందిపడుతూ ఆలోచిస్తోంది.

పని చూసుకుని అరగంటలో గ్రౌండ్‌కి వస్తానన్న నవీన్ అరగంట టైముందని తెలిసినా ముందే అక్కడికి వెళ్లిపోయాడు. ఎందుకంటే ప్రేమలో ఉన్న మగాడు తాను కోరుకున్న అమ్మాయి కోసం ఎక్కడికైనా అరగంట ముందే వచ్చేస్తాడు అన్న లవ్ థియరీ ఉంది మరి. ఆ థియరీని నవీన్ కూడా నిజం చేస్తూ అరగంట ముందుగానే పవిత్రని రమ్మన్న చోటుకి వెళ్లాడు.

పవిత్ర కోసం ఎదురు చూస్తూ ఏం అడగాలి? ఎలా అడగాలి? అని నవీన్ రకరకాలుగా రిహార్సల్ చేసుకుంటున్నాడు. పవిత్రతో ఎలా మాట్లాడాలా అని రిహార్సల్ చేస్తుండగానే పవిత్ర అక్కడికి వచ్చింది.

"ఇంతకీ ఎందుకు రమ్మన్నావ్?...హా...ఏదో చెప్తానని అన్నావ్ కదా..! చెప్పు చెప్పు" అని ఎగురుతూ బుగ్గలను తాకుతున్న తన జట్టుని సవరించుకుంటూ అడిగింది.

కాసేపు దీర్ఘంగా ఆలోచించిన నవీన్..."అదే...నువ్వు ఇచ్చింది నేను డీ కోడ్ చేయలేకపోయాను. ఆన్సర్ నువ్వే చెప్పు" అన్నాడు గాలిపటాల ఆటలో ఓడిపోయిన చిన్న పిల్లాడిలా ముఖం పెట్టి.

"ఓడిపోయానని ఒప్పుకున్నావ్ కదా...బెజవాడ అదుర్స్, బెజవాడ బలుపు అన్నావ్ కదా...ఏమైంది మరి..!" వెటకారంగా అడిగింది.

నవీన్ ఏం మాట్లాడలేదు. మాట్లాడే పొజిషన్‌లో లేడు. ఎందుకంటే ప్రేమైనా, ఆటైనా, పరీక్షైనా గెలిచినోడే రారాజు. ప్రస్తుతం పవిత్ర ఆ రారాజు పొజిషన్‌లో ఉంది.

"సరే అయితే నీకు ఇప్పుడు మెసేజ్ వస్తుంది చూసుకో" అంటూ పవిత్ర ఓ మెసేజ్ పంపింది.

**సనేసె వియాడమ్ (టర్కిష్), ఇచ్ లై బిడిచ్ (జర్మన్), జేగ్ అల్ స్కార్ డిగ్ (స్వీడన్ అండ్ డేనిష్), ఓ ఐని (చైనీష్), యుటే అమో (పోర్చుగీస్), జిటియేమ్ (ఫ్రెంచ్), ఎస్ అగాపా (గ్రీక్), టియామో (ఇటాలియన్).**

ఆ మెసేజ్ చూసిన నవీన్ చిన్న షాక్ అయ్యాడు. భలే కనిపెట్టేసిందే అని పవిత్రని మనసులోనే అభినందించాడు.

"ఇంతకీ దీనికి అర్థం ఏంటి?" అనడిగాడు.

"నాకు అర్థం తెలుసులే కాని...నీకెందుకు ఆ ఫీలింగ్ కలిగింది?" అడిగింది పవిత్ర.

"ఫ్రాంక్‌గా చెప్పాలా?" అడిగాడు నవీన్.

"హా...ఫ్రాంక్‌గా ఉంటేనే మంచిది కదా..!" అన్నది పవిత్ర.

"అందంగా ఉన్న ఏ అమ్మాయిని చూసినా చాలా మంది మగాళ్లకి ఆమెకు దగ్గర కావాలనిపిస్తుంది. నేను కూడా నువ్వు అందంగా ఉన్నావనే ముందు నిన్ను ఇష్టపడ్డాను. ఆ తర్వాత నీ చదువు, నీ మాట, మనం ఒకే ప్రాంతానికి చెందిన వాళ్లం కావడం ఇలా ఒక్కొక్కటి నన్ను నీ వైపు ఆకర్షించేలా చేశాయి. ఆ ఆకర్షణ ఇప్పుడు ప్రేమగా మారింది. అది నీకు ఏమనిపించినా నాకు మాత్రం ప్రేమే అనిపిస్తుంది" అన్నాడు.

ఇద్దరి మధ్య నిశ్శబ్దమే రాజ్యమేలుతోంది. ఇద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకోవడమే కాని, మాట్లాడుకోవడం లేదు. ఎంత సైలెన్స్ అంటే నిశ్శబ్దానికి కూడా ఏదైనా సౌండ్ ఉంటే బాగుంటుందేమోననేంత సైలెన్స్ ఉంది అక్కడ.

"ఓ పావుగంట తర్వాత ఏంటి పవిత్ర ఏం నిర్ణయించుకున్నావు?" అని అడిగాడు.

"దేనికోసం?"

"అదే పాకిస్థాన్ ప్రధాని నిన్ను విందుకు రమ్మని పిలిచాడు కదా...వెళ్లడానికి

నిర్ణయించుకున్నావా లేదా అని”

“పాకిస్థాన్ ప్రధానేంటి? విందేంటి?”

“మరి లేకపోతే...మళ్లీ దేనికోసం అంటున్నావ్” అన్నాడు నవీన్ కాస్త అసహనంగా...

“నవీన్..అమ్మాయికి ఆ మాత్రం సిగ్గూ, భయం ఉంటాయి నీకు తెలియదేమో”

“ఉంటాయి. కాని ఇప్పుడు మన టాపిక్ అది కాదు కదా..” అన్నాడు.

“చూడు నవీన్...ఒక అమ్మాయిని చూసిన వెంటనే ప్రేమించి పెళ్లి చేసుకోవాలనే ఆలోచన టెన్త్ పాసవ్వగానే డాక్టరో, ఇంజనీరో అయిపోదామని అనుకోవడం లాంటిదే. నువ్వు కూడా అలాంటి ఆలోచన చేస్తున్నావేమోనని నా డౌట్” మొహమాటం లేకుండా అడిగింది పవిత్ర.

“చూడు పవిత్ర నేను టెన్త్ కాదు. పీజీ చదువుతున్నాను. కాస్తో కూస్తో లోక జ్ఞానం ఉంది. నాకు నువ్వంటే ప్రేమో, ఇష్టమో తెలియదు కాని ఎప్పటికీ నువ్వు నాతో, నేను నీతోనే ఉండాలనే ఫీలింగ్ ఉంది” అంటూ పవిత్ర వంక చూశాడు.

పవిత్ర నుంచి ఏ విధమైన రెస్పాన్స్ లేదు. కొద్ది సమయం గడిచింది.

“సరే పవిత్ర, నువ్వు ఏం చెప్పలేకపోతున్నావంటే ఈ విషయంలో ఏం చెప్పడానికి లేదనే నాకు అర్థమవుతోంది. అంటే నా ప్రపోజల్ నీకు ఇష్టం లేనట్లుంది. నిన్ను ఇబ్బంది పెట్టాను. అందుకు క్షమించు” అంటూ అక్కడ నుంచి వెళ్లిపోబోయాడు.

రెండు అడుగులు వేసిన నవీన్‌కి “ఒకరికి ఒకరు క్షమాపణ చెప్పుకుంటే అది ప్రేమ కాదు” అన్న పవిత్ర మాటలు వినిపించాయి.

ఆ మాటలకు వెనక్కి తిరిగి “ఏంటి మళ్లీ చెప్పు, నాకు సరిగా అర్థం కాలేదు” అన్నాడు.

“ఏం డీ కోడ్ చేసుకోలేవా?” అనడిగింది పవిత్ర కాస్త సిగ్గుపడుతూ...

అంతే నవీన్ సంతోషానికి పగ్గాలు లేకుండా పోయింది. పవిత్ర నిలబడి ఉంటే నవీన్ మోకాలిపై కూర్చుని...“పవిత్ర థాంక్యూ, ఇప్పటివరకు నీకు ప్రపంచ భాషల్లో ప్రేమని చెప్పాను. ఇప్పుడు ప్రేమికుల భాషలో చెప్తున్నాను. నీ ప్రేమతో నేను మళ్లీ జన్మించాను. నా మరణం వరకు నీతోనే ఉంటాను” అన్నాడు సంతోషానికి లోనవుతూ...

“అవును పవిత్ర నువ్వు డీ కోడ్ చెయ్యమని అన్నావు కదా దాని ఆన్సర్ ఏంటి?” అని నవీన్ అడిగాడు.

“దాని ఆన్సర్‌తో ఇప్పుడు పని లేదు” చెప్పింది పవిత్ర.

“ఏం ఎందుకు లేదు? అయినా నాకు తెలుసుకోవాలని ఉంది”

“దానిలోని అక్షరాలను అటుఇటు పెట్టి చూడు DISCUSS IN DELHI అని వస్తుంది” అని చెప్పింది.

“ఇప్పుడు దీంతో అవసరం ఉందా?” అనడిగింది.

“భవిష్యత్‌లో ఉంటుందేమో” అన్నాడు నవీన్ సరదాగా.

“ఉండకూడదనే నేను అనుకుంటున్నాను” నవీన్‌ని సూటిగా చూస్తూ చెప్పింది పవిత్ర.

“ఉండదనే నీకు నేను మాటిస్తున్నాను” అని పవిత్ర చేతిలో చెయ్యేసి చెప్పాడు నవీన్.

*** * * * ***

పవిత్ర లూసీకి ఫోన్ చేసింది.

“అమ్మా నీతో ఒక ఇంపార్టెంట్ విషయం మాట్లాడాలి” సంతోషంగా చెప్పింది పవిత్ర.

పవిత్ర వాయిస్‌లో సంతోషంతో కూడిన ఎగ్జాయిట్‌మెంట్ వినిపిస్తుండటంతో హ్యాపీ న్యూస్ అని, అది కూడా తన ప్రేమ కోసమే అయ్యింటుందని లూసీ గ్రహించింది. ఎంతైనా సైక్రియాట్రిస్ట్ కదా మరి.

“అమ్మా నేను నవీన్ ప్రపోజల్‌కి ఓకే చెప్దామని అనుకుంటున్నాను. ఏమంటావ్ మమ్మీ” అని అడిగింది పవిత్ర.

“ఏమంటాను...పెళ్లి సంబంధాల కోసం తిరిగే బాధ తప్పించావు. థాంక్యూ బేబి అంటాను” అంది లూసీ.

“ఏంటి మమ్మీ ఎప్పుడూ జోకులేనా..!”

“ఓకే పవిత్ర...ఆలోచించే నిర్ణయం తీసుకున్నావు కదా. నేను, డాడీ మాట్లాడుకుని నవీన్‌తో మాట్లాడతాం. ఆ తర్వాత మనమంతా వాళ్లింటికి వెళ్లి పెద్దలతో మాట్లాడదాం ఓకేనా?” అడిగింది లూసీ.

“ఓకే ఓకే...కాని వెంటనే పెళ్లి అంటే ఒప్పుకోకండడి. నా పీజీ పూర్తయి, నాకు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీలో కాని, నాసాలో కాని, ఇస్రోలో కాని ప్రాజెక్ట్ లేదా జాబ్ వచ్చిన తర్వాతే అని చెప్పండి. దానికి టూ ఇయర్స్ పడుతుంది”

“ఓకే నీకు ఎలాగైతే మాకు అలాగే ఇష్టం. ఐ లవ్ యూ బేబి”

“థాంక్యూ మమ్మీ. నాన్నకి నువ్వే చెప్పు. నేను చెప్పలేను. ఉంటా బై మమ్మీ” అంటూ ఫోన్‌లో లూసీకి ఓ ముద్దు పెట్టింది పవిత్ర.

ఇంటి దగ్గర రాము. లూసీ ఈ టాపిక్‌పై డిస్కస్ చేసుకున్నారు.

*** * * * ***

గంటలు రోజులుగా, రోజులు వారాలుగా, వారాలు నెలలుగా చేసుకుంటూ కాలం

ప్రవహిస్తూనే ఉంది. ఈ ప్రవాహంతో నవీన్, పవిత్రల ప్రేమ కూడా బలపడింది.

నవీన్ కోసం ఒక రోజు పవిత్ర క్యాంటీన్ దగ్గర వెయిట్ చేస్తోంది. చెప్పిన టైమ్‌కి రాలేదు నవీన్. ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. మెసేజ్‌కి రిప్లై లేదు. నవీన్‌కి ఏమైందా అని టెన్షన్ పడుతోంది పవిత్ర. దీంతో చాలా కోపంగా ఉంది పవిత్రకి. చాలాసేపు వెయిటింగ్ తర్వాత క్యాంటీన్‌కి వచ్చాడు నవీన్.

"పెళ్లికి ముందు, పెళ్లికి తర్వాత కూడా అమ్మాయిలకు వెయిటింగ్ తప్పదేమో కదా..!" అని చిరాకుగా అడిగింది నవీన్‌ని.

"అదేంటి?" అన్నాడు.

"పెళ్లయిన అమ్మాయికి, పెళ్లికాని అమ్మాయికి పెద్దగా తేడా ఉండదు నవీన్. ఇద్దరు భర్త కోసం ఎదురు చూస్తారు. పెళ్లి కాని అమ్మాయి ఎలాంటి భర్త వస్తాడా అని ఎదురు చూస్తుంది. పెళ్లయిన అమ్మాయి భర్త ఇంటికి ఎప్పుడొస్తాడా అని ఎదురు చూస్తుంది" అని రుసరుసలాడుతూ చెప్పింది.

"అబ్బో...అబ్బో...అమ్మగారిలో మంచి కవయిత్రి కూడా ఉన్నట్టుందే" అన్నాడు.

"కవయిత్రే కాదు, కాళిక కూడా ఉంది" అంటూ గుర్రుగా చూసింది నవీన్ వైపు.

"ఏం లేదు అమ్మ హాస్టల్ నెంబర్‌కి ఫోన్ చేసింది. ఇంట్లో ల్యాండ్ లైన్‌కి ఫ్రీ ప్యాకేజ్ ఉంది. అందుకే హాస్టల్ ల్యాండ్ లైన్‌కి చేస్తుంది. ఏవో పెళ్లి సంబంధాలు కోసం చెప్తోంది. వచ్చే ఏడాది ఎలాగైనా పెళ్లి చేసుకోవాల్సిందేనని ఆర్డర్ జారీ చేసింది"

"అవునా...మరి స్వామి వారు ఏం చెప్పారో" అనడిగింది.

"ఏముంది నీ ఇష్టమే నా ఇష్టమని అమ్మతో చెప్పాను" అన్నాడు.

పవిత్ర నిజంగానే కలకత్తా కాళీలాగా చూడటం మొదలుపెట్టింది.

"జోక్ చేశాను పవిత్ర. అమ్మతో సంబంధాలు చూడనవసరం లేదు. నేను ఆల్రెడీ ఇక్కడో ప్రేమ సంబంధం చూసుకున్నానని చెప్పాను" అని అన్నాడు.

"దానికి అంటీ ఏమన్నారు..!" అనడిగింది ఉత్సాహంగా.

"అమ్మ కొంచెం సంప్రదాయం టైపు. కులం, మతం పట్టింపులెక్కువ. అవన్ని నేను చూసుకుంటాలే" అన్నాడు.

"నేనంటే ఇష్టం లేకపోయినా నువ్వు చెప్తే ఒప్పుకుంటుందా ఆవిడా...అవేమి అవసరం లేదు. మా మమ్మీ, డాడి వచ్చి మీ వాళ్లతో మాట్లాడతారు. వాళ్లు వాళ్లు ఒప్పుకుంటే మన పెళ్లి. లేదంటే నువ్వు నవీన్, నేను పవిత్ర...మన ఫ్రెండ్స్" అని క్లియర్‌గా చెప్పేసింది పవిత్ర.

"అదేంటి వాళ్లు ఒప్పుకోకపోతే నన్ను కష్టపెడతావా.."

"నాలుగు నెలల ప్రేమకే నన్ను కష్టపెడతావా అనడుగుతున్నావే...మరి 22

సంవత్సరాలు పెంచిన పేరెంట్స్ ఏమడగాలి మనల్ని? ప్రేమే జీవితం కాదు కదా నవీన్..! జీవితంలో ప్రేమ ఒక భాగం మాత్రమే. ప్రేమ సక్సెస్ అయితే ఆ ప్రేమే జీవితం అవ్వాలి. కాని సక్సెస్ కాని ప్రేమ కోసం మిగతా జీవితాన్ని ఎందుకు బలి చేయాలి?” అని అడిగింది పవిత్ర.

“కరెక్ట్...నువ్వు చెప్పింది కూడా బాగానే ఉంది. కాని మనం కలిసుండాలి. అనుకుంటున్నప్పుడు ప్రేమ కూడా సక్సెస్ అవ్వాలి కదా” అడిగాడు నవీన్.

“ప్రేమ సక్సెస్ అవ్వడమంటే మన వాళ్లందరినీ వదిలేసి...మనిద్దరం ఏకమవ్వడమా?” ఏకమవ్వడమా అనే పదాన్ని నొక్కి పలుకుతూ అడిగింది పవిత్ర.

పవిత్ర ఏం చెప్తుందో నవీన్‌కి అర్థమైంది.

# 13

**“పవిత్ర...**మేం బయలుదేరాం. మరో పది నిమిషాల్లో ఫ్లైట్ టేక్ ఆఫ్ అవుతుంది. నువ్వు రైట్ టైమ్‌కి ఎయిర్‌పోర్టుకి వచ్చేయ్”

“అలాగే వచ్చేస్తా...ఇప్పుడే నవీన్ కూడా ఫోన్ చేశాడు. వాళ్ల పేరెంట్స్ కూడా విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చి అక్కడే ఫ్లైట్ ఎక్కుతున్నారట. నెక్ట్స్ ఫ్లైట్‌కి వాళ్లు కూడా వచ్చేస్తారేమో” చెప్పింది పవిత్ర.

“ఓకే ఓకే...ఢిల్లీలో పెళ్లి చూపులు...ఏమైనా నీది రాజభోగమే తల్లి. ల్యాండ్ అవ్వగానే ఫోన్ చేస్తాను” అని ఫోన్ పెట్టేసింది లూసీ.

“బై మమ్మీ...హ్యాపీ ఫ్లైయింగ్” అంటూ ఫోన్ పెట్టేసింది పవిత్ర.

ఆ రోజు సాయంత్రం ఢిల్లీలోని ఓ పార్క్‌లో కలుసుకున్నారంతా.

“ఏమ్మా పార్క్‌లో పెళ్లి చూపులు పెట్టారు? ఏదైనా హోటల్‌లో అయితే బాగుండేది కదా” అని అడిగింది నవీన్ మదర్ పవిత్రని.

“హోటల్ రూమ్స్‌లో అయితే బంధించినట్లు ఉంటుందాంటీ. ఇక్కడైతే ప్రశాంతంగా, స్వేచ్ఛగా మాట్లాడుకోవచ్చు. ఓపెన్ మైండ్‌తో ఫ్రీగా ఉండొచ్చు” చెప్పింది పవిత్ర.

పవిత్ర పేరెంట్స్, నవీన్ పేరెంట్స్ ఒకరిని ఒకరు పరిచయం చేసుకున్నారు. నవీన్ తల్లి పద్మజ, తండ్రి గిరిధర్ ఇద్దరూ కూడా ప్రభుత్వ ఉద్యోగులే.

పవిత్ర మదర్ తనని పరిచయం చేసుకుంటూ “లూసీ” అని చెప్పినప్పుడు ఆమె వైపు అదోలా చూసింది పద్మజ. ఆ విషయాన్ని లూసీ గమనించలేదు.

పరిచయాలు పూర్తయిన తర్వాత పవిత్రతో కాసేపు మాట్లాడింది పద్మజ. వెంటనే పద్మజ తన కొడుకు నవీన్‌ని ఓ పక్కకు తీసుకెళ్లింది.

"ఏరా...నవీన్ పవిత్ర తండ్రి రాము అని పరిచయం చేసుకున్నాడు. మదరేమో లూసీ అని పరిచయం చేసుకుంది. రషీద్ తాతయ్య ఇంట్లోనే పెళ్లి జరగాలని పవిత్ర అంటోంది. అసలు ఏంట్రా నాకేమి అర్థం కావడం లేదు" అనడిగింది.

పవిత్రని చూసిన తర్వాత ఇవన్నీ పెద్దగా అడ్డురావని అనుకున్నాడు నవీన్. కాని వాళ్లమ్మ అడిగిన మొదటి ప్రశ్నకే తన దగ్గర సమాధానం లేదు. పవిత్ర నవీన్‌కి చెప్పిన తన కుటుంబ విషయాలన్నీ ఇప్పుడు నవీన్ తన తల్లి పద్మజకి చెప్పాడు.

అంతా విన్న పద్మజ "సరే పదా" అంటూ అక్కడ నుంచి వీళ్లు మాట్లాడుకుంటున్న చోటుకి వచ్చేశారు. అప్పటి నుంచి నవీన్ మదర్ పద్మజ ముభావంగానే ఉంది. కాసేపటి తర్వాత ఇక బయలుదేరుదామని అనుకున్నారు. ఒకరి ఫోన్ నెంబర్లు ఒకరు తీసుకున్నారు.

ఊరు వెళ్లిన తర్వాత మాట్లాడుకుందామని పద్మజ లూసీతో చెప్పింది.

"ఓకేనండి. అయితే ఒక విషయం పిల్ల నచ్చింది కదా అని వెంటనే పెళ్లంటే కుదరదు. వీళ్ల చదువులు పూర్తయిన ఏడాదైనా ఆగాలి" అంటూ లూసీ ముందుగానే కండిషన్ పెట్టింది.

"అలాగేనండి... మా బంధువులతో కూడా మాట్లాడి చెప్తామండి" అన్నారామె.

ఒకరికొకరు టాటాలు చెప్పుకుంటూ ఆ పార్కు నుంచి బయటపడ్డారంతా.

లూసీ. రాములు కూడా నవీన్ విషయంలో హ్యాపీగానే ఉన్నారు. అయితే వాళ్ల పేరెంట్స్‌కి ఏదో అసంతృప్తి అన్న విషయం గుర్తించారు. సరే ఏదైనా వాళ్ల నుంచి ఏం సమాధానం వస్తుందో చూసి అప్పుడు మాట్లాడదాం అని అనుకున్నారు.

* * * * *

మూడురోజుల తర్వాత నవీన్ పేరెంట్స్‌కి ఫోన్ చేశాడు. వాళ్లకి ఏం సమాధానం చెప్తామని అనుకుంటున్నారని అడిగాడు.

"చదువైన తర్వాత కదరా పెళ్లి. ఇప్పుడు నుంచీ తొందరెందుకు? ఇంకా టైముంది కదా, అప్పుడు చూద్దాంలే" అన్నారు వాళ్లు.

"అది కాదు నాన్న...వాళ్లకి ఏదైనా ఒక సమాధానం చెప్పడం మర్యాద. లేకపోతే వాళు ఏమనుకుంటారు. మనకి ఈ సంబంధం ఇష్టమనా..! లేదనా..! ఏదో ఒకటి వాళ్లకి తెలియాలి కదా. పైగా మీరు ఏదో ఒక విషయం చెప్పేస్తే మాకూ టెన్షన్ ఉండదు. లేదంటే ఈ విషయం కోసం ఆలోచిస్తూ మా చదువులు పాడైపోతాయి" అన్నాడు నవీన్.

"నీ గోలేంట్రా...ఏం చెప్పమంటావు? వాళ్ల కులాలేంటో? మతాలేంటో? అంతా గందరగోళంగా ఉందిరా. అసలు వాటి కోసం ఆలోచించాలంటేనే చాలా సమయం

పట్టేటట్లు ఉంది. అంత కన్ఫ్యూజన్ ఉంది వాళ్ల విషయంలో" అన్నాడు నవీన్ తండ్రి గిరిధర్.

"ఇంకా ఈ రోజుల్లో కూడా కులాలు, మతాలేంటి డాడీ? పైగా మేమిద్దరూ కూడా కుల, మతాల పట్టింపు లేవి పట్టించుకోం" అన్నాడు.

"మీరు పట్టించుకోరు కాని మేం పట్టించుకోవాలిరా" అన్నాడు గిరిధర్.

"మీకు పిల్లల కంటే మీకు కులం, మతమే ఎక్కువ డాడీ..!"

"ఎక్కువ, తక్కువ సమస్య కాదురా..! మనకి మన వాళ్లలో ఎంత గౌరవం ఉందో నీకూ తెలుసు. ఇప్పుడు ఇలా ఈ పట్టింపులు లేని పెళ్లి చేస్తే మన గౌరవం ఏమౌతుంది? పైగా అందరూ అన్ని విషయాల్లో మన సలహా తీసుకుంటారు. ఇప్పుడు ఈ పెళ్లయితే అందరూ మనకి సలహాలు ఇస్తారు. అది ఏమైనా బాగుంటుందా? మన కుటుంబాల పరువు ముఖ్యమా..! నువ్వు కోరుకుంటున్న ఆ అమ్మాయితో పెళ్లి ముఖ్యమా..!" అనడిగాడు కోపంగా.

"ఇలా ప్రతిదానికి కుటుంబం, పరువు, గౌరవం అని లింక్ పెడితే ఏం చెప్పాలి? కాని ఒక్క విషయం డాడీ...నేను పవిత్రనే పెళ్లి చేసుకుంటాను. ఇందులో ఏ మాత్రం మార్పు లేదు. మీరు ఈ విషయంలో బాధపడినా సరే. మతం కోసం నచ్చిన మనుషుల్ని వదులుకోవాలా?" అని గట్టిగానే అడిగాడు నవీన్.

"ఏమోరా బాబు మేం మీలా పెద్ద చదువులు చదువుకోలేదు. ఢిల్లీలోనూ ఉండలేదు. మాకు తెలిసింది ఇంతే. మాకు నీ సుఖమే ముఖ్యం. కాని ఈ పెళ్లి చేస్తే, మతం కాని మతం, కులం కాని కులం పెళ్లి అంటూ మన వాళ్లు ఆడే మాటలు తలుచుకుంటేనే భయంగా ఉందిరా" అన్నాడు గిరిధర్.

"డాడీ మనం 21వ శతాబ్దంలో ఉన్నాం. ఇంకా కులం, మతం ఏంటి డాడీ?"

"అలాగైతే మరి అదే 21వ శతాబ్దంలో ఇన్ని చర్చ్‌లు, మసీదులు, గుళ్లు ఎందుకున్నాయ్? మతం ఉంది కాబట్టే ఇవి ఉన్నాయ్" అని గిరిధర్ గట్టిగానే చెప్పాడు.

ఆ మాటకి ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు నవీన్‌కి.

"ఒకసారి అమ్మకి ఫోనివ్వండి నేను మాట్లాడతాను" అన్నాడు.

"మీ అమ్మ పక్కనే ఉంది. స్పీకర్ ఫోన్ ఆన్‌లో ఉంది. అంతా వింటోంది. మీ అమ్మదైనా, నాదైనా మన కుటుంబంలో ఎవరిదైనా ఇదే మాట. ఇదే వాదన. ఆపై నీ ఇష్టం" అని విసుక్కున్నాడు.

"బాగా ఆలోచించండి...నా నిర్ణయం చెప్పేశాను. ఆ తర్వాత మీ ఇష్టం అని ఫోన్ పెట్టేశాడు" నవీన్ కోపంగా.

* * * * *

మరుసటి రోజు..

క్లాస్ అయిన తర్వాత క్యాంటీన్‌లో కలుసుకున్నారు పవిత్ర, నవీన్.

"నవీన్ పార్కులో పెళ్లి చూపులకి మీ పేరెంట్స్ దగ్గర నుంచి ఏదైనా సమాచారం వచ్చిందా..?" అని ఎంతో ఆసక్తిగా అడిగింది పవిత్ర.

"వచ్చింది" అన్నాడు డల్‌గా..

"నేను నచ్చలేదా మీ వాళ్లకు అంత డల్‌గా చెప్తున్నావ్.."

"డాడీకి, మా మమ్మీకి అన్నీ ఓకే...ఒక్క మీ రిలీజియన్ తప్ప" అన్నాడు.

"మతమా...?"

"మా వాళ్లకి హిందు మతానికి చెందిన అమ్మాయే కావాలంట.."

"నేను హిందువునే కదా.."

"నువ్వు హిందూవే, కాని మీ మమ్మీ, మీ తాతయ్య వీళ్లంతా మావాళ్లకి కొంచెం కన్ఫ్యూజింగ్‌గా ఉందట"

"కన్ఫ్యూజన్ ఏముంది? నేను హిందువుని, మా మమ్మీ క్రిస్టియన్, మా డాడీ బోర్న్ బై హిందూ, బ్రాటప్ బై ముస్లిం, మా తాతయ్య ముస్లిం...అంతా క్లియర్‌గానే ఉంది కదా..."

"క్లియర్‌గా ఉండటం కాదు...మీ ఇంట్లో వాళ్లని చూస్తుంటే భారతదేశం కనిపిస్తోందట"

"మంచిదే కదా...దేశమంతా మన ఇంట్లోనే ఉంటుందిగా..!"

"నీకు వేళాకోళంగా ఉంది పవిత్ర...నాకు ఏం చేయాలో అర్థం కావడం లేదు"

"నాకు అర్థమైంది. మీ వాళ్లకి పెళ్లిళ్లు కావాలంటే మతాలు కావాలి. మాకు పెళ్లిళ్లు అంటే మనసులు చాలు" అని సీరియస్‌గా చెప్పింది పవిత్ర.

"మళ్లీ మాట్లాడి చూస్తాను మా వాళ్లతో. కాని పవిత్ర నా నిర్ణయం అయితే ఎప్పుడో అయిపోయింది. నువ్వే నా భార్యవి. మా వాళ్లు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా, చివరకు మీ వాళ్లు కాదన్నా సరే, ఇది ఫైనల్" అన్నాడు.

"ఒక పని చేద్దాం నవీన్. మన ఫైనల్ ఎగ్జామ్స్ అయిపోయి జాబ్స్ వచ్చేంత వరకు పెళ్లి టాపిక్ వద్దు. మీ ఇంట్లో వాళ్లతో కూడా మాట్లాడకు. నేను మా ఇంట్లో ఇదే విషయం చెప్పేస్తాను. ఎందుకంటే మన చదువులు డిస్ట్రబ్ కాకూడదు. అందుకే ఎగ్జామ్స్ అయిన తర్వాత అప్పుడు మళ్లీ మనం ఈ టాపిక్ గురించి మాట్లాడుకుందాం" చెప్పింది పవిత్ర.

"ఓకే ఇది కూడా బెస్ట్ ఐడియానే. ఎందుకంటే ఏ సమస్యకైనా టైమ్‌కి మించిన మెడిసిన్ ఉండదు కదా"

"లెట్స్ సీ...వాట్ టైమ్ విల్ డూ..."" అనుకున్నారిద

రోజులు గడుస్తున్నాయ్...

పవిత్ర, నవీన్ ఇద్దరూ అనుకున్నట్లుగానే తమ ప్రేమ టాపిక్, పెళ్లి టాపిక్ ఎక్కడా తీసుకురాలేదు. సెకండియర్ కావడంతో చదువుపైనే దృష్టిపెట్టారు. కానీ ఒంటరిగా ఉన్నప్పుడో, రాత్రి నిద్రపోదే ముందు తమ ప్రేమ, పెళ్లి ఆలోచనలు ఎంత వద్దనుకున్నా వస్తూనే ఉన్నాయి. వాటితో పాటు కన్నీళ్లు కూడా వస్తున్నాయి.

"ఫైనల్ ఎగ్జామ్స్ ముగిశాయి. ఇక ఉద్యోగ ప్రయత్నాలు చేయడమో, లేదంటే రీసెర్చ్ కోసం ప్రయత్నించడమో చేయాలి. అయితే ఆ ప్రయత్నాలు ఢిల్లీ నుంచి చేస్తేనే బెటర్. అందుకే హాలీడేస్‌లో కొన్ని రోజులు ఇంటికెళ్లి వచ్చేస్తే ఈలోపు రిజల్ట్స్ కూడా వచ్చేస్తాయి. అప్పుడు ఉద్యోగ ప్రయత్నాల్లో బిజీ అయిపోవచ్చు. అందుకే ఒకసారి ఇంటికి వెళ్దామని అనుకుంటున్నాను" అని నవీన్‌తో చెప్పింది పవిత్ర.

"నేను కూడా వస్తాను, ఇద్దరం కలిసి వెళ్దాం" అన్నాడు నవీన్. దాంతో రెండు రోజుల్లో ఇద్దరూ సొంత ఊర్లకు బయలుదేరారు.

"పేరెంట్స్‌ని చూసొస్తే అదొక రిలీఫ్, అందుకే బయలుదేరాను" చెప్పింది పవిత్ర.

"నీతో వస్తే నాకు రిలీఫ్, అందుకే నేను బయలుదేరాను" చెప్పాడు నవీన్ నవ్వుతూ.

"ఈ మాటలకు ఏం తక్కువ లేదు. పేరెంట్స్‌ని మాత్రం ఒప్పించలేవు" అంటూ నవీన్‌ని తలపై ఒక్కటేసింది.

"జాబ్స్ వచ్చేవరకు ఆ టాపిక్ వద్దనుకున్నాం కదా" అన్నాడు నవీన్.

"అబ్బో ఈ విషయంలో మాత్రం స్ట్రిక్ట్ రూల్స్ ఉంటాయి కదా..." అంది కోపంగా.

"అవును పవిత్ర...మీ ఇంట్లో ఇన్ని మతాల వారు ఉన్నారు కదా..! ఎప్పుడైనా, ఏ మత పరమైన విషయంలోనైనా క్లాస్ వచ్చిందా?" చాలా ఆసక్తిగా తెలుసుకోవాలని అడిగాడు నవీన్.

"లేదు...ఎందుకంటే మా ఇంట్లో ఎవరూ మతాలు కోసం మాట్లాడుకోం. నువ్వన్నట్లు మా ఇల్లు భారతదేశం. మేమంతా భారతీయులం"

"కాని మా ఇల్లు మాత్రం హిందుస్థాన్. మేమంతా హిందువులం" అన్నాడు నీరసంగా.

"అదే సమస్య నవీన్. మతాన్ని ఎందుకో ఒక దైవంలా కొలుస్తారు. దేవుడే దిగి వచ్చినా ఏ మతానికి చెందిన దేవుడివి అని అడుగుతాం మనం" చెప్పింది పవిత్ర నిర్వేదంగా.

"నిజమే పవిత్ర. మతమంటే ఏంటని అడిగితే నువ్వేమి చెప్తావు?" అనడిగాడు నవీన్.

"మనిషి ఆలోచనా జ్ఞానమే మతం. జంతువులకి ఏ మతం ఉండదు. ఎందుకంటే వాటికి జ్ఞానం లేదు కాబట్టి. మానవునిలా అనవసరపు బాధలు ఏమీ ఉండవు వాటికి. గతపు ఆలోచనలూ ఉండవు. భవిష్యత్‌పై బెంగా ఉండదు. కాని మనిషికి అలా కాదు. మనిషి తనని తాను నియంత్రించుకుంటూ, మలుచుకుంటూ, సమాజాన్ని గౌరవిస్తూ, తనకి

తెలియని శక్తి ఉందనే విశ్వాసంతో జీవించాలి. అందుకు ఒక మార్గం కావాలి. ఆ మార్గమే మతం” అని మతం కోసం తన అభిప్రాయం చెప్పింది పవిత్ర.

“అయితే ఇప్పుడు ఆ మతాలు మనిషిని శాసించే స్థితికి ఎదిగిపోయాయి. మతాల వల్ల ఎంత నష్టం జరుగుతోందో కళ్లారా చూస్తున్నప్పటికీ ప్రజల్లో మతం పట్ల ఉండే మూఢ భక్తి తగ్గటం లేదు.  తమ పుట్టుక దగ్గర్నుంచీ ప్రతి దానికీ సైన్స్ మీదనే ఆధారపడే ప్రజలు దాన్ని పూర్తిగా నమ్మలేకపోతున్నారంటే వారిని వెనక్కులాగే శక్తులు ఎంత బలమైనవో అర్థం చేసుకోవచ్చు. వేల ఏళ్ల క్రితం చార్వాకులతో మొదలుపెట్టి, ఇప్పటి నాస్తికవాదులు, వామపక్షాలు చేస్తున్న ప్రయత్నాలేవి గుడ్డి నమ్మకాలను, మత విశ్వాసాలను తొలగించలేకపోతున్నాయి.

అసలు మత హింస ఏ ఒక్క మతానికో పరిమితమైంది కాదు. మత హింస ప్రధానంగా రాజకీయ ఆధిపత్యం కోసమో, డబ్బు కోసమో జరుగుతుంది. దీన్ని ప్రేరేపించే వారు ప్రజల్లో ఉద్వేగాలను రెచ్చగొట్టడానికి మతాలను వాడుకుంటారు. గొర్రెలమందల్లా వచ్చే భక్తులకు నీతివచనాలు వల్లించే మతాధికారులు చరిత్రలో జరిపినంత రక్తపాతం యుద్ధాలలో కూడా కనిపించదు” అని చెప్పిన పవిత్ర ముఖంలో ఏదో అసహనం కనిపిస్తోంది.

టాపిక్ సీరియస్‌గా ఉండటంతో ఇద్దరి మధ్య కాసేపు నిశ్శబ్దం వచ్చి చేరింది. ఇంతలో వీరి నిశ్శబ్దాన్ని ఛేధిస్తూ పెద్ద శబ్దం చేసుకుంటూ ఫ్లైట్ ల్యాండ్ అయ్యింది.

“ఇంటికి రాకూడదూ..!” అనడిగింది పవిత్ర.

“నేను వచ్చినా మీ పేరెంట్స్‌ని ఫేస్ చేయడం ఇబ్బందిగా ఉంటుంది నాకు” అన్నాడు.

“ఓకే ఓకే…బై బై” అంటూ ఇద్దరూ చెరో వైపు వెళ్లారు.

# 14

**ఎయిర్‌పోర్టు** నుంచి క్యాబ్ మాట్లాడుకుని  పవిత్ర  ఇంటికి చేరుకుంది. పవిత్ర వస్తుండటంతో రాము ఆఫీసుకి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉన్నాడు. పవిత్రని చూడగానే రాము, లూసీలకు ఏదో తెలియని రిలీఫ్ వాళ్ల ముఖాల్లో కనపడుతోంది. అయితే పవిత్ర డల్‌గా ఉండటం లూసీ, రాము ఇద్దరూ గమనించారు. పవిత్రని విషయం అడిగి తెలుసుకున్నారు. నువ్వెళ్లి పడుకో, రేపు మనం సరదాగా అవుటింగ్‌కి వెళ్తున్నాం అంటూ పవిత్రని సముదాయించారు.

ఎంత ప్రయత్నించినా పవిత్రకి నిద్ర పట్టడం లేదు. తన కుటుంబాన్ని మతం ఎందుకు

ప్రతిసారి ఇబ్బంది పెడుతుందోనని ఆలోచిస్తోంది. అంతు తెగని ఆలోచనలు...ఏవేవో ప్రశ్నల పరంపర...మనసులో ఒకటే పోరాటం...పవిత్ర చేస్తున్న పోరాటంలో శత్రువు అమితమైన బలవంతుడు. అయితే ఆ శత్రువు కనిపించడు. కనిపించని శత్రువుతో పోరాటమంటే ఎంతటి వీరుడికైనా అసాధ్యమే. శత్రువు కనిపించకపోయినా, ఆ శత్రు సైన్యం అన్ని వైపుల నుంచి తరుముకొస్తోంది. ఆ శత్రువు కల్పితం కాదు. నిజం.

పవిత్ర పోరాటంలో శత్రువు "మతం". మతం అంటే నిర్వచిండడం కష్టం. అన్ని మతాలు సమానంగా అనుసరించే నిర్వచనం అసలు సాధ్యమే కాదు. "కనిపించని శక్తులపై విశ్వాసం, ప్రదర్శించే ఆచరణే మతం" అన్నారు కొందరు. ఆ కనిపించని శక్తులు దేవత కావచ్చు. దెయ్యం కావచ్చు. మరేదైనా కావచ్చు. పవిత్ర ఆలోచనలు ఆగడం లేదు.

మరుసటి రోజు ముగ్గురూ అవుటింగ్‌కి బయలుదేరారు. హైదరాబాద్‌లో చాలా ప్రదేశాల్లో తిరిగారు. తామెళ్లిన ప్రతి చోటా రకరకాలైన ఫోజుల్లో ఫొటోలు తీసుకున్నారు. సెల్ ఫోన్లని అస్సలు ఉపయోగించకుండా టెక్నాలజీకి దూరంగా ఆ సాయంత్రం వరకు హైదరాబాద్ మొత్తం చక్కర్లు కొట్టి రాత్రి పది గంటలకు ఇంటికి చేరుకున్నారు.

ఇంటికి రాగానే పవిత్ర తన సెల్‌ఫోన్ ఆన్ చేసింది. ఆన్ చేయగానే మెయిల్ అలర్ట్ వచ్చింది. ఏంటా అని ఓపెన్ చేసింది.

ఆ మెయిల్ చూడగానే "డాడీ..."అంటూ పెద్దగా పిలిచింది. ఏం జరిగిందోనని రాము, లూసీ పరుగుపరుగున పవిత్ర రూంకి వెళ్లారు.

పవిత్ర ఫోన్‌లో ఏదో చూస్తూ కనిపించింది. పవిత్ర ముఖం సంతోషంతో వెలిగిపోతోంది. దాంతో ఇద్దరూ ఊపిరి పీల్చుకుని విషయం ఏంటని అడిగారు. డాడీ నాకు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ నుంచి ఆఫర్ లెటర్ వచ్చింది అంటూ ఆనందంతో చెప్పింది.

"ఓ కంగ్రాట్స్ ఇక మా పవిత్ర అంతరిక్షంలోకి ఎగిరిపోతుందన్నమాట" అంటూ లూసీ, రాములిద్దరూ కలిసి పవిత్రని పైకి ఎత్తారు.

పవిత్ర మూడ్‌ని ఆ మెయిల్ పూర్తిగా మార్చేసింది. ఎవరికో కాని రాని అవకాశం తనకి రావడంతో ఫుల్ హ్యాపీగా ఉంది. ఢిల్లీ వెళ్లి ఉద్యోగ ప్రయత్నాలు చేయాలని అనుకుంది. నెల రోజుల క్రితం ఆన్‌లైన్‌లో జరిగిన ఇంటర్వ్యూకి రెస్పాన్స్ వస్తుందని అనుకోలేదు. అందులోని ఈఎస్ఏ (యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ)లో జాబ్ అంటే మాటలా మరి. యూరప్ దేశాలన్నీ అంతరిక్ష పరిశోధనల కోసం ఏర్పాటు చేసుకున్న సంస్థ అది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్పేస్ సైంటిస్టుల్లో అతి తక్కువ మందికి మాత్రమే అందులో పని చేసే అవకాశం వస్తుంది. అలాంటి సంస్థలో తనకి అవకాశం రావడం చాలా సంబరంగా ఉంది పవిత్రకి. పైగా భూలోక స్వర్గంగా భావించే ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఉద్యోగం.

రెండు వారాల్లోగా జాయిన్ అవ్వాలని టైమ్ పెట్టారు. దీంతో పవిత్ర మరుసటి రోజు నుంచే ఫ్రాన్స్ వెళ్లడం కోసం ప్రయత్నాలు చేయడం ప్రారంభించింది. వారం రోజుల్లో పారిస్ ప్రయాణానికి అంతా సిద్ధం చేసేసింది.

పవిత్ర పేరెంట్స్‌తో పాటు తాతయ్యలైన రషీద్, అనిల్ కూడా వీళ్లతో పారిస్ బయలుదేరారు. జాయినైన తర్వాత వారం రోజుల పాటు ఉండి ఆ తర్వాత తాము ఇండియా వచ్చేస్తామని చెప్పారు. మళ్లీ ఇండియాలో వ్యవహారాలు అన్నీ చక్కబెట్టుకుని వస్తామన్నారు.

ఐదుగురు పారిస్ బయలుదేరారు. పవిత్రకి ఉన్న సర్కిల్‌లో ఓ ఫ్రెండ్ ద్వారా ఫ్రాన్స్‌లో సెటిలైన తెలుగు అమ్మాయిని కాంటాక్ట్ చేసింది. పారిస్‌లో ల్యాండ్ అయిన తర్వాత ఆ అమ్మాయి ఇంట్లోనే బస చేశారు.

ఇంకా ఒక రోజు జాయినింగ్‌కి టైమ్ ఉండటంతో ఆ రోజు పారిస్‌ని చూడడానికి నిర్ణయించుకున్నారు. అయితే రషీద్, అనిల్‌లు మాత్రం "తాము రాలేమని ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటామని చెప్పారు. ఇంకా వారం ఉంటాం కదా అప్పుడు మేం చూస్తాంలే" అన్నారు.

ప్రపంచంలో ఎక్కువ మంది అమెరికా వెళ్లాలనే కల కంటారు. అక్కడి జీవితం అలాంటిది మరి. కాని అమెరికాలో మాత్రం "అమెరికాలో మంచివారు ఎవరైనా మరణిస్తే పారిస్‌కి పోతారు" అనే సామెత ఉంది. అంటే అమెరికన్లు పారిస్‌ని స్వర్గంతో పోల్చేవారు. అసలు పారిస్ ఒక నగరం కాదు. అదో ప్రపంచం.."మనల్ని మనం మరిచిపోయి, మనల్ని మనం ఆవిష్కరించుకునే, పనికిరాని పాత గతానికి పాతరేసే నగరం పారిస్" అని ఎందరో కవులు  పారిస్ గొప్పతనాన్ని చెప్పేవారు.

## ఆ రోజు తేదీ నవంబర్ 13, 2015.. రాత్రి 9.15 గంటలు

పవిత్ర, లూసీ, రాము ముగ్గురినీ పవిత్ర ఫ్రెండ్ పారిస్‌లోని ర్యాక్ బ్యాండ్ జరుగుతున్న ఫ్రాన్స్ బాటాక్లాన్ కాన్సెర్ట్ హాలు వద్ద డ్రాప్ చేసింది. తాను ప్రోగ్రాం అయ్యేలోగా వచ్చి పికప్ చేసుకుంటానని చెప్పి వెళ్లిపోయింది.

ఫ్రాన్స్ రాజధాని పారిస్. వీధులన్నీ కళకళలాడుతున్నాయి. ఫ్రాన్స్ బాటాక్లాన్ కాన్సెర్ట్ హాల్లో అమెరికాకు చెందిన ఈగల్స్ ఆఫ్ డెత్ మెటల్ రాక్ బ్యాండ్ చూసేందుకు బాగా జనాలు వచ్చారు. ఆ వాతావరణం అంతా కొత్తగా ఉంది రాము ఫ్యామిలీకి. రాము, లూసీ, పవిత్ర పక్కపక్కనే కూర్చుని రాక్‌బ్యాండ్‌ని ఎంజాయ్ చేస్తున్నారు. మరో వైపు రాక్ బ్యాండ్ జరుగుతున్న చోటుకి దగ్గరలో ఉన్న నేషనల్ స్టేడియంలో ఫుట్‌బాల్ మ్యాచ్ సందడి. దీంతో చుట్టుపక్కలున్న హెూటల్స్, రెస్టారెంట్లు, రోడ్లు అన్నీ యువతతో కోలాహలంగా ఉంది. ఆ సమయంలో ఫ్రాన్స్‌ని చూస్తే స్వర్గం అంటే ఇదేనేమో అనిపిస్తుంది.

అదే సమయంలో 8 మంది ఉగ్రవాదులు ఏకే 47 గన్స్‌తో ఒంటికి చుట్టుకున్న బాంబులతో పారిస్‌లోకి ఎలా వచ్చారో కాని నగరంలోకి ప్రవేశించారు. వారు నేరుగా కాన్సెర్ట్ జరుగుతున్న చోటుకి వచ్చారు. కాన్సెర్ట్ ఫుల్ జోష్‌గా జరుగుతోంది. చెవులు హెూరెత్తించే వాయిద్యాలు, డ్రమ్స్‌తో హాల్ మొత్తం దద్దరిల్లిపోయింది. అంతా రాక్ బ్యాండ్‌ని ఎంజాయ్ చేస్తూ ప్రోగ్రాంలో పూర్తిగా లీనమై ఉన్నారు. "హు విల్ లవ్ ద డెవిల్? (దెయ్యాన్ని ఎవరు ప్రేమిస్తారు?), హు విల్ కిస్ హిస్ టంగ్? (దెయ్యం నాలుకని ఎవరు

ముద్దాడుతారు?), హు విల్‌కిస్ ద డెవిల్ అన్ హిస్ టంగ్? (దెయ్యాన్ని, దెయ్యం నాలుకపై ఎవరు ముద్దాడుతారు)” అంటూ గాయకులు అరుస్తూ ఉంటే 1500 మంది ప్రేక్షకులు చేతులు పైకి ఊపుతూ ఎంజాయ్ చేస్తూ ఊగిపోతున్నారు. హుషారుకి కేరాఫ్ అడ్రసులా ఉంది ఆ కాన్సెర్ట్.

ఇంతలో ఏవో నినాదాలు చేస్తూ అక్కడికి చేరుకున్న ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులు మొదలుపెట్టారు. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే బుల్లెట్లు అక్కడున్న సగం మందిని విగత జీవులుగా మార్చేశాయి. అయినా ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరుపుతూనే ఉన్నారు. పారిపోతున్న వారిని కూడా వదలకుండా కసి తీరా కాల్చుతున్నారు. భయంతో వణుకుతున్న వారిని సైతం విడిచిపెట్టలేదు. వారిపై కూడా ఉగ్రవాదులు కాల్పులు ఆపడం లేదు. పారిస్‌ని ఉగ్రవాద దెయ్యం ముద్దాడినట్లుగా ఉంది.

కాల్పుల్లో రాము, పవిత్రలకు బుల్లెట్ దెబ్బలు ఎక్కువ తగిలాయి. లూసీ వీరిద్దరికి అవతల ఉండటంతో ఒకే బుల్లెట్ తగిలింది. అప్పటికే తీవ్ర గాయాలపాలైన రాము, పవిత్రలు అక్కడే జీవచ్ఛవాల్లా పడి ఉన్నారు.

చాలాసేపు విచక్షణా రహితంగా కాల్పులు జరిపిన ఉగ్రవాదుల్లో కొందరు రాక్ బ్యాండ్ కాన్సెప్ట్ వద్ద నుంచి అటు ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతున్న స్టేడియం దగ్గరకు వెళ్లారు. కొందరు ఇక్కడే ఉన్నారు. వీరంతా తమ నడుంకి ఉన్న బాంబులపై చేతులేసి మీట నొక్కారు.

ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలుడు..! ఏం జరిగిందో తెలుసుకునే లోపలే మరో పేలుడు..! జనం రద్దీ హోరులో అకస్మాత్తుగా బాంబు పేలుళ్లు. నిప్పులు చిమ్ముకుంటూ దట్టమైన పొగ..! ఏం జరిగిందో చూసేలోపు చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు..! కొన్ని మాంసపు ముద్దలై...మరికొన్ని నెత్తుటి మడుగులో..! కాళ్లు చేతులు తెగిపడిన వారి హాహాకారాలు, రోదనలు, వేదనలు. రోడ్లపై భయంతో పరుగులు తీస్తున్న జనం. ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా ఇవే దృశ్యాలు. అప్పటి వరకు కాల్పులు జరిపిన ఉగ్రవాదులు తమ వద్ద ఉన్న బాంబులతో తమని తాము పేల్చుకున్నారు.

వరుసగా ఆరు బాంబులు పేలాయి. ఆ ప్రాంతం ఒక్కసారిగా వణికిపోయింది. ఫ్యాషన్ల రాజధాని పారిస్ రక్తపు మడుగులా ఉంది. వరుస బాంబు పేలుళ్ల శబ్దం ఎక్కడో దూరంగా ఉన్న వారికి కూడా వినిపిస్తోంది కాని...బాంబు పేలుళ్ల బాధితులకు, క్షతగాత్రులకు ఏమి వినిపించడం లేదు. భారీ పేలుళ్లకి ఎవ్వరికీ చెవులు పని చేయడం లేదు. కనిపిస్తున్న దృశ్యాలు వేదనాభరితంగా ఉన్నాయి. పేలుడు దాటికి ప్రాణాలు కోల్పోయి కొందరు...తీవ్ర గాయాలతో ఆర్తనాదాలు చేస్తూ రక్తపు మడుగులో మరికొందరు. అక్కడంతా భీతావహ పరిస్థితి కనిపిస్తోంది.

కాన్సెర్ట్ హాల్లో ఉన్న లూసీ, రాము, పవిత్ర ముగ్గురూ కూడా బాంబు ధాటికి అల్లంత దూరాన్న ఎగిరిపడ్డారు. ఎత్తు నుంచి రోడ్డుని గుద్దుకుని పడటంతో శరీరంలోని ఎముకలు విరిగిపోయిన విషయం తెలుస్తోంది. పైగా పెద్ద పేలుడుతో వచ్చిన వేడిని

తట్టుకోలేకపోతున్నారు. ప్రాణాలు ఉన్నాయి కాని పోయేటట్టే ఉన్నాయి. శరీరంలోని అవయవాలు అన్నీ ఉన్నాయో లేవో కూడా తెలియడం లేదు. ప్రాణమైతే ఉందనే విషయం కూడా అస్పష్టంగా తెలుస్తోంది. భరించలేని బాధ వల్లే ప్రాణముందనే విషయం తెలుస్తోంది. శరీరంలోకి ఇనుప ముక్కలు, మేకులు దిగబడ్డట్టుగా ఉన్న ఆ పెయిన్‌ని తట్టుకోవడం చాలా కష్టంగా ఉంది.

ఎక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ప్రజలు పరుగులు పెట్టారు. ఆ బాంబు దాడుల్లో, కాల్పుల్లో 120 మందికి పైగా బలయ్యారు.

పేలుళ్లతో గాయపడ్డ వారిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రులతో పాటు పారిస్ జనరల్ ఆసుపత్రి (PGH)కి కూడా తరలించారు. పవిత్ర, లూసీ, రాములను పారిస్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. పవిత్ర బాధని తట్టుకోలేకపోతోంది. ఆ బాధపడేకంటే ప్రాణాలు పోతేనే బాగుండు అన్నట్లుగా ఉంది వారి పరిస్థితి. పీజీహెచ్‌కి చేరగానే పవిత్ర రాము, లూసీలను వేర్వేరు స్ట్రేచర్స్‌పై తీసుకుని వెళ్తున్నారు.

పవిత్ర రాము వైపు చూసి అతి కష్టం మీద "నాన్న...నేను చచ్చిపోతానా?" అని అడిగింది దీనంగా. దానికి రాము ఏం సమాధానం చెప్పలేకపోతున్నాడు. కూతురి బాధని చూడలేకపోతున్నాడు. కళ్లు మూసుకుందామంటే ఇదే ఆఖరి చూపుతుందనే అనుమానం. అందుకే తన కళ్లు మూతలు పడుతున్నా కూతురి వైపు అలా చూస్తూనే ఉన్నాడు. వీరి ముగ్గురికీ వైద్యులు అత్యవసర చికిత్సలు అందిస్తున్నారు.

రషీద్, అనీల్, పవిత్ర ఫ్రెండ్ జనరల్ ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడి వైద్యులు ఏం సమాధానం చెప్పలేకపోతున్నారు. వారి ప్రయత్నాలు వారు చేస్తూనే ఉన్నారు. లూసీ ఇంకా అపస్మారక స్థితిలోనే ఉంది. లూసీకి వైద్యం అందుతోంది. కాని ఇంకా చలనంలోకి రాలేదు. ప్రాణాలైతే ఉన్నాయి.

ఇదిలా ఉంటే ఉగ్రవాదులు వీడియో సందేశం ఒకటి విడుదల చేశారు. "దేవుడి తరపున జరగుతున్న మత యుద్ధంలోకి దిగే దేశాలకు మేం చెబుతున్నదిదే. పారిస్ మాదిరిగా మీ గురించి దేవుడు తలచుకునే రోజు మీకూ వస్తుంది. ఇప్పటికే పారిస్ నడిబొడ్డున దాడి చేశాం. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో కూడా దాడి చేస్తాం" అంటూ ఒక వ్యక్తి వీడియో ద్వారా హెచ్చరించాడు.

ఆ వీడియో చూసిన ఫ్రాన్స్ ప్రభుత్వం, ప్రపంచంలోని అనేక దేశాల ప్రభుత్వాలు అన్నీ మతం పేరుతో జరుగుతున్న ఉగ్రవాదంపై ఉక్కు పాదం మోపాలని నిర్ణయించాయి.

ఆ వీడియో సందేశం విన్న రషీద్ "దేవుడా ఎవరి కోసమయ్యా ఈ మతం. అసలు నువ్వెక్కడున్నావు? ఉంటే నా కొడుకు, కోడలు, మనుమరాలితో పాటు అందరిని బతికించు. ఎవ్వరినీ నీ దగ్గరకు మాత్రం తీసుకుపోకు. నా మనవరాలు దేవుడు కనిపిస్తే ఎన్నో ప్రశ్నలు అడుగుతానని చిన్నప్పుడు అనేది. నిన్ను ప్రశ్నిస్తుందనే కదా చంపేస్తున్నావు? దాన్ని బతికించు. నిన్ను ఏమి అడగొద్దని నేను చెప్తాను" అంటూ రషీద్ ఏడుస్తునే ఉన్నాడు.

రాము, పవిత్రలకుల చికిత్స అందిస్తున్న జనరల్ ఆసుపత్రిలోని ముగ్గురు సీనియర్

డాక్టర్లు మీటింగ్ రూంలో కలుసుకున్నారు. ముగ్గురు చాలా సీరియస్‌గా ఉన్నారు. వారికి ఏం చేయాలో తెలియడం లేదు. రాము, పవిత్ర ఇద్దరూ చనిపోయినట్లే ఉన్నారు. కాని రిపోర్ట్ ఆ విషయాన్ని కన్ఫామ్ చేయడం లేదు. బ్రెయిన్‌డెడ్ అని అనుకున్నారు. కోమా అనుకున్నారు. అసలు వైద్యానికి అందని విధంగా చనిపోయినట్లు రెండు శరీరాలు కనిపిస్తున్నాయి. కాని టెస్ట్ రిపోర్ట్ మాత్రం వీరికి ప్రాణం ఉందనే విషయాన్ని కన్ఫామ్ చేస్తున్నాయ్. ఏం చెప్పాలో? ఏం చేయాలో తెలియడం లేదు.చాలా విచిత్రమైన పరిస్థితి అది.

ఎలాంటి వైద్యం అందించినా వారి శరీరాలు సహకరించడం లేదు. అలాగే శరీరంలోని ఏ అవయవం పని చేస్తున్నట్లుగా అనిపించడం లేదు. కాని వారి శరీరాలకు అనుసంధానించి ఉన్న వైద్య పరికరాలన్నీ వారికి ప్రాణమున్నట్లు లెక్కలను కచ్చితంగా చూపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని గతంలో ఎక్కడా, ఎవ్వరూ చూసి ఉండరు.

ప్రపంచ వైద్య శాస్త్రంలోనే ఇదొక అరుదైన సంఘటన. ప్రాణం ఉందని పరికరాలు చెప్తున్నాయి. ప్రాణం లేదని మన అనుభవం చెప్తోంది. నిజానికి వీళ్లకి ప్రాణం లేదు. ఆ విషయం అయితే తెలుస్తోంది. “సరే మరికొన్ని గంటలు చూద్దాం. ఏదైనా రిజల్ట్ వస్తుందేమోనని”అన్నాడు ఆ డాక్టర్.

“ఓకే...వి డిడ్ అవర్ జాబ్. లెట్స్ ప్రే గాడ్. ఈ విశ్వంలో ఏదైనా జగరవచ్చు.” అనుకుంటూ అక్కడ నుంచి ముగ్గురు డాక్టర్లు వెళ్లిపోయారు.

# 15

# ఎక్కడో విశ్వాంతరాళాల్లో...

గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశం అనే పంచభూతాలు ఏవీ కనిపించని సుదూర దూరాల్లో...

అదొక ప్రత్యేక లోకంలా ఉంది. మనకి తెలియని మరో లోకం. మన ఊహలకు కూడా అందని ఉత్తేజకరమైన లోకం.

అక్కడేదో విశిష్టత కనిపిస్తుంది. కాని అది ఏంటో అర్థం కాదు. అక్కడేదో అద్భుతం ఉంది. కాని అలా అనిపించదు. ఆ అద్భుతం అర్థం కాదు. అలాగని ఆకర్షించకుండా ఉండదు. అక్కడి నుంచి చూస్తే నవగ్రహాలు స్టార్ హూటల్స్‌లో వెలిగే డిమ్ లైట్లలా కనిపిస్తున్నాయి. ప్రపంచానికే ప్రకాశాన్ని ఇచ్చే సూర్యుడు సైతం కూల్‌గా కనిపిస్తున్నాడు. ఆ లోకం నుంచి చూస్తే అంతా సౌమ్యమే, అన్ని అనుకూలమే అన్నట్లుగా ఉంది.

అలాంటి చోట కొందరు సమావేశమై ఎవరి రాక కోసమో ఎదురు చూస్తున్నట్లున్నారు. దానికి కొంచెం దూరంలో ఉన్నారు పవిత్ర, రాము. వారికి అక్కడ అన్నీ అస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఏదో ఉన్నట్లు, లేనట్లు అసలేం అర్థం కాకుండా ఉంది వాళ్లకి. తామెక్కడున్నామో తెలియక అయోమయంగా, భయం భయంగా ఒకరిని ఒకరు చూసుకుంటున్నారు వారిద్దరూ.

"నాన్న...అమ్మ ఎక్కడుంది?" అని తండ్రి చెవిలో మెల్లగా అడిగింది పవిత్ర.

"అమ్మ...హాస్పటల్‌లో ఉంది కదమ్మా" అన్నాడు రాము అటూ ఇటూ చూస్తూ.

"నాన్న...మరి మనం ఎక్కడున్నాం?"

"ఏమోనమ్మా..! అదే నేను చూస్తున్నాను. ఎక్కడున్నామో, ఏమో? అన్నాడు.

"మనం కూడా హాస్పటల్‌లోనే ఉండాలి కదా..! మరి ఇక్కడెక్కడో ఉన్నాం. ఇది ఏదైనా జనరల్ ఆసుపత్రికి సంబంధించిన స్పెషల్ కేర్ సెంటరా? చాలా కొత్తగా ఉంది" అంటూ అటూ, ఇటూ పరిసరాలను చూస్తూ అడిగింది పవిత్ర.

"కాదు, కాదు..! ఏదో పెద్ద కార్పొరేట్ ఆసుపత్రికి చెందిన సూపర్ స్పెషాలిటీ వార్డులా ఉంది కదా..!" అని రాము కూడా మెల్లగా పవిత్రతో అన్నాడు

"మరి వీళ్లెవరు డాక్టర్లులా లేరే..!"

"అదే నాకు అర్థం కావడం లేదు. చాలా సేపటి నుంచి నేను అదే ఆలోచిస్తున్నా..!"

"డాడీ నాకొక డౌట్..!"

"ఏంటమ్మా..!"

"మనం బాంబు బ్లాస్ట్‌లో తీవ్రంగా గాయాల పాలయ్యాం కదా...మరి మన ఒంటి మీద ఎలాంటి దెబ్బలూ లేవేంటి, కనీసం కట్లు కూడా లేవు. అంటే మనకి యాక్సిడెంట్ అవ్వడం కలా..? లేకపోతే ఇది కలా..?" అనడిగింది పవిత్ర.

"నిజమే మనకి తగిలిన గాయాలేవి? వాటికి కట్టిన కట్లు ఏవీ? వేసిన కుట్లు ఏవీ? అసలు ఏం జరిగింది?" ఏదీ అని అర్థం కాని పరిస్థితిలో ఉన్నాడు రాము.

"డాడీ ఇది కలేమో..! డాడీ అసలు మనం బతికున్నామా..? చనిపోయామా..?"

"అవును మీరు చనిపోయారు" అని సమాధానం వినిపించింది. ఆ మాటలు వచ్చిన వైపు చూశారిద్దరూ. ఏదో అస్పష్టమైన ఆకారం కనిపించింది.

"చనిపోయామా..!" అని ఆశ్చర్యంగా, భయంగా అడిగారు.

"మరి చనిపోతే ఇక్కడున్నామేంటి..? ఇది శ్మశానంలా లేదే?" పైగా మేం చనిపోతే మా వాళ్లంతా వస్తారుగా రాలేదేం..! వాళ్లెక్కడ? అసలు నిజంగా మేం చనిపోతే మేం ఎలా మాట్లాడగలం? అసలు మేం ఎక్కడున్నాం? అనడిగింది పవిత్ర.

“ఇది మన లోకం...మనందరి లోకం...” అంటూ పవిత్ర, రాముల దగ్గరకు వచ్చిన ఆ స్పష్టత లేని రూపం.

“మనందరి లోకం అంటే...భూలోకం కదా..?” అని డౌట్‌గా అడిగింది పవిత్ర.

“కాదు నువ్వు చదువుకున్న స్పేస్ లైన్స్‌లో ఉండే భూలోకం కాదు. కాని ఇది అలాంటిదే” ఆ రూపం ప్రశాంతంగా సమాధానం చెప్పింది.

“డాడీ మనతో ఎవరు మాట్లాడుతున్నారు? వాయిస్ క్లియర్ గానే ఉంది. కాని విజువల్ క్లారిటీ లేదు, ఏంటిది? నాన్న నాకు నువ్వు తప్ప...మిగతా వారంతా క్లియర్‌గా కనిపించడం లేదు” అని కంగారు పడుతూ అడిగింది పవిత్ర.

“నాకు అలాగే ఉందమ్మా. నువ్వు తప్ప నాకు ఎవరూ క్లియర్‌గా కనిపించడం లేదు. అదేంటి ఇదేదో వింతలా ఉందే” అన్నాడు రాము.

“వింత కాదు. అది మీ నమ్మకం. మీకు తెలిసిన దాన్ని పూర్తిగా విశ్వసిస్తున్నారు. అందుకే మీరిద్దరూ ఒకరికి ఒకరు కనిపిస్తున్నారు. కాని ఇక్కడున్నదేమిటో మీకు తెలియడం లేదు. ఇక్కడ ఏదో ఉందని నమ్ముతున్నారు తప్పా అదేంటో నమ్మలేకపోతున్నారు. దీంతో అంతా అయోమయంగా, అస్పష్టంగా ఉన్న దృశ్యం కనిపిస్తోంది.

మీరు ‘నా’ అనుకున్న వాళ్లు మాత్రమే మీకు కనిపిస్తారు. ఇక్కడ నువ్వు కేవలం మీ నాన్నని మాత్రమే “నా” అని నమ్ముతున్నావు. అలాగే మీ నాన్న కూడా నిన్ను మాత్రమే “నా” అని అనుకుంటున్నాడు. అందుకే మీరు ఒకరికి ఒకరు కనపడుతున్నారు. కాని మిగతా వారు మీకు తెలియకపోవడంతో మీరు వారిని “నా” అని అనుకోవడం లేదు. అనుకోలేరు. ఎందుకంటే మీరు మీ లోకంలో కూడా కొన్ని బంధాలకు బంధి అయిపోయి ఉంటారు. కాబట్టి మీరు మీ వారినే “నా” అనుకుంటారు. అలాంటి వారే మీకు కనపడతారు. ఇక్కడా మీ భూలోకంలా ఒక లోకం ఉంది. కాని అది మీకు కనిపించడం లేదు” అని స్పష్టత లేని రూపం సమాధానం చెప్పింది.

“ఇంతకీ మీరు ఎవరు? అస్పష్టంగా కనిపిస్తున్నారు. ఇక్కడంతా ఉన్నట్లు, లేనట్లు అనిపిస్తున్నాయి. అసలు ఇది నిజమా? మాయా?” అనడిగాడు రాము.

“మీ లోకంలో చాలా మంది దేవుడ్ని నమ్ముతారు, కొందరు దేవుడు లేడని అంటారు. మరికొందరు రెండింటికి భిన్నంగా ఉన్నాడో, లేడో తెలియదు కాని...ఏదో ఒక శక్తి ఉందని అనుకుంటారు. ఆ శక్తినే మీరు కూడా నమ్ముతున్నారు. దానికి మీలాంటి వారు పెట్టిన పేరు కాస్మిక్ ఎనర్జీ. ఆ ఎనర్జీనే నేను. ఇక్కడున్న వాళ్లంతా అలాంటి వాళ్లే...అంతా కాస్మిక్ ఎనర్జీ ప్రతిరూపాలే.

“మరి మీకు రూపం లేదా..?”

“ఎందుకు లేదు..?”

“నాకూ రూపం ఉంది. కాకపోతే మీలో ఇంకా నమ్మకం కలగలేదు. మీరు నన్ను ఎలా అనుకుంటే నేను అలాగే కనిపిస్తాను. అయితే ఇంకా మీరు నాకు ఏ రూపం ఇవ్వలేదు.

ఇప్పుడు అర్థమైందా నేను ఎవరినో..?"

"అంటే దేవుడివా..?"

"ఏమో..! మీరు ఏది నమ్మితే అదే..."

"పోనీ మనిషివా...?"

"మనిషినని నమ్ముతారా...! అయితే నేను మీలా మనిషినే. నన్ను మనిషిగా మీరు భావిస్తే మనిషిగానే కనిపిస్తా, దేవుడునని అనుకుంటే దేవుడిగానే కనిపిస్తా, జంతువనుకుంటే జంతువుగా...మీరు ఏ రూపంలో నన్ను అనుకుంటే అదే రూపంలో కనిపిస్తా. అలాగే మీరు ఈ ప్రదేశాన్ని ఏమని ఊహించుకుంటే అదే విధంగా ఉంటుంది. ఖైరతాబాద్‌లో ఉన్నట్లు ఊహించుకుంటే ఇది ఖైరతాబాదే, లేదు రాజమండ్రిలోని రషీద్ కిరాణా దుకాణం అనుకుంటే ఇది అదే, లేదంటే గోదారి గట్టు, ఇంకా మీ స్పేస్ ఫిజిక్స్ క్లాస్ రూం... ఇలా మీ ఊహల్లో ఏది ఉంటే అదే ఈ ప్రదేశం. మీ నమ్మకమే నా రూపం, ఈ ప్రదేశం. సందేహం వద్దు. మీ ఆలోచనలకు రూపం ఇచ్చి ఊహించుకుని చూడండి తెలుస్తుంది" అని చెప్పిందా రూపం.

రాము, పవిత్ర ఇద్దరూ ఏదో మాట్లాడుకుని...తమకి వినిపిస్తూ, అస్పష్టంగా కనిపిస్తున్న రూపాన్ని దేవుడిలా ఊహించుకున్నారు. అలాగే తామున్న ప్రాంతాన్ని తామెప్పుడూ చూడని గ్రహంలా అనుకున్నారు. తమ చుట్టు చాలా మంది మనుషులు ఉన్నట్లు ఊహించుకున్నారు. ఆ వెంటనే, అక్కడేదో జరిగింది. కాని ఏం జరిగిందో అర్థం కాలేదు. కాని సెకండులో లక్షో వంతు సమయంలో అక్కడ దివ్యమైన వెలుగుతో, ప్రశాంతమైన వదనంతో, చెదరని చిరునవ్వుతో ఒక అందమైన రూపం ప్రత్యక్షమైంది. సౌర కుటుంబంలోని నవ గ్రహాల్లో లేని, అసలు ఎప్పుడూ టీవీల్లో కాని, సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో కాని చూడని ఓ కొత్త గ్రహం ఒకటి అక్కడ కనిపించింది. అలాగే అక్కడ చాలా మంది మనుషులు కనిపించారు.

దివ్యమైన తేజస్సు కలిగిన ఓ మనిషి లాంటి రూపం తమతో మాట్లాడుతుందని గ్రహించారు పవిత్ర, రాములిద్దరూ.

"ఇంతకీ మీ పేరు...?" అడిగింది పవిత్ర.

"మీరు ఏమని పిలిస్తే అదే.."

"అదేంటి..?"

"ఇక్కడంతా అంతే. ఇక్కడికి వచ్చిన వారు ఎలా అనుకుంటే అలా..! ఇప్పుడు మీరు నా రూపాన్ని, ఈ ప్రదేశాన్ని ఎలా ఊహించుకున్నారో, నా పేరు కూడా మీరేదని అనుకుంటే అదే"

"అవునా...మరైతే ఇప్పుడున్న మీ రూపం, ఈ ప్రదేశం అంతా భ్రమేనా..."

"నమ్మితే నిజం, నమ్మకపోతే ఏదైనా భ్రమే కదా మరి. ఇప్పుడు మీరు నమ్ముతున్నారు

కాబట్టి ఇది మీకు నిజం. మీ భూలోకంలో కూడా అంతేగా. నమ్మి ఏదీ చేసినా అది మీకు ఫలితమిస్తుంది. అసలు నమ్మకమే లేకపోతే ఏదీ లేదు. ఇదీ అంతే”

ఆ దివ్యమైన రూపం చాలా ప్రశాంతంగా, హాయిగా మాట్లాడుతుండటంతో వారిద్దరికీ భయం తగ్గి, కాస్త ధైర్యం వచ్చింది.

“అయితే మీరు మాకు దేవుడు. ఎందుకంటే మా భూలోకంలో మాకు ఏదైతే అర్థం కాదో, ఏదైతే ఆలోచనలకు అందదో అది మాకు దేవుడి మహిమే. ఇప్పుడు మా పరిస్థితి కూడా అదే. మేం ఇక్కడెందుకున్నామో? ఎలా వచ్చామో? ఏం జరుగుతుందో? ఏం అర్థం కావడం లేదు. అందుకే ఈ పరిస్థితికి కారణమైన మీరు మాకు దేవుడే. అయితే దేవుడంటే కొబ్బరి కాయలు కొట్టించుకుని శిలువ వేయబడి, ఖురాన్‌లో చెప్పిన దేవుడు కాదు. మీరు ఇందాక అన్న కాస్మిక్ ఎనర్జీ దేవుడు. మీ పేరు దేవుడు” అని చెప్పి సమాధానం కోసం చూస్తోంది పవిత్ర.

“అలాగే మీరు ఎలా పిలిస్తే అలా...”

“అలాగే మా దేవుడిని మేం స్వామి, భగవంతుడు, గాడ్, ఖుదా, జీసెస్, అల్లా అని రకరకాలుగా అంటుంటాం. మీకు  ఏ పేరుతో పిలిచినా అభ్యంతరం లేదు కదా..!”

“మీ ఇష్టం అని ఇదివరకే చెప్పాను కదా...”

“సరే స్వామి తెలుగు మాట్లాడుతున్నారే ...ఎలా?”

“మీరు ఏ భాషలో మాట్లాడినా, నేను ఏ భాషలో మాట్లాడినా మనకి ఇక్కడ ఆటోమేటిక్‌గా కమ్యూనికేట్ అయిపోతుంది. ఫలానా భాష మనకి వచ్చి ఉండనవసరం లేదు. అది ఏ భాషైనా...సౌండైనా, సైగలైనా...ఇక్కడదేవీ రహస్యాలుండవు. అంతా స్వేచ్ఛే” అన్నాడు దేవుడు.

“ఇదేదో బాగుందే” అనుకున్నారు.

“అవును స్వామి, వాళ్లంతా ఏదో మీటింగ్ కోసం కూర్చున్నట్లున్నారు..!”

“అవును...ఇందాక వాళ్లు కూడా మీకు స్పష్టంగా కనిపించలేదు. కాని ఇప్పుడు మీకు దృశ్యం స్పష్టంగా ఉంది కదా..! ఇందాక మీరు కన్ఫ్యూజన్‌లో ఉన్నారు. ఇప్పుడు మీరు నమ్మకంతో ఉన్నారు. అదే తేడా. మేమంతా ఒక సమావేశం పెట్టుకున్నాం. మీ లోకంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో, మరికొన్ని చోట్ల మీటింగ్‌లు పెట్టుకుని పరిస్థితులను సమీక్షించుకుంటారే అలాంటిదే ఇది కూడా” అన్నాడు దేవుడు.

“అవునా స్వామి...అంటే మా రివ్యూ మీటింగుల్లా..!” అనడిగాడు రాము.

“అవును...దేవుడి గ్రహం రివ్యూ మీటింగ్ అనుకోండి” చెప్పాడు దేవుడు.

“మరి ఇంతకీ దేనికి స్వామి ఈ మీటింగు?”

“మీ కోసమే. మీ రాక సందర్భంగా ఇది ఏర్పాటు చేశాం”

“మా రాక సందర్భంగానా..?”

“మీరు రావడమంటే మీ శరీరాలు రావడం కాదు. మీ శరీరాలను భూలోకంలోనే వదిలేశారు. ఇక్కడికి వచ్చింది కేవలం మీ ప్రాణాలు మాత్రమే. మీరు ఎప్పుడూ మీ ప్రాణాలను ఎప్పుడు శరీరంతోనే ఊహించుకుంటారు. మీకు అదే అలవాటు. అందుకే ఇక్కడ కూడా మీకు మీరు శరీరాలతోనే ఉన్నట్లు కనిపిస్తున్నారు” అన్నాడు దేవుడు.

“అవును కదా. మనం చనిపోయాం కదా. మన శరీరాలు ఇక్కడెందుకుంటాయ్? అవి పారిస్ జనరల్ ఆసుపత్రి మార్చురీలో ఉంటాయి. మన ఆత్మలే ఇక్కడున్నాయ్…” అని అనుకుంటూ తండ్రి కూతుర్లు ఒకరి వైపు ఒకరు చూసుకున్నారు.

“అయినా స్వామి మేం చనిపోయాక మా ప్రాణాలు ఇక్కడికే ఎందుకొచ్చాయి?”

“ఎందుకంటే ఎక్కడి నుంచి వెళ్లిన ప్రాణాలు అక్కడికే వస్తాయి కాబట్టి. ఏదో పని మీద ఇంటి నుంచి బయలుదేరిన మీరు పనవ్వగానే ఇంటికి వచ్చేస్తారుగా ఇదీ అంతే”

“అవునా స్వామి? ఇంతకీ మేం వస్తున్నామని ఈ మీటింగ్ అన్నారు కదా…అసలు మాకు ఈ మీటింగ్‌కి సంబంధం ఏంటి?”

“అదే చెప్తున్నా…మా ఈ లోకానికి మీలా అందరూ రారు. కొందరే వస్తారు”

“ఎవరు వస్తారు..?”

“మీలాంటి వాళ్లు…ముఖ్యంగా నీలాంటి వాళ్లు పవిత్ర”

“నాలాంటి వాళ్లు అంటే..?”

దేవుడు కనిపిస్తే చాలా అడగాలని అనుకుంటావు కదా. ఎప్పుడూ దేవుడ్ని ఏదో ప్రశ్నించాలనే తాపత్రయపడతావు కదా..! నీకు ప్రశ్నలంటే చాలా ఆసక్తి కదా. అందుకే అసలు ఏం ప్రశ్నిస్తావా అని నిన్ను ఇక్కడికి ఆహ్వానించాం”

“అవునా…అలా అయితే మేమే ఎందుకు? చాలా మంది రోజూ చనిపోతుంటారు కదా..! అంతదాకా ఎందుకు ఇవాళ మాతో పాటు చాలా మంది బాంబు దాడిలో చనిపోయారు. వాళ్లలో కూడా చాలా మంది నిన్ను అడగాలనే అనుకుంటారు కదా..! వాళ్లంతా ఎందుకు రాలేదు స్వామి?” అనడిగింది పవిత్ర.

పవిత్ర తనని అడిగినట్లే చకచకా దేవుడిని కూడా ప్రశ్నలడుగుతుంటే రాము పవిత్రని ఆగమన్నట్లుగా సైగ చేస్తున్నాడు.

అయితే అసలే తనకి బోలెడు అనుమానాలు, పైగా ఎదురుగా దేవుడు, అందుకే వరుసగా ప్రశ్నల మీద ప్రశ్నలు వేసేస్తోంది పవిత్ర.

“సింపుల్…మీకు అర్థమయ్యేటట్లు చెప్తాను. ఇటీవల కాలంలో మీ టీవీల్లో బాగా ఫేమస్ అయిన మీలో ఎవరు కోటీశ్వరుడు కార్యక్రమానికి లక్షల్లో మెసేజ్‌లు పెడితే వందో,

రెండు వందల మందికో అవకాశం వస్తుంది. ఆషాఢమాసం సీజన్‌లో బట్టల దుకాణంలో వేలాది మంది బట్టలు కొంటే ఇద్దరికే లక్కీ డిప్ ద్వారా ఫారిన్ ట్రిప్ లభిస్తుంది. ఇది అంతే. లక్కీ డీప్. మీరు అలాంటి స్కీమ్‌లోనే ఇక్కడికి వచ్చారు"

"చచ్చి...ఇక్కడికి రావడమూ లక్కీ డిప్పేనా...దానికి స్కీము కూడానా..!"

"మరి అంతేగా...భూలోకంతో మీ జీవితం అయిపోకుండా...మళ్లీ ఇక్కడో కొత్త జీవితంలోకి వచ్చారు కదా" అన్నాడు దేవుడు.

"అవునవును...చస్తే ఎలా బతుకుతావురా అని మా లోకంలో అనుకుంటుంటారు. చచ్చిన తర్వాత బతకడమేంట్రా అని చాలాసార్లు అనుకున్నా....ఇప్పుడర్థమైంది స్వామి అదేంటో"

రాము మాటలకు పవిత్ర, దేవుడు, ఇతర భూలోక ప్రాణాలు చిన్నగా నవ్వారు.

"అక్కడికి రండి మాట్లాడుకుందాం" అంటూ మీటింగ్ వైపు చూపించాడు దేవుడు.

దేవుడు, రాము, పవిత్ర అక్కడికి వెళ్లారు.

"ఇప్పుడు ఏదైనా అడగాలని, చెప్పాలని అనుకుంటున్నారా...?"

"ఏం చెప్తాం..?ఏం అడుగుతాం?చనిపోయిన తర్వాత ఏం చేసినా ఏంఉపయోగం?"

"మరి దేవుడు కనిపిస్తే అడిగేస్తాం, కడిగేస్తాం అంటుంటారు కదా మీ మానవులంతా"

"నిజంగానే అడగొచ్చా..? సమాధానం చెప్తారా..!" అనడిగాడు రాము.

"నిస్సందేహంగా...అడగండి"

"స్వామి..నేను, నా భార్యాబిడ్డతో కలిసి సరదాగా బయటకు వెళ్లాను. మంచి సంగీతాన్ని వింటున్నాం. అక్కడ మాలాంటి వాళ్లు ఎందరో ఉన్నారు. అక్కడ బాంబులు పేల్చిన వాళ్లకి మాకు ఏ సంబంధం లేదు? మేం ఏం చేశాం? బాంబు పేలుళ్లలో మమ్మల్నేందుకు చంపేశారు స్వామి? అని కోపంగా అడిగాడు రాము.

"మీ భాషలో విధి రాత. మా లెక్కలో అది ఒక సంఘటన అంతే" అన్నాడు దేవుడు.

"ప్రాణాలు పోవడమంటే సంఘటనతో సమానమా..!"

"మీకు పుట్టుక, చావు రెండు పెద్ద విషయాలే. కాని మాకు మీ పుట్టుక, చావు, నడుమ గడిపే జీవితం అన్నీ సాధారణ విషయాలే"

"అదెలా అవుతుంది..?"

"అంతేగా నువ్వు కొనుక్కున్న కారుని ఎప్పుడైనా అమ్మేసుకుంటావ్. కొత్త కారు తీసుకుంటావ్. మీకు నచ్చని దస్తులు మార్చేసి కొత్తవి వేసుకుంటారు. మీకు అదెంత సాధారణమో, మాకు ఇది అంతే..!"

"అదేంటి స్వామి అలా అంటారు? మాకు ఏవో ఆలోచనలు, భవిష్యత్‌పై ఆశలు, చుట్టు

పక్కలవారితో బంధాలు ఇలా ఎన్నో ఉంటాయి. వాటన్నింటిని వదులుకుని మరణించడం అంటే ఎంత బాధో కదా స్వామి” అన్నాడు రాము.

“బాధే..! కాని ఆ బాధ ఎవరు పుట్టించారు. మీకు మీరే పెంచుకున్న బాధ. మీలో మీరే ఏర్పరచుకున్న బాధ. అలాంటి దాన్ని మీరే పోగొట్టుకోవాలి?:

“అదెలా దేవుడా..? మనుషులుగా పుట్టిన తర్వాత ఇవన్నీ ఉంటాయి కదా. మేమేమి తయారు చేసుకున్నవి కాదు కదా?

“జీవితం అశాశ్వతం అని తెలిసినా, ఒకరిపై ఒకరు బంధాలు పెంచుకున్నారు. వాటికి మధ్యలో అవాంతరాలు వస్తే అల్లాడిపోతున్నారు”

“నా కూతురి పెళ్లి అనుకున్నాం. ఇంతలోనే ఇలా జరిగింది. ఎలా తట్టుకోగలం స్వామి?”

“నీ కూతురి పెళ్లి లాంటి పెళ్లిళ్లు రోజు చాలానే ఆగిపోతున్నాయో…అప్పుడెప్పుడైనా నీకు బాధ కలిగిందా? కలగదు. ఎందుకంటే వాళ్లు నీ కూతుర్లు కాదు కదా? నీకు ఒక ప్రత్యేక వ్యక్తి మీదో, వస్తువు మీదో ప్రేమ ఉంటుంది. అలాంటి వాటికి ఏదైనా జరిగితేనే నీ బాధలు, మమకారాలు, ఆప్యాయతలు బయటపడతాయి. అదే మరొకరికైతే నీకేమీ అనిపించదు. అంటే దానర్థం నీలో కలుగుతున్న బాధ నేను సృష్టించింది కాదు కదా…! నేను సృష్టించిందైతే అది అందరిపైనా సమానంగా ఉండాలి కదా.” అన్నాడు దేవుడు.

ఇదంతా గమనిస్తోంది పవిత్ర. నాన్న ప్రశ్నలు, దేవుడి సమాధానాలు చూస్తుంటే ఉదయాన్నే టీవీల్లో ప్రసారమయ్యే వేదాంత చర్చలా అనిపించింది.

“స్వామి నేను కూడా మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు వేయవచ్చా?” అనడిగింది పవిత్ర.

“తప్పకుండా నీకున్న స్పెషల్ క్వాలిటీనే అది కదా” అన్నాడు దేవుడు నవ్వుతూ.

“స్వామి! ఈ లోకం నుంచి మా లోకానికి ప్రాణాలు సప్లయి అవుతాయి. పని అయిపోగానే మళ్లీ ఇక్కడికి వచ్చేస్తాయి. అదేగా కాసేపటి క్రితం మీరు మాకు చెప్పింది” అనడిగింది పవిత్ర.

“అవును. మీ జీవితాలు శాశ్వతం కాదని మీకు తెలుసు. అయినా అదంతా శాశ్వతమనుకుని బంధాలు, కుటుంబాలు ఏర్పాటు చేసుకుని ప్రాణాలు శాశ్వతమనుకుని సమస్యల్ని మీరే సృష్టించుకుంటారు. మీకు ప్రాణం ఎలా వస్తుందో, ఎలా పోతుందో తెలియదు. దాన్ని తెలుసుకోవాలనే ప్రయత్నం ఈ భూమిపై జీవి పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు సాగుతూనే ఉంది”

“దేవుడా..! మమ్మల్ని కాపాడే, మమ్మల్ని నడిపించే భగవత్ స్వరూపం కూడా మీరేనా?”

“నువ్వు నన్ను దేవుడని అనుకుంటే అంతే కదా మరి”

“మరి అలాగైతే ఈశ్వరుడు, ఏసుక్రీస్తు, అల్లా, గౌతమ బుద్ధుడు అన్నీ మీరేనా..?”

“అన్నీ నేనే…మానవులు సన్మార్గం విడిచి తప్పుడు మార్గంలో వెళ్తున్నప్పుడు మళ్లీ

సన్మార్గంలో నడిపించడం కోసం ఒక్కొక్క సమయంలో ఒకొక్క రూపంలో భూలోకంలోకి రావడమో, లేదా నా తరపున ఎవరినైనా పంపడమో జరిగింది. ఆ తప్పుల్ని సరిదిద్దడం జరిగింది. ఇంకా జరుగుతుంది కూడా.

"తప్పుల్ని సరిదిద్దారా...? తప్పు చేసిందే నువ్వు కదా స్వామి. అయినా స్వామి తప్పు నువ్వు చేసి మనుషుల తప్పులు సరిదిద్దడానికి వచ్చాననంటావేంటి స్వామి" అని అడిగింది పవిత్ర.

"నేను మనుషుల తప్పులు సరిదిద్దడం తప్పా..? సన్మార్గంలో నడిపించడం తప్పా..? వారి కోసం అయా సమయాల్లో రకరకాలైన రూపాల్లో వారిని ఆదుకుంటున్నాను కదా..!"

"అదే నువ్వు చేసిన తప్పు స్వామి. నువ్వు చేసిన తప్పు మమ్మల్ని వెంటాడుతూ ఉంది. నువ్వేదైతే గొప్ప పని అనుకుని చేశావో, ఇప్పుడు మాకు అది శాపంగా మారింది. దాని నుంచి బయటపడలేక...ఒక మనిషిని మరొకరు నమ్మలేక చస్తూ బతుకుతున్నాం. బతికితే నువ్వు చేసిన తప్పు చంపేస్తుంది. దానికి సాక్షులమే ఇవాళ బాంబు పేలుళ్లలో మరణించిన మేమూ, మాలాంటి చాలా మంది. నువ్వు తప్పు చేసి ఇక్కడ మాకు మంచితనం, మానవత్వం, సద్బుద్ధి అంటూ పాఠాలు చెప్తున్నావ్.

దేవుడిని తప్పు చేశావని పవిత్ర నిలదీస్తూంటే అక్కడున్న వారంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు పవిత్ర వైపు. కాని పవిత్ర ఏ మాత్రం బెదురు లేకుండా నిజాయితీతో అడుగుతోంది.

"నేను తప్పు చేశానా...? నేను తప్పు చేయడమేంటి? ఆ తప్పుకి మీ మానవులు బాధపడటం ఏంటి? నాకు అర్థం కాలేదు. ఇప్పటివరకు దేవుడు విగ్రహానికి నమస్కారం పెట్టిన వాళ్లనో, దేవుడు ప్రత్యక్షమైతే వరం అడగాలని అనుకునే వాళ్లనో చూశాను కాని...తప్పు చేశావంటూ ప్రశ్నిస్తున్న మొదటి వ్యక్తిని నిన్నే చూస్తున్నా.. నాకు చాలా కొత్తగా ఉంది" అన్నాడు దేవుడు.

"అవును స్వామి తప్పు చేసిన వాళ్లు ఎప్పుడూ తమ తప్పుని ఒప్పుకోరు. మీరూ అలాగే అంటున్నారు"

"అసలు నేను ఏం తప్పు చేశానో చెప్తే...అప్పుడు తప్పు ఒప్పుకోవడం గురించి చూద్దాం"

పవిత్ర ఏం చెప్తుందా అని అంతా ఆసక్తిగా చూస్తున్నారు.

"మా కుటుంబంలో మా తాత, తండ్రి, తల్లి, స్నేహితులు, బంధువులు చివరకు నా ప్రేమ, మా చావు అన్నీ నువ్వు చేసిన తప్పు వల్ల జరిగినవే. ఇంతా చేసి నాకేమి తెలియదంటావు..!"

"ముందు ఈ భూగోళంపై మానవాళికి జీవం పోశావు. అది నువ్వే ఒప్పుకున్నావు. మానవాళి హాయిగా తమ జీవనం సాగిస్తుంటే...నిన్ను మర్చిపోతారనో, నిన్ను మించిపోతారనో వాళ్ల మధ్య దేవుడంటూ నువ్వొచ్చి పడ్డావు. వస్తే వచ్చావ్...మనుషుల

జీవితాల్లో జరిగే ప్రతి మంచి చెడులకు కారణం నువ్వే అన్నట్లుగా భావన కలిగించావు. దేవుడనే, మనుషులకు తెలియని ఒక మహా శక్తి ఉందని నమ్మేలా చేశావ్. దాంతో మనిషి మరో మనిషినో, తన జీవితానికి కారణమైన ప్రకృతినో కాకుండా...నువ్వే మా జీవితానికి ఆధారమంటూ నిన్ను నమ్మడం మొదలు పెట్టాడు.

"అవును...అందులో తప్పేముంది. మానవులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు కష్టాలను ఎదుర్కోలేనప్పుడు వాళ్లకి ఒక ఆసరా కల్పించాలి కాబట్టి...నేనున్నాననే నమ్మకం కలిగించాను"

"నువ్వున్నావనే నమ్మకంతో హాయిగా ఉంటాడని నువ్వంటున్నావు. కాని అన్నీ నువ్వే చూసుకుంటావులే అనుకుని అసలు మనిషి తనని తాను కూడా నమ్మడం మానేసి నిన్ను నమ్మడం మొదలుపెట్టాడు. దాంతో మనకి అందని దేవుడనే ఒక శక్తి ఉందని, ఆ దేవుడిని పూజిస్తే చాలనుకునే మనుషులు పెరిగిపోయారు. పైగా నిన్ను శాంతింపజేయడం కోసం జంతు బలి, నర బలి, కామ దహనాలు ఇలా నీ పేరుతో జరిగిన, చెలరేగిన అశాంతి, అహింస అంతా ఇంతా కాదు." అంటూ సీరియస్‌గా చెప్పుకుంటూ పోతోంది పవిత్ర.

దేవుడు ఏం మాట్లాడడం లేదు. పవిత్ర వైపు సూటిగా చూస్తున్నాడు. అక్కడున్న మిగతా వారంతా దేవుడిని, పవిత్రని చూస్తున్నారు. రాముకి అయితే అర్థం కావడం లేదు. తన కూతురు ఇంత పెద్ద మాటలు మాట్లాడుతూ దేవుడ్నే ప్రశ్నిస్తుంటే ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నాడు.

ఇలా ఒక ఆత్మ దేవుడిని ప్రశ్నించడం ఎప్పుడు జరగలేదు అక్కడ. దాంతో ఈ వ్యవహారమంతా చాలా కొత్తగా, వింతగా, ఆసక్తిగా, భయంగా ఉంది అక్కడి వారందికీ.

"ఒక మనిషికి ప్రాణం పోసేది ఒక మనిషి. ఒక మనిషికి సాయం చేసేది మరో మనిషి. మన మనిషిని చంపేది ఇంకో మనిషి. ఒక మనిషి మాట్లాడేది మరో మనిషితో, మనిషి ప్రేమించేది మనిషినే, మనిషి మరణించేది మనుష్యుల మధ్యనే, ఆ మనిషికి అంతిమ సంస్కారాలు చేసేది కూడా మళ్లీ మనిషే...ఇలాంటి మనిషి జీవితంలో నువ్వెక్కడున్నావ్ స్వామి" అని దేవుడ్ని సూటిగా ప్రశ్నించింది పవిత్ర.

"పుట్టుక నుంచి చావు వరకు ఎక్కడ చూసినా మనిషికి మనిషే తప్ప...దేవుడు తోడు లేడు. అలాంటి నీకు ఎంత ప్రాధాన్యత ఇచ్చామో తెలుసా స్వామి మా లోకంలో. మనిషి చేసిన ఏ పనైనా నీ వల్లే జరిగిందంటారు. నువ్వే జరిపిస్తున్నావంటారు. అసలు రేపు జరగబోయే దానికి ఇవాళ జరుగుతున్న దానికి, నిన్న జరిగిపోయిన దానికి కారణం నువ్వే అంటారు. పని మాది కూలీ డబ్బులు నీకు అన్నట్లుగా ఉంది మా పరిస్థితి. ఇదెక్కడి న్యాయం స్వామి"

"అది నిజమే కదా...దైవ ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదనే విషయం నువ్వు వినలేదా పవిత్ర?"

"విన్నాను స్వామి...విన్నాను...మరి అది నిజమే అయితే మరి మా లోకం జరుగుతున్న అన్ని విషయాలకు నువ్వే కారణమా స్వామి?"

“అవును”

“మరైతే మా మరణానికి కారణమైన బాంబు దాడులు నువ్వే చేయించావా? తల్లి గర్భంలోనే పిల్లలు చనిపోతుంటారు నువ్వేనా స్వామి దానికీ కారణం? స్కూల్ బస్సు ఎక్కిన చిన్నారులు రైళ్లు గుద్ది ప్రాణాలు పోగొట్టుకున్నారు దానికి నువ్వేనా కారణం? గుడి, చర్చ్, మసీదు అని తేడా లేకుండా వాటిల్లో కూడా నరమేధం జరుగుతోంది దానికి కూడా నువ్వే కారణమా? ఏ జీవికి రక్షణ లేని సమాజంలో బతుకుతున్నాం దానికి నువ్వేనా కారణం? నీ గుళ్లో కూడా దొంగతనాలు జరుగుతుంటాయి దానికి కారణం నువ్వేనా? అసలిదంతా ఎందుకు స్వామి భూగోళంలో ఏ క్షణం ఏం జరుగుతుందోనని రక్షణ లేని జీవితాలతో బతుకుతూ చస్తుంటాం...ఇలా అన్నింటికి నువ్వే కారణం అయితే అసలివ్వన్నీ ఎందుకు చేస్తున్నావు దేవా..?”

“దేవుడ్ని చూద్దామని తీర్థ యాత్రలకి వచ్చిన వారిని కూడా ప్రమాదాలు, వరదలు సృష్టించి చంపేస్తావ్. జీవిత చరమాంకంలో ప్రశాంతంగా గడపాల్సిన వృద్ధుల్ని వృద్ధాశ్రమాలకి పంపేస్తావ్. దేశ భవిష్యత్ అనుకునే యువకుల్ని మధ్యలోనే నీ దగ్గరకు తెచ్చేసుకుంటావ్. మరి ఎవరి కోసం స్వామి ఈ ఆటలు? నువ్వే పోసిన ప్రాణం అంటున్నావ్, మరి ఆ ప్రాణాలంటే నీకు ఎందుకంత పగ. ఆ ప్రాణాలు మీద నీకు ప్రేమ లేదా తండ్రి..?

అవున్లే ఎందుకుంటుంది? నీకు నీకున్నదల్లా...నువ్వు ఆడే ఆట మీద ఆసక్తి. ఆ ఆటలో మేం పావుల్లా విలవిలలాడుతుంటే చూసి ఆనందించే మనస్తత్వం అంతే. అంటే నువ్వే దేవుడివి కాదు. నువ్వు మాలాంటి మనిషివే. అసలు నీ లక్షణాలే మాకు వచ్చుంటాయి. స్వార్థం, కుంచిత స్వభావం, సాటి మనిషి బాధ చూసి ఆనందపడే సగటు మనిషివే నువ్వు. కాని నీకు మాత్రం దేవుడనే పేరు. ఆ పేరుకి రోజూ పూజలు. ఎంత స్వార్థం స్వామి..?”

“పవిత్ర...ప్రపంచంలో ఇక్కడో అక్కడో జరిగే సంఘటనలను మొత్తం నేనే కారణమంటే ఎలా..? అలాంటి వాటికి నేనెలా కారణం అవుతాను. అవి మానవుల పూర్వ జన్మ కర్మలు, పాపపుణ్యాల ఫలితాలు..”

“అవును స్వామి అసలు మనిషి నిన్నేమైనా మాకు జన్మలు ఇవ్వమని అడిగాడా..? అసలు మనిషికి ఎందుకు నువ్వు ప్రాణం పోశావు? అలా ప్రాణం పోసింది నిజమే అయితే మానవులందర్నీ మంచి వాళ్లగానే పుట్టించు. మళ్లీ వాళ్ల చేత పాపాలు చేయించడమెందుకు? వాటికి ఫలితాలు అంటూ మరో జన్మలో ఇబ్బందులు పెట్టడమెందుకు?” అని ప్రశ్నించింది. పవిత్ర, దేవుడల్ల మధ్య సంభాషణ కాస్త సీరియస్ అవుతోంది. దేవుడు ఏం మాట్లాడటం లేదు. ఆ ప్రయత్నం చేయడం లేదు. పవిత్ర ఇంకా ఏం చెప్తుందా అని చూస్తున్నాడు.

“స్వామి నిన్న జరిగినవ బాంబు దాడులకైతే పూర్తిగా నువ్వే కారణం తెలుసా స్వామి? మానవుల విషయంలో నువ్వు అన్నింటి కంటే అతి పెద్ద తప్పు చేశావు. ఆ తప్పే మా ప్రాణాలు తీసింది. అది ఏంటో తెలుసా స్వామి..?”

అతి పెద్ద తప్పా...! దేవుడు తప్పు చేశాడా...! అది ఒక మానవ ఆత్మ దేవుడు తప్పు

చేశాడని చెప్పడమా..! అక్కడున్న వారందరికీ బుర్రలో వేలాది గ్రహాలు గిర్రున తిరుగుతున్నట్లుగా ఉంది.

* * * * *

పారిస్ జనరల్ ఆసుపత్రిలో వైద్యులకు ఏం అర్థం కావడం లేదు. రాము, పవిత్రలు చనిపోయారో, ప్రాణాలతో ఉన్నారో తెలియని పరిస్థితి వారిది. ఏ ప్రకటన చేస్తే ఏం కొంప మునుగుతుందోనని చిరంజీవి ఠాగూర్ సినిమాలోలా సీన్ క్రియేట్ చేస్తున్నారు.

ఇండియాలో వహీదా, అండ్రియా, రాము ఆఫీస్ స్టాఫ్, లూసీ స్టూడెంట్స్ అంతా అక్కడ ఏం జరుగుతుందో తెలియక టెన్షన్ పడుతున్నారు. వహీదా, అండ్రియాలైతే గంటకో సారి పారిస్‌లో ఉన్న రషీద్‌కి ఫోన్ చేస్తున్నారు. అసలేం సమాచారం చెప్పలేకపోతున్నాడు రషీద్. అసలు వాళ్లకే ఏ సమాధానం తెలియడం లేదు. డాక్టర్లు ఏం చెప్పడం లేదు.

లూసీ పరిస్థితి ఇంకా అలాగే ఉంది. అపస్మారక స్థితి నుంచి ఇంకా బయటపడలేదు. అయితే శరీరం మాత్రం కాస్త వైద్యానికి సహకరిస్తుండటంతో లూసీకి వైద్యం అందిస్తున్నారు. పవిత్ర, రాముల గదిలో ఉన్న ఎక్విప్‌మెంట్‌ని మాత్రం వైద్యులు పదే పదే చూస్తున్నారు. అవి సరిగానే పని చేస్తున్నాయి. మరి వీరిద్దరి శరీరాలు మాత్రం ఎందుకు స్పందించడం లేదు. అందుకే ప్రతి అరగంటకి వీరి శరీరాల్ని, ఎక్విప్‌మెంట్ పరిశీలన చేస్తున్నారు. చూస్తున్న కొద్దీ కన్ఫ్యూజనఫ్ పెరుగుతుందే తప్ప...క్లారిటీ రావడం లేదు.

దేవుడి దగ్గర ఇంకా ఆత్మలు సజీవంగానే ఉండటంతో ఇక్కడున్న రాము, పవిత్ర శరీరాలతో ఆ ఆత్మలకున్న బంధం తెగిపోలేదు. దాంతో వారు శరీరాలు మరణించినట్లుగా కనిపిస్తున్నా... వారి ఆత్మలకు జీవం ఉండటంతో శరీరాన్ని ప్రాణాలు పూర్తిగా వదల్లేదు. దీంతో వైద్యానికి అందని ఒక అద్భుతంలా అనిపిస్తోంది రాము, పవిత్రల శరీర ధర్మం.

# 16

**దేవుడి** గ్రహంలో ఎప్పుడూ లేనటువంటి పరిస్థితి. అక్కడున్న వారికెవరికి ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. అర్థమైన దేవుడికి మాట రావడం లేదు.

“నేను చేసిన అతి పెద్ద తప్పా..! ఏమై ఉంటుంది. ప్రాణాలు పోయడం తప్పు కాదే..! మరి ప్రార్థనలు అందుకోవడమూ తప్పు కాదే..! మరేంటది..? అని ఆలోచిస్తున్నాడు.

పవిత్ర దేవుడి వైపే చూస్తోంది. దేవుడు మాత్రం ఇంకా తీక్షణంగా ఆలోచనలో

ఉన్నాడు.

"స్వామి ఏం తప్పు చేశారో తెలిసిందా?" అని అడిగింది.

ఆ మాటకి పవిత్ర వైపు తెలియలేదు అన్నట్లుగా చూశాడు దేవుడు.

"స్వామి నేనే చెప్తా...ఎందుకంటే నువ్వు చేసిన తప్పుకి మా ఇంట్లో అందరం బాధితులమే. అందుకే నేనే చెప్తాను. అప్పుడు నీకు అర్థమవుతుంది"

"స్వామి..! నీ సృష్టిలో మనిషికో మతాన్ని ఎందుకు ఇచ్చావు?

"మనిషికో మతాన్ని ఇవ్వడమేంటి?" అని అనుమానంగా అడిగాడు దేవుడు.

"స్వామి నువ్వు సృష్టించిన ప్రపంచంలో జంతువులకు, పక్షులకు, చేపలకు, చెట్లకు, కొండలకు, వాగులకు, సముద్రాలకు, నదులకు, ఆఖరికి పంచభూతాలకు ఇవ్వని మతాన్ని కేవలం మనిషికి మాత్రమే ఎందుకిచ్చావ్?" అనడిగింది పవిత్ర.

"కాలక్రమంలో మనిషి సుఖమయ జీవనానికి అప్పటి పరిస్థితులకు అనుగుణంగా పుట్టిన మార్గాల పేర్లే మతాలు" అన్నాడు దేవుడు.

"పేరు ఏదైనా మతం పుట్టుకకు కారణం మాత్రం నువ్వే కదా స్వామి"

"అవును నేనే..."

"అదే స్వామి నువ్వు చేసిన అతి పెద్ద తప్పు..."

"మతం తప్పు ఎలా అవుతుంది?"

"మతం తప్పు కాదు స్వామి...నువ్వు మనిషి సౌలభ్యం కోసం, మనిషి సౌకర్యం కోసం అంటూ వంద మతాలు సృష్టించావే అదే తప్పు...ఆ తప్పు మానవాళికి శాపంగా మారింది.

"అదెలా..?"

"స్వామి అన్నీ నాకు తెలుసంటావు..! మళ్లీ నన్నే ప్రశ్నిస్తున్నావ్..! మతాల సృష్టించడం వల్ల ఏం జరిగిందో, ఏం జరుగుతుందో తెలియదా స్వామీ నీకు?"

"నువ్వు చెప్పు పవిత్ర"

"స్వామి మా లోకంలో నువ్వు సృష్టించిన అనేక మతాలున్నాయి. ఆ మతాలు మనిషి మనుగడకు ఉపయోగపడకపోగా...మనిషిని ఉన్మాదిగా మారడానికి దోహదం చేస్తున్నాయి. ఎందువల్లో, ఏ మాయ చేతనో, నీ మాయో తెలియదు కాని మానవులకు ఒకరి మతమంటే మరొకరికి పడదు. తాను పుట్టిన మతమే మంచిదనే భావన ప్రతి ఒక్కరిలోనూ ఉంది. తన మతమే గొప్పదని, మిగతావి తక్కువ మతాలనే ఆలోచన వారిది. ఇది ఎప్పుడు మొదలైందో కాని...తరతరాలవుగా కొనసాగుతూనే ఉంది. మనిషిని మనిషిగా కాకుండా మనిషి అంటే మతంగా మార్చేసింది ఈ మతం. ఒక మనిషి ఏదో తప్పు చేస్తాడు. ఆ తప్పు చేసిన వ్యక్తి ఏదో ఒక మతానికి చెందిన వాడై ఉంటాడు. దాంతో తప్పు చేసింది మనిషి అనడం లేదు.

ఆ మతమే తప్పు చేసిందంటున్నారు. మనిషి కోసం మతం కాకుండా...మతం కోసం మనిషి అన్నట్లుగా ఉంది ప్రస్తుతం మా లోకంలో మతాల పరిస్థితి.

పుట్టుక దగ్గర నుంచి మరణం వరకు ఉన్న అన్ని బంధాలు మతంతోనే ముడిపడిపోతున్నాయి స్వామి. స్నేహం, ప్రేమ, పెళ్లి, తిండి, నిద్ర, మరణం, శరణం ఇలా ఏదైనా అన్నంటికీ మతమే లింక్.

మా కుటుంబంలో మా తాతయ్యల స్నేహానికి మతం అడ్డు చెప్పింది. వారి అద్భుతమైన స్నేహాన్ని మతం తిట్టింది. ఓ తండ్రి ప్రేమకి మతం అడ్డొచ్చింది. ఓ కూతురి పెళ్లికి మతం ఆటంకమైంది. ఓ స్నేహితుడ్ని మతం హత్య చేసింది. భార్యతో సరదాగా బయటకెళితే ప్రాణాలు తీసింది మతమే. ఒక మతం మనిషి, మరో మతం మనిషిని బతకనివ్వడా..? ఒక సారి స్నేహాన్ని, మరోసారి ప్రేమని, ఇంకోసారి వివాహాన్ని, పుట్టుకని, చావుని ఇలా అన్నింటిని మతమే శాసిస్తోంది తండ్రి అక్కడ మా లోకంలో" అని పవిత్ర మత పేరుతో జరిగిన దారుణాల్ని చెప్పింది పవిత్ర.

ఇక్బాల్ గురించి తన కూతురడిగిన ఈ ప్రశ్న మాత్రం రాముకి బాగా నచ్చింది. ఇంకా తనేమి అడుగుతుందా అని ఆసక్తిగా చూస్తున్నాడు.

"దానికి నేనేమి చేయగలను. అందరి మంచి కోసమే కదా నేను మతాన్ని సృష్టించాను. దాన్ని మీరు తప్పుగా అర్థం చేసుకుంటే ఎలా? మనిషికి ప్రాణం పోస్తాను. ఆ ప్రాణానికి నేను మతాన్ని అంటించనే."

"నువ్వు అంటించవు. కాని ప్రపంచమంతా మతమే ఉంది. మతమనే విషపు వల ఎక్కడికక్కడ అల్లుకుని ఉంది. పుట్టిన ప్రతి ప్రాణి ఆ వలలో చిక్కుకోవాల్సిందే. మా లోకంలో జరిగే అన్నింటికి కారణమైన నువ్వు, ఈ మతానికి కూడా కారకుడివే కదా. నిన్ను చేరాలనే మార్గాలే కదా మతాలంటే?"

"దానికి నేను ఏం చేయాలి?"

"పుట్టే ప్రతి ప్రాణికి మతం అనే ఆప్షన్లు ఇవ్వకు స్వామి. మనిషిగా పుట్టడం. మనిషిగా చావడం అంతే. అలా కాకుండా హిందువుగా పుట్టడం, హిందువుగానే పోవడం, క్రిస్టియన్‌గా పుట్టి, అలాగే సమాధి కావడం, ఇస్లాంలో పుట్టి ముస్లింగా చనిపోవడం ఇలా అనేక ఆప్షన్లు వద్దు. అసలు మాకు మతమే వద్దు."

నిజమే అనిపించింది దేవుడికి. "కాని అదెలా సాధ్యం అవుతుంది? అన్నాడు.

"సాధ్యం కాదులే స్వామి..! ఎందుకంటే మతం లేకపోతే నీ ఆటలు సాగవు కదా. నీ ఆటని ఎలా ఆడాలో? ఎంత సేపు ఆడాలో? ఎప్పుడు ముగించాలో తెలిసిన నువ్వు...ఈ మతాలే వద్దంటే అదేలా అని ప్రశ్నిస్తున్నావ్. అవున్లే...అలా చేస్తే నీ ఆటలోని కిక్ పోతుంది కదా" అని నిరాశగా అంది పవిత్ర.

"మనిషి జీవితం ఎలా సాగాలో? ఏ విధంగా సాగించాలో? అనే విషయాలను ఎప్పటికప్పుడు భగవద్గీత, బైబిల్, ఖురాన్ ఇలా ఒక్కో మత గ్రంథం ద్వారా మానవులకి

అందిస్తూనే ఉన్నాను కదా"

"భగవద్గీత, బైబిల్, ఖురాన్ అంటూ ఏ మత గ్రంథం తీసుకున్నా సారాంశం ఒక్కటే కదా స్వామీ..!" అనడిగింది పవిత్ర.

అవును ఏ మత గ్రంథ సారాంశమైనా ఒక్కటే ఉంటుంది. అంతా మనిషి మంచి కోసమే ఉంటుంది" అన్నాడు దేవుడు.

"మరి అయితే స్వామి అన్నింటి సారాంశం ఒక్కటే అయినప్పుడు మాకు ఇన్ని మతాలెందుకు? ఒక్క మతం చాలు కదా..! ఒక్కో మతంలో ఒక్కో దేవుడెందుకు? ఒక్క దేవుడు చాలు కదా. అన్ని మతాల అర్థం, పరమార్థం ఒకటే అయినప్పుడు ఒక్కో మత గ్రంథం, ఒక్కో విషయాన్ని చెప్పడానికి ఒక్కో మార్గాన్ని ఎందుకు ఎంచుకోవాలి? అన్నింటికి ఒకే గ్రంథం ఉంటే సరిపోతుంది కదా. అసలు ఇంతమంది దేవుళ్లెందుకు? మాకు ఒక్క దేవుడు, ఒక మతం, ఒక గ్రంథం ఉంటే సరిపోతుంది కదా స్వామి" అంటూ పవిత్ర గట్టిగా అరిచింది.

పవిత్ర అడుగుతున్న ప్రశ్నలకి దేవుడితో సహా అంతా ఆశ్చర్యానికి గురయ్యారు. పవిత్ర కళ్లలో కోపం కనపడుతోంది.

దేవుడు మాత్రం దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. పవిత్ర మాటల్లోవ నిజం ఉంది. నిజమే ఇది తాను చేసిన తప్పేనేమో అని దేవుడు ఆలోచిస్తున్నాడు.

"స్వామి సవాలక్ష సమస్యలున్న మానవ అరణ్యంలోకి మమ్మల్ని నెట్టేశావు. మళ్లీ మతం పేరుతో ఇంత కన్ఫ్యూజన్ మాకెందుకు?. స్వామి నువ్వు పుట్టించే మనుషులందరినీ ఒకేలా పుట్టించకుండా మనిషి మనిషికి ఏదో ఒక తేడా చూపించావు. ఆ తేడా మనిషి...మరొ మనిషి గుర్తించడానికి అయినంత వరకు బాగానే ఉంది. కాని ఒక మనిషి మరొ మనిషిని చూసి ఎగతాళి చేసేలా ఆ తేడాలను పెట్టావు. ఆ తేడాలే ఇద్దరు వ్యక్తుల్ని, రెండు ప్రాంతాల్ని, రెండు దేశాల్ని వేరు చేస్తున్నాయి. మనుష్యుల మధ్య ఉన్న తేడాల వల్ల ఒకరంటే ఒకరికి పడని పరిస్థితి వచ్చేసింది. ఏదో తేడా, మతమో, రంగో, భాషో, నేలో...ఏదో తేడా. ఆ తేడా వల్లే నువ్వు వేరు నేను వేరు అనే భావన వస్తుంది.

"ప్రతి విషయంలో పరిణితితో ఆలోచించే మానవుడు ఇద్దరం మనుష్యులమే కదా అనే సమానత్వాన్ని ఎందుకు చూపించలేకపోతున్నాడు" అని దేవుడు పవిత్రని ప్రశ్నించాడు.

"ఎందుకంటే మనుష్యులకంటే ముందు ఈ తేడాలే వాళ్ల మధ్య గోడలు కట్టేస్తున్నాయి. అందుకే ఆ గోడ దాటి అవతల వైపు ఉన్న తనలాంటి ప్రాణాన్ని చూడలేకపోతున్నాడు"

"ఆ తేడాలన్నీ నేను సృష్టించినవి కావు. అవన్నీ ఆయా జీవులు జీవించే నేల బట్టో, నీరు బట్టో, ప్రాంతంబట్టో వచ్చిన తేడాలు."

"మరి వాటి వల్ల తేడాలొస్తే...నువ్వు లేనట్లేగా..! అన్నీ ప్రాంతం, నేల, నీరు బట్టి జరిగితే మరి మనిషి జీవితానికి నువ్వు చేసిందేమిటి, అసలు దేవుడెందుకు?"

“మీ మానవులు తప్పు చేయడం లేదని చెప్పడం కోసం నువ్వు ప్రయత్నిస్తున్నట్లున్నావు. సామరస్యంగా ఉండి, అంతా కలిసి మెలిసి జీవిస్తే ఏ గొడవలూ జరగవు. మీ మనుషులు ప్రతిసారి కార్మికులారా ఏకండి, కర్షకులారా ఏకంకండి, ప్రజలారా ఏకంకండి, అని ప్రతి విషయంలో ఏకంకండి, అని నినాదాలు చేస్తుంటారు కదా…మరి ఈ మతం విషయంలో ఎందుకు ఏకం కావడం లేదు?”

“అసలు మత సామరస్యం మనుషులు కాదు స్వామి, దేవుళ్లు పాటించాలి. దేవుళ్లంతా సామరస్యంగా ఉండండి. హిందూ దేవుడు, ముస్లిం దేవుడు, క్రిస్టియన్ దేవుడు, సిక్కు దేవుడు ఇలా ఎంతమంది దేవుళ్లున్నారో వాళ్లంతా ఏకంకండి. కలిసికట్టుగా ఉండండి. ఒకే పద్ధతిని ప్రపంచానికి అందించండి. ఒకే విధానాన్ని అనుసరించనివ్వండి. నువ్వు ఒకరికి కృష్ణుడివి, మరొకరికి అల్లావి, ఇంకొకరికి యేసువి ఇలా ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపంలో బతుకు మార్గాన్ని సూచించావు. నువ్వు చూపించిన మార్గాల గొప్పతనాన్నీ వివరించావు. కాని ఇది ఎంత ప్రమాదాన్ని తీసుకొస్తుందో నువ్వు ఊహించలేకపోవడం కూడా నీ తప్పే” స్వామి.

“నువ్వు ప్రపంచమంతా ఒకే రూపంలో కృష్ణుడిగా ఉండి ఉంటే ప్రపంచమంతా కృష్ణుడి భక్తులుగానే ఉంటూ కృష్ణ నామస్మరణతో హాయిగా జీవించే వాళ్లం. పోనీ…లేదు, యేసుగానే మానవులందరికీ కనిపించి ఉంటే ఆమెన్ అనుకుంటూ అంతా ఏసు ప్రభువు సంకీర్తనే పాడుకుంటూ సుఖంగా ఉండేవాళ్లం. పోనీ అది కాదు ప్రవక్త రూపమే ఈ లోకం అని చెప్పి ఉంటే అందరం అల్లాకి నమాజులు చేస్తూ అన్నదమ్ముల్లా ఉండేవాళ్లం. కాని నువ్వు అలా కాకుండా ఒకసారి కృష్ణుడిగా, మరోసారి అల్లాగా, ఇంకోసారి యేసుగా ప్రజలకు దగ్గరయ్యావు. కాని ఆయా రూపాల్లో నీకు దగ్గరవుతున్న మానవులవు తోటి మానవులకు దూరమైపోతున్నారు. అందుకే నువ్వు ఒకే రూపంలో ప్రజలకు దగ్గరైతే ప్రజలంతా ఒక్కలాగే ఉంటారు. ఒకే మత విశ్వాసం కలిగి ఉంటారు. కాని నువ్వు అలా చేయకుండా ఒక్కోసారి ఒక్కోరూపంలో ఒక్కో మతం పేరుతో మనిషికి దగ్గరై తప్పు చేశావు స్వామి. ఇప్పుడు ఆ తప్పుకి భూలోకంలోని మానవులంతా క్షణక్షణం నరకం అనుభవిస్తున్నారు”

ఆ మాటలకు దేవుడు మరింత ఆశ్చర్యానికి గురయ్యాడు. “నిజమే కదా నేను ఒకే రూపంలో ఉండి ఉంటే ఒకే మతం, ఒకే తత్వం ఉండేది” అని అనుకున్నాడు. పవిత్ర ఆలోచలన్నీ దాదాపు ఒప్పుకున్నాడు భగవంతుడు.

“స్వామి మనిషి చేసిన తప్పులకు శిక్షలు నువ్వు విధిస్తావని అంటారు. నువ్వు చేసిన ఈ తప్పుకి శిక్షగా దాన్ని నువ్వే సరిదిద్దు స్వామి” అనడిగింది పవిత్ర

దేవుడు పవిత్ర వైపు సౌమ్యంగా చూస్తూ…ఏం చెప్తుందా అని ఆసక్తిగా ఉన్నాడు.

“మానవుడిగా పుట్టిన వాడికి మతమే వద్దు. మానవ జీవితానికి చుక్కాని వలే నడిపించడానికి ఏదో ఒక మతం ఉంటే చాలు. అలాంటి ఏర్పాటు ఏదైనా ఉంటే చూడు స్వామి. అదే నీ తప్పుకి శిక్ష” అంటూ పవిత్ర దేవుడి వైపు చూసింది.

“అదెలా సాధ్యం? ఇన్ని మతాల మనుష్యులను ఒకే మతంలోకి మార్చడమంటే

మాటలా..! మతాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోవడం మానవుల లోపం. అలాంటిది ఇప్పుడు అన్ని మతాల విలువలు, విధానాలను మార్చడం కుదరదు" అన్నాడు దేముడు.

"స్వామి ఈ అనంతంలో ఇంకా ఎన్ని గ్రహాలున్నాయి?".

"లెక్కలేన్నన్ని."

"అయితే ఒక పని చేయ్ స్వామి. మనుష్యులందరికీ ఒకే గ్రహం ఇచ్చావు కదా. ఈ సారి అలా కాకుండా ఒక్కో మతానికి ఒక్కో గ్రహం ఇచ్చేయ్. ఒక మతంలో పుట్టే వాళ్లందరూ ఒకే గ్రహంలో పుడతారు. అప్పుడు ఒక మతం, ఒక గ్రహం, ఒక వాదం, ఒక జీవితం...ఎంత బాగుంటుందో కదా..."

"ఒక్కో గ్రహానికి ఒక్కో మతమా..? ఒక్కో విధానమా? అదెలా సాధ్యం?"

"అవునా స్వామి..! ఒక్కో విలువ, ఒక్కో విధానం సాధ్యపడదా? మరి మా లోకంలో నీ పరిస్థితి అదే కదా స్వామి. నీకు ఒక్కో చోట ఒక్కో విలువ, ఒక్కో విధానం ఉన్నాయి. ప్రాంతం, స్థలం, సమయం బట్టి నీకు విలువ ఉంటుంది. నిన్ను ప్రార్థించే విధానముంటుంది. ప్రాంతం, స్థలం, బట్టి దేవుడైన నీ విలువే మారిపోతుంది. ఇక మానవులు, మతం ఎంత స్వామి..! తిరుపతిలో నీ విలువ వందల కోట్లు ఉంటే...రోడ్డు పక్క ఉండే నీ గుడిలో కనీసం హారతి కూడా ఉండదు. అంటే కొండ మీద నీకు ఎక్కువ విలువ, రోడ్డు పక్కన ఉండే గుడిలో అసలు విలువే లేదు. అక్కడా నువ్వే, ఇక్కడా నువ్వే. మరి తేడా ఎక్కడొచ్చింది స్వామి?"

"మక్కా మసీదును జీవితంలో ఒక్కసారైనా చూడాలని, అక్కడ ప్రార్థన చేయాలని అనుకుంటారు. మరి వీధుల్లో ఉన్న మసీదుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుంది. చర్చ్‌ల పరిస్థితి అంతే. దీనర్థం నీకు స్థిరమైన విలువ లేదనే కదా స్వామీ?"

దేవుడికి ఏం చెప్పాలో అర్థం కాలేదు.

"ఇంతకీ ఏం చెప్తున్నావ్ పవిత్ర?" అనడిగాడు దేవుడు.

"స్వామి నేను చెప్పేది ఒక్కటే. మనుష్యులంతా ఒక్కటవ్వడం కాదు. ముందు మీ దేవుళ్లంతా ఏకం కండి. మీరు ఏకమైతే...మేం ఏకమైపోయినట్లే...మీరంతా ఒక్కటవ్వాలి...ఒక్కటంటే ఒక్కటే అవ్వాలి..ఒక్కరే ఉండాలి...ఆ ఒక్కరు మమ్మల్ని ఒక్కరిగా ఉంచాలి...అది చాలు స్వామి"

నువ్వు చెప్పినదంతా బాగుంది పవిత్ర. కాని ఇది సాధ్యమవుతుందా? ఈ సాధ్యం చేసేందుకు నీ దగ్గర ఏదైనా ఆలోచన ఉందా? ప్రశ్నలేసిన నువ్వు దానికి పరిష్కారం చెప్పగలవా?" అనడిగాడు భగవంతుడు.

దేవుడు అలా అనేసరికి పవిత్ర ఆలోచనలో పడింది.

"నువ్వు చెప్పే ఆలోచన మానవాళికి ఏ విధమైన ఇబ్బంది కలిగించకుండా, ఎవరి

జీవన విధానాన్ని దెబ్బతీయకుండా ఉండాలి. అలా చేస్తే నీకు, నీ తండ్రికి తిరిగి భూలోకానికి పంపించే వరం ఇస్తాను. అంతే కాదు అక్కడ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న మీ అమ్మకి కూడా ప్రాణం పోస్తాను" అన్నాడు దేవుడు.

"స్వామి నా ప్రాణం, నా తల్లిదండ్రుల ప్రాణాల కోసం కాదు కాని...మానవాళి సుఖంగా ఉండటానికి అంటున్నారు కాబట్టి కచ్చితంగా చెప్పేందుకు ప్రయత్నిస్తాను. మీరు కోరినట్లు ఎవరికీ ఇబ్బందిలేని ఐడియా కోసం నాకు కొంచెం టైమ్ ఇవ్వాలి" అనడిగింది పవిత్ర.

"సరే" అన్నాడు దేవుడు.

పవిత్ర, దేవుడి మధ్య జరిగిన ఈ సంభాషణ అంతా చాలా ఆసక్తి కలిగించింది అందరిలో. ఇప్పుడు పవిత్ర ఏం పరిష్కారం చెప్తుందోననే ఆత్రుత అందరిలోనూ కనిపిస్తోంది. మానవాళి ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఎలాంటి కష్టం కలగకుండా భవిష్యత్‌లో మతం అనే ప్రస్తావనే లేకుండా పవిత్ర దేవుడికి పరిష్కారం చూపించాలి. అది ఎలా ఉంటుంది? ఎలా ఉండాలి? అనే విషయంపై అక్కడ గ్రూపులుగా ఏర్పడి రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

ఈ తరహా వాతావరణం దేవుడి గ్రహంలో కొత్త. మరణించి ఆత్మరూపంలో వచ్చిన మానవులకు మాత్రం పెద్ద వింతగా లేదు. ఎందుకంటే భూలోకంలో ఇలాంటివి మామూలే కదా..! రోడ్డు మీద రెండు వాహనాలు గుద్దుకున్నప్పుడో, ధోని సెంచరీ చేసినప్పుడో, పవన్ కల్యాణ్ సినిమా రిలీజ్ అయినప్పుడో, అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలప్పుడో, పక్కింటి వాడు కలర్ టీవీ కొన్నప్పుడో ఇలా ఎప్పుడో ఒకప్పుడు పనికొచ్చినా, రాకపోయినా గ్రూపు డిస్కషన్లు చేయడం అలవాటే కదా. కాకపోతే ఆ గ్రహంలో ఉన్న కాస్మిక్ ఎనర్జీ అని చెప్పుకుంటున్న దేవుళ్లకి మాత్రం ఇది చాలా కొత్తగా ఉంది. భూలోకంలో హామీల్లేని రాజకీయ నాయకుల ప్రసంగం ఎంత వింతో..! ఇప్పుడు ఆ దేవుడి గ్రహంలో పవిత్రకి దేవుడికి మధ్య జరిగిన సంభాషణ కూడా అంతే వింతగా ఉంది.

పవిత్ర ఎలాంటి పరిష్కారం చూపుతుందోనని రాముతో పాటు అక్కడ అందరూ ఎదురు చూస్తున్నారు. పవిత్ర తన మెదడులోని విషయాలన్ని మననం చేసుకుంటూ...ఒక్కో విషయాన్ని ఆలోచిస్తూ ఒక క్రమపద్ధతిలో పెడుతున్నట్లుగా ఉంది. అంతా పవిత్రని ఆసక్తిగా గమనిస్తున్నారు. దేవుడు కూడా పవిత్ర ఎలాంటి పరిష్కారంతో వస్తుందా అని చూస్తున్నాడు.

చాలా మంది అసలు ఇది నిజమేనా అనే అనుమానంతో ఉన్నారు. రాము అయితే ఇది నిజమని నమ్మలేకపోతున్నాడు.

దేవుడు ఇచ్చిన అవకాశంతో పవిత్ర నిజంగానే పరిష్కరం చూపించగలదా...? పవిత్ర చెప్పిన దానిని దేవుడు అంగీకరిస్తాడా...?

ఇప్పుడు అందరి ఆలోచన పవిత్ర చూపించే పరిష్కారం, దానికి దేవుడు రియాక్షన్ ఎలా ఉంటుందనే దాని మీదే ఉన్నాయి. ఏం జరుగుతుందో అనే టెన్షన్‌తో ఆ గ్రహ నిత్యం గందరగోళంగా ఉండే భూలోకంలా కనిపిస్తోంది.

# 17

**జనరల్** ఆసుపత్రిలో వైద్యులు ఫైనల్‌గా ఒక నిర్ణయానికి వచ్చారు. మరో నాలుగు గంటలు చూసి అప్పటికీ ఇదే పరిస్థితి కొనసాగితే తమ నిర్ణయాన్ని ప్రకటించాలని అనుకున్నారు. మనిషి శరీర ధర్మమే వైద్యానికి సహకరిస్తుంది. రాము, పవిత్రల శరీరాలు వైద్యానికి సహకరించడం లేదు. ఈ పరిస్థితుల్లో వైద్య పరికరాలను నమ్ముకునే కంటే...శరీర ధర్మాన్ని అనుసరించి రాము, పవిత్రలు ఇద్దరూ మరణించినట్లు ప్రకటించాలని నిర్ణయించుకున్నారు.

మరోవైపు లూసీ అపస్మారక స్థితిలోనే ఉంది. వైద్యం అందుతోంది కాని, వైద్యులు ఆమె పరిస్థితిపై కూడా సరైన అంచనాకి రాలేకపోతున్నారు.

ఆసుపత్రిలోనే ఉన్న రషీద్, అనిల్ పరిస్థితి చూస్తే గుండెలు పగిలిపోయేలా ఉంది. కొడుకూ, కోడలు, మనవరాలి పరిస్థితి ఏంటో డాక్టర్లు చెప్పలేకపోతున్నారు. కనీసం దూరం నుంచి కూడా చూడనివ్వడం లేదు. అసలు వాళ్లు ఈ ఆసుపత్రిలోనే ఉన్నారా లేదా అనే అనుమానం కూడా కలుగుతోంది వారికి. కాని ఏం చేయలేని పరిస్థితి.

* * * * *

భూలోక సమయం ప్రకారం సాయంత్రం కావడానికి మరో గంట సమయం ఉంది. దేవుడి గ్రహంలో టైమ్‌తో పని లేకపోవడంతో అంతా ఇంకా చర్చలు నడిపిస్తూనే ఉన్నారు. అయితే ఏ ఒక్కరికీ పవిత్ర ఏం చేస్తే బాగుంటుందో అనే విషయంపై ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో అక్కడున్న వారిలో పవిత్ర ఏం చెప్తుందా అనే టెన్షన్ మరింత పెరిగింది.

పవిత్ర చాలా కాన్ఫిడెంట్‌గా కనిపిస్తోంది. దేవుడు రాక కోసమే అంతా ఎదురు చూస్తున్నారు. కొద్దిసేపటికి దేవుడు వచ్చాడు.

“ఏం పవిత్ర పరిష్కారం కనుగొన్నావా?” అనడిగాడు దేవుడు.

“ఆ స్వామి నాకొక ఆలోచన వచ్చింది” అంది పవిత్ర.

“మరైతే చెప్పు...” అన్నాడు భగవంతుడు.

“స్వామి భూలోకంలో ఎక్కువ మతాలు ఉండటమే ప్రతిచోటా కనిపిస్తున్న మత అసహనానికి కారణం. ఏదో ఒక్క మతం ఉంటే అంతా ఒకే మతస్థులుగా ఉంటారు. అప్పుడు ఎవరికి  ఏ సమస్యా ఉండదు.”

"కాని ఇన్ని మతాలను ఎలా ఒక మతంగా మార్చేస్తావు?"

"అదే చెప్పబోతున్నా స్వామి..." అంది పవిత్ర.

"అలాగే మనిషికి మనిషికి ఉన్న తేడాలు కూడా ఇద్దరు మనుష్యుల్ని కలవనివ్వడం లేదు. అది రంగు కావచ్చు, ప్రాంతం కావచ్చు, భాష కావచ్చు, మరేదైనా కావచ్చు. ఇవి కూడా మనుష్యుల్ని వేరు చేస్తున్నాయి కదా స్వామి?" అనడిగింది పవిత్ర.

"అవును...అది కాసేపటి కిందటే చెప్పావు...నాకు పరిష్కారం చెప్పు" అన్నాడు దేవుడు.

అందరిలోనూ టెన్షన్ మరింత పెరుగుతోంది...ఏం చెప్తుందోననే ఆసక్తి మరింత ఎక్కువైంది.

"స్వామి నువ్వు దేవుడివి. మా మానవులకి సర్వాంతర్యామివి, కారణభూతుడివి. మా మానవుల ప్రాణాలు పోసినా, తీసినా నీదే బాధ్యత. నీకు మానవులపై సర్వ హక్కులున్నాయి. అవునా? కాదా?" అనడిగింది పవిత్ర.

"అవును..." అన్నాడు దేవుడు పవిత్ర ఏం చెప్తుందోనన్న ఆసక్తితో.

"అందుకే ఈ సమస్యకు పరిష్కారం కోసం ఏం చేయాలో నేను చెప్తాను. కాని చేయాల్సింది మాత్రం మీరే." అని భారం దేవుడిపైనే పెట్టింది పవిత్ర.

"నువ్వు సూచించిన పరిష్కారం అందరికీ ఆమోదయోగ్యం అయితే నాకు చేయడానికి ఏ మాత్రం అభ్యంతరం లేదు. ఎందుకంటే నీ వల్ల రానున్న తరాలు సుఖంగా ఉంటాయంటే అంతకంటే మాకు కావాల్సింది ఏమీ లేదు. త్వరగా ఆ పరిష్కారం ఏంటో చెప్పు" అన్నాడు దేవుడు.

"స్వామి..! నువ్వు ఇప్పుడు ఒక కొత్త లోకాన్ని సృష్టించాలి. ఈ భూగోళాన్ని సరికొత్తగా మళ్లీ పుట్టించాలి" చెప్పింది పవిత్ర.

పవిత్ర ఆ మాట వినగానే దేవుడితో సహా అందరూ ఆశ్చర్యపోయారు. భూగోళాన్ని మళ్లీ సృష్టించాలా? మరి ఇప్పుడున్న ఈ భూగోళం పరిస్థితి ఏంటి? ఒక బాంబు దాడిలో వంద మంది చనిపోయారని భూగోళంలో ఉన్న మొత్తం మనుషులనే చంపేయాలా? అని పవిత్ర తప్ప మిగతా వారంతా వాళ్లలో వాళ్లు అనుకుంటూ పవిత్రని పిచ్చిదాన్ని చూసినట్లు చూస్తున్నారు.

"స్వామి నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. ఈ భూగోళాన్ని నువ్వు ఎలా సృష్టించావో ఇప్పుడు అలా లేదు. అది అనేక మార్పులకు లోనవుతూ వస్తోంది. ఇంకా మార్పులకు గురవుతూనే ఉంది. మనిషి ఆ మార్పులకు తట్టుకుని, అవగాహన చేసుకుని, ఆకళింపజేసుకుని తన జీవనాన్ని సాగిస్తున్నాడు. కాబట్టి మనిషికి భూగోళంలో మార్పులు రావడం, ఆ మార్పులకు అనుగుణంగా తాను మారడం పెద్ద విషయమేమీ కాదు. తనకి క్లాసులో ప్రొఫెసర్ చెప్పిన భూఖండ చలన సిద్ధాంతం పాఠాన్ని గుర్తుకు చేసుకుంది పవిత్ర. ఇది కూడా కొత్త విషయమేమీ కాదు. ప్రస్తుతం భూలోకంలో దీన్ని భూఖండ చలన

సిద్ధాంతం అంటున్నారు. దీన్నే కాంటినెంటల్ డ్రిఫ్ట్ అని ఇంగ్లిష్‌లో అంటాం. అంటే ఒకప్పుడు పలకగా, ఒకచోట పోసిన ముద్దలా ఉండే భూమి విడిపోయి ఖండాలుగా మారడం. ఇప్పుడు ఖండాలుగా ఉన్న భూమిని నువ్వు ఒకే ఖండంగా మార్చేయ్యి. భూఖండ చలన సిద్ధాంతం ప్రకారం భూగోళంలో ఉండే భూభాగమంతా ఒకేచోట చేరడానికి కోట్ల సంవత్సరాలు పడుతుంది. దాన్ని నువ్వు ఇప్పుడే చేసెయ్యి స్వామి. నువ్వు భూఖండ చలన సిద్ధాంతాన్ని వెంటనే అమలు చేసి...ఈ భూగోళంలోని భూభాగాన్ని ఒకే ఖండంగా మార్చేయాలి స్వామి.”

భూగోళాన్ని మార్చేస్తే మతం ఎలా పోతుంది. సమస్యలు ఎలా తీరిపోతాయి? అనే సందేహం అక్కడ అందరిలో కనిపించింది.

“ఆ మార్పు ఎలా ఉండాలంటే ఇది నా దేశం, నా గ్రామం, నా ఊరు, నా వీధి అనుకోడానికి వీలు లేకుండా అంతా ఒకేలా ఉండాలి. సరిహద్దులు లేని భూగోళంగా దీన్ని మార్చేయాలి. సరిహద్దులే లేని భూభాగంగా ఉండాలి. ఆ భూభాగంలో ఎక్కడ చూసినా ఒకటే వాతావరణం ఉండాలి. అప్పుడు అందరూ ఒకే రంగులో ఉంటారు. అలాగే ఇక్కడ ఈ లోకంలో ఎవరు ఏ భాష మాట్లాడినా అది మరొకరికి అర్థం అవ్వడం, తిరిగి అదే భాషలో సమాధానం చెప్పడం ఎలా ఉందో...అక్కడ కూడా అదే విధంగా ఉండాలి. అప్పుడు నా దేశం, నా భాష, నా రంగు ప్రజలు ఇలా ఏవీ ఉండవు. అంతా మనమే అనుకుంటారు. మా లోకంలో కూడా “నా” అనేది వదిలేసి “మనం” అని అనుకోండని చాలా మంది జ్ఞానులు, సాధువులు చెప్తుంటారు. ఇప్పుడు నేను అదే నీకు చెప్తున్నా స్వామి...అలాంటి భావం వచ్చే విధంగా నువ్వు నేను చెప్పినవన్నీ చేయాలి. అప్పుడు అంతా ఒక్కటే. అందరూ ఒక్కటే.

అన్నింటి కంటే ప్రధానంగా చేయాల్సిన పని ఒకటి ఉంది. మనిషికి మతి మరుపు సహజంగా ఉండే గుణం. అయితే కాలంతో పాటు జ్ఞాపక శక్తి కోల్పోవడం జరుగుతుంది. అయితే ఇక్కడ నువ్వు చేయాల్సింది ఏంటంటే భూలోకంలో ఉన్న ప్రజలందరికీ ఈ జరుగుతున్న మార్పుని గుర్తించినప్పటికి కూడా...జరిగిన తర్వాత మాత్రం మార్పులేవి గుర్తు లేకుండా చేయాలి. మార్పులు జరిగిన తర్వాత వారు ఎప్పటిలా తమ తమ జీవితాలను సాగించే విధంగా ఉండాలి. ఏదో జరిగిందనే విషయం వారికి తెలియకూడదు. జరిగిందేంటో తెలిస్తే మనిషి దాని కోసమే ఆలోచిస్తూ మళ్లీ తనని తాను వెతుక్కునే ప్రయత్నం చేస్తాడు. అప్పుడు నువ్వు చేసిన దానికి ఫలితం ఉండదు.”

పవిత్ర చెప్తుంటే దేవుడితో సహా అందరూ చెవులు రిక్కించి మరీ వింటున్నారు.

“స్వామి ఇప్పుడు అసలైన సమస్యకి పరిష్కారం చూపించాలి. అదే మతం. మత అసహనం రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఇదే భూగోళంలో ప్రధాన సమస్య. ఇప్పటివరకు అనుకున్నవన్నీ చేసిన తర్వాత భూలోకమంతా ఒకటే మాట, ఒకే రంగు, ఒకే ప్రాంతంగా ఉంటుంది. అలాంటి చోట నువ్వు కూడా ఒక్కడిగానే ఉండు. బహుశా అలాంటి ప్రపంచంలో నీ అవసరం మాకు, మా అవసరం నీకు పెద్దగా ఉండదు కూడా.

కాని స్వామి మనిషి మనుగడకి ఏదో ఒక శక్తి అవసరం. ముందుకు నడిపించే శక్తి.

దాని నామవాచకం ఏదైనా దానికి సర్వనామం మాత్రం దేవుడే. ఆ దేవుడిగా నువ్వే ఉండు. కాని ఒక్కడిగానే రా. రకరకాలైన వేషాల్లో, మతాల్లో రాకు, ఒకే వేషం, ఒకే మతంతో నువ్వు ఉండు స్వామి. ఆ వేషం కూడా మనిషి వేషం. ఆ మతం కూడా మానవత్వం అయ్యుండాలి స్వామి. అప్పుడే వచ్చే తరాలు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా అమ్మ ఒళ్లో పసిపాపల్లా హాయిగా ఉంటారు తండ్రి" చెప్పింది పవిత్ర.

దేవుడికి పవిత్ర మాటలు ఎంతో ఆసక్తి కలిగిస్తున్నాయి. తనకి ఎప్పుడూ ఇలాంటి ఆలోచన రాలేదు కదా అని అనుకున్నాడు. అంతేలే ఏదైనా అనుభవిస్తేనే కదా తెలుస్తుంది. వాళ్లు అనుభవించారు తెలుసుకున్నారు. నేను మతాన్ని సృష్టించి మరో కొత్త మార్గాన్ని ఇచ్చానని అనుకున్నానే కాని ఆ మార్గం ఇన్ని ఇబ్బందుల్ని తెస్తుందని అనుకోలేదు. నిజమే ఇది నేను చేసిన తప్పే అని ఈ సారి పూర్తిగా ఒప్పుకున్నాడు దేవుడు.

"స్వామి మాకు హిందూయిజం, క్రిస్టియనిజం, ఇస్లామిజం ఇలా ఏదీ వద్దు, హ్యూమనిజం ఇవ్వు చాలు. ఒక జాతిని చీల్చాలంటే మతాన్ని మించిన ఆయుధం లేదు. ఒక జాతిని నిలబెట్టాలంటే మానవత్వాన్ని మించిన మతం లేదు. అందుకే మాకు ఒక్క దేవుడే కావాలి. ఆ దేవుడిచ్చే మతం మానవత్వమై ఉండాలి. అప్పుడు మాకు ఈ మతాల గొడవ ఉండదు. అందుకే స్వామి కొత్త లోకం సృష్టించమని అడుగుతున్నాను. ఈ కొత్త లోకం విశ్వంలో మరెన్నో లోకాలున్నా అన్నింటికీ ఆదర్శం కావాలి. అలాంటి సృష్టి నువ్వు చేయాలి స్వామి" అంటూ చెప్పడం ముగించింది పవిత్ర.

పవిత్రతో పాటు అక్కడున్న అందరూ దేవుడి వైపే చూస్తున్నారు. దేవుడు ఏం చెప్తాడా అని అంతా తీవ్రమైన ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

దేవుడు మాత్రం పవిత్ర దగ్గరకు వచ్చాడు. దేవుడు పవిత్ర దగ్గరకు రావడం చూస్తున్న రాము చాలా ఆందోళనగా ఉన్నాడు. తన బిడ్డ దేవుడ్ని ఎదిరించడమేంటి? దేవుడికి సలహాలు ఇవ్వడమేంటి? పైగా కొత్త లోకం సృష్టించమని అడగడమేంటి? ఇదేమీ అర్థం కావడం లేదు రాముకి. అసలు ఇదిలా కలా? నిజమా? అనే విషయంలో సందేహం వచ్చి గిల్లుకుందామని అనుకున్నాడు. కుడి చేతిని ఎడమచేత్తో గిల్లే ప్రయత్నం చేశాడు. గిల్లిన అనుభూతి అయితే కలిగింది కానీ...స్పర్శ మాత్రం తెలియలేదు. అప్పుడు గుర్తొచ్చింది రాముకి, తాము శరీరమున్న మనుషులం కాదని...ఆత్మలమని.

పవిత్ర దగ్గరకి వచ్చిన దేవుడు పవిత్రని చూసి ఒక చిన్న చిరునవ్వు నవ్వాడు.

దేవుడు ఏం చెప్తాడా అని పవిత్ర ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తోంది.

"స్వామి ఎప్పుడు చేస్తారు నూతన సృష్టిని?" అని అడిగేసింది.

దేవుడు పవిత్రని ఆప్యాయంగా చూస్తూ అలా ముందుకు సాగాడు.

పవిత్రకి ఏం అర్థంకావడంలేదు. అంటే దేవుడు భూలోకాన్ని కొత్తగా సృష్టించేందుకు ఒప్పుకున్నాడా..! లేదా..! అసలు జరిగినదంతా నిజమేనా అని రాముకి వచ్చిన అనుమానమే పవిత్రకీ వచ్చింది. కానీ ఇది కలకాదు నిజమే అన్న విషయం వెంటనే

గ్రహించింది. మరి దేవుడు తన ఆలోచనను అమలు చేస్తాడా, లేదా అని ఆలోచిస్తోంది పవిత్ర.

ఇప్పుడు దేవుడు ఏం చేస్తాడా అని అంతా ఆసక్తిగా భూగోళం వైపే చూస్తున్నారు.

భూగోళం ఎప్పటిలా ఏ మార్పు లేకుండా ఉంది. సమయం గడుస్తున్నా ఎలాంటి మార్పు లేకపోవడంతో పవిత్రతో సహా అక్కడున్న వారంతా ఒకరి ముఖాలు ఒకరు చోసుకున్నారు.

* * * * *

పీజేహెచ్ వైద్యులు ఒక నిర్ణయానికి వచ్చేశారు. రాము, పవిత్రల మరణాన్ని అధికారికంగా ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. రాము, పవిత్రలను చివరగా ఒకసారి చెక్ చేశారు. అదే రిజల్ట్. అదే కన్ఫ్యూజన్. ఇక చేసేదేమీ లేదు, వారి మరణాన్ని తెలియజేయడం తప్ప అనుకున్నారంతా. ఆ విషయాన్ని వారి రిలేటివ్స్ చెప్పడానికి మానసికంగా సిద్ధమయ్యారు. ఏం చెప్తారా అని రషీద్, అనిల్, పవిత్ర ఫ్రెండ్ అంతా బయట టెన్షన్‌తో ఎదురు చూస్తున్నారు. డాక్టర్లు ముగ్గురూ బయటకు వచ్చారు. అది చూసిన రషీద్ కంగారుగా వారి వైపు వెళ్లాడు. డాక్టర్ కళ్లజోడు తీసి...

"చూడండి" అంటూ డాక్టర్ ఏదో చెప్పబోతుండగా..

"డాక్టర్...ర్...ర్...ర్..." అంటూ అటువైపు నుంచి పెద్ద కేక వినిపించింది.

ఒక నర్స్ పరుగెత్తుకుంటూ రావడం చూసిన డాక్టర్లు అటువైపుగా వెళ్లారు.

"డాక్టర్ ఆ పేషెంట్ కళ్లు తెరిచింది" అని ఆయాసపడుతూ చెప్పింది నర్స్.

"ఏ పేషెంట్...పవిత్రనా..?" అనడిగారు డాక్టర్లు ముగ్గురూ ఒకేసారి ఆశ్చర్యంగా.

నర్స్ అయాసపడుతూ చెప్పలేకపోతోంది. స్థిమితపడ్డాక డాక్టర్లు మళ్ళీ అడిగారు. కళ్లు తెరిచింది ఏవరు..? పవిత్రేనా అని.

"కాదు కాదు...పవిత్ర వాళ్ల అమ్మ లూసీ" అంది నర్స్.

అంతే...ఆ మాట వినగానే ముగ్గురు డాక్టర్లు ఆ నర్సుని పక్కకి తోసేసి లూసీ రూం వైపు పరుగులు తీశారు.

నిన్నటి వరకు ఉలుకూపలుకూ లేకుండా పడి ఉన్న లూసీ శరీరం ఇప్పుడు స్పందిస్తోంది. దాంతో వైద్యులు హడావిడిగా ఆమెకు పరీక్షలు నిర్వహిస్తూ వైద్యం అందిస్తున్నారు.

అయితే అసలు ఏం జరిగిందో రషీద్ అండ్ బ్యాచ్‌కి అర్థం కాక అయోమయంగా డాక్టర్లు పరిగెత్తిన వైపు చూస్తున్నారు. తమని ఎందుకు రమ్మన్నారో, ఎందుకు డాక్టర్లు అటువైపు పరుగులు తీశారో అర్థం కావడం లేదు వాళ్లకి. ఏదో జరుగుతోంది. కానీ ఎంటో

తెలియడం లేదు. డాక్టర్లు తమ వారి ఆరోగ్య పరిస్థితిని ఎందుకు చెప్పడం లేదో రషీద్, అనిల్‌కి అర్థం కావడం లేదు.

# 18

**దేవుడు** ఏదో చేస్తాడని ఆత్రుతగా ఎదురు చూస్తున్న వారికి ఏం ఫలితం కనిపించడం లేదు. అంతా భూగోళం వైపు చూస్తున్నారు. ఏదైనా మార్పు సంభవిస్తుందా అని, కానీ అలాంటిదేమీ కనిపించడం లేదు. పవిత్ర దేవుడు కోసం ఎదురు చూస్తోంది వస్తే అడుగుదామని. కానీ దేవుడు ఇంకా రాలేదు. దేవుడు వెళ్లిన వైపే పవిత్ర చూస్తూ ఉంది. అంతలోనే దేవుడి గ్రహం మీద చిన్న అలజడి మొదలైంది. అదేంటా అని పవిత్ర వెనక్కి తిరిగి చూసింది. దేవుడి గ్రహవాసులంతా కళ్లు పెద్దవి చేసుకుని మరీ భూగోళం వైపు చూస్తున్నారు.

ఆశ్చర్యం...

భూగోళంలోని నీలిరంగు అంతా ఒక వైపు కదులుతున్నట్లుగా కనిపించింది. అంతే పవిత్రతోపాటు అక్కడున్న వారంతా ఎంతో ఆశ్చర్యానికి, ఆనందానికి గురవుతున్నారు. దేవుడు పని ప్రారంభించాడు. దేవుడు భూగోళాన్ని మళ్లీ సృష్టిస్తున్నాడు. ఆ సృష్టికి తొలి సాక్షులుగా దేవుడి గ్రహం నుంచి ఆ మార్పుని చూస్తున్న పవిత్ర, రాము కూడా ఉన్నారు.

భూగోళంలోని భూభాగమంతా కదులుతోంది. బ్రెజిల్ తీర ప్రాంతం కదులుతూ కనిపిస్తోంది. అది దక్షిణ అట్లాంటిక్ సముద్రం మీద తేలుతూ మెల్ల మెల్లగా ఆఫ్రికా ఖండం వైపు వెళ్లిపోతోంది. బ్రెజిల్ అలా అలా వస్తూ ఆఫ్రికా ఖండంలోని దక్షిణాఫ్రికా, నంబియా, అంగోలా తదితర దేశాలను ఢీకొట్టబోతోంది. మరోవైపు గ్రీన్ ల్యాండ్ భూభాగం మొత్తం కదులుతూ ఐర్లాండ్ దేశాన్ని ఢీకొట్టింది. ఆ రెండు భూ భాగాలు కలిసిపోయి...సముద్రాన్ని వెనక్కి నెట్టేస్తూ, నార్వే దేశం వైపు పయనిస్తున్నాయి. ఇండియా చిట్టచివరి భాగమైన కన్యాకుమారి పాయింట్‌కు దిగువన ఉండే శ్రీలంక కదులుతూ ఉంది. ఇలా మొత్తం ప్రపంచంలోని తీర ప్రాంత దేశాలన్నీ పక్కనున్న ఖండాలు లేదా దేశాల్లో కలిసిపోవడమో, కలిపేసుకోవడమో జరుగుతోంది. అయితే రోజూ భూమి గుండ్రంగా తిరుగుతున్నా ...అదే భూమీదున్న మానవులు దాన్ని ఎలా గుర్తించలేరో, ఈ భూభాగం కదలికలను కూడా మనిషి గుర్తించలేడు. అంతరిక్ష కేంద్రంలో అస్ట్రోనాట్స్‌కి ఈ మార్పు కనిపిస్తోంది.

దేవుడు పని మొదలు పెట్టాడు అనే విషయాన్ని రుజువు చేస్తూ భూమి మీద దేశాలన్నీ జరుగుతూ ఒకదానితో మరొకటి కలిసిపోతున్నాయి.

అంతా గందరగోళం, ఒకటే అయోమయం. ఇలా ప్రపంచ భూభాగమంతా ఒక్కటైపోయింది. దేశాల సరిహద్దులన్నీ చెరిగిపోయాయి. భూభాగమంతా ఎలాంటి గ్యాప్

లేకుండా కలిసిపోయింది. దీంతో సముద్రాల్నీ వెనక్కి వెళ్లి సరిహద్దుల్ని కోల్పోయి, భూభాగం చుట్టూ చేరి ఏ సముద్రం ఏదో తెలియనంతగా ఒక్కటైపోయాయి.

అలాగే భూమ్మీద చాలా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. చైనా పౌరుడు జర్మన్ మాట్లాడగలుగుతున్నాడు, జర్మన్ చైనీస్‌ను బ్రహ్మాండంగా పలికేస్తున్నాడు. నిన్నటి వరకు మాతృభాషే సరిగ్గా మాట్లాడటం రాని చాలా మంది కూడా మాతృభాషతోపాటు ప్రపంచంలోని అన్ని భాషలూ మాట్లాడగలుతున్నారు. అంటే ఇండియన్‌తో చైనీస్, ఆస్ట్రేలియన్‌తో స్పానిష్, ఫ్రాన్స్‌లో హిందీ, అమెరికాలో బెంగాలీ ఇలా అందరూ... అన్ని భాషలు మాట్లాడగలుగుతున్నారు. దీంతో భూగోళంపై ఉండే భాషా సమస్య తీరిపోయింది.

ఏదో మాయ జరిగింది. అయితే అదేంటో అర్థం కావడం లేదు. అసలేం జరుగుతుందో ఎవరికీ అంతుపట్టని పరిస్థితి. అసలేం జరిగింది?

ఒక్కో ఖండం కలిసిపోయింది. సముద్రం మీద తేలియాడుతున్నట్టు భూభాగమంతా కదులుతూ ఒక దేశం మరో దేశంతో, ఒక ఖండం మరో ఖండంతో ఏకమైపోయాయి. ఆ విషయాన్ని గమనిస్తున్న అంతరిక్షంలోని స్పేస్ రిసెర్చ్ సెంటర్ సైంటిస్టులు ఆశ్చర్యానికి లోనవుతున్నారు.

తాను చదువుకున్న భూఖండ చలన సిద్ధాంతాన్ని స్వయంగా చూస్తుండటంతో పవిత్ర ఎంతో ఆశ్చర్యానికి లోనవుతోంది. కొన్ని కోట్ల సంవత్సరాల తర్వాత జరగాల్సిన ఈ పరిణామం క్షణాల్లో జరిగిపోతుండటంతో దాన్ని ఇంకా దగ్గరగా చూడాలని అనుకుంటూ భూగోళం వైపు వంగి వంగి చూస్తోంది. అలా చూస్తూ చూస్తూ ఒక్కసారిగా పట్టు జారినట్లు అక్కడి నుంచి జారిపడిపోయింది. పవిత్ర పడిపోడాన్ని చూసిన రాము కూతుర్ని పట్టుకోవడం కోసం ముందుకు వంగాడు. దాంతో రాము కూడా అక్కడి నుంచి పట్టు జారి కిందకి పడిపోయాడు. పవిత్ర, రాము ఇద్దరూ కిందకి పడిపోతున్నారు.

* * * * *

లూసీ శరీరంలో స్పందన మొదలవడంతో తక్షణ వైద్యం అందించారు వైద్యులు. రాము, పవిత్రల విషయం మాత్రం సస్పెన్స్‌గానే ఉంది. లూసీనైతే బతికించొచ్చు అనే నిర్ణయానికి వచ్చారు వైద్యులు. ఇక రాము, పవిత్ర మరణించారనే విషయాన్ని వారి బంధువులకు చెప్పడం మినహా మరో మార్గం కనిపించడం లేదు. దాంతో మళ్లీ రషీద్ అండ్ బ్యాచ్‌కి కబురు పెట్టారు డాక్టర్లు. వారు వచ్చి డాక్టర్ల కోసం వెయిట్ చేస్తున్నారు.

ముగ్గురు డాక్టర్లూ వచ్చారు.

రషీద్ వాళ్ల వైపు కోపంగా చూస్తున్నారు. దాదాపు ఒక రోజు గడిచింది ఏం జరిగిందో చెప్పలేకపోతున్నారు. ఇప్పటికైనా చెప్తారా...? చెప్తే ఏం చెప్తారు? తమ బిడ్డలు క్షేమంగా ఉన్నారనే విషయం చెప్తారా..? లేకపోతే చావు కబురు వినిపిస్తారా..? అని రషీద్ మనసులో ఒకటే ఆలోచనలు.

డాక్టర్లు ఒకరి వైపు ఒకరు చూసుకుంటున్నారు. నువ్వు చెప్పు అంటే, లేదు లేదు నువ్వే చెప్పు అన్నట్లుగా ఉన్నాయి అక్కడి డాక్టర్ల చూపులు. రెండు నిమిషాల తర్వాత ఒక డాక్టర్ ముందుకొచ్చి కళ్లజోడి తీసి..

"బాంబు పేలుళ్లలో గాయపడిన మీ...అంటూ ఏదో చెప్పబోతుండగా...

ఈసారి మరో నర్స్ నుంచి "డాక్టర్...ర్..ర్..ర్.." అంటూ కేక వినిపించింది.

అంతే...ఏమైందా అని అంతా ఆ కేక వినిపించిన వైపు పరుగులు పెట్టారు.

కొంత దూరం వెళ్లిన తర్వాత అక్కడ సెక్యూరిటీ గార్డు డాక్టర్లని పంపించేసి...రషీద్ అండ్ బ్యాచ్‌ని అడ్డేశాడు.

నర్స్ డాక్టర్ల వైపు పరిగెత్తుకుంటూ వచ్చి...ఆయాసపడుతోంది.

ఆమె ఏం చెప్తుందా అని డాక్టర్లు టెన్షన్ పడిపోతూ ఎదురు చూస్తున్నారు.

"డాక్టర్...డాక్టర్...వాళ్లిద్దరూ కదులుతున్నారు" అని ఆయాసపడుతూ చెప్పిందా నర్స్.

"ఎవరా ఇద్దరూ?" అంటూ డాక్టర్లు అటువైపు చూశారు.

చనిపోయారని  అనుకున్న రాము, పవిత్ర శరీరాలు కదులుతున్నాయి. అది చూసిన డాక్టర్లకు వణుకు వచ్చినట్లుగా ఉంది. ముగ్గురి శరీరాల్లోని చిన్నపాటి షేకింగ్ తెలుస్తోంది. ముగ్గురు డాక్టర్లు మెల్లగా రాము, పవిత్ర దగ్గరకు వెళ్లారు.

దేవుడి గ్రహం నుంచి జారిపడిన పవిత్ర, రాము ఆత్మలు నేరుగా పారిస్ జనరల్ ఆసుపత్రిలోని వారి శరీరాల్లోకి వచ్చి చేరాయి. మంచి ఆలోచన చెప్తే ఇద్దరికీ ప్రాణాలు ఇస్తానని చెప్పిన దేవుడు తన మాటని నిలబెట్టుకున్నాడు. దాంతో ఆ శరీరాలకు మళ్లీ ప్రాణం వచ్చి చేరింది.

ఇద్దరి శరీరాల్లో చలనం ఉంది. కొద్ది నిమిషాల కిందటి వరకు అసలు ఎలాంటి స్పందన లేని వీరిద్దరి శరీరాలు స్పందిస్తున్నాయి. పైగా చాలా యాక్టివ్‌గా ఉన్నాయి. డాక్టర్లకు ఏం జరిగిందో అర్థం కావడం లేదు. జరిగింది ఏదైనప్పటికీ ఇద్దరి శరీరాలు వైద్యానికి సహకరిస్తుండటంతో వెంటనే వైద్య సేవలు ప్రారంభించారు.

డాక్టర్ల కోసం ఎదురు చూస్తున్న రషీద్, అనిల్‌కు ఏం అర్థం కావడం లేదు. అసలేం జరుగుతోంది. డాక్టర్లు తమని ఎందుకు రమ్మంటున్నారు? ఏదో చెప్పబోతుండగా...నర్సులు ఎందురు అరుస్తున్నారు? డాక్టర్లు ఎందుకు పరుగులు పెడుతున్నారో తెలియక అయోమయంగా, భయంభయంగా చూస్తున్నారు.

వైద్య సేవలు అందించిన తర్వాత డాక్టర్లకు ధైర్యం వచ్చింది. వీరి ప్రాణాలకు ఢోకా లేదని, అక్కడ లూసీ, ఇక్కడ రాము, పవిత్ర మొత్తం ముగ్గురి ప్రాణాలు సేఫ్ అనుకున్నారు డాక్టర్లు. ఊపిరి పీల్చుకున్న డాక్టర్లు ఈసారి ఆ సంతోషకరమైన విషయాన్ని రషీద్ బ్యాచ్‌కి తెలియచేద్దామని అనుకున్నారు. అయితే ఈసారి వాళ్లని పేషెంట్ల దగ్గరకే రమ్మని కబురు

పంపించారు.

బయట వెయిట్ చేస్తున్న రషీద్ దగ్గరకు వచ్చిన ఓ వార్డ్ బాయ్...

"డాక్టర్ గారు మిమ్మల్ని పిలుస్తున్నారు" అని చెప్పాడు.

"ఎవర్నీ, ముగ్గుర్నినా?" అనడిగాడు రషీద్.

"అవును ముగ్గుర్నీ..!" అన్నాడు ఆ వార్డు బాయ్

అంతే రషీద్, అనిల్, లూసీ ఫ్రెండ్ ముగ్గురికీ వణుకు మొదలైంది. ఇప్పటివరకు ఏ విషయం చెప్పని డాక్టర్లు ఇప్పుడు లోపలికి రమ్మంటున్నారంటే ఏదో కీడు శంకిస్తున్నాయి వాళ్ల మనసులు.

ఒకరి చేయి ఒకరు పట్టుకుని  డాక్టర్లు రమ్మన్న రూం దగ్గరకి వెళ్తున్నారు. దాదాపుగా రూం దగ్గరకి వెళ్లేసరికి...

"డాక్టర్...ర్...ర్..ర్.." అంటూ పెద్ద గావు కేక వినిపించింది.

ఆ అరుపులకి మళ్లీ అంతా అటువైపు పరుగులు పెట్టారు రషీద్, అనిల్‌తో సహా...రాము, పవిత్రలున్న పక్క రూం నుంచే వినిపించాయి ఆ అరుపులు.

ఆ రూంలో ఓ ఆఫ్రికన్ యాక్సిడెంట్ కేసులో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడు.

డాక్టర్స్ అంతా ఆ రూంలోకి వెళ్లి చూసేసరికి...నర్స్ రెండు కళ్లు మూసుకుని ఓ గోడకు ఆనుకుని భయపడిపోతూ కనిపించింది.

డాక్టర్లు అక్కడ బెడ్ మీద ఉన్న ఆఫ్రికన్ నిగ్రో పేషెంట్ వైపు చూశారు. డాక్టర్లు షాక్ అయ్యారు. నిగ్రో శరీరం రంగు మెల్లగా మారిపోతోంది. ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. కాని అతని శరీరం రంగు మారిపోతోంది. మెల్ల మెల్లగా శరీరం రంగు మారి తమ శరీరం రంగులోకి రావడాన్ని గమనించారు అక్కడి డాక్టర్లు, వారితో పాటు ఉన్న వారంతా.

నీగ్రో ముఖం వైపు వింతగా, భయంగా చూస్తూ వీడికేమన్నా వింత రోగం వచ్చిందా?" వణుకుతూ అడిగింది నర్స్.

"నాకేమి కాలేదు. నేను బాగానే ఉన్నాను ఏ రోగం లేదు" అని ఆఫ్రికన్ నిగ్రో ఆశ్చర్యకరంగా ఫ్రెంచ్ లాంగ్వేజ్‌లో సమాధానం చెప్పాడు.

దాంతో ఆ నర్స్‌కి, నర్సుతో పాటు ఉన్న డాక్టర్లకి ముఖం తిరిగినంత పనైంది. ఆఫ్రిక్ స్వచ్ఛమైన ఫ్రెంచ్‌ని ఎంచక్కా మాట్లాడేస్తున్నాడేంటి అని ఆశ్చర్యపోయారు. అదే సమయంలో ఆసుపత్రిలోని డాక్టర్లు, నర్సులు, పేషెంట్లు అందరికీ రంగులు మారాయి. అయితే నీగ్రో కలర్ మార్పు స్పష్టంగా కనిపించింది. వారి రంగు తేడా అంత స్పష్టంగా కనిపించలేదు.

అదే సమయంలో ప్రపంచంలో అద్దం ముందు ఉండి తమ ముఖాలు చూసుకుంటున్న

వారంతా గమనించారు. తమ శరీర రంగులోని తేడాలను, నల్లగా ఉన్న వారు కాస్త తెల్లగా మారిపోయారు. తెల్లగా ఉన్న వారు కాస్త నల్లగా మారిపోయారు. మొత్తంగా మనుషులందరూ ఒకే రంగులోకి వచ్చేశారు. ఇలా ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ ఇదే సీన్. న్యూజిలాండ్, బ్రెజిల్, అమెరికా, ఆఫ్రికా, ఇండియా ఇలా ప్రపంచమంతా ఒకే రంగులోకి వచ్చేసింది. అంతా ఈక్వల్ ఇన్ కలర్.

సరిహద్దులు కలిసిపోయాయి. భాషలు ఏకమయ్యాయి. రంగులన్నీ ఒకే రంగు అయ్యింది. దేవుడు తన పనిని విజయవంతంగా పూర్తి చేశాడు. అదే క్షణంలో..

సృష్టి మొత్తం క్షణకాలం పాటు ఆగిపోయింది.

ఆ క్షణంలో భూగోళం మొత్తం మారిపోయింది. పవిత్ర దేవుడ్ని కోరిన కోరికలన్నీ కార్యరూపంలోకి వచ్చాయి.

ఆ క్షణమే విశ్వానికి కొత్త లోకం అందింది.

ఆ క్షణమే ప్రపంచంలోని తేడాలన్నీ మాయమయ్యాయి.

ఆ క్షణమే భూగోళం మరోసారి పురిటి నొప్పులు పడింది.

ఆ క్షణమే భూలోకం  మరో జన్మెత్తింది.

ఆ క్షణమే భూగోళం మీద జీవం మరోసారి ఊపిరిపోసుకుంది.

ఆ క్షణమే మతం మాయమైంది.

ఆ క్షణమే మతం లేని సమానత్వం కనిపించింది.

ఆ క్షణమే అందరి దేవుళ్లు ఒక్కటై ఒక్క దేవుడయ్యాడు.

ఆ క్షణమే అమ్మ ఒడిలోని బిడ్డలా భూగోళం బోసి నవ్వులు నవ్వింది.

ఆ క్షణమే తేడాల్లేని లోకం ఆవిష్కృతమైంది.

ఆ క్షణమే దేవుడు సైతం తన సృష్టికి గర్వపడ్డాడు.

భూలోకం కొత్తగా కనిపిస్తోంది. అయితే ఆ మార్పులు జరిగినప్పుడు గుర్తించిన మానవుడు ఆ మార్పు పూర్తవ్వగానే అన్నీ మర్చిపోయాడు. యుగయుగాలుగా ఈ లోకం ఇలాగే ఉందన్నట్లుగా, ఏదో జరిగిందనే విషయమే తెలియక ఎప్పటిలా తమ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ మార్పులకు కారణమైన పవిత్ర, రాములతో సహా ఎవ్వరికీ ఏం తెలియలేదు. ఏం జరిగిందో తెలుసుకోవాల్సిన అవసరమే మానవజాతికి రాలేదు. ఎందుకంటే రంగు, మతం, పోలిక తేడాలు ఇవేమీ మనిషి మెదడులో లేవు. శాశ్వతంగా

తొలగిపోయాయి. దాంతో భూగోళమంతా స్వచ్ఛమైన పచ్చని చెట్టులాగా ఉంది. ఆ చెట్టు గాలి ఎంత హాయిగా ఉంటుందో భూలోకంలో మనిషి జీవితం అంతే హాయిగా మారిపోయింది.

# 19

## ముగింపు

**వరంగల్‌లోని** ఒక స్కూల్లో (ఎల్‌కేజీలో) తమ బిడ్డని జాయిన్ చేసేందుకు తీసుకొచ్చారు మిస్టర్ అండ్ మిసెస్ పీటర్ మార్గథెట్. అప్లికేషన్ నింపుతున్నాడు పీటర్. స్టూడెంట్ నేమ్ అనే చోట డేవిడ్ అని రాశారు. ఫాదర్ నేమ్ అనే చోట పీటర్ అని రాశాడు. డేట్ ఆఫ్ బర్త్ అనే చోట ఏప్రిల్ 6, 2011 అని నింపాడు. దాని తర్వాత రిలీజియన్ అనే కాలమ్ ఉంది. అక్కడ ఏం నింపాలో తెలియలేదు. దాంతో అయోమయంగా చూస్తూ మేడం ఇక్కడ ఏం నింపాలి అని ఆ ఆప్షన్స్‌ని చూపిస్తూ అడిగారు.

ఆ ఆప్షన్ చూసిన మేడం, టేబుల్‌పై ఉన్న బెల్ కొట్టింది. అది విన్న ప్యూన్ “మేడం” అంటూ లోపలకి వచ్చాడు.

“ఏంటయ్యా…ఈ అప్లికేషన్‌లో రిలీజియన్ అనే చోట హిందూయిజం, క్రిస్టియానిటీ, ఇస్లాం అని ఇవేవో రానున్నాయి. అసలు ఇవేంటి? ఈ పదాలకు అర్థం ఏంటి? ఇక్కడ ఉండాల్సింది హ్యూమనిజం అని కదా. ఆ ప్రింటర్‌కి మళ్లీ కొత్తగా అప్లికేషన్స్ ప్రింట్ చేసుకురమ్మను…” అంటూ కేకలేసింది మేడమ్.

అలాగే మేడం అంటూ ఆ అప్లికేషన్లను తీసుకుని ప్రింటర్ దగ్గరకు వెళ్లాడు ప్యూన్.

“ఏమయ్యా…అప్లికేషన్స్ అన్నీ తప్పులే ఉన్నాయి” అంటూ ఆ అప్లికేషన్స్‌ని చూపించాడు.

అది చూసిన ప్రింటర్…“అవునండి తప్పు జరిగింది, కొంచెం టైమ్ ఇవ్వండి సరి చేస్తామని చెప్పాడు. ఇవేంటి ఈ పదాలు ఎలా వచ్చాయి” అని తన ప్రింటింగ్ వర్కర్స్‌ని అడిగాడు.

“అది ఎప్పటివో పాతవండి. కొన్ని అప్లికేషన్స్ మన దగ్గర ఉండిపోతే ఇచ్చేశామండి. ఎలాగూ అదే స్కూల్ అప్లికేషన్స్ కదా” అని అన్నాడా వర్కర్.

అసలు ఆ పదాలకు అర్థమేంటి హిందూయిజం, ఇస్లాం, క్రిస్టియానిటీ ఏంటి వీటికి

అర్థం అని ఫ్యూన్, ప్రింటర్ ఇద్దరూ బుర్రలు గోక్కుంటూ ఆలోచిస్తున్నారు. దేవుడు చేసిన మ్యాజిక్ వీళ్లకు తెలియలేదు కదా మరి.

* * * * *

